సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 36

సోమవారం 28-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

కొత్త సీఎస్‌గా కె.రామకృష్ణారావు

శాంతికుమారి స్థానంలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. ఈ నెల 30న రిటైరవనున్న ప్రస్తుత సీఎస్ శాంతికుమారి స్థానంలో ఆయన్ను నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 5లో ▶

"మంచిగున్న తెలంగాణను ఆగం పట్టించి ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం, దగా చేశారు. ఇవాళ అప్పు పుడత లేదని మాట్లాడుతుండ్రు. నా మనసు కాలుతోంది. బాధ పడుతోంది. దుఃఖం వస్తోంది.

కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదిన్నరయ్యింది.. ఏ మాయ రోగం వచ్చె.. ఏం బీమారి వచ్చె.. ఏమేం చెప్పిరి.. ఎన్నెన్ని చెప్పిరి.. గోల్‌మాల్ దింపుట్ల, అబద్ధాలు చెప్పుట్ల కాంగ్రెస్‌ను మించినోళ్లు లేరు.

అప్పుడు చెరువుల పూడిక తీసిన బుల్డోజర్లు, ఇప్పుడు ఇళ్లు కూలగొడుతున్నయి.

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నరు. ఓట్లెప్పుడు వస్తయా అని చూస్తున్నరు."



బీఆర్ఎస్ సభకు హాజరైన జనసందోహం. (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కేసీఆర్

కాంగ్రెస్ అన్నిట్లోనూ ఫెయిల్

మంచిగున్న తెలంగాణను ఆగం చేశారు

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ఫైర్

- మమ్మల్ని మించిన సిపాయిలు లేరన్నారు.. కేసీఆర్‌ను మించి చేస్తామన్నారు
- 420 హామీలిచ్చి ఏమీ చేయకుండా ప్రజలను దగా చేశారు
- ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే
- రాష్ట్ర ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే వీపులు సాపు చేస్తారు
- ప్రజలంతా ఓ నిర్ణయానికొచ్చారు.. ఓట్లెప్పుడొస్తాయా అని చూస్తున్నారు
- కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు తాను బయటకు వస్తానని ప్రకటన
- తెలంగాణ చెలరేగింది..మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టీకరణ

2లో

డేట్ ఫిక్స్ చేయండి..అసెంబ్లీకి రండి

కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్

బీఆర్ఎస్ అధినేతపై ధ్వజమెత్తిన మంత్రులు జూపల్లి, పొన్నం, సీతక్క

సాక్షి, హైదరాబాద్: రజతోత్సవ సభ పేరుతో ఎల్క తుర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీపై ఆక్రోశంతో విషం కక్కారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అద్భుతాలు జరిగినట్లు, ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏమీ జరగనట్లు ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో.. కాంగ్రెస్ టైంలో ఏం జరిగిందో చర్చించేందుకు సిద్ధం కావాలని చాలెంజ్ చేశారు. 'మీరు డేట్ ఫిక్స్ చేయండి. అసెంబ్లీకి రండి. మీరే సర్టిఫికెట్ ఇచ్చిన మీ బచ్చాగాళ్లతో మాట్లాడేది లేదు. మీరు రండి. మీ పాలనలో అద్భుతాలు, మీరు చేసిన ఘనకార్యాలను ప్రజలకు వివరిద్దాం. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి కూడా మాట్లాడదాం. డేట్ మీరే చెప్పండి. చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సభ ముగిసిన అనంతరం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి పొంగులేటి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తనను గద్దె దింపారనే ఆక్రోశంతో కేసీఆర్ మాట్లాడారని విమర్శించారు. కడుపునిండా కాంగ్రెస్ పార్టీపై విషం పెట్టుకొని మమ్మల్ని విలన్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎందుకు విలన్ అయ్యిందో రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఇచ్చిన మాటకు నిలబడి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు విలన్ అయ్యిందా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను ఏర్పాటు చేసినందుకు విలన్ అయ్యిందా అని ప్రశ్నించారు. రజతోత్సవ సభలో తన హయాంలో జరిగిన మంచి పనులను చెప్పుకోవచ్చు.. అదేవిధంగా లోపాలను కూడా మాట్లాడి ఉంటే ఎవరూ అభ్యంతరం చెప్పరన్నారు. రైతుల గుదిబండగా మారిన ధరణి పోర్టల్ గురించి, కుప్పకూలిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఆ సభలో కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అసలు కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ తీసేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తామేదో బీఆర్ఎస్ సభను అడ్డుకునేందుకు

మిగతా 3వ పేజీలో ▶



ఆదివారం రజతోత్సవ వేదికపై మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మల్లారెడ్డి, ఎర్రబెల్లి, నామా, రసమయి, ఎర్రోళ్ల, కొత్త ప్రభాకర్‌రెడ్డి, జోగు రామన్న, వి.ప్రకాశ్, రెడ్యా, సుధీర్‌రెడ్డి, గంగుల, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, సురేశ్‌రెడ్డి, కేటీఆర్, బండా ప్రకాశ్, పొన్నాల, లక్ష్మీకాంతరావు, రమణ, వినోద్, కవిత, సబిత, సత్యవతి

కాంగ్రెస్ అన్నిట్లోనూ ఫెయిల్

మంచిగున్న తెలంగాణను ఆగం చేశారు ● బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ఫైర్

ఎల్కతుర్తి నుంచి సాక్షి ప్రతినిధి:

అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా చేసుకుంటే, ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పార్టీ నాశనం చేసిందని, అన్నిట్లోనూ ఫెయిల్ అయ్యిందని భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. మా అంత సిపాయిలు లేరు.. కేసీఆర్‌కు మించి ఇస్తాం.. ఆరు చందమామలు తెచ్చి ఇస్తాం.. ఏడు సూర్యుళ్లు పెడతాం అని నమ్మబలికి ఓట్లు వేయించుకుని ప్రజలను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలిచ్చి ఏమీ చేయలేదని, మంచిగున్న తెలంగాణను ఆగం పట్టించారని విమర్శించారు. రైతుబంధు లాంటి పథకాలు కావాలని తననెవరూ అడగలేదని, మన ప్రజలను మనమే బాగు చేసుకోవాలని ఆ పథకాలను అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము పడగొట్టబోమని, ప్రజలే వీపులు సాపు చేస్తారని వ్యాఖ్యానించారు. ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు కాంగ్రెస్సే నంబర్ వన్ విలన్ అని అన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు ఇక తాను బయటకు వస్తానని ప్రకటించారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభలో ఆయన ప్రసంగించారు.

బుక్కులు పంచింద్రు.. బాండ్లు రాసిచ్చింద్రు

హామీలు ఇచ్చుడు కాదు.. పెద్ద పెద్ద బుక్కులు ఊరూరా పంచింద్రు. సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చింద్రు. అడ్డగోలుగా హామీలు ఇచ్చింద్రు..యేడికెళ్లి ఇస్తారని కాంగ్రెస్ నేతలను అడిగితే.. చేసి చూపిస్తాం.. మాది పెద్ద పార్టీ.. మమ్మల్ని మించిన సిపాయిలు లేరని ఇప్పుడు ఆర్థికమంత్రిగా ఉన్నాయన జబ్బలు చరిచాడు.. ఒకడు మెడలు చరిచాడు. డైలాగులు మీద డైలాగులు కొట్టారు. మధ్యలో ఎంపీ ఎలక్షన్లు వచ్చాయి.. నాకు కాలు విరిగింది.. అయినా నేను బయల్దేరాను.. దీంతో తెలంగాణలో ఎంత మంది దేవుళ్లు ఉంటే అంత మంది దేవుళ్ల మీద ఒట్లు పెట్టింద్రు. ఇన్ని మాటలు చెప్పి మోసం చేసిన్రు. ఉచిత బస్సు అని పెడితే జుట్లు పట్టుకుని కొట్టుకునేందుకు పనికి వస్తోంది తప్ప ఉపయోగం లేదు. ఈ ఉచిత బస్సు మాకు అవసరం లేదు అని ఆడబిడ్డలు అంటున్నరు. ఊ అంటే ఆ అంటే అబద్ధాలు చెబుతున్నారు. నమ్మి బోల్తా పడ్డం..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

ఎన్నెన్ని చెప్పిరి.. ఏమన్నా చేసిన్రా?

'కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదిన్నరయ్యింది.. ఏ మాయ రోగం వచ్చె..ఏం బీమారి వచ్చె.. ఏమేం చెప్పిరి.. ఎన్నెన్ని చెప్పిరి.. గోల్‌మాల్ దింపుట్ల, అబద్ధాలు చెప్పుట్ల కాంగ్రెస్‌ను మించినోళ్లు లేరు. ఇక్కడ ఉన్నోళ్లు చాలరని చెప్పి ఉన్న గాంధీలు, లేని గాంధీలు, డూప్లికేట్ గాంధీలు ఢిల్లీకెళ్లి దిగిరి. స్టేజీల మీద డ్యాన్సులు చేసిన్రు. కేసీఆర్ రైతుబంధు కింద ఏం ఇస్తుండు..రూ.10 వేలు ఇస్తుండు.. మేం రూ.15 వేలు ఇస్తమని చెప్పిన్రు. పెన్షన్లు రూ.2 వేలు ఇస్తుండు మేం వస్తే రూ.4 వేలు ఇస్తమని చెప్పిరి. ఇద్దరు ఉంటే కేసీఆర్ ఒక్కరికే ఇస్తుండు.. మేం ముసలిది ముసలోడికి ఇద్దరికీ ఇస్తమనిరి. దివ్యాంగులకు రూ.4 వేలు ఇస్తుండు.. మేం రూ.6 వేలు ఇస్తమన్నరు. ఆడపిల్లలకు స్కూటీలు కొనిస్తమన్నరు. విద్యార్థులకు ఐదు లక్షల గ్యారంటీ కార్డు ఇస్తమని చెప్పిరి. ఇక ఒకరెనుక ఒకరు ఉరికి.. రూ.2 లక్షల లోన్ తెచ్చుకోండి.. డిసెంబర్ 9న ఒక్క కలం పోటుతో ఖతం చేస్తం అన్నరు. కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ లక్షా నూటపదహార్లు ఇస్తున్నడు.. మేం తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పింద్రు. 420 హామీలు ఇచ్చిన్రు. ఏమన్నా చేసిన్రా .. ఏం చేయలేదు. మాట్లాడితే బీఆర్‌ఎస్, కేసీఆర్ మీద నిందలు వేస్తున్నారు.

అప్పుడెంత బాగుండె.. ఇప్పుడెట్లయింది?

'ఒక ఊరిలో నాట్లు వేసే టైమ్ వస్తే వడ్లు ఓ రైతు అలుకుతున్నడు. మొలకకు అలుకుడు చేస్తం కదా.. పెద్ద మొగోడు అని ఒకర్ని మొలక అలికేందుకు పిలిస్తే.. ఎలుక పిల్లను చూసి ఎల్లెలకల పడ్డడట. అట్లనే మా అంత సిపాయిలు లేరు.. మేం తెచ్చి ఇస్తాం అన్నరు. ఇవాళ మమ్మల్ని నమ్మతలేరు.. అప్పు పుడుత లేదని మాట్లాడుతుంద్రు. ఎక్కడికెళ్లి తెచ్చి చేయాలని అంటున్నరు. అపారమైన అనుభవం ఉందని అప్పుడు అన్నరు.. ఇప్పుడేమో ఎల్లెలకల పడుతుంద్రు. నా ప్రసంగం టీవీల్లో వినే కోట్లాను కోట్ల మందిని అడుగుతున్నా.. ఇంత మోసం ఉంటదా.. ఇంత దగా ఉంటదా..? ఎంత వరకు ఇది కరెక్ట్..? తెలంగాణను బొందల పడగొట్టింద్రు.. ఎంత ఘోరమైన ఫలితం చూస్తున్నాం. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఎంత బాగుండె. ఇప్పుడెట్లయింది? నా మనసు కాలుతుంది. బాధయితంది. దుఃఖం వస్తోంది. కేసీఆర్ పక్కన పోంగనే ఇంత ఆగమయితదా? ఎందుకు ప్రజల గోస పోసుకుంటున్నరు? కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు భూముల ధరలు ఎట్లుండె. కొనేటోళ్లు ఎక్కువుండె. అమ్మేటోళ్లు తక్కువుండే. నేను 24 గంటలు కరెంటు ఇయ్యలేదా? ఇప్పుడు ఎందుకు ఇయ్య శాతనయిత లేదు? మళ్లీ తెల్లందాక కరెంటు పెట్టడానికి పోవాల్నా..? మంచినీళ్లు కూడా ఇయ్య శాతనయితలేదు. కానీ మేం ఇంత సిపాయిలం, అంత సిపాయిలం అంటున్నరు..' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.



సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చారు

'ఆనాడైనా, ఏనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలన్ నంబర్ వన్ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ హైదరాబాద్ స్టేట్ పేరుతో ఉన్ననాడు.. ప్రజలు వద్దంటే కూడా బలవంతంగా తెలంగాణను ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్ పార్టీ, జవహర్‌లాల్ నెహ్రూ. 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరాగాంధీ ప్రభుత్వం.. ఆనాడు ఉన్నటువంటి కాంగ్రెస్ పరిపాలన. 2001 నుంచి గులాబీ పార్టీ పెట్టి విజృంభిస్తే.. నంగనాచిలాగా ఇదే కాంగ్రెస్ వచ్చి.. మన బలాన్ని, మన ఊపును చూసి పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇస్తమని నమ్మబలికిన్రు. మళ్లీ ఎగ్గొట్టే ప్రయత్నం చేసిన్రు. 14 సంవత్సరాలు ఏడిపించిన్రు. జయశంకర్ సార్‌తో కలిసి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కాంగ్రెస్ గొంతు పట్టుకుంటే.. అప్పుడు దిగివచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన్రు. మళ్లీ వెనక్కి వెళ్లారు. ఆ తర్వాత సకల జనుల సమ్మె కావొచ్చు. సాగర హారాలు కావొచ్చు. వంటావార్పులు కావొచ్చు.. అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం. మూడేళ్ల తర్వాత రాజకీయ అవసరం ఏర్పడి ఆనాడు మళ్లీ తెలంగాణ ఇస్తామని ప్రకటించారు. వారికి ఇష్టం లేకపోయినా తెలంగాణ సృష్టించిన సుడి గాడుపులు తట్టుకోలేమని తెలంగాణ ఇచ్చిన్రు..' అని మాజీ సీఎం గుర్తు చేశారు.

'చంద్రునికో' వెండిపోగు!



సిరిసిల్ల: బీఆర్‌ఎస్ రజతో త్సవాల సందర్భంగా సిరి సిల్ల చేనేత కళాకా రుడు వెల్ది హరిప్రసాద్ వెండిపో గులు, పట్టుదారంతో కేసీఆర్ చి త్రంతో కూడిన శాలువాను నేశాడు. సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఈ శాలువాను ఆర్డర్ ఇవ్వడంతో.. ఐదు రోజులు మగ్గంపై శ్రమించి తయారు చేశాడు. 33 గ్రాముల వెండి, పట్టుపోగులతో రూపొందిన శాలువా పై కేసీఆర్ చిత్రం, రెండువైపులా బీఆర్‌ఎస్ 25 ఏళ్ల వేడుకల (రజతోత్సవ) చిత్రాలు, కాకతీయుల కళాతోరణాన్ని ఆవిష్కరించారు. రెండున్నర మీటర్ల పొడవు, 46 అంగుళాల వెడల్పుతో రూపొందించారు. ఈ శాలువాను వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో ఆదివారం కేసీఆర్‌కు బహూకరించేందుకు జిందం కళాచక్రపాణి దంపతులు తీసుకెళ్లారు.



వాళ్ల మధ్య వేలెందుకు పెట్టార్సార్!

బాధ్యతగా పాలించాం.. అద్భుతమైన పనులు చేశాం

'60 ఏళ్ల సమైక్య పాలనలో ఎంతో వేదన, హింస, అణిచివేత చూశాం. గోదావరి, కృష్ణా నీళ్లు దక్కకకుండా తరలిపోతే తల్లి చనుబాలకు నోచని పిల్లల్లాగా తెలంగాణ బిడ్డలు రోదించారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టింది టీఆర్‌ఎస్ పార్టీ. పదవీ త్యాగాలతోనే మన తెలంగాణ ప్రస్థానం ప్రారంభమైంది. అది ఫలించి సొంత రాష్ట్రం కల కూడా నెరవేరింది. తర్వాత ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. మనం అధికారం అనుభవించేందుకు తీసుకోలేదు. బాధ్యతగా తీసుకున్నాం. రాష్ట్రాన్ని మన చేతుల్లో పెడితే పదేళ్లలో ఎక్కడున్న తెలంగాణను ఎక్కడికి తీసుకుని పోయాం. ఎన్ని రంగాల్లో ఎన్ని అవార్డులు వచ్చాయి. ఎన్ని అద్భుతమైన పనులు చేసి చూపించాం. తెలంగాణ అంటే ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం. ఎగతాళి చేయబడ్డ ప్రాంతం. పనికిమాలిన ప్రాంతం అని పేరుపెట్టబడిన ప్రాంతం. అలాంటిది రూ.90 వేలు ఉన్న తలసరి ఆదాయాన్ని రూ.3.50 లక్షలకు పెంచుకున్నాం. జీఎస్‌డీపీని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాం. బ్రహ్మాండంగా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకున్నాం ..' అని కేసీఆర్ సభా వేదికగా గుర్తుచేశారు.

పథకాలు కావాలని ఎవరూ అడగలేదు

'రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు కార్యక్రమాలను నన్ను ఎవరూ అడగలేదు. మన ప్రజలను మనమే బాగు చేసుకోవాలని ఆ పథకాలను అమలు చేశాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులను ఆగమేఘాలపై పని చేసి పూర్తి చేయించాం. పాలమూరు జిల్లాలోనే పది లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చుకున్నాం. 3.5 లక్షల టన్నుల వడ్లు పండించే స్థాయికి తెలంగాణను తీసుకుని పోయాం. వడ్ల కొనుగోలు కేంద్రాలు పెట్టి కనీస మద్దతు ధర వచ్చేలా .. తడిసినా, రంగు పోయినా, మొలక వచ్చినా.. రైతులు మన బిడ్డలు కాబట్టి గవర్నమెంట్‌కు రూ.5 వేల కోట్ల నష్టం వచ్చినా ధాన్యం కొన్నాం..బాధ పడలేదు. వరంగల్ గడ్డ కోసం పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి ఈ గడ్డకు నీరు తెచ్చుకున్నాం. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నాం. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పూడికలు తీసుకున్నాం. ఒక అద్భుతమైన తెలంగాణను తయారు చేసుకున్నాం..' అని మాజీ సీఎం చెప్పారు.

రైతాంగాన్ని కడుపులో పెట్టుకుని చూసుకున్నా..

పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండించాం. రైతు కష్టం ఏంటో నాకు తెలుసు. నేను స్వయంగా రైతును కాబట్టే రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని చూసుకున్నా. ఈ దేశంలో షేర్షా సూరీ అనే ఒక రాజు ఉండేవాడు. ఆయన కాలంలోనే రెవెన్యూ సంస్కరణలు తెచ్చారు. చరిత్ర పొడుగూతా చూస్తే.. షేర్షా సూరీ నుంచి స్వతంత్ర భారతం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కూడా.. రైతుల వద్ద రకరకాల శిస్తులు వసూలు చేశాయి. రైతుల వద్ద డబ్బులు, తహసీల్, నీటి తీరువాలు వసూలు చేశారు కానీ.. రైతును చూడాలని ఎవరూ అనుకోలేదు. జై కిసాన్.. జై జవాన్ అన్నరు తప్ప పట్టించుకోలేదు. కానీ నన్ను ఎవరూ అడగలేదు. ఎన్నికల్లోనూ చెప్పలేదు. నాకు నేనుగా ఆలోచించి.. రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చాను. బ్రహ్మాండంగా అమలు చేశాం. బ్యాంకుల్లో డబ్బులు పడి రైతుల సెల్‌ఫోన్లు మోగుతుండే. రైతాంగానికి ఎటువంటి కరెంటు ఇచ్చాం? ఆంధ్ర వలసవాద ముఖ్యమంత్రులు ఏం మాటలు మాట్లాడారు? తెలంగాణ వస్తే కారు చీకట్లు అయితయ్ అని చెబితే.. వాళ్ల నోర్లు మూయించేలా నాణ్యమైన కరెంటును 24 గంటలు సరఫరా చేశాం.



> 'కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పెడితే నేను అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులను పిలిచి అడిగిన. ఆ పథకం మంచిదని చెప్పడంతో పేరు కూడా మార్చకుండా కొనసాగించిన. అసెంబ్లీలో చెప్పిన.. రాజశేఖరరెడ్డి తెచ్చిన మంచి పథకం అదని. ఇప్పుడు నేను తీసుకొచ్చిన పథకాలను నిర్వీర్యం చేస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తారట.

పొలాల కాడ బోర్లు దుంకినయ్..

రైతులు ఇంట్ల కూసుంటే.. పొలాల కాడ బోర్లు దుంకినయ్. మూడెకరాలున్న రైతులకు ఏముంటది ఆదాయం? బీఆర్‌ఎస్ రాక ముందు వారు చనిపోతే పట్టించుకున్న నాథుడు లేడు. బీఆర్‌ఎస్ వచ్చాక రైతు బీమా ఇచ్చి 8 రోజుల్లోనే కుటుంబాలకు బీమా అందేలా చర్యలు తీసుకున్నాం. 7500 కేంద్రాల్లో వడ్లు కొని మూడునాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశాం. మిషన్ భగీరథ ఎన్నికల ప్రణాళికలో చెప్పలేదు. ఇంటింటా నల్లా పెట్టి ప్రజలకు మంచినీరు అందించాం. చెరువుల్లో చేపలు పెంచాలని నన్ను ఎవరు అడిగారు ? మత్స్యకారులను ప్రోత్సహించాలని చెరువుల్లో చేపలు పెంచాం. లక్షలాది గొర్రెలను పంపిణీ చేయమని ధర్నా చేయలేదు. ఎవరూ అడగలేదు. ప్రభుత్వమే వారికి బ్రహ్మాండంగా చేసింది. ప్రజల అవసరాలు ఎప్పటికప్పుడు తీర్చింది..' అని కేసీఆర్ వివరించారు.

> రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు కార్యక్రమాలను నన్ను ఎవరూ అడగలేదు. మన ప్రజలను మనమే బాగు చేసుకోవాలని ఆ పథకాలను అమలు చేశాం. చెరువుల్లో చేపలు పెంచాలని నన్ను ఎవరు అడిగారు ? మత్స్యకారులను ప్రోత్సహించాలని చెరువుల్లో చేపలు పెంచాం. లక్షలాది గొర్రెలను పంపిణీ చేయమని ధర్నా చేయలేదు. ఎవరూ అడగలేదు. ప్రభుత్వమే వారికి బ్రహ్మాండంగా చేసింది.

నేను చెప్పినవన్నీ మీ కళ్లెదుట జరిగినవే..

'పారిశ్రామిక రంగంపై దృష్టి పెట్టాం. పెట్టుబడులు ఆకర్షించాం. సుమారు 20–25 లక్షల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నం చేశాం. రూ.40 కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులను రూ.2.50 లక్షల కోట్లకు పెంచగలిగాం. ఐటీ రంగంలో 7 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. వెయ్యికి పైగా గురుకులాలు తీసుకువచ్చాం. తెలంగాణలో మూడే మూడు మెడికల్ కాలేజీలు ఉంటే.. 33 కాలేజీలకు పెంచాం. బీఆర్‌ఎస్ హయాంలో మత కల్లోలం లేదు. కర్ఫ్యూ లేదు.. కల్లోలం లేదు. శాంతిభద్రతలన్నీ బ్రహ్మాండంగా కాపాడి.. ప్రతి ఒక్కరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నాం. ఇవన్నీ నా డైలాగులు కాదు, స్టోరీలు కాదు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా అనేక సందర్భాల్లో వెల్లడించిన విషయాలు. ఆర్‌బీఐ, కాగ్ వెల్లడించిన అధికారిక లెక్కలే. మీ కండ్ల ముందర జరిగినవే..' అని మాజీ సీఎం పేర్కొన్నారు.

> పారిశ్రామిక రంగంపై దృష్టి పెట్టాం. పెట్టుబడులు ఆకర్షించాం. సుమారు 20-25 లక్షల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నం చేశాం. రూ.40 కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులను రూ.2.50 లక్షల కోట్లకు పెంచగలిగాం. ఐటీ రంగంలో 7 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. వెయ్యికి పైగా గురుకులాలు తీసుకువచ్చాం. తెలంగాణలో మూడే మూడు మెడికల్ కాలేజీలు ఉంటే.. 33 కాలేజీలకు పెంచాం.

పోలీసులెందుకు దుంకులాడుతున్నరు?

లక్షన్నర మందిని రోడ్లపైనే లారీలు అడ్డుపెట్టి ఆపిన్రు. ఇన్ని అడ్డంకులా? ఈ ప్రభంజనాన్ని ఎట్ల ఆపుతారు? పోలీసులను అడుగుతున్న. మీరెందుకు దుంకులాడుతున్నరు? సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ సైనికులు ప్రశ్నిస్తే పోలీసులు కేసులు పెడుతున్నారు. డైరీల్లో రాసిపెట్టుకోండి... మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. దాన్ని ఆపడం ఎవడి తరం కాదు. ఎవడి వశం కాదు. సోషల్ మీడియా వారియర్స్‌ను కాపాడేందుకు బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అండగా ఉంటుంది. నేను కూడా ఊర్కోను. బయలుదేరుత. కమీషన్లు తీసుకుంటున్నారని కేటీఆర్ అసెంబ్లీలో చెపితే భుజాలు తడుముకున్నరు. తప్పు చేయనప్పుడు ఆర్థిక మంత్రి ఎందుకు ఉలిక్కి పడుతున్నరు? కేసీఆర్ నువ్వు అసెంబ్లీకి రా అంటున్నరు. మా సభ్యులు అడిగితేనే సమాధానం చెపుతలేరు.

బీజేపీతో మనకు వచ్చేది లేదు

బీజేపీ 11 ఏళ్లుగా రాజ్యం చేస్తోంది. దేశంలో 150 మెడికల్ కాలేజీలు ఇస్తే తెలంగాణకు ఒక్కటి లేదు. ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు. బీజేపీతో మనకు వచ్చేది లేదు. ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను ఊచకోత కోస్తున్నారు. బలం ఉంది కదా అని చంపుడేనా? నక్సలైట్లు చర్చలు జరుపుతం అంటున్నరు. చర్చలు జరపండి. దీనిపై ఢిల్లీకి ఉత్తరం పంపిద్దాం..' అని కేసీఆర్ అన్నారు.

సైడ్‌లైట్స్

- మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు ఇతర ముఖ్య నేతలంతా సాయంత్రం 4:30 గంటలకు సభావేదికపైకి చేరుకున్నారు. ఆ సమయంలోనే వచ్చిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గాయకుల పాటలకు మాస్ స్టెప్పులతో పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.
- 'ఉక్కు గుండెను ఒక్కసారన్నా తాకాలని ఉన్నది.. ఆ బక్క పలచని పెయ్యిని హత్తుకోవాలని ఉన్నది' అనే పాటకు కవిత సహా సభా వేదికపై ఉన్న నేతలు సెల్‌ఫోన్లలో టార్చ్‌లైట్ ఆన్ చేసి ఊపడంతో సభికులు కూడా తమ సెల్‌ఫోన్లలో టార్చ్ ఆన్ చేసి చేతులతో పైకెత్తి ఊపారు.
- సాయంత్రం 5:48 గంటలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వచ్చిన హెలికాప్టర్ సభా ప్రాంగణంలో ల్యాండ్ అయ్యింది.
- దాదాపు గంట తర్వాత 6:51 గంటలకు కేసీఆర్ సభావేదికపైకి చేరుకొని ప్రజలకు అభివాదం చేశారు.
- ముందుగా పహల్గాం ఉగ్ర దాడి మృతులకు నిమిషంపాటు సంతాపం తెలిపారు.
- కేసీఆర్ ప్రసంగించేందుకు సిద్ధమవుతుండగా సీఎం, సీఎం అంటూ సభికుల నుంచి పలుమార్లు నినాదాలు చేశారు. దీంతో కేసీఆర్ జర ఆగండి అంటూ సుతిమెత్తగా మందలించారు.
- కాంగ్రెస్ ఏయే అంశాల్లో విఫలమైందో చెబుతూనే ప్రజల నుంచి చెప్పించే ప్రయత్నం చేశారు.
- రాత్రి 7 గంటలకు మొదలైన కేసీఆర్ ప్రసంగం 7:59 గంటలకు ముగిసింది.
- చివరగా 'ఇక మీ లొల్లి షురూ చేయండి' అని కేసీఆర్ అనడంతో సభికులు సీఎం, సీఎం అంటూ నినదించారు. ఇంకోవైపు బాణాసంచా మోత మోగించారు.

- సాక్షి, వరంగల్



వేదికపై ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కేసీఆర్

డేట్ ఫిక్స్ చేయండి..అసెంబ్లీకి రండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నం చేశామని చెబుతుంటే నవ్వు వస్తుందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉండగా, కాంగ్రెస్ సభలకు బస్సులు ఇవ్వలేదని, టూవీలర్లు కూడా రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కానీ తాము ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించామని, వారు ఎన్ని బస్సులకు డబ్బులు కడితే అన్ని బస్సులు ఇచ్చామని తెలిపారు. నిజంగా కాంగ్రెస్ అడ్డుకొని ఉంటే బీఆర్ఎస్ సభ జరిగేదా అని నిలదీశారు. తామేదో వర్సిటీ భూములు అమ్మినట్టు కేసీఆర్ చెప్పారని, ఏ యూనివర్సిటీ భూములు అమ్మామో ప్రజలకు చెప్పాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును తనకు కావాల్సిన వారికి లీజుకు ఇచ్చుకుంది.. వైన్ షాపుల టెండర్లు ముగియక ముందే డబ్బులు వసూలు చేసుకుంది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. తాము కమీషన్లు తీసుకున్నామని కేసీఆర్ అంటున్నారని, ఎక్కడ తీసుకున్నామో చూపించాలని డిమాండ్ చేశారు. ఏ కమీషన్లు తీసుకోకుండానే దేశంలోనే అత్యంత ధనిక ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ ఎలా ఎదిగిందని, రూ.1,500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చబోమని కేసీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని, ఆయన కూలిస్తే కూలిపోవడానికి ప్రభుత్వమే



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

మైనా బొమ్మరిల్లా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన నాయకుడు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేయడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ వచ్చాక దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చేయలేదని, ఇప్పుడైనా ఆ పార్టీ శాసనసభ పక్ష పదవిని దళితుడికి ఇస్తారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీకి ఇవ్వగలరా అని వ్యాఖ్యానించారు. వీటన్నింటిపై మాట్లాడేందుకు కేసీఆర్ డేట్‌ఫిక్స్ చేస్తే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించేందుకు సిద్ధం కావాలని మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ నేతలను సవాల్ చేశారు.

అధికారం పోయినా గర్వం పోలేదు

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలు ఉద్యోగం ఊడగొట్టినా కేసీఆర్‌కు గర్వం పోలేదని.. చింత చచ్చినా పులుపు చావనట్టు ఆయన మాట్లాడుతున్నారన్నారు. ఒక్కో గ్రామానికి రూ. 3 లక్షలు ఖర్చు చేసి ఈ సభ నిర్వహించారని, ఆ డబ్బులు ఎక్కడివని నిలదీశారు. తాము కూడా రాజకీయాల్లోనే ఉన్నామని, తమకు ఏమీ తెలియదని అనుకోవడం పొరపాటని అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తానని కేసీఆర్ పగటి కలలు కంటున్నాడని, అసలు ఆయన ఉద్యోగం ఎందుకు ఊడిందో..ప్రజలు ఎందుకు ఓడించారో ఇప్పటికైనా జ్ఞానోదయం చేసుకోవాలని హితవు పలికారు.

ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ పార్టీని విలన్ అంటూ కేసీఆర్ మాట్లాడిన మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని మంత్రి పొన్నం



ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీనే లేకుంటే కేసీఆర్ మూడు చెరువుల నీళ్లు తాగినా, వంద మంది కేసీఆర్‌లు వచ్చినా తెలంగాణ వచ్చేది కాదని చెప్పారు. ఎల్కతుర్తి సభకు జనం రాకపోతే అదేదో తాము అడ్డుకున్నట్టు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అగ్గిపెట్టి రాజకీయానికి బలైన ఉద్యమకారులు, అమరవీరులకు ఆ సభలో ఎందుకు నివాళులర్పించలేదని మంత్రి పొన్నం ప్రశ్నించారు.

నియంత మాట్లాడినట్టుంది

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒక నియంత అధికారాన్ని కోల్పోయిన తర్వాత మాట్లాడినట్టు కేసీఆర్ ప్రసంగం ఉందని చెప్పారు. అధికారం పోయాక కుటుంబం, ఆస్తులు చీలికలు,పీలికలు అయ్యాయన్న ఆవేదనతో ఆయన మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బిడ్డ మంచి కార్లలో తిరగొచ్చు గానీ.. పేద మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరగవద్దా అని ప్రశ్నించారు.

ఇప్పుడు రాలేను.. సమయం ఇవ్వండి

- ఈడీ విచారణకు సమయం కోరిన మహేశ్ బాబు



సాక్షి, హైదరాబాద్: సాయిసూర్య డెవలపర్స్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం ఇవ్వాలని నటుడు మహేశ్ బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను కోరారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం షూటింగ్‌లకు హాజరుకావాల్సి ఉన్నందున మరికొంత సమయం ఇవ్వాలని కోరుతూ ఆయన లేఖ రాసినట్టు తెలిసింది. ఈ నెల 22న ఈడీ అధికారులు ఇచ్చిన సమన్ల ప్రకారం సోమవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఇప్పుడు దీనికి మరింత గడువు కోరుతూ మహేశ్‌బాబు చేసిన విజ్ఞప్తిని ఈడీ అధికారులు పరిశీలిస్తున్నారు. తదుపరి విచారణ ఎప్పుడన్నది సోమవారం ఈడీ వెల్లడించే అవకాశం ఉంది. కాగా, సాయి సూర్య డెవలపర్స్ వెంచర్స్ ప్రాజెక్టు ప్రమోషన్ కోసం మహేశ్‌బాబు రూ.5.9 కోట్లు తీసుకున్నట్టు అధికారులు ఆధారాలు సేకరించారు. దీనిపై మరింత లోతుగా విచారించేందుకు మహేశ్‌బాబుకు సమన్లు జారీ చేశారు. సురానా గ్రూప్ కంపెనీలైన సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థల్లో ఈ నెల 16న ఈడీ సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.100 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను ఈడీ గుర్తించింది. మహేశ్‌బాబుకు చెక్కుల రూపంలో రూ.3.4 కోట్లు, నగదు రూపంలో రూ.2.5 కోట్లు చెల్లించినట్లు ఆధారాలు లభించాయి. దీంతో మహేశ్‌బాబుకు సమన్లు జారీ చేశారు.

ఓరుగల్లు.. గులాబీ జల్లు

ఉద్యమ కాలం నాటి సభలను గుర్తు చేసిన రజతోత్సవ సభ

- ఫలించిన భారీ జన సమీకరణ వ్యూహం.. గులాబీ మయం
- ఉద్యమ కాలం నాటి పరిస్థితులను గుర్తు చేసిన కేసీఆర్
- తొమ్మిదిన్నరేళ్ల తన పాలనలో చేపట్టిన పథకాల మననం
- కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనను తూర్పార పట్టిన అధినేత
- సభ సక్సెస్ కావడంపై బీఆర్ఎస్‌లో నూతన ఉత్సాహం
- మళ్లీ మనదే సర్కారు అంటూ చేసిన ప్రసంగంతో జోష్



రజతోత్సవ సభకు తరలివస్తున్న జనం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగసభ ఉద్యమకాలం నాటి సభలను గుర్తు చేసింది. భారీగా జనం తరలివచ్చి సభ విజయవంతం కావడం పార్టీలో కొత్త జోష్‌ను నింపింది. భారీ జన సమీకరణ లక్ష్యంగా కేసీఆర్ ఆదేశాల మేరకు జరిగిన ప్రయత్నాలు సఫలం కావడంతో సభా ప్రాంగణమంతా గులాబీమయమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో నిరాశ కలిగించే ఫలితాలు ఎదుర్కొన్న బీఆర్ఎస్‌లో కొత్త ఉత్సాహం నింపేలా సభ సాగింది. సుమారు ఏడాది కాలం తర్వాత ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ కేడర్‌లో ఉత్తేజం నింపే ప్రయత్నం చేశారు.

ఉద్యమ కాలం నుంచి నేటి దాకా

టీఆర్ఎస్ ఏర్పాటుకు ముందు తెలంగాణలో ఉన్న సామాజిక పరిస్థితులను కేసీఆర్ వివరించారు. ఉద్యమ కాలంలో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లు, ఎత్తు పల్లాలను గుర్తు చేశారు. తాను చేపట్టిన ఆమరణ దీక్ష మూలంగా తెలంగాణ ఇవ్వాల్సిన అనివార్యత కాంగ్రెస్‌కు ఏర్పడిన తీరును వివరించారు. ప్రత్యేక రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్ల పాలనలో వ్యవసాయం, విద్యుత్, తాగునీరు, సాగునీరు, విద్య తదితర రంగాల్లో జరిగిన కృషిని గుర్తు చేశారు. రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తాను ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా పథకాన్ని కేసీఆర్ పలుమార్లు ప్రస్తావించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై మెరుపు దాడి

ఏడాది తర్వాత బహిరంగసభ వేదికగా మాట్లాడిన కేసీఆర్ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల పేరు ఎత్తకుండా వారి పనితీరుపై విమర్శల దాడి చేశారు. సీఎం రేవంత్ ప్రభుత్వ పాలనావైఫల్యం, అనుభవలేమి, అవినీతిపై విమర్శల దాడి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల వైఫల్యాన్ని తనదైన శైలిలో సామెతలు, పిట్ట కథలతో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. తెచ్చిన తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో ఆగమవుతోందని భావోద్వేగంతో వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన కనిపించింది. వచ్చే రెండున్నర ఏళ్లలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేసీఆర్ ప్రయత్నించారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని ప్రస్తావించారు.

కేటీఆర్ స్థానాన్ని బలోపేతం చేసేలా

సభావేదికను 'బాహుబలి'గా పార్టీ నేతలు అభివర్ణించగా, సభా మైదానంలో చేసిన ఏర్పాట్లపై బీఆర్ఎస్ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. కేసీఆర్‌తోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. సభా వేదికపైనా కేటీఆర్ వచ్చిన సందర్భంలో నేతలు ఆయనతో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. పార్టీ రజతోత్సవ సభ వేదికగా కేటీఆర్ స్థానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఏర్పాట్లు జరిగాయని పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది.

భవిష్యత్ కార్యాచరణపై సంకేతాలు

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి వేధించడాన్ని కేసీఆర్ ఖండించారు. అదే సమయంలో పార్టీ కేడర్ వెంట నిలుస్తానని, రాబోయే రోజుల్లో పదవులు లభిస్తాయని భరోసా ఇచ్చారు. ఇకపై ప్రజాక్షేత్రంలో చురుగ్గా వ్యవహరిస్తాననే సంకేతాలు ఈ సభ ద్వారా కేసీఆర్ ఇచ్చారు. ఆపరేషన్ కగార్ మినహా బీజేపీకి సంబంధించిన ప్రస్తావన కేసీఆర్ ప్రసంగంలో పెద్దగా కనిపించలేదు. తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన వరంగల్‌ను రజతోత్సవ సభ నిర్వహణకు ఎంపిక చేసుకున్న బీఆర్ఎస్.. రాష్ట్ర రాజకీయాల్లో తమ స్థానం చెక్కు చెదరలేదనే సంకేతం ఇచ్చేందుకు బలంగా ప్రయత్నించింది.

మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

హసన్‌పర్తి/వరంగల్‌క్రైం: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించలేకపోయారు. అధిక సంఖ్యలో వాహనాలు రోడ్లపై బారులుదీరడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల్ని నిలిపేందుకు మూడుచోట్ల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇటు హనుమకొండ నుంచి ఎల్కతుర్తి, దేవన్నపేట-అన్నాసాగరం మార్గంతోపాటు హుజూరాబాద్, సిద్దిపేట ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. ఎటూ చూసినా మూడు కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

సభకు వెళుతున్న బస్సుల అడ్డగింత

తిరుమలాయపాలెం: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సులకు బీఆర్ఎస్ స్టిక్కర్లు వేసుకొని రజతోత్సవ సభకు వెళుతుండగా, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం వద్ద ఆర్టీఏ, అధికారులు అడ్డుకున్నారు. లైసెన్స్‌లు రద్దు చేసి, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య అక్కడకు చేరుకొని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా, బస్సులను పంపించారు. ఆ తర్వాత మళ్లీ బస్సులు ఆపుతుండగా, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆగి రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా సభ: కేసీఆర్

తెలంగాణ నలమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చి బీఆర్ఎస్ సభను విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా భారీ సభను విజయవంతం చేయడంలో భాగస్వాములైన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కిక్కిరిసిన గూడూరు టోల్‌ప్లాజా

బీబీనగర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జంట నగరాలు సహా.. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తల వాహనాలు భారీగా తరలి రావడంతో జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. దీంతో గూడూరు టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయి.. వాహనాలు నెమ్మదిగా కదిలాయి.



రెండు గంటల సభ కోసం ఎక్కడిదీ డబ్బు?

ఏ కమీషన్లతో వచ్చిన ధనమో బీఆర్ఎస్ చెప్పాలి: చామల



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభకు ఖర్చు పెట్టిన వందల కోట్ల డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. 'అది కూలిన కాళేశ్వరం కమీషన్ సొమ్మా? మిషన్ భగీరథ పేరుతో పాత ట్యాంకులకు రంగులు వేసి, పాత తాగునీటి పథకాలను లింక్ చేసి దోచిన సొమ్మా? హైదరాబాద్ బిల్డర్ల దగ్గర పర్మిషన్ల కోసం వసూలు చేసిన అదనపు ఫ్లోర్ల కమీషన్ సొమ్మా? ఫార్ములా కార్ రేస్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు దోచిపెట్టిన సొమ్మా? ధరణి పేరుతో అర్ధరాత్రులు భూ హక్కులను మార్చేసి దోచిన వేల ఎకరాల దోపిడీ సొమ్మా? ఖానామెట్, నియోపోలీస్, కోకాపేట్‌లలో వేల కోట్ల విలువ చేసే భూములను వేలం పేరుతో అయిన వారికి దోచిపెట్టడం ద్వారా సంపాదించిన సొమ్మా?'అని నిలదీశారు. లేదంటే లక్షల కోట్ల విలువ చేసే ఔటర్ రింగ్ రోడ్డును కేవలం రూ.7,000 కోట్లకు 33 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి ధారాదత్తం చేయడం వల్ల వచ్చిన కిక్ బ్యాక్ సొమ్మా?, రెండు గంటల సభ కోసం పెట్టిన డబ్బు ఏ కమీషన్ల తాలూకాదో తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్ చెప్పాలి అని ఆదివారం ఎక్స్ వేదికలో చామల పోస్ట్ చేశారు.

అది తండ్రీ కొడుకుల సభ

- టీపీసీసీ నేత 'చనగాని'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నిర్వహించింది రజతోత్సవ సభ కాదని, తండ్రీ కొడుకుల సభ అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్టీకి 25 ఏళ్లు నిండాయని చెప్పి నిర్వహించిన ఈ సభను కేటీఆర్ సభలా మార్చారని, పార్టీలో ఆయనదే భవిష్యత్తు అని చెప్పేందుకు కేసీఆర్ వేసిన ఎత్తుగడ అన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు దోచుకున్న రూ.వందల కోట్లతో ఆర్భాటాలు చేస్తున్నారని, అసెంబ్లీకి రానివారు, కనీసం ప్రజల సమస్యలు మాట్లాడని వాళ్లు సభల పేరుతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పదేళ్లు ఉంటుందన్నారు.

కొత్త సీసాలో పాత సారా

- ఎమ్మెల్సీ అద్దంకి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హింసరాజులా మారారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. వరంగల్ రజతోత్సవ సభలో.. కేసీఆర్ కొత్త సీసాలో పాత సారా మాదిరిగా మాట్లాడారని చెప్పారు. దయాకర్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. చెప్పిందే చెప్పి పాత చింతకాయ పచ్చడిలాగా కేసీఆర్ ప్రసంగం కొనసాగిందని ఎద్దేవా చేశారు.

జీపీవో పోస్టులకు 6వేలకు పైగా దరఖాస్తులు

- త్వరలోనే కలెక్టర్ కార్యాలయాల్లో స్క్రూటినీలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టులకు 6,123 మంది పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు దరఖాస్తు చేసుకున్నారని రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. ఈ పోస్టుల కోసం రాత పరీక్ష రాసేందుకు సానుకూలంగా ఉన్న వారి నుంచి గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తులు కోరగా ఈ మేరకు దరఖాస్తులు చేసుకున్నారని తెలుస్తోంది. ఈ దరఖాస్తుల్లో కొందరు పదో తరగతి చదివిన వారు కూడా ఉన్నారని, కొందరు బయటి వ్యక్తులు కూడా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులను వీఆర్వోలు, వీఆర్ఏల ఎంప్లాయి ఐడీలు, విద్యార్హతల ఆధారంగా పరిశీలించి అర్హమైన దరఖాస్తులను సీసీఎల్ఏకు పంపుతుందని, అప్పుడు పరీక్ష రాసేందుకు ఎంత మంది అర్హులో తేలుతుందని సీసీఎల్ఏ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలాఖరుకల్లా స్క్రూటినీ పూర్తవుతుందని సమాచారం.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా రజనీకాంత్, నాగరాజు



ఖమ్మం మయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడిగా రజనీకాంత్ (కరీంనగర్), కార్యదర్శిగా టి.నాగరాజు (ఖమ్మం) ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాకేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు ఆదివారం రాత్రి ముగిశాయి. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అశోక్, పూజ, కిరణ్ (హైదరాబాద్), శంకర్ (రంగారెడ్డి), శ్రీకాంత్ (కరీంనగర్), శ్రీకాంత్ వర్మ (సూర్యాపేట), ప్రశాంత్ (మహబూబ్‌నగర్), సహాయ కార్యదర్శులుగా యార ప్రశాంత్ (వరంగల్), శంకర్ (నల్గొండ), రంజిత్ రెడ్డి (సిద్దిపేట), దీపిక, మమత, ఆదిక్ (హైదరాబాద్)లతో రాష్ట్ర కార్యదర్శివర్గం ఏర్పాటైంది.

నిచినో సంస్థతో తెలంగాణ భాగస్వామ్యం

- జపాన్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన చిన్నారెడ్డి బృందం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోని ప్రముఖ ఆగ్రో కెమికల్ సంస్థల్లో ఒకటైన జపాన్‌కు చెందిన నిచినో సంస్థతో తెలంగాణ భాగస్వామ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్. జి.చిన్నారెడ్డి వెల్లడించారు. జపాన్ పర్యటనలో భాగంగా ఒసాకో నగరంలోని నిచినో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఆదివారం చిన్నారెడ్డి బృందం సందర్శించింది. పురుగు మందులు, శిలీంద్ర నాశకాలు, కల్మష నివారకాల పరిశోధనలపై నిచినో సంస్థ నూతన ఆవిష్కరణలను గురించి ఈ బృందం తెలుసుకుంది. నిచినో సంస్థ ప్రతినిధులు డాక్టర్ కజుహికో మొటోబాకి, డాక్టర్ ప్రశాంత్‌లు చిన్నారెడ్డి బృందానికి స్వాగతం పలికారు. ఈ బృందంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, వ్యవసాయ మంత్రి ఓఎస్డీ శ్రీధర్ వాసిరెడ్డి తదితరులు ఉన్నారు.



"సంపద మొత్తం శ్రమ ఫలితమే!
– జాన్ లాకే

సాక్షి
సోమవారం, 28 ఏప్రిల్ 2025

మలబారు యాత్ర

వైకోం మహమ్మద్ బషీర్ తమ ఇంటిముందున్న వంగమామిడి చెట్టుకింద కూర్చుని రాసేవారట. ఆ చెట్టు గాలిని పీల్చే 'మా తాతకో ఏనుగుండేది', 'చిన్ననాటి నేస్తం', 'గోడలు' లాంటి ఆయన రచనలు ఊపిరి పోసుకున్నాయి. బషీర్ అభిమానులకు ఆ చెట్టును చూడటం గొప్ప సంతోషం. అంతేనా? ఆయన విన్న గ్రామ్‌ఫోన్ రికార్డు, ఆయన సేదతీరిన ఆరాం కుర్చీ కూడా ప్రత్యేకమే. బషీర్‌ను ఆయన జన్మించిన బేపూర్‌ను బట్టి బేపూర్ సుల్తాన్ అంటారు. ఆయన వస్తువులు, ఆయన జీవితాన్ని తెలియజెప్పే విశేషాలతో ఆ ఊళ్లో కేరళ ప్రభుత్వం ఒక మెమోరియల్ నిర్మిస్తోంది. బషీర్ క్లాసిక్ అయిన 'ప్రేమలేఖనం' నవలలో దంపతులు తమ చిన్నారికి పెట్టుకున్న ఆకాశమిఠాయి పేరునే ఈ స్మారక కేంద్రానికి ఉంచారు. ఒక రచయితకు మెమోరియల్ నిర్మించడం దానికదే విశేషమే అయినా, నిత్య సాహిత్య రాష్ట్రమైన కేరళ తన సాహిత్య స్పృహను మరో స్థాయికి తీసుకెళ్లింది. రచయితల మెమోరియల్స్‌ను కలుపుతూ దేశంలోనే తొట్టతొలి సాహిత్య యాత్రకు శ్రీకారం చుడుతోంది. 'మలబార్ లిటెరరీ టూరిజం సర్క్యూట్' పేరుతో ఈ యాత్ర కోళికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలను కవర్ చేస్తుంది.

మలయాళ సాహిత్యంలో ప్రాచీన కవిత్రయంలో ఒకరిగా పిలిచే, ఆధునిక మలయాళ సాహిత్య పితామహుడిగానూ కొలిచే 16వ శతాబ్దపు కవి, భాషావేత్త తుంచాత్తు రామానుజన్ ఎలుత్తాచ్చన్ గ్రామమైన తుంజన్ పరంబు మలబారు ప్రాంతంలోనే ఉంది. విజయదశమి రోజున చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల అక్షరాభ్యాసం కోసం ఈ గ్రామాన్ని దర్శించుకుంటారు. ఈ మలబారు ప్రాంతంలోనే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ఎం.టి.వాసుదేవన్ నాయర్; రచయిత, కార్టూనిస్ట్ ఒ.వి.విజయన్; ప్రఖ్యాత యాత్రాసాహిత్య కర్త ఎస్.కె.పొట్టెక్కాట్; మరో కవి, జ్ఞానపీఠ గ్రహీత అక్కితం అచ్యుతన్ నంబూద్రి లాంటివారి స్మారక కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఇవి భిన్న దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వాటన్నింటినీ అభిమానులు కలయదిరిగేలా, రచయితల పుస్తకంలో ప్రాణం పోసుకున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా అనుభవించేలా, మానవ ఉద్వేగాలన్నీ కాగితాల్లోకి ఎలా బదిలీ అయ్యాయో తెలుసుకునేలా కేరళ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 2021లోనే ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపులు జరపగా, ఈ సంవత్సరం మధ్యకల్లా దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. కోళికోడ్‌ను యునెస్కో భారతదేశ తొట్టతొలి సాహిత్య నగరంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వల్ల ఆ నగర ఘనత మరింతగా ఇనుమడిస్తుంది.

లండన్‌లోని షేక్‌స్పియర్ స్మారక కేంద్రాన్ని ఏటా పాతిక లక్షల మంది సందర్శిస్తారు. యూకేలో భిన్న లిటెరరీ సర్క్యూట్స్, వాటికి తగిన ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణ అమెరికాలోని కొలంబియాలో మ్యూజియంగా మార్చిన గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ ఇల్లు, ఆయన చదివిన పాఠశాల, ఆయన వెళ్లిన గ్రంథాలయం... ఇలా ఆయన 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్'కు ప్రేరణగా నిలిచిన అన్ని ప్రదేశాలను కలుపుతూ ప్రయాణించవచ్చు. ప్రముఖ మలయాళ సాహిత్యకారులకు కూడా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు ఉంది. వీళ్ల రచనలు భిన్న భారతీయ భాషలతో పాటు, ఆంగ్లం, ఇతర ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయి. దానికి తగ్గ ఉత్సాహం, ప్రోత్సాహం అక్కడ ఉన్నాయి. అందుకే సందర్శకులు భిన్న ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉంది. మరి తెలుగు రచయితల పరిస్థితి ఏమిటి? ముందు తెలుగు రచయితలను తెలుగువాళ్లకు పరిచయం చేయడమే పెద్ద సవాలు కావొచ్చు.

వైజాగ్ వైపు వెళ్లే కొందరు సాహిత్యాభిమానులు ప్రత్యేకించి భీమిలి వెళ్తారు చలం ఇంటి కోసం. విజయనగరం వైపు పోయేవాళ్లు గురజాడ గృహాన్ని దర్శించవచ్చు. అదే విశాఖపట్నానితో ముడిపడిన శ్రీశ్రీ, రావిశాస్త్రిలను ముడేస్తూ, అటుగా శ్రీకాకుళంలోని కథానిలయంతో కరచాలనం చేసేలా ఉత్తరాంధ్ర సాహితీయానం చేయగలిగితే ఎలా ఉంటుంది? పోతన, దాశరథి, కాళోజీ లాంటి వాళ్లను తలుచుకోగలిగే వరంగల్ సాహిత్య టూర్ ఎందుకు ఉండకూడదు? రచయితలను ప్రాంతాల వారీగానో, జిల్లాల వారీగానో అనుసంధానం చేసే సాహిత్య టూర్లను ఆశించడం తెలుగు నేల మీద మరీ అత్యాశా? కానీ ఎంతమంది రచయితలకు మెమోరియల్స్ ఉన్నాయి? కనీసం విగ్రహాలైనా ఉన్నాయా? కువెంపు విమానాశ్రయం (శివమొగ్గ) అని కన్నడవాళ్లు పెట్టుకున్నట్టుగా తెలుగు నేల మీద అలా ఒక రచయితకు గౌరవం దక్కుతుందా?

ప్రాచీన ప్రపంచంలో ఈజిప్టులోని అలెగ్జాండ్రియా లైబ్రరీ ఒక జ్ఞానధామం. క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన ఇది ఆ కాలపు గొప్ప పండితులందరికీ నిత్య సందర్శనా స్థలం. అమెజాన్ కంపెనీ తన వర్చువల్ అసిస్టెంట్‌ను ప్రారంభించినప్పుడు దాని పేరును అలెగ్జాండ్రియాకు నివాళిగా ఎన్నుకుంది. అట్లా 'అలెక్సా' చాలామంది జీవితాలకు చేరువైంది. సాహిత్యంతో పరిచయం లేదనుకునేవాళ్లు కూడా దాని ఫలాలను ఇంకో రూపంలో అనుభవిస్తూనే ఉంటారు. 'పోషణ, ఆవాసం, సాహచర్యం తర్వాత ఈ ప్రపంచంలో మనకు అత్యంతగా కావాల్సింది కథలు' అంటాడు ఫిలిప్ పుల్‌మాన్. 'రచయితలో కన్నీళ్లు లేకపోతే పాఠకుడిలో కన్నీళ్లు లేవు. రచయితలో ఆశ్చర్యం లేకపోతే పాఠకుడిలో ఆశ్చర్యం లేదు' అంటాడు రాబర్ట్ ఫ్రాస్ట్. రచయితలో ఉన్నదే పాఠకుడికి అందుతుంది. రచయితలో ఉన్నదంతా కూడా పాఠకుడికి బదిలీ అవుతుంది. సాహిత్యం అనేది మన అంతరాత్మలను వెలిగించే అదృశ్య దివ్వె. అందుకే సాహిత్య సృష్టికర్తలను తలుచుకునే ఏ ప్రయత్నం అయినా ప్రాధాన్యత కలిగినదే, దానికోసం తీసుకునే ఏ చొరవైనా విలువైనదే!

పాక్‌కు ఏది సరిపోయే శిక్ష?

విశ్లేషణ



తారా కార్థా

పహల్‌గామ్‌లో 26 మంది పౌరులను కాల్చి చంపిన భయంకర ఉగ్రదాడి తర్వాత భారత్‌లో పాకిస్తాన్ పై ఆగ్రహం పెరుగుతోంది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) కటువైన ప్రకటన విడుదల చేసింది. దాడి చేయడంలో ఉగ్రవాదులు ప్రదర్శించిన క్రూరత్వాన్ని చూస్తే ఆ ఆగ్రహం ఆశ్చర్యం కలిగించదు. పాక్ మీడియా వ్యాఖ్యాతలు ఇస్లామాబాద్‌ను ఇరికించడానికి భారతదేశమే ఈ దాడిని నిర్వహించిందని దారుణమైన ఆరోపణ చేస్తున్నారు. స్పష్టంగా, వారు ఘోరమైన పరిణామాన్ని ఆశిస్తున్నారు.

భద్రతా కేబినెట్ కమిటీ ప్రకటన కావలసిన అన్ని అంచనాలను తీర్చింది. న్యూఢిల్లీలో ఉన్న పాకిస్తాన్ హైకమిషన్‌లోని ఛార్జ్ డి'అఫైర్ సహా 14 మంది సిబ్బంది ఇంకా మిగిలి ఉన్నప్పటికీ, పాక్ సైనిక సలహాదారులు, ఇతర సహాయక సిబ్బందిని భారత్ విడిచి వెళ్ళమని ఆదేశించారు. ఇది పాక్ సైనిక సంస్థపై పూర్తిగా నిందను మోపుతుంది. అటారీ చెక్‌పోస్ట్ మూసివేయడం, మిగిలిన వీసా ప్రోటోకాల్స్‌ని నిలిపివేయడం కూడా ఊహించినదే. పాక్‌పై తీవ్రమైన ప్రభావం కలిగించడానికి భారత్ కఠిన నిర్ణయాలు తీసుకోవడం ఆశ్చర్యం కలిగించలేదు. గత సంవత్సరం చివర్లో, సింధునదీ జలాల ఒప్పందంపై తిరిగి చర్చలు జరిగే వరకు సింధునదీ జలాల కమిషన్ సమావేశాలను నిర్వహించడానికి కూడా భారత్ నిరాకరించింది.

కేవలం నిలిపేసింది!

భారత్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆలస్యం చేయడానికి పాకిస్తాన్ అతి స్వల్ప కారణాలను చూపుతూ సింధు జలాల ఒప్పందాన్ని ఉపయోగించుకుంటోంది. ఒప్పందంలో ఇరు దేశాల కమిషనర్లు సహా మూడు అంచెల వివాద యంత్రాంగం ఉంది. అది విఫలమైనప్పుడు, 1960లో ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన ప్రపంచ బ్యాంకు ఒక తటస్థ నిపుణుడిని నియమిస్తుంది. అది కూడా పని చేయకపోతే, మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయవచ్చు. 1970లలో, భారతదేశం సలాల్ (జమ్ము–కశ్మీర్) ఆనకట్ట ఎత్తును తగ్గించి, దాని అవుట్‌లెట్‌లను తెరిచి వేయవలసి వచ్చింది. దీనివలన ఆనకట్ట ఉపయోగం తగ్గి భారీగా బురద చేరి, కోతకు గురైంది. మరొక సందర్భంలో, బాగ్లిహార్ ఆనకట్ట (జమ్ము–కశ్మీర్) 14 ఏళ్ల ఆలస్యాన్ని ఎదుర్కొంది. కిషన్‌గంగా ప్రాజెక్టు మరింత ఇబ్బందులకు గురైంది. ప్రపంచ బ్యాంక్ నియమించిన తటస్థ నిపుణుడు ఈ విషయాన్ని పరిశీలిస్తున్నప్పుడే పాక్ మధ్యవర్తిత్వ స్థాయికి వెళ్లింది. ప్రపంచంలోనే అత్యంత నీటి కొరత ఉన్న దేశాలలో పాకిస్తాన్ 15వది. భారతదేశం ప్రస్తుతం జలాల ఒప్పందాన్ని కేవలం 'నిలిపివేసింది'. సరిహద్దుకు అవతలి వైపు ఉన్న బాధ్యతాయుతమైన మనుషులు ఈ స్వల్పభేదాన్ని అర్థం చేసుకోవాలి.

అయితే, ఇవేవీ భారతదేశ ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేవు. భద్రతా కేబినెట్ కమిటీ ప్రకటన 'ఇటీవల తహవ్వుర్ రానాను వెనక్కి రప్పించినట్లే, ఉగ్రవాద చర్యలకు పాల్పడిన లేదా వాటిని సాధ్యం చేయడానికి కుట్ర పన్నిన వారిని వెంబడించడంలో భారతదేశం అవిశ్రాంతంగా ఉంటుంది' అని పేర్కొంది. ఉగ్రదాడి తర్వాత ప్రధాని బిహార్‌లో ఉద్దేశపూర్వకంగానే ఇంగ్లీషులో మాట్లాడుతూ, 'భారతదేశం ప్రతి ఉగ్రవాదినీ, వారికి మద్దతు ఇచ్చేవారినీ గుర్తించి, వెంబడించి, శిక్షిస్తుంది. మేము వారిని భూమ్మీద ఎక్కడున్నా దొరికించుకుంటాం' అన్నారు. ఉగ్రవాదాన్ని శిక్షించే చర్యలు దీర్ఘకాలంపాటు కొనసాగుతాయని ఈ ప్రకటన సూచిస్తుంది.



- కనీస జ్ఞానం ఉన్న ఏ దేశమైనా, కీలకమైన ఇంధనాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితుల్లో యుద్ధం ప్రారంభించదు. అయినా భారత్‌ను పాక్ యుద్ధంలోకి లాగుతున్నట్టు కనిపిస్తోంది. దానికి పోయేదేమీ లేదు.
- పాకిస్తాన్ మోకరిల్లేలా వివిధ దేశాలు ఆంక్షలు విధించాలని డిమాండ్ చేయాలి.
- పాక్ కోరుకోని విధంగా, దీర్ఘకాలంగా అణచివేతకు గురైన బలూచ్‌లు, పష్తూన్‌లకు బహిరంగ మద్దతు ప్రకటించే సమయం ఇదే కావచ్చు.

ఎలా దాడి చేయొచ్చు?

కాబట్టి, ఇప్పుడు ఇక్కడ ఏమి సాధ్యమవుతుంది అంటే కచ్చితంగానే బాలకోట్ తరహా దాడి సాధ్యం కాదు. ఈసారి, పాక్ సైన్యం పూర్తి అప్రమత్తంగా ఉంది. స్పష్టమైన ప్రత్యామ్నాయం ఏమిటంటే, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలను గుర్తించే లక్ష్యంతో భారత భూభాగం నుంచే 290 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించడం. అది భారత్ తనదని చెప్పుకొంటున్న ప్రాంతం కాబట్టి ఇది సాంకేతికంగా పాకిస్తాన్‌పై దాడి కాదు. మరింత కావాల్సిన లక్ష్యం లష్కర్–ఎ–తొయిబా కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న మురిద్కే. ఇది లాహోర్‌కు దగ్గరగా, భారత సరిహద్దు నుండి దాదాపు 30 కి.మీ. దూరంలో ఉంది. సాయుధ డ్రోన్‌లను ఉపయోగించి కూడా దీనిపై దాడి చేయవచ్చు. దీని వలన కచ్చితత్వంతోపాటు ఎటువంటి ఆనుషంగిక నష్టం ఉండదు.

కానీ ఏదైనా సరే, ఎంత సమర్థనీయమైనా సరే, అది యుద్ధ చర్యే. పాకిస్తాన్ సైన్యం ప్రతీకారం తీర్చుకుంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. బాలకోట్ తరువాత, అది జాగ్రత్తగా దాడి చేసింది. పెద్దగా నష్టం కలిగించకుండా ప్రతిస్పందనను నమోదు చేసింది. దానికి ప్రధానంగా అప్పటి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ బాజ్వా కారణం. ఆయన దేశ సొంత ప్రయోజనం కోసం పాక్ అంతటా భారతదేశానికి వాణిజ్యాన్ని ప్రతిపాదించిన వాస్తవికవాది. కానీ, యుద్ధం, దాని అన్ని తీవ్రతరమైన అవకాశాలను దృష్టిలో ఉంచుకుంటే ప్రస్తుత చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ వివేకవంతమైన వ్యూహకర్త కాదు. భారతదేశం ఈ యుద్ధాన్ని భరించగలదు. అయినప్పటికీ ముఖ్యంగా ఆయుధాల కోసం దిగుమతులపై ఆధారపడి ఉన్నప్పుడు ఇది అత్యంత వ్యర్థమైన ఖర్చు.

ముక్కలుగా కత్తిరిస్తే!

భారత్ యుద్ధాన్ని కాకుండా, ఆర్థిక వృద్ధిని కోరుకుంటోంది. పాక్ నిజంగా యుద్ధాన్ని భరించలేదు. పైగా అంతర్జాతీయ ద్రవ్యనిధి అటువంటి ఖర్చులను దయతో చూస్తుందా లేదా అనేది విషయం కాదు... వాస్తవం ఏమిటంటే, ఆ దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు సంక్షోభంలో ఉన్నాయి. ఇది జెట్ ఇంధనం విషయంలో తీవ్రమైన కొరతకు దారితీస్తుంది. గత తొమ్మిది నెలల్లో ఆరు ప్రధాన శుద్ధి కర్మాగారాలలో ఏవీ చమురు పంపిణీ చేయలేదు. కనీస జ్ఞానం ఉన్న ఏ దేశమైనా, కీలకమైన ఇంధనాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితుల్లో యుద్ధం ప్రారంభించదు. అయినా భారత్‌ను పాక్ యుద్ధంలోకి లాగాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది. దానికి పోయేది ఏమీ లేదు. అందుకే తక్కువ 'ఆడంబర' ప్రత్యామ్నాయం ఏమిటంటే, ఎల్‌ఓసి అంతటా ఫిరంగి కాల్పులు జరపడం. కానీ మన వైపు పౌరులకు కూడా నష్టాలు ఉంటాయి. పైగా ఈ మొత్తం విన్యాస ప్రయోజనమే ప్రశ్నార్థకం అవుతుంది. ఏమైనప్పటికీ ఉగ్రవాదులు చొరబడతారు. ఏమైనా పాక్ కోరుకుంటున్న దిశలో ఇండియా కొట్టుకుపోకుండా జాగ్రత్త వహించాలి. బదులుగా, చాలా నైపుణ్యంతో పాక్‌ని శిక్షించడాన్ని ఎంచుకోవాలి.

చాలా కాలంగా, పాకిస్తాన్ రెండు వైపులా ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడాన్ని అందరూ గుర్తించారు. పాకిస్తాన్ ను మోకరిల్లేలా చేసే వరకు సంబంధిత దేశాలు ఆంక్షలు విధించాలని డిమాండ్ చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ముఖ్యంగా ఆంక్షలనేవి పాక్ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకోవాలి. ఇకపై పాక్ సైన్యాధికారులు సౌకర్యవంతమైన విదేశాల పర్యటనలు చేయకుండా చూడాలి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి వచ్చే అన్ని బాహ్య నిధులకు అడ్డుకట్ట వేయాలి.

అవును, చాలా దేశాలు పాక్‌ను శిక్షించే కార్యక్రమంలో చేరవు. ఉగ్రవాదాన్ని ఎంత ఇష్టపడకపోయినా, పాక్‌ని శిక్షించని దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంటుంది. అందుకే పాక్ కోరుకోని విధంగా, దీర్ఘకాలంగా అణచివేతకు గురైన బలూచ్‌లు, పష్తూన్‌లకు బహిరంగ మద్దతు ప్రకటించే సమయం ఇదే కావచ్చు. ఇది పాక్ రహస్య వ్యూహాల అనుకరణ కాకూడదు. ఇది ప్రపంచాన్ని ముందుకు రావాలని పిలుపునిచ్చే బహిరంగ మద్దతుగా ఉండాలి. ఇక జరిగింది చాలు, పాక్‌కు దాని స్థాయేమిటో తెలియజెప్పాలి.

వ్యాసకర్త డైరెక్టర్ (పరిశోధన), సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఇప్పుడే ఎందుకు?



పహల్‌గామ్ దాడి 'ఇప్పుడే' ఎందుకు జరిగివుంటుంది? పాకిస్తాన్ గందరగోళంలో ఉంది. కాబట్టి పాకిస్తాన్ సైన్యం జనాల దృష్టి మళ్ళించాలనుకుంటుంది. అది అసాధారణం ఏమీకాదు. కానీ సుంకాల యుద్ధం తర్వాత, 'యాపిల్' సహా చాలా పాశ్చాత్య కంపెనీలు తమ స్థావరాలను చైనా నుంచి ఇండియాకు మార్చాలనుకుంటున్నాయి. దాన్ని ఎలా నెమ్మదింపజేయాలి? ఇండియా సురక్షితం కాదని అవి భావించేలా చేయాలి. పాకిస్తాన్‌కు అ కావాలి, చైనాకూ అదే కావాలి.

– విక్రమ్ చంద్ర, సంపాదకుడు

ఏం చేయొచ్చు?



సాంకేతికంగా సాధ్యమైతే ఇండియా తక్షణం తీసుకోగలిగే ఒక చర్య– జమ్ము కశ్మీర్‌లో ఇప్పటికే ఉన్న, నిర్మాణంలో ఉన్న డ్యామ్స్ ఎత్తు పెంచడం. అది రాత్రికి రాత్రే జరగదు. కానీ మౌలిక సదుపాయాలను పెంచడం మన నీటిని మరింతగా ఒడిసి పట్టుకోవడానికి ఉన్న వేగవంతమైన మార్గం. అలాగే సాధ్యమైనచోట నది నీళ్ల మీద నడిచే ప్రాజెక్టుల్ని ఏకీకృత జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టులుగా మార్చాలి.

– యూసుఫ్ ఉంర్యూవాలా, సంపాదకుడు

తార్కికంగా ఆలోచించాలి!



నేను నా దేశాన్ని పట్టించుకుంటాను. అదే సమయంలో యుద్ధతంత్రం, అందులో వచ్చిన మార్పులు కూడా తెలుసు. చైనా, పాకిస్తాన్ రెండింటిని ఎదుర్కొనే విశ్వసనీయ సామర్థ్యాన్ని ఇండియా పెంపొందించుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేకించి 2019 ఆగస్ట్ 5 నుంచీ పాకిస్తాన్ సార్వభౌమత్వానికి మద్దతిస్తామని చైనా పదే పదే చెప్పింది. కాబట్టి ఏ తార్కిక మదింపు అయినా దీన్ని దృష్టిలో పెట్టుకుని జరగాలి. ఊరకే అరుపులతో పని జరగదు.

– ప్రవీణ్ సహానీ, మాజీ సైనికాధికారి


బడాయి ప్రాంతం



చాలామందికి అర్థం కానిది ఏమంటే పాకిస్తాన్ అంటే ముఖ్యంగా పశ్చిమ పంజాబ్ మాత్రమే. మిగిలిన ప్రాంతాలన్నింటికీ పాకిస్తాన్ రాజ్యంతో ఏదో సమస్య ఉంది. పశ్చిమ పంజాబ్ అన్నింటినీ నియంత్రిస్తుంది. అయితే, ఈ ప్రాంతం బడాయికి పెట్టింది పేరు.

– హిందోళ్ సేన్‌గుప్తా, ప్రొఫెసర్

అపూర్వ కలయిక



డా. టి. సంపత్ కుమార్

చిన్నప్పటినుండి కలిసి చదువుకొన్నవారు విడిపోయి, దీర్ఘ విరామాల తరువాత కలుసుకోవడం మరిచిపోలేని అనుభవాలను ఇస్తుంది. మా కలయికా అటువంటిదే! మాది చిన్న ఊరు: ఖానాపూర్ (అప్పుడు ఆదిలాబాద్ జిల్లా). నాల్గవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివాం. అరవై మంది విద్యార్థులం పదవ తరగతిని 1970వ సంవత్సరంలో ముగించాం. కొందరు చదువాపేస్తే, మరికొందరు వ్యవసాయం, కులవృత్తుల్లో స్థిరపడ్డారు. అవకాశాలున్న వారు పై చదువుల కోసం వేరేచోట్లకి వెళ్లారు.

నేను ఇంటర్, డిగ్రీ, పీజీ ఆంధ్రప్రదేశ్‌లో చదివి, పై చదువుల కోసం ఢిల్లీ చేరాను. నలభై ఏళ్లు అక్కడే ఉండి, పదవీ విరమణ తరువాత 2015లో నిర్మల్‌కి (కొత్త జిల్లా) మకాం మార్చాను. మా పదవ తరగతి వాళ్లం అందరం తిరిగి కలవాలనే (రీ యూనియన్) ఆలోచన వచ్చింది. అప్పటికి 45 సంవత్సరాలయ్యింది విడిపోయి. పెద్ద సవాలు! ఐదుగురు స్నేహితులను కలిశాను. ఒక టాస్క్ ఫోర్స్‌లా ఏర్పడి ఆరుగురం (నాతో కలిపి) ఒక్కొక్కరు పది మంది స్నేహితులను కాంటాక్ట్ చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకొన్నాం. నెల రోజుల తరువాత అందరూ సేకరించిన సమాచారాన్ని పరిశీలించాం. స్నేహితుల వివరాలు సంపాదించాం. మాకది గొప్ప విజయం! అయితే అందులో పదిహేను మంది స్నేహితులు చనిపోయారు. అందర్నీ సంప్రతించి ఆదివారం, 2017 ఏప్రిల్ 9 నాడు మేము చదువుకున్న ఖానాపూర్‌లోని పాఠశాల ప్రాంగణంలోనే కలుసుకున్నాం.

ఉదయం పది గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించి, సాయంత్రం వరకు తరగతి గదులను, మేము కూర్చున్న సీట్లను చూస్తూ... మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తూ స్నేహితులతో కలిసి తిరుగుతుంటే ఆ ఆనందాన్ని ఎలా వర్ణించగలం? ముగ్గురు అమ్మాయిలు మా కార్యక్రమానికి రాలేకపోయారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే మాకు చదువు చెప్పిన ముగ్గురు టీచర్లు ఆరోగ్యంగా అందుబాటులో ఉండటంతో వారిని ప్రత్యేకంగా ఆహ్వానించాం. గౌరవ మర్యాదలతో వారిని సత్కరించాం. మండల విద్యాధికారి కార్యక్రమానికి హాజరయ్యారు. అందరం ఆప్యాయంగా ఆలింగనాలు చేసుకొంటూ సాయంత్రం విడిపోయాం. మా అపూర్వ కలయికను దినపత్రికలు గొప్పగా రాశాయి.

ఇది జరిగి ఎనిమిది సంవత్సరాలు కావస్తోంది. ఇంకో ఐదుగురు మిత్రులు మమ్మల్ని వదిలిపెట్టిపోయారు. ఇప్పుడు మా అందరి వయస్సు డెబ్బై ఏళ్ళకి అటు ఇటుగా ఉంటుంది. అప్పటి పిల్లలం కాలక్రమేణా తండ్రులు, తాతలు, ముత్తాతలమయ్యాం. కలయికలు పాత జ్ఞాపకాలను తాజాపరుస్తాయి. హుషారును నింపుతాయి. చిన్నప్పటి మిత్రుల్ని కలవనివారు ఉంటే ఆలస్యం చేయకుండా కలిసే ప్రయత్నాలు మొదలుపెట్టండి. వెల లేని సంబరాలను తెచ్చిపెడతాయి.

రచయిత ఢిల్లీలోని కెనడియన్ హైకమిషన్‌లో మాజీ సీనియర్ సలహాదారు

'ఫూలే'ను ఎందుకు ఆపాలని చూశారు?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మొదటిసారి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే మీద ఒక హిందీ సినిమా వచ్చింది. దాన్ని ప్రఖ్యాత సినిమా డైరెక్టర్ అనంత్ మహాదేవన్ తీశారు. ప్రతీక్ గాంధీ, పత్రలేఖా పాల్ అనే ఇద్దరు యాక్టర్లు పూలే, సావిత్రిగా నటించారు. ఆ సినిమా నిజానికి పూలే 198వ జయంతి అయిన 2025 ఏప్రిల్ 11న విడుదల కావలసి ఉంది. కానీ దేశంలోని కొన్ని బ్రాహ్మణ సంఘాలు సినిమా విడుదలను వ్యతిరేకించి 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిమ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ)కి ఎన్నో ఫిర్యాదులు పంపారు. సీబీఎఫ్‌సీ అతివేగంగా స్పందించి, విడుదల కావాల్సిన సినిమాను ఆపేసి కొన్ని మార్పులు సూచించింది. ఎన్నో ఇబ్బందుల అనంతరం చివరికి ఏప్రిల్ 25న సినిమా విడుదలయ్యింది.

'ఫూలే' సినిమా ఊహాజనిత కథపై ఆధారపడి తీసింది కాదు. ఫూలే, సావిత్రిపై రాసిన ఇంగ్లిష్, మరాఠీ, హిందీ భాషల్లోని చాలా జీవిత చరిత్రలపై ఆధారపడి తీసింది. కానీ సీబీఎఫ్‌సీ బలమైన చారిత్రక ఆధారాలతో సినిమాలో పెట్టిన ఘటనలను, కొన్ని పేర్లను తొలగించాలని సూచించింది. ముఖ్యంగా పూలే కాలంలో కూడా దళితులు గ్రామ వీధుల్లోకి వస్తే మూతికి ముంత, నడుముకు తాటాకు కట్టుకోవలసి ఉండింది. ఈ ఘోరమైన అంటరానితనాన్ని ఆ ప్రాంతాన్ని పరిపాలించిన బ్రాహ్మణ రాజులైన పీష్వాలు కఠినంగా అమలుచేశారు.

పూలే స్వయంగా చదువు చెప్పి సావిత్రీబాయిని దేశంలోనే మొదటి మహిళా టీచర్‌ని చేశాక, పుణె పట్టణ సమీపంలోని దళితవాడలో ఆడపిల్లలకు స్కూలు పెట్టారు. ఏ కులానికి చెందిన అమ్మాయిలైనా వచ్చి చదువుకోవచ్చని ప్రకటించారు. సావిత్రీబాయితోపాటు చదువుకున్న ముస్లిం స్త్రీ ఫాతిమా షేక్ ఆమెకు అండగా ఉండేది. సావిత్రీబాయి ఈ దేశం మొత్తం చరిత్రలో భర్త సహాయంతో చదువుకొని టీచరై, ఆడపిల్లలకు బడి పెట్టిన మొదటి మహిళ.

పూలే దంపతులు బ్రాహ్మణులతో తగువు పెట్టుకోలేదు. కొట్టినా, తిట్టినా ఈ దేశ రైతాంగ జీవితాన్ని, కూలీల జీవితాన్ని, వృత్తి పనివారి జీవితాన్ని, ముఖ్యంగా స్త్రీ సమాజ జీవితాన్ని మార్చిన ఏకైక ఆదర్శ భార్యాభర్తల జంట అది. ఆ జంట అహింసకు మారుపేరు.

ఈ సినిమాలో పీష్వాల కాలం నాటి ఘోర అంటరానితనం, మనుషులను జంతు ప్రాయంగా చూసిన పీష్వా రాజ్య న్యాయ వ్యవస్థను ఈనాటి సమాజానికి చెప్పకుండా, సినిమా రూపంలో చూపించకుండా ఎందుకుండాలి? చుట్టూ బ్రిటిష్ పరిపాలన ఉన్నా, పీష్వా రాజులు పుష్యమిత్ర శుంగుని క్రూరాతిక్రూరమైన వర్ణధర్మ రాజ్యాన్ని నడిపింది చరిత్ర కదా! మొత్తం రైతాంగాన్ని – అంటే ఇవాళ పై శూద్ర కులంగా ఉన్న మరాఠాలు, కుంబీలు (పూలే కులస్థులు) సైతం చదువు నేర్చుకునే హక్కు లేని కట్టుబానిసలు కదా! అందుకే 'గులాంగిరీ' పుస్తకంలో పూలే వ్యవసాయ ఉత్పత్తిదారులను బానిసత్వం నుండి విముక్తి చెయ్యకుండా దేశం అభివృద్ధి కావడం అసంభవం అని రాశారు.

ఆనాటి శూద్ర బానిసలకు తాము బానిసలమనే సోయి కూడా లేదు. ఈ వ్యవస్థ వ్యవసాయ ఉత్పత్తిని పెంచలేదు. ఉన్న పంటలో అదిరించి, బెదిరించి, స్వర్గం–నరకం సిద్ధాంతం చెప్పినవాళ్లు మాత్రమే కాస్త మంచి తిండి తిన్నారు. వీళ్ళకు ఆనాడు జాతీయ భావం లేదు. కుల భావం మాత్రమే ఉంది. జాతీయ భావన సమానత్వంతో ముడిపడి ఉంది.

ఈ దేశంలో అన్ని కులాల వారికి జాతీయ భావాన్ని నేర్పిన మొట్టమొదటి దైవసమాన జంట పూలే–సావిత్రీబాయి. వారిని మించిన జంట ఈ భూమి మీద ఆనాటికి పుట్టలేదు. ఈనాటికీ వెతికినా దొరికే స్థితి లేదు.



'ఫూలే' చిత్ర దర్శకుడు అనంత్ మహదేవన్. ఆ చిత్రంలో ప్రధాన పాత్రధారులు

పిల్లలు లేని ఈ జంట... విధవలుగా జీవిస్తున్న ఇద్దరు (బ్రాహ్మణ, ఇతర కులాలకు చెందిన) స్త్రీలను... ఇంట్లో పెట్టుకొని, ఒక బ్రాహ్మణ విధవకు పుట్టిన యశ్వంతరావును పెంచుకొని, మొదటి డాక్టరును చేశారు. ఆనాటి వరకు బ్రాహ్మణ పురుషులు కూడా అలోపతి మెడిసిన్ చదవడం లేదు. సముద్రాలు దాటడం లేదు. ఈ దంపతులను ఈనాటి బ్రాహ్మణులైనా, ఏ కులస్థులైనా ఎలా చూడాలి? ఈ భూమి మీద నడిచిన దేవ–దేవతా దంపతులుగా చూడాలి కదా! వారి జీవిత చరిత్ర చిత్రీకరణను వ్యతిరేకించడమేమిటి?

సావిత్రీబాయి ఈ దేశ మొదటి మహిళా టీచరయ్యారు నిజమే. ఆమెపై ఆనాటి సంప్రదాయ యువకులు పేడ కొట్టింది నిజమే. కొంతమంది బ్రాహ్మణులు ఆ దంపతులకు మద్దతిచ్చిందీ నిజమే. సీబీఎఫ్‌సీ పేడకొట్టే సీను సినిమాలో తీసెయ్యాలని ఎలా అన్నది? ఈ సీబీఎఫ్‌సీలో ఒక్క శూద్ర వ్యక్తిగానీ, దళిత వ్యక్తిగానీ లేకుండా ఎలా చేశారు బీసీ ప్రధానమంత్రి? ఈ సీబీఎఫ్‌సీ కశ్మీర్ మీద, గుజరాత్ మీద, కేరళ మీద ముస్లింలపై సినిమా తీసినప్పుడు వాళ్ళు ట్రైలర్లు చూసి ఎన్ని అభ్యంతరాలు పెట్టినా ఒక్క సీన్‌గానీ, ఒక్క పదంగానీ కట్ చెయ్యలేదు. ఇప్పుడు సీబీఎఫ్‌సీ అధ్యక్షుడు ప్రసూన్ జోషీ ఈ దేశ జాతీయతను ఏం చెయ్యదలచుకున్నారు?

ఆ సినిమాలు ప్రధానమంత్రి చూశారు. పొగిడారు. మరి 'ఫూలే' సినిమాను ప్రధానమంత్రి చూస్తారా? ఒక బీసీగా ప్రధానమంత్రి అయి, ముఖ్యంగా శూద్ర బీసీల ఓట్లతో గెలిచి ఫూలే వ్యతిరేకులను సమర్థిస్తారా అనేది చాలా ముఖ్యమైన అంశం.

ఈ సినిమా భారతదేశపు సినిమా ఇండస్ట్రీలో ఒక కొత్త మలుపు. మన సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలు పుస్తకాలుగా వచ్చాయి. కానీ వారిపై పెద్ద డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు సినిమాలు తీసే ప్రయత్నం చెయ్యలేదు. అందులో ముఖ్యంగా ప్రపంచ ఆధునిక చరిత్రలో ఎక్కడా లేని ఒక ఫూలే జంట లాంటి జంట మీద సినిమా తీయడం, వారి జీవితాలను ఇంటింటికీ ఆదర్శవంతం చేయడం నిజానికి జాతీయ లక్షణాలు కలిగిన సినిమా ఇండస్ట్రీకి ఉండాలి. కానీ అదెక్కడా కనిపించలేదు. ఈ సినిమాతో అది మొదలయింది.

ఒక సినిమా మంచిదా, కాదా అనేది అది ఎన్ని కోట్లు సంపాదిస్తుంది అనే మార్కెట్ విలువను బట్టి ఈ రోజుల్లో, మార్కెట్‌లో కూడా ఈ సినిమా విలువను పెంచాల్సి ఉంది. ప్రభుత్వాలు ఈ సినిమాకు పన్ను తగ్గిస్తాయా, మాఫీ చేస్తాయా అనేది అంత ముఖ్యం కాదు. ఎంతమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఈ సినిమాను చూస్తారు అనేది ముఖ్యం. అమెరికాలో రేసిజాన్ని అంతం చేసిన ప్రెసిడెంట్ అబ్రహాం లింకన్ 1865లో 'అవర్ అమెరికన్ కజిన్' డ్రామాను థియేటర్‌లో చూస్తూ హత్యకు గురయ్యారు. మంచిని నేర్చుకోవడానికి ఆయన చూపిన శ్రద్ధ అది.

ఈ సమాజం సమానత్వం వైపు పయనిస్తేనే ప్రజాస్వామ్యం బతికి ఉంటుంది. లేకపోతే పూలేలు నేర్పిన శ్రమ గౌరవ పాఠాలు ఇసుక దిబ్బల మీద రాసిన రాతలయ్యే ప్రమాదముంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు



గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం; **తిథి:** శు.పాడ్యమి రా.10.56 వరకు, తదుపరి విదియ; **నక్షత్రం:** భరణి రా.11.28 వరకు, తదుపరి కృత్తిక; **వర్జ్యం:** ప.10.04 నుండి 11.33 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు; **అమృత ఘడియలు:** సా.6.58 నుండి 8.30 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.40; **సూర్యాస్తమయం** 6.14

క్లుప్తంగా...

మూడేళ్లలో 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే మూడేళ్లలో ఆయిల్ పామ్ సాగును 2 లక్షల ఎకరాలకు విస్తరించనున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణలో నాలుగు రోజులపాటు పర్యటించనున్న జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శిల్పినేహా తెర్కే ఆదివారం మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. రైతుల కోసం కొత్త పథకాలు, కృత్రిమ మేధస్సు వినియోగం, రైతులకు లాభదాయకంగా చేసే విధానాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం రైతుల కోసం కేటాయించి, దేశంలో ఎక్కడా జరగని విధంగా రూ.2 లక్షలలోపు పంట రుణమాఫీని ఏకకాలంలో పూర్తిచేశామని, రూ. 20,616 కోట్లను ఖర్చు చేసి 25,35,964 మంది రైతులను రుణవిముక్తులను చేసినట్టు తెలిపారు. శిల్పినేహా తెర్కే హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్ఎంఆర్ఐ, ఎన్ఎఫ్‌డీబీ, ఐఐఎంఆర్‌లను సందర్శించి అక్కడ జరిగే సమావేశాల్లో పాల్గొంటారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రజాభవన్‌లో ఆదివారం మంత్రి సీతక్కతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి భేటీ అయ్యారు. కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత.. సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు మొదటిసారిగా మంత్రి సీతక్కతో సమావేశమయ్యారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు తక్షణమే స్పందించేలా కమిషన్ పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బాలల హక్కుల కమిషన్ సభ్యులు కలిశారు.

భారత్ సమ్మిట్ విజయవంతం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ సమ్మిట్–2025 విజయవంతమైందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. తెలంగాణ గొప్పతనాన్ని చాటేవిధంగా.. అంతర్జాతీయ స్థాయి సమావేశం నిర్వహించడాన్ని గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రపంచానికి తెలియజేయడానికి భారత్ సమ్మిట్ ఒక వేదికగా ఉపయోగపడిందన్నారు. ప్రపంచ శాంతి, ప్రపంచ న్యాయం, వాతావరణ మార్పులు, తీవ్రవాదం తదితర అంశాలపై లోతైన చర్చలకు సదస్సు వేదికైందని వెల్లడించారు. మొత్తం 44 అంశాలతో ఈ సందర్భంగా విడుదల చేసిన హైదరాబాద్ డిక్లరేషన్ ప్రపంచ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం విలువల నిబద్ధతకు నిలువుటద్దంగా ఉందని మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు.

జాతీయ మహిళా కమిషన్ బహిరంగ విచారణ నేడు

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహిళల సమస్యలపై జాతీయ మహిళా కమిషన్ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించనున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు తెలిపారు. బేగంపేట్ టూరిజం ప్లాజాలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహిళా సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం జరగనుందని చెప్పారు. రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్ – మహిళా జన్ సున్వాయితో.. జాతీయ మహిళా కమిషన్ మహిళల సమస్యలపై వినతులు స్వీకరిస్తుందని పేర్కొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల సమస్యగా కాకుండా.. సామాజిక ఆర్థిక, రాజకీయ సమస్యగా చూడాలని కోరారు. మావోయిస్టులు కూడా ఆయుధాలు వదిలి.. జనజీవన స్రవంతిలోకి వచ్చి పోరాడాలని సూచించారు.

కొత్త సీఎస్‌గా కె.రామకృష్ణారావు

ఈ నెల 30న రిటైరవనున్న శాంతికుమారి స్థానంలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

- దేశంలోనే సుదీర్ఘకాలం ఆర్థిక కార్యదర్శిగా, 14 బడ్జెట్లు రూపొందించిన అధికారిగా రికార్డులు
- పునర్విభజన చట్టానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
- సీఎం రేవంత్, కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలిపిన రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. ఈ నెల 30న రిటైరవనున్న ప్రస్తుత సీఎస్ శాంతికుమారి స్థానంలో ఆయన్ను నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాల వరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని ప్రభుత్వం మరో ఉత్తర్వులో పేర్కొంది. రామకృష్ణారావు 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు.



ఆర్థిక శాఖ కార్యదర్శిగా రికార్డు..

రామకృష్ణారావు 1965 ఆగస్టు 30న ఆదిలాబాద్ జిల్లాలో జన్మించారు. ఐఐటీ కాన్పూర్ నుంచి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఇంజనీరింగ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్, అమెరికాలో ఎంబీఏ చేశారు. ఉమ్మడి ఏపీలో ఆయన నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల సబ్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. అలాగే పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా, ఆ తర్వాత 2013లో సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా ఉన్నారు. 2014 నుంచి ఆయన ఆర్థిక శాఖలో ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాల్లో కొనసాగుతున్నారు. దేశంలోనే సుదీర్ఘంగా 11 ఏళ్లపాటు ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ అధికారిగా ఆయన రికార్డు సృష్టించారు. పూర్తిస్థాయి బడ్జెట్లు, ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు కలిపి మొత్తం 14 బడ్జెట్లను రూపొందించిన అధికారిగా సైతం ఆయన మరో రికార్డు సొంతం చేసుకున్నారు. ఏపీ పునర్విభజన చట్టానికి సంబంధించి కొత్త రాష్ట్రమైన తెలంగాణలో తలెత్తిన వివిధ సమస్యల పరిష్కారానికి ఆయన ప్రత్యేక చొరవ చూపారు. అలాగే ప్రాజెక్టులు, ప్రతిష్టాత్మక పథకాలకు నిధుల సమీకరణ కోసం పెద్ద ఎత్తున కృషి చేశారు. ఆర్థికశాఖలో పారదర్శకతకు పెద్దపీట వేశారు.

టీమ్ వర్క్‌ను ప్రోత్సహిస్తా

'సాక్షి'తో కె.రామకృష్ణారావు

'నాకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు. క్రియాశీలకంగా పనిచేసే మంచి టీమ్‌గా, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపిస్తా. టీమ్ వర్క్‌ను ప్రోత్సహిస్తా. ప్రభుత్వ కార్యదర్శులు ఎవరి పనివారు చేసుకోవాలి. ప్రతి కార్యదర్శికి బాధ్యతలు స్పష్టంగా ఉన్నాయి. అవసరమైతేనే జోక్యం చేసుకొని వారికి సహకరిస్తా' అని కె.రామకృష్ణారావు ఆదివారం 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణం, రాజీవ్ యువవికాసం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణాభివృద్ధి ప్రాజెక్టులతో పాటు బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చిన అంశాలపై దృష్టి పెట్టి వాటిని ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఆదాయ లీకేజీలను నిర్మూలించి పన్నేతర ఆదాయం పెంపుపై దృష్టి పెడతానన్నారు. పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంతో నిధుల కొరతను అధిగమిస్తామని వివరించారు.

ప్రాధాన్యాలకు కొత్త జట్టు!

రాష్ట్ర పాలనా యంత్రాంగంలో భారీ బదిలీలు

- 18 మంది ఐఏఎస్, ఇద్దరు నాన్ కేడర్ అధికారులకు స్థానచలనం
- రెండుగా పురపాలక శాఖ విభజన..
- హెచ్ఎండీఏ లోపలి, వెలుపలి ప్రాంతాలకు వేర్వేరు కార్యదర్శులు
- సీఎంఓలోని ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్, స్పీడ్‌కు జయేశ్ రంజన్
- సర్కారు ప్రాధాన్యతలకు అనుగుణంగా కొత్త పోస్టింగ్‌లు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పాలనా యంత్రాంగంలో భారీగా బదిలీలు జరిగాయి. ఆదివారం తొలుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును నియమించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ వెంటనే పలు కీలక శాఖలు, విభాగాలకు కొత్త బాస్‌లను నియమించింది. పెట్టుబడుల ఆవిష్కరణ, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, హైదరాబాద్ నగరాభివృద్ధి, పట్టణాభివృద్ధి వంటి ప్రభుత్వ ప్రాధాన్యాంశాలకు అనుగుణంగా కొత్త జట్టును సిద్ధం చేసింది. ఈ మేరకు 18 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు నాన్ కేడర్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన ఐటీ, పరిశ్రమలు, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేశ్ రంజన్‌ను సీఎంఓలోని ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్, స్మార్ట్ ప్రొయాక్టివ్ ఎఫీషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ (స్పీడ్) విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/సీఈఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పరిశ్రమలు, ఐటీ, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ స్థానచలనం పొందారు. ఇక గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేవిధంగా 'ఎక్స్'లో పోస్టులను షేర్ చేసిన యువజన అభ్యుదయ, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి, పురావస్తు శాఖ డైరెక్టర్ స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆమెను రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యకార్యదర్శిగా మళ్లీ ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేసింది. ఆమె స్థానంలో యువజన అభ్యుదయ, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి, పురావస్తు శాఖ డైరెక్టర్‌గా జయేశ్ రంజన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆ శాఖ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండగా, శాఖాధిపతిని మార్చడం గమనార్హం. సీనియారిటీ ప్రకారం సీఎస్ రేసులో ముందంజలో ఉన్న శశాంక్ గోయల్‌ను ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డీజీ పోస్టు నుంచి మరో ప్రాధాన్యత లేని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్ పోస్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది.

రెండుగా పురపాలక శాఖ విభజన

పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్‌ను ప్రభుత్వం కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ శాఖను రెండుగా విడగొట్టి ఇద్దరు కార్యదర్శులను నియమించింది. పురపాలక శాఖ డైరెక్టర్, కమిషనర్ టీకే శ్రీదేవిని పురపాలక శాఖ (హెచ్ఎండీఏ వెలుపలి ప్రాంతం) కార్యదర్శిగా బదిలీ చేసింది. హెచ్ఎండీఏ వెలుపలి ప్రాంతాల్లోని పురపాలికలు మాత్రమే ఈ పోస్టు పరిధిలోకి రానున్నాయి. మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ (హెచ్ఎండీఏ పరిధి) పేరుతో కొత్త శాఖను సృష్టించి దాని కార్యదర్శిగా జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తిని బదిలీ చేసింది. ఇక ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో ఒకటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా కె.శశాంకను నియమించింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) సీఎండీగా అదనపు బాధ్యతల నుంచి సందీప్‌కుమార్ సుల్తానియాను తప్పించింది. జెన్‌కో సీఎండీగా సమాచార, ప్రజాసంబంధాల శాఖ ఎక్స్‌అఫిషియో స్పెషల్ సెక్రటరీ ఎస్.హరీశ్‌ను నియమించింది. సమాచార, ప్రజాసంబంధాల శాఖ ఎక్స్‌అఫిషియో స్పెషల్ సెక్రటరీగా, రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శిగా హరీశ్ అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు.



శశాంక్ గోయల్



జయేశ్ రంజన్



ఎం.దానకిశోర్



ఆర్‌వీ కర్ణన్



స్మితా సబర్వాల్

ఐఏఎస్‌ల బదిలీలు ఇలా...

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
శశాంక్ గోయల్	ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డీజీ	సీజీజీ వైస్ ఛైర్మన్, ఈపీటీఆర్ఐ డీజీ(ఎఫ్ఏసీ)
జయేశ్ రంజన్	ఐటీ, క్రీడల శాఖ	సీఎంఓలోని స్పెషల్ సీఎస్ ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్, స్పీడ్ సీఈఓ/స్పెషల్ సీఎస్ అదనపు బాధ్యతలు: యువజన అభ్యుదయ,పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్, పురావస్తు డైరెక్టర్
సంజయ్‌కుమార్	కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ కర్మాగారాల శాఖ స్పెషల్ సీఎస్	పరిశ్రమలు, ఐటీ, క్రీడల శాఖల స్పెషల్ సీఎస్
ఎం.దానకిశోర్	పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి	కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి అదనపు బాధ్యతలు: కార్మిక శాఖ కమిషనర్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్, ఉపాధి, శిక్షణ డైరెక్టర్, గవర్నర్ ముఖ్యకార్యదర్శిగా కొనసాగింపు
స్మితా సబర్వాల్	యువజన అభ్యుదయ, పర్యాటక శాఖ కార్యదర్శి	టీజీ ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శి
టీకే శ్రీదేవి	పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్	పురపాలక శాఖ (హెచ్ఎండీఏ వెలుపలి ప్రాంతం) కార్యదర్శి అదనపు బాధ్యతలు: పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (ఓఆర్ఆర్ వెలుపలి పురపాలికలు)
కె.ఇలంబర్తి	జీహెచ్ఎంసీ కమిషనర్	మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (హెచ్ఎండీఏ పరిధి) కార్యదర్శి
ఆర్‌వీ కర్ణన్	వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్	జీహెచ్ఎంసీ కమిషనర్
కె.శశాంక	స్టేట్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుల కమిషనర్	ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్. అదనపు బాధ్యతలు: గనుల శాఖ డైరెక్టర్
ఎస్.హరీశ్	సమాచార, ప్రజాసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్	జెన్‌కో సీఎండీ. అదనపు బాధ్యతలు: సమాచార, ప్రజాసంబంధాల ప్రత్యేక కమిషనర్, రెవెన్యూ జాయింట్ సెక్రటరీ
కె.నిఖిల	టీజీఐఆర్‌డీ సీఈఓ	టీజీఐఆర్‌డీ సీఈఓ, అదనపు బాధ్యతలు: మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, సీఈఓ
ఎస్.సంగీత సత్యనారాయణ	సీఎం సంయుక్త కార్యదర్శి	వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ అదనపు బాధ్యతలు: ఆరోగ్యశ్రీ ట్రస్ట్
ఎస్.వెంకట రావు	ప్రొటోకాల్ శాఖ సంయుక్త కార్యదర్శి/ డైరెక్టర్	దేవాదాయ శాఖ డైరెక్టర్, అదనపు బాధ్యతలు: యాదగిరి గుట్ట ఆలయ ఈఓ
కాత్యాయిని దేవి	స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీ	సెర్ప్ అదనపు సీఈఓ
ఈవీ నరసింహారెడ్డి	పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్	ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్, స్పీడ్ అదనపు సీఈఓ. అదనపు బాధ్యతలు: మూసీ నది అభివృద్ధి సంస్థ ఎండీ
భోర్ఖాడే హేమంత్ సహదేవ్ రావు	తెలంగాణ వైద్య సేవల సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ	జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్
జి.ఫణీంద్ర రెడ్డి	హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి	తెలంగాణ వైద్య సేవల సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ
పి.కథిరవన్	హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి
కె.విద్యాసాగర్ (నాన్ కేడర్)	సీఎస్‌కి ఓఎస్డీ	హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు). అదనపు బాధ్యతలు: హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి
ఆర్.ఉపేందర్ రెడ్డి (నాన్ కేడర్)	–	హెచ్ఎండీఏ కార్యదర్శి

ఈనెల 30న టెన్త్ ఫలితాలు

- సన్నాహాలు చేస్తున్న అధికారులు
- మెమోల్లో గ్రేడింగ్‌తో పాటు మార్కులు కూడా..
- వచ్చే ఏడాది నుంచి అంతర్గత మార్కుల ఎత్తివేత!

సాక్షి, హైదరాబాద్: ఈనెల 30వ తేదీన పదవ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విడుదల చేసే అవకాశం ఉందని టెన్త్ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. వాస్తవానికి టెన్త్ మూల్యాంకన ప్రక్రియ, మార్కుల కంప్యూటరీకరణ, పలు దఫాల పరిశీలన ప్రక్రియ వారం రోజుల క్రితమే పూర్తయింది. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధీనంలోనే ఉంది. ఈ కారణంగా ఆయన చేతుల మీదుగా ఫలితాలు విడుదల చేయించాలని అధికారులు భావించారు. ఆ సమయంలో సీఎం విదేశీ పర్యటనలో ఉన్నారు. దీంతో ఆయన వచ్చే వరకూ నిరీక్షించారు. ఇటీవల అధికారులు సీఎంను కలవగా, ఫలితాల విడుదల బాధ్యత డిప్యూటీ సీఎంకు అప్పగించినట్టు తెలిసింది. ఈనెల 30న భట్టి సమయం ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఫలితాలు వెలువడిన నెల రోజుల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

మెమోల్లో మార్పులు

టెన్త్ మెమోల విధానంలో ప్రభుత్వం మార్పులు చేసింది. పరీక్ష ఫలితాలు వెలువడుతున్న తరుణంలో ఇందుకు సంబంధించి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ గ్రేడింగ్ విధానంలో మెమోలు ఇచ్చేవాళ్లు. ఇక నుంచి ప్రతి సబ్జెక్టులో గ్రేడింగ్‌తో పాటు, విద్యార్థి మార్కులు మెమోలో పొందుపరుస్తారు. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ మార్కులు, జీపీఏ మెమోలో ఉంటాయని ఆ ఆదేశాల్లో వెల్లడించారు. ఇప్పటివరకూ విద్యార్థి ఆయా సబ్జెక్టులో సాధించిన మార్కుల ఆధారంగా గ్రేడ్లు ఇచ్చారు. దీనివల్ల ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థి ఎవరనే విషయం గుర్తించడం కష్టం. ఇప్పుడీ విధానాన్ని మార్చడంతో గ్రేడ్స్‌తో పాటు ఆయా సబ్జెక్టుల్లో ఎన్ని మార్కులు పొందారో మెమోలో ఉంటుంది. ప్రస్తుతం వార్షిక పరీక్ష ప్రతీ సబ్జెక్టుకు 80 మార్కులకు ఉంటుంది. మిగిలిన 20 అంతర్గత మార్కులుగా ఇస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి అంతర్గత మార్కులను ఎత్తివేసేందుకు కూడా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

రెండ్రోజులపాటు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ విదర్భ నుంచి మరఠ్వాడ, కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరికొన్ని జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

కేంద్రం	ఉష్ణోగ్రత
మెదక్	42
నల్లగొండ	38.5
ఆదిలాబాద్	38.3
నిజామాబాద్	38.2
భద్రాచలం	37.8
ఖమ్మం	37.6
రామగుండం	37.2
మహబూబ్‌నగర్	36.5
దుండిగల్	33.5
హకీంపేట్	33.5
హనుమకొండ	36
హైదరాబాద్	33.7

తగ్గిన ఉష్ణోగ్రతలు..: రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు శనివారంతో పోలిస్తే ఆదివారం కాస్త తగ్గాయి. మెదక్‌లో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండ్రోజులు కూడా రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగానే నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

హరిరామ్ ఆస్తులు రూ.250 కోట్లపైనే..!

- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువపై ఏసీబీ అంచనా
- ఇప్పటికే పలు భూములు, విల్లాలు, కార్లు, బంగారం గుర్తించిన ఏసీబీ
- బినామీలపై ఆరా తీస్తున్న అధికారులు
- చంచల్‌గూడ జైలుకు హరిరామ్ తరలింపు



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భుక్యా హరిరామ్ ఆస్తులపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేసిన ఏసీబీ బృందాలు పలుచోట్ల భూములు, ఇతర ఆస్తులు ఉన్నట్టు గుర్తించాయి. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.250 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ గృహాలు, షేక్‌పేటలో ఒక విల్లా, కొండాపూర్‌లో ఒక విల్లా, మాదాపూర్‌లో ఒక ఫ్లాట్, నార్సింగిలో ఒక ఫ్లాట్, అమరావతిలో ఒక వాణిజ్య స్థలం, మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్‌లో, మిర్యాలగూడలో స్థలాలు ఉన్నట్టు కీలక ఆధారాలను అధికారులు సేకరించారు. బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల విలువ కట్టేపనిలో ఉన్నారు. అదేవిధంగా మూడు బ్యాంకు లాకర్లను అధికారులు గుర్తించారు. ఈ లాకర్లను తెరిచేందుకు అనుమతి కోరుతూ అధికారులు సోమవారం కోర్టులో మెమో దాఖలు చేయనున్నట్టు సమాచారం. కాగా, శనివారం అర్ధరాత్రి వరకు సోదాలు జరిపిన అధికారులు.. హరిరామ్‌ను అరెస్టు చేసి జడ్జి ముందు హాజరుపర్చగా. 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

బినామీలపై ఆరా: ఈఎన్సీ హరిరామ్ అక్రమార్జనను కొందరు బినామీల పేరిట పెట్టినట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. వారు ఎవరు, ఎక్కడెక్కడ వారి పేరిట ఆస్తులు ఉన్నాయనే కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. జలసౌధ కార్యాలయంలో సేకరించిన పలు పత్రాలు, హరిరామ్ ఇంట్లో లభించిన పత్రాలను పరిశీలించే పనిని ప్రత్యేక టీంకు అప్పగించినట్టు తెలిసింది. హరిరాం ఇంట్లో, సిద్దిపేట జిల్లా మర్కూక్ తహ సీల్దార్ ఆఫీసులో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా ఆయన భార్య అనితపై కూడా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

'సీతారామ'లో దిద్దుబాటు చర్యలు

- పాసేజ్ పిల్లర్ కూలిన చోట కొత్త నిర్మాణం



పిల్లర్ కూలిన భాగంలో స్లాబ్‌కు ఐరన్ రాడ్లతో సపోర్ట్ వేస్తున్న దృశ్యం

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి సూపర్ పాసేజ్ పిల్లర్ (పియర్) ఇటీవల కూలిపోయిన నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కూలిన పిల్లర్ స్థానంలో కొత్త నిర్మాణాన్ని ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం వీకే రామవరం శివారులో పంప్‌హౌస్ –2 నుంచి కమలాపురంలోని పంప్‌హౌస్ –3 వరకు సుమారు 10 కి.మీ. ప్రధాన కాల్వ నిర్మించారు. ప్యాకేజ్–4 కింద చేపట్టిన ఈ పనుల్లో 48.30 కి.మీ. వద్ద నిర్మించిన సూపర్ పాసేజ్ వంతెన పిల్లర్ కూలిన విషయం విదితమే. అంతేకాక 53వ కి.మీ. వద్ద గైడ్‌వాల్‌కు బీటలు పడి, పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో నలుగురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించింది. సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీతోనే పిల్లర్‌ను పునర్నిర్మిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నూతన పిల్లర్ నిర్మాణంలో భాగంగా సూపర్ పాసేజ్‌కు సపోర్ట్‌గా రాడ్లు ఏర్పాటుచేసి, అక్కడ వంతెన కుంగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పిల్లర్ దిగువ భాగం నుంచి మూడు దశలుగా ఐరన్ రాడ్లతో సపోర్ట్ సెట్టింగ్ వేస్తుండగా.. కూలిన పిల్లర్‌ను తొలగించి అక్కడే కొత్తది నిర్మించనున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ రాంబాబు మాట్లాడుతూ.. మే నెలాఖరులోగా నూతన పిల్లర్ నిర్మాణం పూర్తవుతుందని, త్వరలోనే గైడ్‌వాల్ మరమ్మతులు కూడా చేపడతామని తెలిపారు.

కుంగిన తర్నం వంతెన కూల్చివేత



కుంగిపోయిన వంతెన కూల్చివేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ టౌన్ (జైనథ్): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం తర్నం వద్దగల పాత వంతెను జాతీయ రహదారుల అధికారులు ఆదివారం కూల్చివేశారు. తర్నం వంతెన 2023లో భారీ వర్షాలకు దెబ్బ తినడం తెలిసిందే. దీంతో జైనథ్, బేల మండలాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిరాల నుంచి లాండసాంగ్వి వైపు ఆదిలాబాద్‌కు వచ్చేందుకు దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులు దూరాభారంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం తర్నం వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుంగిన వంతెనను అధికారులు, కాంట్రాక్టర్లు ఆదివారం కూల్చివేశారు. పాత వంతెన స్థానంలో తాత్కాలిక వంతెనను నిర్మించారు. కుంగిన వంతెన కూల్చివేతను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు. త్వరితగతిన నూతన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

- ఎన్‌హెచ్ అధికారులపై రైతుల ఆగ్రహం




ఎన్‌హెచ్ అధికారులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

చింతకాని: నాగ్‌పూర్ – అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరులో ఆదివారం మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారు. దీంతో జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు ఆదివారం ఉదయం భారీ యంత్రాలతో చేరుకుని పంట పొలాలను చదును చేసే పని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని పొలాల్లో పంట ఉందని, ఒకరోజు సమయం ఇస్తే ఇంటికి తీసుకెళ్తామని ప్రాధేయపడ్డారు. అయితే దీనిని పట్టించుకోని అధికారులు.. పోలీసుల రక్షణతో పంటను ధ్వంసం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం రైతు సంఘాల నాయకులు కూచిపూడి రవి, కొల్లి సీతయ్య, పెంట్యాల అప్పారావు తదితరులు అక్కడికి చేరుకుని ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, వైరా ఏసీపీ రెహమాన్‌తో చర్చలు జరిపారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రైతులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఫోన్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీఓతో మాట్లాడి రైతులకు న్యాయం చేసి సమస్యను పరిష్కరించాలని, అంతవరకు రహదారి నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టర్ రైతులతో సమావేశం కానున్నారు.

పాక్ అణు బెదిరింపులు!

తారస్థాయికి ఉద్రిక్తతలు

- భారత్ పైకి 130 అణుబాంబులు
- క్షిపణులకు బిగించి ఎక్కుపెట్టాం
- దమ్ముంటే నీళ్లు ఆపండి చూద్దాం
- పూర్తిస్థాయి యుద్ధమే: పాక్ మంత్రి
- విఫల రాజ్యపు పిచ్చి ప్రేలాపనలు
- త్వరలో పాక్ మోకరిల్లేలా చేస్తాం
- తీవ్రంగా మండిపడ్డ భారత్
- కొనసాగుతున్న పాక్ కాల్పులు


హనీఫ్ అబ్బాసీ

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ/చండీగఢ్/శ్రీనగర్: పరిస్థితి ముదురు పాకాన పడుతోంది. మాటల తూటాలు పేలుతున్నాయి. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య రాజుకున్న ఉద్రిక్తతలు తారస్థాయిని చేరుతున్నాయి. భారత్ విధించిన ఆంక్షలు, తీసుకున్న కఠిన చర్యలతో దిక్కుతోచక దాయాది బెంబేలెత్తిపోతోంది. ఆ క్రమంలో ఆదివారం ఏకంగా 'అణు' బెదిరింపులకే దిగింది! 130 అణుబాంబులను భారత్‌కేసి ఎక్కుపెట్టి ఉంచామంటూ పాక్ మంత్రి హనీఫ్ అబ్బాసీ బాహాటంగా హెచ్చరికలు జారీ చేశారు. ''పాక్‌కు సింధూ జలాలను ఆపుతారా? దమ్ముంటే ఆపండి చూద్దాం! అప్పుడు మీరు పూర్తిస్థాయి యుద్ధాన్ని, అది కూడా అణుయుద్ధాన్ని చవిచూడాల్సి వస్తుంది జాగ్రత్త! మా సైనిక పాటవం, ముఖ్యంగా మా దగ్గరున్న అణ్వాయుధాలు ప్రదర్శన కోసం కాదు. 130 అణు వార్‌హెడ్‌లను ఘోరీ, షహీన్, గజ్నవీ వంటి క్షిపణులకు సంధించి కేవలం భారత్ కోసమే దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రహస్యంగా ఎక్కుపెట్టి ఉంచాం. మమ్మల్ని ఏమాత్రం రెచ్చగొట్టినా అవి మీపై వచ్చిపడతాయి జాగ్రత్త! నేను మళ్లీ చెబుతున్నా. మా అణ్వాయుధాలన్నీ మిమ్మల్నే లక్ష్యం చేసుకుని సిద్ధంగా ఉన్నాయి'' అంటూ ప్రేలాపనలకు దిగారు. అబ్బాసీవి వ్యక్తిగత వ్యాఖ్యలు కావని, పాక్ ప్రభుత్వ మతిలేని వైఖరినే ప్రతిబింబించాయని భావిస్తున్నారు. తమపై విధించిన ఆంక్షలతో భారతే తీవ్రంగా నష్టపోతోందని అబ్బాసీ సూత్రీకరించారు. ''భారత్‌కు పాక్ గగనతలాన్ని మూసేసి చావుదెబ్బ తీశాం. రెండు రోజుల్లోనే భారత వైమానిక రంగం అతలాకుతలం అవుతోంది. మరో 10 రోజులు ఇలాగే కొనసాగితే వాళ్ల విమాన సంస్థలన్నీ దివాలా తీస్తాయి'' అని చెప్పుకున్నారు. 30 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ వచ్చిందని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ శనివారమే అంగీకరించడం తెలిసిందే.

అబ్బాసీ మతిలేని వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా మండిపడింది. వాటిని ఓ విఫలరాజ్యపు పిచ్చి ప్రేలాపనలుగా అభివర్ణించింది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాక్‌ను అతి త్వరలో మోకరిల్లేలా చేసి తీరతామని కేంద్రం ప్రకటించింది. ఉగ్రవాదాన్నే ప్రభుత్వ విధానంగా మార్చుకున్న చరిత్ర దాయాదిదంటూ కేంద్ర మంత్రి హర్దీప్ పురి మండిపడ్డారు. ''ఈసారి మాత్రం వాళ్లు తప్పుడు లెక్కలేసుకున్నారు. రాంగ్ నంబర్ డయల్ చేశారు. ఎందుకంటే భారత్‌లో ఇప్పుడున్నది నరేంద్ర మోదీ నాయకత్వం.

దిద్దుకోలేని తప్పిదం: పురి

పహల్గాం వంటి ఉగ్ర దాడుల గురించి మరో సారి కలలో కూడా ఆలోచించలేని పరిస్థితిని పాక్‌కు కల్పించి తీరతాం'' అని స్పష్టం చేశారు. ''ఎన్నడూ లేనివిధంగా సింధూ జల ఒప్పందాన్ని సస్పెండ్ చేశాం. ఈ విషయంలో మోదీ సర్కారు చిత్తశుద్ధికి ఈ నిర్ణయాలే తార్కాణం'' అన్నారు. ''పాక్ విడిపోయాక ఈ 75 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. పాక్ మాత్రం అన్ని రంగాల్లోనూ పాతాళానికి దిగజారి విఫల, ఉగ్రరాజ్యంగా మిగిలింది'' అంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు నియంత్రణరేఖ వెంబడి పాక్ విచ్చలవిడి కాల్పులు ఆదివారం కూడా కొనసాగాయి. వాటిని భారత బలగాలు దీటుగా తిప్పికొట్టాయి.

పాక్ ఆర్మీ చీఫ్ ఎక్కడ?


మునీర్

కుటుంబంతో పాటు దేశం వీడి జంప్!

- ప్రభుత్వ ఆగ్రహానికి జడిసి పారిపోయారు
- స్థానిక మీడియాలో జోరుగా వార్తలు
- కుటుంబాలను దేశం దాటిస్తున్న పాక్ ఉన్నత సైన్యాధికారులు!

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న వేళ సైన్యాధిపతి జనరల్ సయీద్ ఆసిఫ్ మునీర్ కనిపించడం లేదన్న వార్తలు పాకిస్తాన్‌లో కలకలం రేపుతున్నాయి. కుటుంబంతో పాటుగా ఆయన దేశం వీడి పారిపోయారని స్థానిక మీడియాలో ఆదివారం వార్తలొచ్చాయి. ''తొలుత కుటుంబాన్ని విదేశాలకు తరలించారు. తర్వాత తానూ పాక్ వీడారు'' అన్నది వాటి సారాంశం. కొద్ది రోజులుగా, ఆ మాటకొస్తే పహల్గాం దాడి జరిగినప్పటి నుంచీ మునీర్ బయట ఎక్కడా కన్పించడం లేదని ఆ కథనాలు చెబుతున్నాయి. మునీర్‌కు తీవ్ర భారత విద్వేషిగా పేరుంది. కొద్ది రోజులుగా భారత వ్యతిరేక వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తూ వస్తున్నారు. పాక్‌కు కశ్మీర్ జీవనాడి అని, దాన్ని వదులుకునే ప్రసక్తే లేదని, హిందువులు, ముస్లింలు భిన్న జాతులని ఇటీవలే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తర్వాత రెండు రోజులకే పహల్గాం ఉగ్ర దాడి జరిగింది. ''దాడిపై ఆగ్రహంతో రగిలిపోతున్న భారత్ తీవ్రస్థాయిలో ప్రతీకార చర్యలకు దిగుతుందని పాక్ ఆందోళన చెందుతోంది. అందుకు తానే బాధ్యుడిని అవుతానని మునీర్ భయపడ్డారు. అందుకే దేశం నుంచి జారుకున్నట్టు కనిపిస్తోంది'' అని కథనాలు పేర్కొంటున్నాయి. మునీర్ పాక్‌లోనే ఉన్నారని, రావల్పిండి బంకర్లో తలదాచుకున్నారని మరికొందరు చెబుతున్నారు. ఈ పుకార్లతో సైన్యం మనోబలం దెబ్బ తింటుందని గ్రహించిన పాక్ ప్రభుత్వం నష్ట నివారణకు దిగింది. ప్రధాని షహబాజ్ షరీఫ్, ఉన్నత సైనికాధికారులతో శనివారం మునీర్ దిగిన గ్రూప్ ఫొటో అంటూ పాక్ పీఎంఓ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దాన్ని నమ్మలేమని, శనివారం సైనిక కాలేజీ ఉత్సవాల్లో ప్రధానితో పాటు మునీర్ పాల్గొన్నట్టుగా వచ్చిన వార్తలూ నమ్మశక్యంగా లేవని మీడియా అభిప్రాయపడింది. మరోవైపు పాక్ సైన్యంలోని జనరల్స్, ఉన్నతాధికారులు తమ కుటుంబాలను ఉన్నపళంగా దేశం దాటిస్తున్నట్టు చెబుతున్నారు.

అత్యంత కీలకంగా మారిన చెట్టు మీది వీడియో

పహల్గాం/న్యూఢిల్లీ: ఒక ఫొటోగ్రాఫర్ చెట్టు మీది నుంచి తీసిన వీడియో పహల్గాం ఉగ్ర ఘటన దర్యాప్తులో కీలకంగా మారింది. అలాగే ఘటన సమయంలో కుటుంబంతో కలిసి అక్కడికి విహారయాత్రకు వచ్చిన ఒక సైనికాధికారి ప్రత్యక్ష సాక్షిగా ఇచ్చిన వాంగ్మూలం కూడా దర్యాప్తు అధికారులకు ఎంతో సాయపడుతోంది. నాటి ఘటన క్రమాన్ని ఆయన పూసగుచ్చినట్టు వివరించారు. కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు పహల్గాం ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) స్వీకరించింది. ఆదివారం జమ్మూలో కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించింది. ఐజీ, డీఐజీ, ఎస్పీలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఘటన జరిగిన రోజు నుంచే స్థానిక పోలీసులకు దర్యాప్తులో ఎన్ఐఏ బృందం సాయపడటం తెల్సిందే. దాడి నుంచి బయటపడి స్వస్థలాలకు వెళ్లిన పర్యాటకుల నుంచి వేర్వేరు బృందాలు వాంగ్మూలాలను సేకరిస్తున్నాయి.


దాడి అనంతర దృశ్యం (ఫైల్)

సైన్యాధికారి ఏం చెప్పారంటే...

లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న సైనికాధికారి కాల్పుల వేళ తన కుటుంబాన్ని సురక్షిత ప్రాంతంలో దాచేశారు. ఉగ్రవాదులు ఎటు నుంచి వచ్చారు, తొలుత ఎవరిని చంపారు, తర్వాత ఎటు వెళ్లారు వంటి వివరాలను వాంగ్మూలంలో చెప్పారు. ''తొలుత ఇద్దరు ఉగ్రవాదులు చిన్న పాటి దుకాణాల వెనుక నుంచి హఠాత్తుగా వచ్చి పర్యాటకులను 'కల్మా' చదవాలని ఆదేశించారు. చదవని నలుగురిని తలపై కాల్చిచంపారు. దాంతో అంతా ప్రాణభయంతో పరుగులు పెట్టారు. ఉగ్రవాదులు వారి తల, గుండెకు గురి చూసి కాల్చడంతో మరికొందరు చనిపోయారు. కాసేపటికే మరో ఇద్దరు ఉగ్రవాదులు అడవి నుంచి బయటికొచ్చి పర్యాటకులపైకి కాల్పులకు దిగారు'' అని ఆయన వివరించినట్టు సమాచారం. కాల్పుల ఘటనను ఉగ్రవాదులు తమ బాడీ క్యామ్‌లలో రికార్డ్ చేసుకున్నట్టు కూడా ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. యువ నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ పెళ్లయిన ఆరు రోజులకే దాడిలో చనిపోవడం తెలిసిందే. దాంతో ఆయన భార్య హిమాన్షీ గుండెలవిసేలా రోదిస్తూనే ఫోన్ చేసి పోలీసులకు వెంటనే సమాచారమిచ్చారు. దాడిపై వారికి వచ్చిన తొలి కాల్ అదే. దాంతో పహల్గాం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు.

22 గంటలు ట్రెక్కింగ్ చేసొచ్చి చంపారు

భద్రతా బలగాల కంటబడకుండా ఉండేందుకు ఉగ్రవాదులు రోడ్డు మార్గంలోకాకుండా అత్యంత ప్రతికూలమైన, ప్రమాదకర పర్వత సానువుల గుండా వచ్చినట్టు వెల్లడైంది. కోకెర్నాగ్ అటవీ ప్రాంతం గుండా 22 గంటలు ట్రెక్కింగ్ చేసి మరీ బైసారన్ చేరుకున్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. పర్యాటకులను కాల్చే క్రమంలో ఒక స్థానికుడు, మరో పర్యాటకుడి నుంచి వాళ్ల మొబైల్ ఫోన్లు లాక్కున్నారు. తిరిగి వెళ్తూ వాటిని మార్గమధ్యంలో ధ్వంసం చేశారని తెలుస్తోంది. దాడిలో ఏకే 47, ఎం4 మెషీన్‌గన్లు వాడినట్టు జాగా ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది.

ప్రాణభయంతో చెట్టెక్కి, వీడియో తీసి...

ఉగ్రవాదులు దాడికి దిగినప్పుడు అక్కడే ఉన్న స్థానిక ఫొటోగ్రాఫర్ ఒకరు ప్రాణభయంతో చెట్టెక్కి కొమ్మల్లో నక్కారు. అలా వారి కంట పడకుండా తప్పించుకున్నారు. కళ్లెదుటే అమాయక పర్యాటకులపై విచక్షణారహితంగా తూటాల వర్షం కురిపించిన తీరును కెమెరాలో బంధించారు. దాడి క్రమాన్ని స్పష్టంగా పట్టిచ్చిన ఆ వీడియో ఎన్ఐఏ దర్యాప్తులో కీలకంగా మారింది.

యుద్ధనౌకల రణన్నినాదం

నేవీ కీలక వార్ డ్రిల్స్

- యాంటీ–షిప్ క్షిపణి పరీక్షలు
- బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం


ఆదివారం నేవీ డ్రిల్స్‌లో భాగంగా యుద్ధనౌక నుంచి క్షిపణిని ప్రయోగిస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం/న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం తర్వాత పాక్‌పై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు ఎగసిపడుతున్న వేళ నావికాదళం పరాక్రమం చాటింది. సమరానికి సై అంటూ యుద్ధ సన్నద్ధత ప్రదర్శించింది. శనివారం భారీ విన్యాసాలకు దిగింది. పలు యుద్ధనౌకలు నౌకా విధ్వంసక క్షిపణులను విజయవంతంగా ప్రయోగించినట్టు నేవీ పేర్కొంది. సుదూర లక్ష్యాలను ఛేదించే దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించారు. యుద్ధ సన్నద్ధతను పరీక్షించే చర్యల్లో భాగంగా వీటిని చేపట్టారు. భూతల, గగనతల, సముద్రమార్గాల్లో పాక్‌పై దాడికి సర్వసన్నద్ధమని చెప్పడమే లక్ష్యమని తెలుస్తోంది. మరోవైపు విశాఖపట్నం క్లాస్ డిస్ట్రాయర్స్ ఐఎన్ఎస్ విశాఖపట్నం, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ మొర్ముగావ్, ఐఎన్ఎస్ ఇంఫాల్, ఐఎన్ఎస్ కొచ్చి యుద్ధ నౌకలను మోహరించినట్లు నౌకాదళం తెలిపింది.

పాక్ అదుపులోనే బీఎస్ఎఫ్ జవాన్

న్యూఢిల్లీ: ప్రమాదవశాత్తు అంతర్జాతీయ సరిహద్దు దాటి పాక్‌రేంజర్లకు చిక్కిన భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కానిస్టేబుల్ ఇంకా విడుదల కాలేదు. ఆయన సరిహద్దు దాటి 90 గంటలు దాటింది. విడిపించేందుకు బీఎస్ఎఫ్, పాక్ రేంజర్ల మధ్య మూడు దఫాలు సమావేశాలు జరిగాయి. కానిస్టేబుల్‌ను బీఎస్ఎఫ్ 182వ బెటాలియన్ సభ్యుడు పూర్ణం కుమార్ సాహుగా గుర్తించారు. ఆయన స్వస్థలం పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ. ఆ జవాన్ గురించిన సమాచారం తమ వద్దలేదని పాకిస్తాన్ చెబుతోంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో మోహరించిన అన్ని యూనిట్లను బీఎస్ఎఫ్ అప్రమత్తం చేసింది. పాక్ రేంజర్లతో మరోసారి ఫీల్డ్ కమాండర్ స్థాయి ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించాలని బీఎస్ఎఫ్ కోరింది. త్వరలోనే ఈ సమావేశం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 90 గంటలైనా జవాన్ ఆచూకీ లభించకపోవడం కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేసింది. తమ కుమారుడిని త్వరగా తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలని షా తండ్రి ప్రభుత్వాన్ని కోరారు. భర్తను తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాల గురించి తెలుసుకునేందుకు జవాన్ పూర్ణం సాహు భార్య రజనీ.. హౌరా నుంచి ఫిరోజ్‌పూర్‌కు బయల్దేరారు.

భారతీయుల రక్తం మరుగుతోంది

'మన్‌కీ బాత్'లో మోదీ

- పహల్గాం బాధితులకు న్యాయం చేకూరుస్తాం
- పాత్రధారులు, సూత్రధారులను దారుణంగా శిక్షిస్తాం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నెలవారీ 'మన్‌కీ బాత్' రేడియో ప్రసంగం ఆదివారం అత్యంత గంభీరంగా కొనసాగింది. గత వారం కశ్మీర్‌లోయలో అమాయక పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్ర కిరాతకాన్ని తీవ్రంగా మోదీ ఖండించారు. ''బైసారన్ బాధితులకు సరైన న్యాయం దక్కేలా చేస్తాం. వారిని విచక్షణారహితంగా కాల్చేసిన దృశ్యాలు, ఫొటోలు చూసి ప్రతి భారతీయుడి రక్తమూ మరిగిపోతోంది. ఈ దాడిలో పాత్రధారులు, సూత్రధారులను పట్టితెచ్చి చట్టం ముందు నిలబెట్టి దారుణంగా శిక్షిస్తాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేస్తున్న పోరాటంలో 140 కోట్ల మంది పౌరుల ఐక్యత, సంఘీభావమే మాకు అసలైన శక్తి. కశ్మీర్ లోయలో ఇటీవలి కాలంలోనే మళ్లీ శాంతిసుమాలు విరబూస్తున్నాయి. ఉద్రిక్తతలు తగ్గడంతో అక్కడ స్కూళ్లు, కాలేజీలు తెరచుకున్నాయి. నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. రికార్డు స్థాయిలో కోట్లాది పర్యాటకులు వస్తున్నారు. స్థానికుల ఆదాయం పెరి గింది. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యా యి. లోయలో ప్రజాస్వామ్యం బలోపేతమైంది. ఇవన్నీ పాక్‌కు అస్సలు నచ్చలేదు. కశ్మీర్ ప్రగతి ఫలాలను అందుకోవడంతో ముష్కరమూకల్లో అసహనం కట్టలు తెంచుకుంది. దేశంలోని, జమ్మూ కశ్మీర్‌లోని భారత వ్యతిరేక శక్తులకు, శత్రువులకు ఇవి నచ్చలేదు. అందుకే కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలని ఉగ్రవాదులు, వారిని వెనకుండి నడిపిస్తున్న సూత్రధారులు ఇలా హేయమైన దాడికి తెగబడ్డారు. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ కశ్మీర్‌లో దాడి జరగడంతో నా హృదయం ఎంతో కుమిలిపోయింది. ఈ దుర్ఘటన ప్రతి భారతీయుడినీ ఎంతగానో బాధించింది. బాధితులు ఏ రాష్ట్రం వారు, ఏ భాష మాట్లాడతారనే పట్టింపుల్లేకుండా ప్రతి భారతీయుడూ ఎంతో సహానుభూతి వ్యక్తం చేశాడు. ఘటన పట్ల వారి రక్తం మరుగుతోందని తెలుసు. మీకు మరోసారి మాటిస్తున్నా. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తా. దేశంగా మన సమష్టి సంకల్ప శక్తిని మరోసారి చాటుదాం. ఘటనను తీవ్రంగా ఖండిస్తూ యావత్ భారతావని ఒకే వాణిని వినిపించడాన్ని అన్ని దేశాలు గమనించాయి. ప్రపంచ దేశాలు సైతం దాడిని ముక్తకంఠంతో ఖండించాయి'' అన్నారు.



కస్తూరీరంగన్‌కు నివాళులు

ఇటీవల కన్నుమూసిన మాజీ ఇస్రో చైర్మన్ కె.కస్తూరిరంగన్‌కు మోదీ నివాళులర్పించారు. ''దేశం మరో గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయింది. డాక్టర్ కస్తూరిరంగన్‌ను ఎప్పుడు కలిసినా ప్రతిభ గల భారతీయ యువత, ఆధునిక విద్య, అంతరిక్ష శాస్త్రం గురించే మాట్లాడుకునేవాళ్లం. సైన్స్, ఎడ్యుకేషన్, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్‌లలో భారత్‌ను కస్తూరిరంగన్ ఉన్నత శిఖరాలపై నిలబెట్టారు. ఆయన సారథ్యంలో ఇస్రో సరికొత్త విజయాలను సాధించింది'' అని మోదీ అన్నారు. ''మిగతా దేశాలతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చులో అంతరిక్ష ప్రయోగాలు, పరీక్షలు చేస్తూ భారత్ అంతరిక్ష శక్తిగా అవతరించింది. ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచదేశాలను అబ్బురపరిచాం. చంద్రుని దక్షిణ ధ్రువాన్నీ చేరుకున్నాం. భవిష్యత్తులోనూ నూతన శిఖరాలను చేరుకోవాలని ఆశిస్తున్నా. అంతరిక్ష రంగ అంకుర సంస్థలను స్థాపిస్తూ ఎందరో యువత కొత్త మైలురాళ్లను చేరుకుంటున్నారు. గత దశాబ్దకాలంలో ఈ రంగంలో ఒకే ఒక్క స్టార్టప్ ఉంటే ఇప్పుడు 325 సంస్థలున్నాయి'' అని మోదీ చెప్పారు.

పహల్గాం దాడిని ఖండించిన కాశ్ పటేల్

భారత ప్రభుత్వానికి ఎఫ్‌బీఐ మద్దతుంటుందని హామీ

వాషింగ్టన్: పహల్గాం ఉగ్ర దాడిని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ తీవ్రంగా ఖండించారు. దాడి బాధితులకు సంతాపం తెలిపారు. భారత ప్రభుత్వానికి నిరంతర మద్దతిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద ముప్పుకు ఈ దాడి నిదర్శనమన్నారు. ''కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మా ప్రగాఢ సంతాపం. భారత ప్రభుత్వానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుంది. ఉగ్రవాదం నుంచి ప్రపంచం ఎదుర్కొంటున్న నిరంతర ముప్పును ఈ దాడి గుర్తుచేస్తోంది. బాధితులకు అండగా నిలబడి, సాయం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఇరాన్ అధ్యక్షుని ఖండన

టెహ్రాన్: పహల్గాంలో ఉగ్ర దాడిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని నేతలు పునరుద్ఘాటించారు. భారత్, పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వానికి ఇరాన్ ముందుకొచ్చిన మర్నాడే ఈ పరిణామం జరిగింది.

బంగ్లాదేశ్‌కూ నీళ్లు నిలిపివేయాలి: బీజేపీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలగాలంటూ నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్ విషయంలో సైతం ఇలాంటి చర్యనే తీసుకోవాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కోరారు. 1996లో కాంగ్రెస్ హయాంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య కుదిరిన గంగ జలాల ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. 'ఆ ఒప్పందం చాలా తప్పు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పొరపాటు చేసింది'అని పేర్కొన్నారు. ఉగ్రవాదంతో సంబంధాలున్న దేశాలతో నదీ జలాల పంపకం ఒప్పందాలను యథా ప్రకారం కొనసాగించడంలో అర్థం లేదన్నారు. 'పాములకు ఎంత కాలం నీళ్లు అందించాలి? వాటిని నలిపేయాలి'అంటూ దూబే వ్యాఖ్యానించారు. లష్కరే తొయిబా ఉగ్రవాదులకు బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వంతో సంబంధాలున్నాయంటూ వచ్చిన వార్తలను ఆయన ప్రస్తావించారు. ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడకుండా భద్రతా చర్యలను పటిష్టం చేయాలన్నారు.

పాక్‌లో 41 మంది ఉగ్రవాదులు హతం

పెషావర్: నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ)కి చెందిన 41 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు పాకిస్తాన్ అధికారులు తెలిపారు. అఫ్గానిస్తాన్ నుంచి దొంగచాటుగా పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించేందుకు యత్నించిన వీరిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారని, ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో వీరు హతమయ్యారని వివరించారు. గిరిజనుల ప్రాబల్యమున్న నార్త్ వజీరిస్తాన్‌లోని బిబక్ ఘర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలో దాగున్న మిలిటెంట్ల కోసం పెద్ద ఎత్తున గాలింపు కొనసాగుతోందన్నారు. మృతుల్లో ఎక్కువ మంది అఫ్గాన్ పౌరులేనని చెప్పారు. ఈ ఘటనపై పాక్ సైన్యం స్పందించలేదు.

పాక్‌తో యుద్ధం వద్దు: సిద్ధరామయ్య

'పాక్ రత్న' బిరుదుకు అర్హుడు: బీజేపీ ఎద్దేవా

బెంగళూరు: పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో యుద్ధం అవసరం లేదని కర్నాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. శనివారం ఓ పాక్ వార్తా చానెల్‌తో మాట్లాడుతూ ఈ మేరకు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాటిపై బీజేపీ మండిపడింది. సిద్దూను 'పాకిస్తాన్ రత్న'గా అభివర్ణించింది. ''శత్రు దేశం చేతిలో కీలుబొమ్మలా మాట్లాడుతున్నారు. ఆయన పాక్ వెళ్తే రాచ మర్యాదలు, నిషాన్–ఇ–పాకిస్తాన్ వంటి బిరుదులు ఖాయం'' అంటూ ఎద్దేవా చేసింది. దాంతో, అవసరమైతే యుద్ధం చేయాలన్నది తన ఉద్దేశమంటూ సిద్ధూ వివరణ ఇచ్చారు.

పాక్ వెళ్లేందుకు ముగిసిన గడువు

- నాలుగు రోజుల వ్యవధిలో 537 మంది తిరుగుముఖం
- పాక్ నుంచి 850 మంది భారతీయుల రాక


ఆదివారం బస్సులో అటారీ చెక్‌పోస్టుకు వెళ్తున్న పాక్ బాలలు

చండీగఢ్/న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశం వీడేందుకు పాకిస్తానీలకు భారత్ నిర్దేశించిన గడువు ఆదివారంతో ముగిసింది. వారికి అన్ని రకాల వీసాలనూ రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దాంతో గత నాలుగు రోజుల్లో అటారీ–వాఘా సరిహద్దు గుండా తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులు సహా 537 మంది పాకిస్తానీలు తిరుగుముఖం పట్టినట్టు అధికారులు వెల్లడించారు. అదే సమయంలో 14 మంది భారత దౌత్యవేత్తలు, అధికారులు సహా 850 మంది భారత్‌కు తిరిగి వచ్చినట్టు పేర్కొన్నారు. కొందరు పాకిస్తానీలు తిరిగి వెళ్లేందుకు వాయుమార్గాన్ని ఎంచుకున్నారు. వ్యాపారం, సినిమాలు, జర్నలిజం, రవాణా, సదస్సులు, ట్రెక్కింగ్, విద్య, బృంద పర్యాటకం, పుణ్యక్షేత్రాల సందర్శన ఇలా పాకిస్తానీలకు మంజూరుచేసిన 12 రకాల వీసాల గడువును భారత్ రద్దుచేయడం తెల్సిందే. దాంతో కొద్ది రోజులుగా పాకిస్తానీలు అటారీ–వాఘా బోర్డర్ వద్ద వందలాదిగా బారులు తీరుతున్నారు. ఆ దారంతా వాహనాలు కనిపించాయి. వారిని సాగనంపేందుకు వచ్చిన భారత బంధువులు ఉద్వేగంతో వీడ్కోలు పలుకుతున్న దృశ్యాలు కనిపించాయి. మెడికల్ వీసాపై వచ్చిన వారికి మాత్రం భారత్ వీడేందుకు మంగళవారం దాకా గడువుంది. కాగా, గడువు తీరిన నేపథ్యంలో ఇంకా భారత్‌లోనే ఉన్న పాకిస్తానీలను అరెస్టు చేస్తామని కేంద్రం తెలిపింది. వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తారు. ఈ నెల 4న అమల్లోకి వచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని కేంద్రం పేర్కొంది.

ఢిల్లీలో 5,000 మంది

ఢిల్లీలో 5,000 మంది పాకిస్తానీలున్నట్టు ఇంటెలిజెన్స్ బ్యూరో గుర్తించింది. ఆ జాబితాను పోలీసులకు అందజేసింది. అక్రమంగా ఉంటున్న పాకిస్తానీలను గుర్తించి సమాచారమివ్వాలని ఢిల్లీ హోం మంత్రి ఆశిష్ సూద్ ప్రజలను కోరారు. వారిని తిప్పి పంపేలా కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలని పోలీసులకు సూచించారు. దీర్ఘకాల వీసాలతో వచ్చిన పాకిస్తానీలు మహారాష్ట్రలోనూ 5,050 దాకా ఉంటారని అధికారులు తెలిపారు. తమ రాష్ట్రంలోని పాకిస్తానీలంతా వెళ్లిపోయారని బిహార్ ప్రకటించింది. కేరళలో 104 మంది ఉన్నట్లు గణాంకాల వెల్లడిస్తున్నాయి. తమ రాష్ట్రం నుంచి 228 మంది వెళ్లిపోయారని మధ్యప్రదేశ్ సర్కార్ తెలిపింది.

కస్తూరిరంగన్‌కు తుది వీడ్కోలు


కస్తూరిరంగన్ భౌతికకాయానికి సిద్ధరామయ్య నివాళులు

సాక్షి, బెంగళూరు/శివాజీ నగర: భారత అంతరిక్ష దిగ్గజం, ఇస్రో మాజీ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ (84)కు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికారు. వయోభారంతో ఆయన శుక్రవారం బెంగళూరులోని నివాసంలో కన్నుమూయడం తెలిసిందే. ఆయన పార్థివ శరీరాన్ని రామన్ రీసెర్చ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మాజీ సీఎం యడియూరప్ప, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఇస్రో మాజీ అధ్యక్షులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం హెబ్బాళలోని విద్యుత్ దహన వాటికలో అంత్యక్రియలను పూర్తిచేశారు.

మాపైకి భారత్ వరద: పాక్

ఇస్లామాబాద్: ముందస్తు సమాచారం లేకుండా భారత్ అకస్మాత్తుగా జీలం నదిలోకి నీటిని విడుదల చేసిందని పాక్ ఆదివారం ఆరోపించింది. పీవోకేలోని ముజఫరాబాద్ సమీపంలో జీలం నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగిందని వాపోయింది. ఇలా చెప్పాపెట్టకుండా వరదను దిగువకు వదలటం అంతర్జాతీయ నిబంధనలకు, జల ఒప్పందాలకు విరుద్ధమని పేర్కొంది. సింధూ జల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేయడం తెలిసిందే.



పరస్పర బది'లీలలు'
రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీగా డబ్బులు చేతులు మారినట్లు విమర్శలున్నాయి. -8లో



సాహసం చేద్దాం బ్రదర్..
వేసవి సెలవులను ఎంజాయ్ చేయడంలో ఇప్పుడు అడ్వెంచర్స్ కూడా భాగమవుతున్నాయి. నగరంలోని సాహసికులను, ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 37.0/24.0

వాతావరణం
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

కదం తొక్కిన గులాబీ దళం



బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేముందు పద్మారావునగర్‌లో బెలూన్లు ఎగరవేస్తున్న తలసాని



నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్, సిరికొండ మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రేటర్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. దారి పొడవునా ర్యాలీలు, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించాయి. మాజీ మంత్రులు సహా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తమ కేడర్‌ను వెంట తీసుకుని బస్సులు, కార్లలో ర్యాలీగా బయలుదేరారు. గులాబీ జెండాలతో.. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ఒకే సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపైకి చేరడంతో ఇటు ఎల్బీనగర్ నుంచి అటు పెద్ద అంబర్‌పేట్ ఔటర్ జంక్షన్ వరకు, ఇటు సికింద్రాబాద్ నుంచి అటు ఘట్‌కేసర్ వరకు భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. అంతకు ముందు మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు ర్యాలీగా వెళ్లి ట్యాంక్‌బండ్ సమీపంలోని జల దృశ్యంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజతోత్సవ సభకు గ్రేటర్ నుంచి వెయ్యికిపైగా బస్సులు, 1500కుపైగా కార్లలో గులాబీ శ్రేణులు తరలి వెళ్లినట్లు సమాచారం.

బల్దియాకు నయా బాస్

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్
- హైదరాబాద్ మెట్రో పాలిటన్ సెక్రటరీగా ఇలంబర్తి
- ఎఫ్‌సీడీఏ కమిషనర్‌గా శశాంక నియామకం



ఆర్వీ కర్ణన్.

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ నియమితులయ్యారు. ప్రస్తుతం బల్దియా కమిషనర్‌గా ఉన్న ఇలంబర్తికి హైదరాబాద్ మెట్రో పాలిటన్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించారు. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా కె.శశాంకను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్వీ కర్ణన్.. తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ నుంచి ఫారెస్ట్రీ విభాగంలో గ్రాడ్యుయేషన్ చేశారు. 2007లో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలో టాపర్‌గా నిలిచారు. అనంతరం 2012లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, కరీంనగర్, నల్లగొండ జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా ఉన్న కర్ణన్.. ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీలపై విస్తృతంగా తనిఖీలు చేయించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీలో తనిఖీలపై ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆహార కల్తీలను గుర్తించినప్పుడు హోటళ్ల లైసెన్సులు రద్దు చేయడం తదితర అధికారాలను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు అప్పగిస్తూ.. వారిని ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమించారు. ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాక పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ఇలంబర్తిని జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమించిన ప్రభుత్వం.. ఆయనను నవంబర్‌లో రెగ్యులర్ కమిషనర్‌గా నియమించింది. దాదాపు ఆర్నెల్లకే బదిలీ చేయడంతో జీహెచ్ఎంసీ పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందనే వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి సైతం స్వల్పకాలం మాత్రమే జీహెచ్ఎంసీ కమిషనర్లుగా పని చేయడం తెలిసిందే. కాగా హెచ్ఎండీఏ సెక్రటరీగా ఆర్.ఉపేందర్ రెడ్డి బదిలీపై వచ్చారు.

మరో ముగ్గురు..

- నగరం విడిచి వెళ్లిపోయిన పాకిస్థానీలు
- భారత్ టు పాకిస్థాన్ వయా దుబాయ్

సాక్షి, సిటీబ్యూరో: పహల్గాం ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిణామాలతో ప్రస్తుతం భారత్- పాకిస్థాన్ మధ్య విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కేంద్రం నిర్దేశించిన గడువు మేరకు నగరం వదిలి వెళ్లాల్సిన షార్ట్ టర్మ్ వీసా (ఎస్‌టీవీ) కలిగిన పాకిస్థానీయులు ప్రస్తుతానికి 'మూడో దేశం' చేరారు. ఈ తరహా వీసాలపై నగరానికి వచ్చిన నలుగురూ ఆదివారం సాయంత్రానికి దేశం వదిలారు. సిటీలో ఉన్న నలుగురిలో ఓ పురుషుడు శనివారం వెళ్లిపోగా... ఇద్దరు మహిళలు, చిన్నారి ఆదివారం విమానం ఎక్కారు. పాకిస్థాన్‌కు నేరుగా విమానాలు లేకపోవడంతో భారత్- పాక్ బోర్డర్‌కు చేరుకునే ఆ దేశంలోకి ప్రవేశించాలి. నగరం నుంచి ఈ సరిహద్దులు దూరం కావడంతో.. ఎల్‌టీవీపై వచ్చిన వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివారం రాత్రికి దేశం వదిలి వెళ్లడం అనివార్యం కావడంతో ప్రత్యామ్నాయాలు అన్వేషించారు. దీంతో నలుగురు పాకిస్థానీలు (ఓ చిన్నారి సహా) నగరం నుంచి దుబాయ్ వెళ్లారు. అక్కడ నుంచి వాళ్లు పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లాంగ్‌టర్మ్ వీసాలపై ఉన్న వారికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి వచ్చే ఆదేశాల కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. మెడికల్ వీసాలపై వచ్చిన వాళ్లు మంగళవారం నాటికి దేశం వదలాల్సి ఉంది. ఈ కేటగిరీకి చెందిన వాళ్లు నగరంలో ఎవరూ లేరని అధికారులు చెబుతున్నారు. కేంద్రం నిర్దేశించిన గడువు తర్వాత చిక్కే పాకిస్థానీలను అరెస్టు చేస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క నగరంలో ఎవరైనా అక్రమంగా నివస్తున్నారా? అనే దానిపైనా దృష్టి పెట్టారు.

క్రీడారంగ అభివృద్ధికి కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

గన్‌ఫౌండ్రీ: క్రీడారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టి-20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రికెట్ ఖేలో-నషా చోడో అనే నినాదంతో, నో డ్రగ్స్- నో బెట్టింగ్ అంటూ క్రికెట్ పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, స్పోర్ట్స్ సెల్ ఇన్‌చార్జి పొన్నం తరుణ్ గౌడ్, శక్తి సూపర్ షీ కోఆర్డినేటర్ కె.విద్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే 5న అంబర్‌పేట ఫ్లై ఓవర్ ప్రారంభం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మే 5వ తేదీన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం జరిగిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబర్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిని గడ్కరీ ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతంరావు, సి.కృష్ణయాదవ్, ఎడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఎయిర్‌టెక్‌కు చెక్!

3 నెలలకోసారి వాహన ధ్రువీకరణ తప్పనిసరి

- ఇక జెట్టింగ్, సక్షన్‌తో పాటు గ్రాబర్ తప్పనిసరి
- పాత టెక్నాలజీ అప్‌గ్రేడ్‌తో కొత్త గ్రేడింగ్‌కు అవకాశం
- త్వరలో సరికొత్త నిబంధనలతో టెండర్ల ప్రక్రియ
- చర్యలకు సిద్ధమవుతున్న జలమండలి యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: మ్యాన్‌హోళ్ల క్లీనింగ్‌కు వినియోగిస్తున్న బిగ్ ఎయిర్‌టెక్ మిషన్లలో కాలం చెల్లిన వాటికి చెక్ పెట్టేందుకు జలమండలి సిద్ధమవుతోంది. ఎయిర్‌టెక్ వాహనాలకు పాత టెక్నాలజీ అప్‌గ్రేడ్‌తో కొత్త గ్రేడింగ్‌కు అవకాశం కల్పిస్తూనే సరికొత్త నిబంధనలతో టెండర్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. వాహన కాల పరిమితి 13 ఏళ్లలోపు ఉండాలని, జెట్టింగ్, సక్షన్‌తో పాటు గ్రాబర్ కలిగి ఉండేలా నిబంధనలు రూపొందిస్తోంది. పైపులైన్‌లోని మురుగును గ్రాబర్ (బకెట్) ద్వారా బయటికి తీసుకొచ్చేలా ఉన్న వాహనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయి వర్క్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత ప్రతి మూడు నెలలకోసారి పీడీఐఎల్ (భారత ప్రభుత్వ వాహన యోగ్యత తనిఖీ కేంద్రం) ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించేలా నిబంధన రూపొందిస్తోంది. నిత్యం వాహనాల పనితీరుపై జీపీఎస్ ద్వారా ఏవీటీఎస్ వినియోగించి పర్యవేక్షించనుంది.

త్వరలో టెండర్లు ఆహ్వానిస్తాం

మురుగునీటి వ్యవస్థ నిర్వహణలో వినియోగిస్తున్న భారీ ఎయిర్‌టెక్ మిషన్ల కోసం సరికొత్త నిబంధనలతో త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయి వర్క్ ఆర్డర్ ఇచ్చేవరకు సీవరేజీ క్లీనింగ్ చేస్తున్న వాహనాల వర్క్ ఆర్డర్ల కాలపరిమితి పొడించాలని నిర్ణయించాం. ఏఆర్ఏఐ నిబంధనల ప్రకారం కాలం చెల్లిన వాహనాలను కట్టడి చేస్తాం.

- అశోక్‌రెడ్డి, ఎండీ, జలమండలి

జలమండలి పరిధిలో భారీ ఎయిర్‌టెక్ యంత్రాలు ఇలా..

డివిజన్	నియోజక వర్గం	వాహనాల సంఖ్య
1	చార్మినార్, బహదూర్‌పురా	6
2	మలక్‌పేట, యాకుత్‌పురా	6
3	కార్వాన్, నాంపల్లి (కొద్ది భాగం)	6
4	గోషామహల్, నాంపల్లి (కొద్ది భాగం)	6
5	అంబర్‌పేట, ముషీరాబాద్	7
6	జూబ్లీహిల్స్, ఖైరతాబాద్	10
7	సికింద్రాబాద్, సనత్‌నగర్	7
8	చాంద్రాయణగుట్ట	3
9	కూకట్‌పల్లి	3
10	ఎల్బీనగర్ (కొద్ది భాగం)	2
11	ఎల్బీనగర్ (ఇంకొద్ది భాగం)	2
12	కుత్బుల్లాపూర్	4
13	మల్కాజిగిరి	6
14	ఉప్పల్	4
15	శేరిలింగంపల్లి (కొద్ది భాగం)	3
16	రాజేంద్రనగర్	3
17	శేరిలింగంపల్లి (కొద్ది భాగం)	3

ముచ్చటగా మూడోసారి..

జలమండలి పరిధిలో 80 భారీ ఎయిర్ మిషన్లను అద్దె ప్రాతిపదికన వినియోగిస్తున్నారు. ఎయిర్ టెక్ మిషన్ల టెండర్ వర్క్ ఆర్డర్ కాల పరిమితి గతేడాది సెప్టెంబర్ 14తోనే ముగిసింది. తిరిగి టెండర్ ప్రక్రియ చేపట్టకుండా ఇదివరకే మూడు నెలల చొప్పున రెండుసార్లు వర్క్ ఆర్డర్ కాలపరిమితిని అధికారులు పొడిగించారు. తాజాగా మూడోసారి కూడా ఆరు నెలల కాల పరిమితిని పొడిగించేందుకు దస్త్రాలు ముందుకు కదిలాయి. నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ కాలపరిమితి ముగియక ముందే కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టి వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. టెండర్ కాలపరిమితి ముగిసి ఎలాంటి ఆటంకం లేనప్పటికీ పాత వర్క్ ఆర్డర్‌కు గడువు పొడిగింపు పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏడాది రూ.30కోట్ల పైనే..

జలమండలి భారీ ఎయిర్‌టెక్ వాహనాలకు ప్రతి యేటా రూ.30కోట్లకుపైగా అద్దె చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక్కో యంత్రం రోజు వారీగా గరిష్ఠంగా 500 రన్నింగ్ మీటర్ మేర పైపులైన్‌లో సీవరేజీ క్లీనింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక రన్నింగ్ మీటర్‌కు రూ.22 చొప్పున సదరు ఏజెన్సీలకు చెల్లిస్తోంది. ఇలా ఒక్కో యంత్రానికి నెలకు రూ.3.30 లక్షల చొప్పున ఏటా 80 వాహనాలకుగాను రూ.31.68 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. కొందరు భారీ ఎయిర్‌టెక్ యజమానులు క్షేత్రస్థాయి అధికారుల సహకారంతో లాగ్ పుస్తకాల్లో తప్పుడు సమాచారం నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం 150 నుంచి 200 వరకు రన్నింగ్ మీటర్ల పైపులైన్ క్లీన్ చేసి రెండింతలకు పైగా ఎక్కువగా నమోదు చేయించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. వాహనాలకు జీపీఎస్ ద్వారా ఏవీటీఎస్ విధించినా క్షేత్రస్థాయి అధికారుల ధ్రువీకరణ ఇందుకు దోహదం చేస్తోంది. మరోవైపు కొన్ని యంత్రాలు సరిగా పని చేయకున్నా పని చేసినట్లు బిల్లుల చెల్లింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక నెల బిల్లు ముట్టజెబితే...

ఎయిర్ టెక్ వాహనాల్లో సగానికిపైగా కాలం చెల్లినవి ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా మార్కెట్‌లో ఏఆర్ఏఐ బీఎస్-6 వాహనాలు అందుబాటులో ఉండగా.. జలమండలి మాత్రం అత్యధికంగా బీఎస్-3, బీఎస్-4 వాహనాలు వినియోగంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కొందరు జలమండలి ఉన్నతాధికారులకు కలిసి వచ్చేలా తయారైంది. కాలం చెల్లిన వాహనాలకు వర్క్ ఆర్డర్‌ను కొత్త టెండర్ ప్రక్రియ పూర్తి వరకు కొనసాగించాలంటే ఒక నెల బిల్లు ముట్టజెప్పాలని అధికారులు సదరు ఏజెన్సీలపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

చంపేస్తున్నారు!

- నగరంలో ఇటీవల వరుసగా హత్యోదంతాలు
- వీటిలో రౌడీషీటర్ల ప్రమేయంతో జరిగినవీ కొన్ని
- నడిరోడ్డుపై నరుకుతుండటంతో స్థానికుల్లో భయం
- కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలు అవసరం
- ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలనే అభిప్రాయం

ఈ నెల 7వ తేదీ.. గోల్కొండ పరిధిలో బావ ముఖీత్‌ను బావమరిది సమీర్ కత్తితో పొడిచి చంపేశాడు. ఇదే నెల 8న మేడిపల్లిలో జిమ్ నిర్వాహకుడు సాయి కిషోర్‌ను చంటి తదితరులు జిమ్‌లోనే డంబెల్‌తో మోది హతమార్చారు. 14న రెయిన్‌బజార్‌లో రౌడీషీటర్ మహ్మద్ మసీయుద్దీన్‌ను మహ్మద్ షేర్, ఆరిఫ్ సహా ఆరుగురు కత్తులతో పొడిచి హత్య చేశారు. 18వ తేదీన కూతురు పెళ్లి విషయంలో తలదూర్చవద్దని, ప్రవర్తన మార్చుకోవాలని హితవుపలికిన భర్త సాయిలును భార్య కవిత మరో ఇద్దరితో కలిసి చంపేసింది. ఇదే నెల 19న నాగోల్ ఫ్లైఓవర్ సమీపంలో వంగ మనోజ్‌ను సంజయ్ తన స్నేహితులతో కలిసి దారుణంగా పొడిచి చంపాడు. నగరంలో ఏప్రిల్ నెలలో చోటు చేసుకున్న దారుణాల్లో కొన్ని ఉదాహరణలు ఇవి. వివాహేతర సంబంధాలు, ఆర్థిక వివాదాలు, పాత కక్షలు.. ఇలా కారణం ఏదైనా వరుసగా దారుణ ఉదంతాలు చోటుచేసుకున్నాయి. పట్టపగలు, నడిరోడ్డుపై జరిగినవి ఉన్నాయి. సమాజంపై తీవ్ర ప్రభావం చూపించే హత్య కేసుల విషయంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ పరిస్థితి మారుతుందని నగరవాసులు భావిస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



బాడీ అఫెన్సులుగా పిలిచే వాటిలో హత్య కేసులు అత్యంత కీలకమైనవి. గ్రేవ్ అఫెన్సులుగా పిలిచే వీటి దర్యాప్తునకు పోలీసులు సైతం కీలక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఎవరైనా వ్యక్తి ఓ చీటింగ్ కేసులోనో, మరో సైబర్ నేరంలోనో రూ.10 కోట్లు కోల్పోయాడన్నా ఆ వార్త సమాజంపై పెద్దగా ప్రభావం చూపించదు. అదే ఓ ప్రాంతంలో కొందరు దుండగులు ఓ వ్యక్తిని పట్టపగలు, నడిరోడ్డుపై నరికి/పొడిచి చంపారంటే మాత్రం అది తీవ్ర కలకలం సృష్టిస్తుంది. దీని ప్రభావం శాంతిభద్రతలపైనే కాదు.. సమాజం మొత్తమ్మీద ఉంటుంది. దారుణం జరిగిన చోట నివసించే స్థానికుల్లో అభద్రతాభావం ఏర్పడుతుంది.

అవి నిరోధించడం సాధ్యం కాదు..

హత్యల్లో ప్రధానంగా రెండు రకాలు ఉంటాయి. వ్యక్తిగత కక్షలు, ఈర్ష్య, ఆస్తి వివాదాలు, అక్రమ సంబంధాల వల్ల జరిగేవి మొదటి రకానికి చెందినవి. ఇక రౌడీషీటర్ల మధ్య ఆధిపత్య పోరు, గతంలో జరిగిన హత్య/హత్యా యత్నాలకు ప్రతీకారంగా జరిగే వాటితో పాటు సుపారీ హత్యలు, అసాంఘిక శక్తులు చేసేవి రెండో రకం కిందికి వస్తాయి. పరిచయస్తులు, బంధువులు, కుటుంబీకుల మధ్య జరిగే మొదటి తరహాకు చెందిన వాటిని ముందుగా గుర్తించే అవకాశం లేదు. అయితే అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లతో పాటు గతంలో ఇలాంటి నేరాలు చేసిన వారిపై నిఘా వేసి ఉంచితే రెండో తరహాకు చెందిన హత్యల్ని అడ్డుకోవచ్చు. పోలీసులపై ఈ బాధ్యత కూడా ఉంది.

మొగ్గలోనే తుంచేయడం అవసరం...

ఓ వ్యక్తి రౌడీషీటర్‌గా మారాలంటే అతడిపై హత్య, హత్యాయత్నం సహా మరి కొన్ని కేసులు నమోదై ఉండాలి. ఇలాంటి వాళ్లు మొదటి నేరం చేసినప్పుడే వారికి శిక్షపడేలా చేయాలి. తద్వారా తదుపరి నేరాలు చేసి, రౌడీషీట్ వరకు వాళ్లు వెళ్లకుండా చేయవచ్చు. ప్రధానంగా హత్య కేసుల దర్యాప్తులో ఎంత వేగంగా, పక్కాగా స్పందిస్తే అంత మెరుగైన ఫలితాలు ఉంటాయి. ప్రస్తుతం మర్డర్ కేసుల్ని ఆయా ఠాణాల ఇన్‌స్పెక్టర్లు దర్యాప్తు చేస్తుంటారు. వీరికి ఉండే దైనందిన విధుల నేపథ్యంలో ఈ కేసులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టలేరు. ఈ నేపథ్యంలో హత్య కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలు అవసరమన్నది నిపుణుల మాట. ప్రతి ఠాణాకు కాకపోయినా కనీసం డివిజన్‌కు ఒక టీమ్ ఏర్పాటు చేసి, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి బాధ్యత అప్పగించాలని సూచిస్తున్నారు.

సిటీ జర్నీ!

- జాడలేని సిటీ ఆర్టీసీ బస్సులు
- పగటిపూట ప్రయాణికుల పాట్లు
- గంటల తరబడి ఎదురుచూపులు
- నగర శివార్లకు అరకొర సర్వీసులు
- సెలవు రోజుల్లో పరిస్థితి మరీ దయనీయం

సాక్షి, సిటీబ్యూరో: సిటీ ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు అన్ని రోజుల్లోనూ పగటిపూట బస్సుల కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గంటల తరబడి ప్రయాణికులు బస్టాపుల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. నగర శివార్లను సైతం బస్సుల కొరత వెంటాడుతోంది. నగరంలో బస్సుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు లేవు. దీంతో నగరవాసులు ఇతర ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారించాల్సి వస్తోంది. విస్తరిస్తున్న కాలనీలు, శివారు ప్రాంతాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం కావాల్సిఉండగా.. అందుకు విరుద్ధంగా బలహీనమవుతోంది. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న బస్సులను సకాలంలో నడపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతకాలంగా వేసవి రద్దీ పెరిగింది. పిల్లలకు సెలువుల దృష్ట్యా ప్రయాణాలు పెరిగాయి. అదేసమయంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికుల రద్దీ కూడా పెరిగింది. కానీ ఈ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు.

పగటిపూట ట్రిప్పుల్లో కోత..

సాధారణంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ మిగతా అన్ని సమయాల్లోనూ ప్రయాణికుల రాకపోకలు విరివిగానే ఉంటాయి. వివిధ అవసరాల కోసం నగరవాసులు సిటీబస్సులపై ఆధారపడి ప్రయాణం సాగిస్తారు. కానీ.. మధ్యాహ్నం పూట ఛేంజ్ అవర్ (విధుల్లో మార్పు) పేరిట గంటల తరబడి బస్సులను నిలిపివేస్తున్నారు.



మధ్యాహ్నం 12 గంటలలోపే బస్సులు డిపోలకు చేరుతున్నాయి. చాలాచోట్ల ఛేంజ్ అవర్ సమయంలో రోడ్లపైనే బస్సులు నిలిపివేస్తున్నారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు మాత్రమే బయలుదేరుతున్నాయి. దీంతో కనీసం 5 గంటల పాటు ప్రయాణికులు బస్సుల కోసం పాట్లు పడాల్సి వస్తోంది. ప్రతిరోజు సుమారు 20 లక్షల మంది ప్రయాణం చేస్తున్నట్లు అంచనా. కానీ సకాలంలో బస్సులు లేకపోవడంతో లక్షలాది మంది సెవెన్ సీటర్ ఆటోలు, మూడు సీట్ల ఆటోలు, క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలపై ఆధారపడుతున్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఉచిత ప్రయాణ సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని మహిళలు మాత్రం సిటీబస్సులను వినియోగించుకుంటున్నారు. కానీ సకాలంలో బస్సులు లేకపోవడం వల్ల మహిళలు సైతం ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.

శివార్లు విలవిల..

మరోవైపు నగర శివార్లకు బస్సుల్లేవు. చాలా ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం అరకొరగా నడుస్తున్నాయి. డిమాండ్ మేరకు బస్సుల్లేక కిక్కిరిసి వెళ్లాల్సివస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో ఫుట్‌బోర్డులపైనే నిల్చొని ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో మహిళలు సైతం ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పోచారం, ఘట్‌కేసర్, కీసర, కొర్రెముల, అవుషాపూర్, అంకుషాపూర్, శామీర్‌పేట్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ చుట్టుపక్కల ప్రాంతాలు, యాచారం, ఆమన్‌గల్ వైపు, షాద్‌నగర్, చేవెళ్ల వైపు పలు శివారు ప్రాంతాలకు ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో లేవు. సాధారణ రోజుల్లో కాలేజీలకు వెళ్లే విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సివస్తోంది.

'ఏ' కథా సంపుటి ఆవిష్కరణ



సాక్షి, సిటీ బ్యూరో: రిటైర్డ్ పోలీస్ అధికారి, రచయిత చిలుకూరి రామ ఉమామహేశ్వర శర్మ రాసిన 'ఏ' కథా సంపుటిని పలువురు సాహితీ వేత్తలు ఆవిష్కరించారు. ఆదివారం జూబ్లీ హిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్, రచయితలు ఖదీర్ బాబు, అనిల్, మానస ఎండ్లూరి, కుప్పిలి పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 'ఏ' కథా సంపుటిలో వైవిధ్యం, వాస్తవికత, మానవీయత కలిగిన కథలు ఉన్నాయని కొనియాడారు. ఈ కథల్లో స్త్రీ, పురుష సంబంధాల గురించి స్వేచ్ఛగా వ్యక్తపరచడం పాఠకులను ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు. కథలన్నీ ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. స్త్రీ, పురుష సంబంధాల పట్ల, సమాజం నిర్మించిన నైతిక చట్రపు విలువలను, సంబద్ధతను రచయిత నిశితంగా ప్రశ్నించారని వివరించారు. ఒకే మూసలో ఒదగని ఈ కథలు చెప్పేతీరు కూడా కథ కథకి మారుతుందన్నారు. కాగా ఉమామహేశ్వర శర్మ పదవీ విరమణ చేశాక రాసిన రెండో పుస్తకం 'ఏ' కథలు. ఆయన మొదటి పుస్తకం 'నేనూ శాంత కూడా–ఓ జీవన కథ' ఇప్పటికే పాఠకుల ఆదరణ పొందింది.

ఆర్థిక ఇబ్బందులు..ఆపై లోన్ యాప్ వేధింపులు..

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో పాటు లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు అధికమవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీకి చెందిన సుమన్ (31) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. గత ఎనిమిది నెలల క్రితం ఝాన్సీ అనే యువతితో వివాహం జరిగింది. తన సోదరులు పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 25 సాయంత్రం 4.30 గంటలకు ఇంట్లో వారంతా మూసాపేటలో తమ కుటుంబ శుభకార్యానికి వెళ్లి అర్ధరాత్రి 2.30 గంటలకు తిరిగివచ్చారు. సుమన్ భార్య ఝాన్సీ మూసాపేటలోనే ఆగిపోగా మిగతా కుటుంబ సభ్యులంతా ఇంటికి వచ్చారు. ఎవరి గదుల్లోకి వారు వెళ్లి నిద్రపోయారు. సుమన్ ఒంటరిగా తన గదిలో పడుకున్నాడు. శనివారం ఉదయం 9.30 గంటల వరకు కూడా సుమన్ గది నుంచి బయటకు రాకపోవడంతో సోదరుడు పవన్ ఫోన్ చేసినా లిఫ్ట్‌చేయలేదు. తలుపు కొట్టినా తీయకపోవడంతో పొరుగువారి సహాయంతో గది తలుపులు పగులగొట్టి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి సుమన్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అయితే కొన్ని నెలల నుంచి సుమన్ ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడని, లోన్‌యాప్‌లతో పాటు ఇతర వ్యక్తుల నుంచి రుణం తీసుకున్నాడని, వారు రుణం తీర్చమని నిరంతరం హింసిస్తుండడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర బది'లీలలు'!

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో అడ్డగోలు ట్రాన్స్‌ఫర్లు

- అనుకూలమైన చోటుకు వెళ్లేందుకు అడ్డదారులు
- నిబంధనలకు విరుద్ధంగా రిలీవింగ్.. జాయినింగ్
- భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: పరస్పర బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో రెండు మూడు నెలలు/ రోజుల్లో పదవీ విరమణ చేయాల్సిన వారు కూడా పరస్పర బదిలీ పేరుతో ఇతర జిల్లాలకు వెళ్తుండడం సందేహాలకు తావిస్తోంది. ప్రతిఫలంగా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే సర్వీసు ఎక్కువ ఉన్న వారి నుంచి 'పెద్ద మొత్తంలో' లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని అడ్డుకోవాల్సిన ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారులు పరోక్షంగా ఇందుకు సహకరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి స్థానికేతరుల కోటా 20 శాతానికి మించకూడదు. కానీ జిల్లాలో ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చి చేరిన వారితో స్థానికేతరుల కోటా 50 శాతం దాటిపోయింది. స్పౌజ్ కోటాలో ఇప్పటికే 32 మంది ఉపాధ్యాయులు జిల్లాకు రాగా, తాజాగా పరస్పర బదిలీల ప్రక్రియలో భాగంగా మరో 112 మంది వచ్చి చేరినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇష్టారీతిన పోస్టింగ్‌లు

ఆరోగ్య సమస్యలు, పిల్లల ఉన్నత చదువుల పేరుతో ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలు సహా ప్రజాప్రతినిధుల బంధువులు రాజకీయ, ఆర్థిక పలుకుబడిని అడ్డం పెట్టుకుని డిప్యూటేషన్‌పై జిల్లాకు వస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కాకుండా, ఇంటికి సమీపంలో, తక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లలో (ఫోకల్) పోస్టింగ్‌లు పొందుతున్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే చదువుకుని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఎంపికైన వారు ఇతర మండలాల్లోని నాన్ ఫోకల్ పోస్టుల్లో పని చేయాల్సి వస్తోంది. సీనియార్టీ పేరుతో పదోన్నతులను కొల్లగొడుతున్నారు. ఈ విషయం తెలిసి కూడా ఒక్క ఉపాధ్యాయ సంఘం కూడా అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. జిల్లాలో ఇప్పటికే 20 వేల మందికిపైగా బీఈడీ, టెట్ అర్హత పరీక్షలు పూర్తి చేసుకుని డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం పోస్టుల భర్తీకి రెండు మూడేళ్లకోసారి నోటిఫికేషన్లు జారీ చేస్తే.. ఆయా సమయాల్లో ఖాళీ లేక జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరకని పరిస్థితి నెలకొంది.

ఇప్పుడెందుకు వెళ్తున్నట్లు?

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4,054 ఎస్‌జీటీలు, 3,997 స్కూల్ అసిస్టెంట్లు, 278 మంది హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, 200 మంది ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పని చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులను స్థానికత ఆధారంగా ఆయా జిల్లాలకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని కొంత మంది ఉపాధ్యాయులకు స్థానికత ఉన్నప్పటికీ సీనియారిటీ లేకపోవడంతో ఇతర జిల్లాలకు కేటాయించింది. ఇందులో భాగంగా ఆమనగల్లు మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని నాగర్‌కర్నూలు జిల్లాకు కేటాయించింది. ఆయన ఇప్పటి వరకు రిలీవ్ కాలేదు. తనకున్న ఆర్థిక, రాజకీయ పలుకుబడితో నాలుగేళ్లుగా ఇక్కడే కొనసాగుతూ వచ్చారు. మరో మూడు రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సర్వీసు ముగిసే సమయంలో ఆయన పరస్పర బదిలీల్లో భాగంగా వికారాబాద్‌కు వెళ్తున్నారు. ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లాకు చెందిన సర్వీసు ఎక్కువగా ఉన్న మరో ఉపాధ్యాయురాలు జిల్లాకు వచ్చారు. పరస్పర బదిలీల్లో భాగంగా ఇద్దరి మధ్య పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 25 మంది వరకు పరస్పర బదిలీల్లో వెళ్లి.. అటు నుంచి వచ్చే వారి నుంచి భారీగా 'పుచ్చుకున్నట్లు' తెలిసింది. నిజానికి సర్వీసు ముగింపు దశలో ఉన్న వారిని రిలీవ్ చేయకూడదు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

మహిళపై దాడి..కేసు నమోదు

సనత్‌నగర్: కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా ఇంట్లోకి చొరబడి మహిళను రక్తం కారేలా కొట్టి తీవ్రంగా గాయపర్చిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్ డీఎస్‌ఎం కాలనీకి చెందిన రైసా నాజియా (40) ఈ నెల 26న ఉదయం 10 గంటల సమయంలో తాను ఇంట్లో ఉండగా ఆమెకు తెలిసిన వ్యక్తులైన మహ్మద్ సులేమాన్ రాజా, ముబీన్ సుల్తానా, షబానాతో పాటు మరికొంతమంది వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఒక్కసారిగా దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమె ముఖం, ముక్కు. పెదవులపై చేతులు వేస్తూ, గొంతు నొక్కుతూ దాడికి పాల్పడ్డారు. సులేమాన్ రాజా అనే వ్యక్తి ఆమె తలపై బ్యాట్‌తో కొట్టగా తీవ్ర రక్తస్రావం అయ్యింది. అదే సమయంలో రైసా నాజియా బావమరిది వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా బ్యాట్‌తో దాడి చేసి రక్తం కారేలా కొట్టారు. బాధితురాలు నిందితులపై చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితులపై బీఎన్‌ఎస్ 329(4), 118 (1), 352, 351 (2) రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.85 లక్షలు చోరీ

సనత్‌నగర్: కూరగాయల వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.1,85,000లు చోరీ చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. భరత్‌నగర్ కాలనీ జేపీనగర్‌కు చెందిన భోగేశ్వరరావు భరత్‌నగర్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. గత మూడు రోజుల క్రితం భోగేశ్వరరావు స్వగ్రామానికి వెళ్లాడు. స్వగ్రామానికి వెళ్లే సమయంలో పూజ గదిలో రూ.25,000, అల్మరాల్లో వేర్వేరు చోట్ల రూ.లక్షా అరవై వేలు ఉంచాడు. ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు భోగేశ్వరరావు కుమారుడు పెద్ద కేశవరావు ఇంటికి తాళం వేసి కీని విద్యుత్ మీటరుపై పెట్టి భరత్‌నగర్ మార్కెట్‌కు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చిన పెద్ద కేశవరావు పూజ చేస్తుండగా గదిలో ఉంచిన రూ.25 వేల నగదు కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి ఇంట్లో అల్మరాలో ఉంచిన నగదు చూడగా అవి కూడా కనిపించలేదు. కరెంటు మీటరుపై ఉంచిన కీ తీసుకుని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నగదును దొంగిలించి యథాప్రకారం తాళం చెవులను అక్కడే ఉంచి వెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో యువతిని మోసగించిన సెక్యూరిటీగార్డు

సనత్‌నగర్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన సెక్యూరిటీ గార్డ్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా గోతిలగుట్ట తాండాకు చెందిన రమావత్ ఈశ్వర్ బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. మోతీనగర్‌లో ఉంటూ అమీర్‌పేటలోని ఓ షాపింగ్ మాల్‌లో గత రెండున్నర సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అదే షాపింగ్ మాల్‌లో పనిచేసే యువతి (24)తో ఈశ్వర్‌కు పరిచయం ఏర్పడింది. నువ్వంటే ఇష్టమని, వివాహం చేసుకుంటానని ఆ యువతికి చెప్పాడు. మొదట అందుకు ఆమె నిరాకరించగా, ఒత్తిడి చేసి వివాహానికి ఒప్పించాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చింది. దీంతో తనను పెళ్లి చేసుకోమని కోరగా, గర్భం దాల్చితే ఇంట్లో వాళ్లు ఒప్పుకోరని చెప్పి ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఆమెకు బలవంతంగా గర్భ నిరోధక మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమెకు గర్భస్రావం జరిగింది. ఆ తర్వాత నుంచి ఈశ్వర్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంచాడు. మార్చి 18న ఆ యువతి, ఈశ్వర్, అతని తల్లి..గ్రామ పెద్దలు, సర్పంచ్‌ల సమక్షంలో పెళ్లి విషయమై మాట్లాడారు. వారి సమక్షంలో ఈశ్వర్ ఆమెను వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయినప్పటికీ వివాహం చేసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకు తిరుగుతుండడంతో శనివారం ఆ యువతి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 69 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మియాపూర్: ముందు వెళ్తున్న కారుకు సడన్ బ్రేకులు వేయడంతో..వెనుక బైకుపై వస్తున్న ఇద్దరు కిందపడగా...వారిలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. మియాపూర్ జనప్రియ నగర్ కాలనీలో నివాసముంటున్న హైదర్ షరీఫ్ (70), రెహమాన్ షరీఫ్‌లు సోదరులు. వీరిద్దరు ఆదివారం లక్డీకాపూల్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. వీరి వాహనం మెట్రో స్టేషన్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్‌గా బ్రేకులు వేయడంతో అదుపు తప్పి కిందపడ్డారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సు హైదర్ షరీఫ్ పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రెహమాన్ షరీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మీర్‌పేట: మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత పిలుపునిచ్చారు. మీర్‌పేటలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ఆదివారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వేడుకల్లో కార్మికులందరూ పాల్గొని ఐక్యత చాటాలన్నారు. కార్మిక చట్టాల రక్షణ కోసం మే 20 నుంచి జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్, దాసరి బాబు, యాదయ్యచారి, సత్యం, మల్లికార్జున్, వెంకయ్య, ఆంజనేయులు, సోమ్లా నాయక్, చిన్నబాబు, శ్యామ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో, కరాటే పోటీలు

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వెయ్యి మందితో ఫాస్ట్ కిక్కింగ్ కాంపిటీషన్
- హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకుంటున్న వీణావాహిని

హుడాకాంప్లెక్స్: ఫస్ట్ ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ ఓపెన్ తైక్వాండో కరాటే, కుంగ్ ఫూ, మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్ షిప్–2025 పోటీలు ఉత్సాహంగా సాగాయి. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఇంటర్నేషనల్ తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి, కోచ్ ఖలీల్, గజిందర్ ఆధ్వర్యంలో స్పీడ్ కిక్కింగ్, స్పీడ్ పంచింగ్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఒకేసారి వెయ్యి మంది క్రీడాకారులు ఫాస్ట్ కిక్కింగ్‌లో పాల్గొనడంతో హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా అమికల్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ వీణా వాహిని మాట్లాడుతూ.. పిల్లల్లో ఆత్మరక్షణ పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. లండన్‌లో జూలైలో జరిగే పోటీలకు ఇందులోని విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. యువత చెడుమార్గాల వైపు అడుగులు వేయకుండా ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు సుమన్ పల్లె, శ్రీకాంత్ గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఖాజా అఫ్రిది, ముర్‌వాసిఫ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైరేంజ్ ప్రతినిధులు వీణా వాహినికి రికార్డ్స్ పత్రాన్ని అందజేశారు.


ఫాస్ట్ కిక్కింగ్ కాంపిటీషన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

చేపలు పట్టడానికి వెళ్లి.. కుంటలో పడి..

శంకర్‌పల్లి: ఓ వ్యక్తి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌కి చెందిన గడ్డం లక్ష్మయ్య (44) సెంట్రింగ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం భోజనం చేసిన తర్వాత బయటకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులు బుల్కాపూర్ శివారులోని కుంటలో మృతదేహం పడి ఉండడం చూసి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని మృతదేహన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. లక్ష్మయ్య చేపలు పట్టడానికి వెళ్లి, మూర్ఛవ్యాధి ఉండడంతో ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

ఇన్‌స్పెక్టర్ నాగరాజు

మీర్‌పేట: జన్మదిన వేడుకలు, ఇతర కారణాలతో రాత్రి వేళల్లో రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి 1 గంట నుంచి 3 గంటల వరకు నందనవనం, ఆర్‌ఎన్‌రెడ్డినగర్, భూపేశ్‌గుప్తానగర్, టీకేఆర్ కళాశాల ప్రాంతాల్లో ఆపరేషన్ చబూత్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లపై తిరుగుతున్న 113 మంది యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు రాత్రివేళల్లో తిరగడంతో జరిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు బాక్స్ క్రికెట్ గ్రౌండ్స్ వద్ద ఆడుకునే యువత కాలనీవాసులకు అసౌకర్యం కలిగించొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యం స్థాపించాలి

దళితసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు


మాట్లాడుతున్న జేబీ రాజు

ఇబ్రహీంపట్నం: బహుజనుల రాజ్యాన్ని స్థాపించి ఎర్రకోటపై జెండా ఎగురవేయాలని దళితసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు పిలుపునిచ్చారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జన జాతర సభను ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. 95 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యస్థాపనకు కృషిచేయాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అందరూ సమానులేనని అంబేడ్కర్ రాజ్యాంగంలో రచిస్తే దానిని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చే మెజార్టీ పార్లమెంట్‌లో లేని కారణంగానే మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయలేకపోయిందన్నారు. మనుధర్మాన్ని అమలు చేస్తే మన బతుకులు పాత కాలంలో మాదిరిగా మారిపోతాయని, మనుషుల మధ్య స్వేచ్ఛ, సమానత్వం ఉండవని, అణగారిన కులాలు ఆగమైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కు ద్వారా ఎన్నికల్లో బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించాలని, అప్పుడే మన బతుకులు మారుతాయన్నారు. లెక్కలు తేలితే తమ ఆటలు సాగవని బీసీ జనాభా లెక్కలు తేల్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకు రావడంలేదని విమర్శించారు. పోరాటలతోనే రాజ్యాధికారం దక్కుదని.. ఎన్నికల్లో గెలుపే ప్రధానమన్నారు. అందుకు బహుజనులంతా అధికారం చేపట్టే దిశగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. పూలే, అంబేడ్కర్ ఆశయాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్‌లను స్మరించకపోతే మన భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి అధికారం దక్కించుకోవాలనే దుర్భర పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ నేతృత్వంలో బహుజనులను ఏకం చేస్తూ రాజ్యాధికారం వైపు నడిపించే పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు సామేల్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరో.. కారు ఢీకొని ముగ్గురు దుర్మరణం
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన శ్రుతి, ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

కొడంగల్ రూరల్: ఎదురెదురుగా వస్తున్న బొలెరో..కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అయినన్‌పల్లి స్టేజ్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన రామారావు(51) హైదరాబాద్‌లోని కేపీహెచ్‌పీ కాలనీలో ఏడాది కాలంగా నివాసం ఉంటున్నారు. ఇతనికి భార్య శారద, కుమారుడు అనిష్ ఉన్నారు. శనివారం పని మనిషి శ్రీలత(42), ఆమె మూడో కూతురు శ్రుతి(12)తో కలిసి కారులో కర్ణాటకలోని గానుగాపూర్‌లో గల దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లారు. ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొడంగల్ మండలం అయినన్‌పల్లి గేటు సమీపంలోకి రాగానే కొడంగల్ నుంచి లక్ష్మీపల్లికి వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రులు శ్రుతి, రామారావును హైవే అంబులెన్సులో కొడంగల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా రామారావు మృతిచెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రుతి మృతి చెందింది. ఇదిలా ఉండగా కొడంగల్ మండలం పర్సాపూర్‌కు చెందిన శ్రీలతకు పెద్దేముల్ మండలం మంబాపూర్‌కు చెందిన కృష్ణప్పతో వివాహం జరిగింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటూ ఇళ్లలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రామారావు ఇంటో శ్రీలత పని చేస్తోంది. దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామారావు, శ్రీలత, శ్రుతి మృతి చెందారు. బొలెరో వాహన డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.


రామారావు మృతదేహం


ఘటనా స్థలంలో శ్రీలత మృతదేహం

ఆత్మీయ సమ్మేళనం



వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి తీపి గుర్తులు, ఆటలు, పాఠశాలలో ఎదుర్కొన్న జయాపజయాలు అన్నీ మనసు విప్పి మాట్లాడుకున్నారు. అనంతరం అప్పటి టీచర్లను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ సమ్మేళనంతో ఆనందంగా గడిపారు.

రేవంత్‌రెడ్డి హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి

లిబర్టీ: రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం బాటలు వేస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక దేశాలు మొగ్గు చూపుతున్నాయన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనతో ఎన్నో పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా పలు కంపెనీలు ఒప్పందాలు సైతం చేసుకున్నాయన్నారు. ఫోర్త్ సిటీలో సంస్థలను ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు..

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడిన ఓ ఆస్పత్రి ఉద్యోగి ఈజీ మనీ కోసం గంజాయి విక్రేతగా మారి బంజారాహిల్స్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఉదయ్‌నగర్‌లో నివసించే బిజినమైన రఘు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కార్డియో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన షేక్ అంజాద్ అనే గంజాయి స్మగ్లర్‌తో ఏర్పడిన పరిచయం ఆధారంగా గజాయి విక్రయాలకు తెరలేపాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి అంబేద్కర్‌నగర్ సమీపంలోని శ్మశానవాటికలో కిలోన్నర గంజాయి ప్యాకెట్‌తో వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడి చేసి రఘును రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకుని అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

వెంగళరావునగర్ : గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడనిన యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్ కాలనీ పార్క్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న పుల్లయ్య కుమార్తె వెన్నెల (19) ఇంటర్ చదువుతోంది. నాలుగు రోజుల క్రితం వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఆమె ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి లోనైన వెన్నెల గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఆమెను నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్: శుభ కార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సయ్యద్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బషీర్ బిన బిలాల్ ఈ నెల 25న రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆరాంఘర్‌కు వెళ్లాడు. 26న తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఏడు గ్రాముల బంగారు గొలుసు, ఉంగరం, 50 తులాల వెండి ఆభరణాలు, రూ.65,000 నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డెర్మటోసర్జరీకి పెరుగుతున్న ప్రాధాన్యం

రాంగోపాల్‌పేట్: డెర్మటాలజీ విభాగంలో డెర్మటోసర్జరీ అనే ఉప విభాగానికి ప్రాధాన్యం బాగా పెరుగుతోందని, ఈ విషయంలో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటేనే రోగులకు మరుగైన ఫలితాలను అందించగలమని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం ఏసీఎస్ (ఐ)ఈసీ, అకాడమీ సమన్వయంతో డెర్మటోసర్జరీపై వైద్యుల కోసం వర్క్‌షాప్ నిర్వహించారు. కుట్లు వేసే టెక్నిక్‌లపై డెర్మటాలజిస్టులకు శిక్షణ ఇచ్చారు.

ఆన్ చేస్తే సీజ్ చేస్తారు...

కొనసాగుతున్న కరెంటు మోటార్ల సీజ్..

- నల్లాలకు మోటార్లు బిగిస్తే జరిమానాలు..
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ప్రత్యేక బృందాలు..
- స్వచ్ఛందంగా తొలగించుకుంటున్న నివాసితులు..


స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు..

బంజారాహిల్స్: వేసవికాలంలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి జలమండలి చేపట్టిన మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రత్యేక బృందాలు కాలనీలు, హోటళ్లు, ప్రైవేటు హాస్టళ్లు, ఆస్పత్రి క్లినిక్‌ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జలమండలి డివిజన్–6 అధికారులతో పాటు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. నల్లాకు మోటార్లు బిగించి మంచినీటిని తోడుతున్నట్లు తేలితే వారి కనెక్షన్ కట్ చేయడమేగాక రూ.5,000 జరిమానా విధిస్తున్నారు. ఇప్పటివరకు 88 మోటార్లను సీజ్ చేశారు. నీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగుతుంది. లైన్‌మెన్ నుంచి అధికారి వరకు ఈ నెల 15 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. వేసవిలో మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా నాలుగు దశల్లో తనిఖీలకు అధికారులు సిద్ధమయ్యారు. మంచినీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టి సాధారణ స్థాయి ఒత్తిడితో నీటి సరఫరా జరిగే విధంగా ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుండగా నల్లాలు వదిలినప్పుడు క్షేత్రస్థాయిలో అధికారుల బృందాలు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాయి.

మొదటి దశలో..

మొదటి దశలో లైన్‌మెన్లు వాటర్ వాల్వ్ తిప్పగానే సరఫరా చేసే లైన్లలో ప్రతి కనెక్షన్‌ను పరిశీలించి వాటర్ ప్రెషర్ ఎలా ఉందో తెలుసుకోవడమే కాకుండా మోటార్ల వినియోగాన్ని గుర్తిస్తున్నారు.

రెండో దశలో..

రెండో రోజు జలమండలి సెక్షన్ మేనేజర్ అదే ప్రాంతంలో పర్యటించి మోటార్లు బిగించినట్లు తేలితే రూ.5 వేల జరిమానా విధించి తక్షణమే మోటారు సీజ్ చేస్తున్నారు. ఆ ఇంటి క్యాన్ నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెడతారు. ఆ తర్వాత క్యాన్ నెంబర్ల జాబితాతో మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ లైన్లుగా జీఎం హరిశంకర్‌కు ఆన్‌లైన్‌లో నివేదిక సమర్పిస్తారు.

మూడో దశలో..

మేనేజర్ నివేదిక ఆధారంగా జీఎం క్షేత్ర స్థాయిలో వాటర్ లైన్లను ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి చెందితే సీజీఎంకు నివేదిక ఇస్తారు. అక్కడి నుంచి డైరెక్టర్, ఎండీ లాగిన్‌కు రోజువారీగా ఆన్‌లైన్ నివేదిక సమర్పిస్తారు.

నాలుగో దశలో..

ఈ నివేదికల ఆధారంగా క్రాస్ చెక్ కోసం జలమండలి ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తూ మోటార్లు సీజ్ చేస్తారు.

తప్పుడు నివేదిక ఇస్తే మెమో..

మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ సర్వేలో సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే మాత్రం సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసే డ్యాష్ బోర్డులో ఆన్‌లైన్ ఆధారంగా ప్రతిరోజూ నివేదికలను పరిశీలిస్తారు. మొత్తంగా లైన్‌మెన్ నుంచి అధికారుల వరకు విజిలెన్స్ పోలీసులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తోడుతున్న వారి జాబితాను రూపొందిస్తున్నారు. జరిమానాలతో పాటు నీటి కనెక్షన్‌ను కూడా కట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత కొద్ది రోజులుగా ఈ స్పెషల్ డ్రైవ్ పట్ల వినియోగదారుల్లో భయాందోళనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చాలామంది తాము ఏర్పాటు చేసుకున్న మోటార్లను స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. ఈ వేసవి కాలం అయ్యేవరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఖైరతాబాద్ బీజేపీ కార్యాలయంలో 'మన్‌కీ బాత్'


మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, చంద్రశేఖర్ తివారీ

బంజారాహిల్స్: ప్రధాని మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని సాగర్ సొసైటీలోని ఖైరతాబాద్ నియోజక వర్గం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ చెప్పిన పలు విషయాలపై వారు కార్యకర్తలు, నేతలతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గౌతంరావు, మేచినేని శ్రీనివాస్, బోజిరెడ్డి పల్లె వీణారెడ్డి, మద్దంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్లవంకాయ.18, పొడుగు వంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జిమిర్చి.28, క్యాప్సికం.45, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.09, క్యారెట్.21, దొండకాయ.18, గుండు బీన్స్.80, గింజచిక్కుడు.45, గోకరకాయ.35, కీర.31, దోసకాయ.18, బీట్‌రూట్.19, ఉల్లిగడ్డ.14, ఆలుగడ్డ.27, చామగడ్డ.35.

కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చూడాలి


వరంగల్ సభకు తరలి వెళుతున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్ష అని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ 25వ వార్షికోత్సవ సభకు కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రైతులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తమ గుండెల్లో కేసీఆర్‌ను గుడి కట్టుకుని ఆరాధిస్తున్నారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మరోసారి ఆయన సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, బాలకృష్ణ, పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, యాదగిరి, పూజారి బాలు, బాలు రజక తదితరులు పాల్గొన్నారు.

18న గాయత్రీ హిల్స్ కాలనీ ఎన్నికలు


మాట్లాడుతున్న కాలనీ సీనియర్ సభ్యుడు ఇస్మాయిల్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని గాయత్రీ హిల్స్ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎన్నికలు మే 18న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. గత కమిటీ పదవీ కాలం ఏప్రిల్ నెలతో ముగియడంతో ఆదివారం కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీనియర్ సభ్యుడు ఇస్మాయిల్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ మేరకు నూతన కమిటీ నియామకానికి వచ్చే నెల 11న నామినేషన్లు ఉంటాయని, 13న నామినేషన్ల ఉపసంహరణ, మే 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా రూ. 1000 ఇచ్చి నమోదు చేసుకున్న ప్రతి ఇంటికి ఓటు హక్కు కలిస్తామని తద్వారా సేకరించిన డబ్బును కాలనీ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సభ్యత్వం తీసుకోవడానికి మే 7 ఆఖరి తేదీగా తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సీనియర్ సభ్యులు రాఘవులు, మల్లేష్, జయప్రసాద్, నారాయణ రావు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గాన్ని చైతన్యం చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

హిమాయత్ నగర్ : సాంస్కృతిక, ప్రజా కళలతో ప్రజలను చైతన్యం చేసి కార్మికవర్గాన్ని సంఘటితం చేయాల్సిన బాధ్యత కవులు, కళాకారులపై ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో కవుల, కళాకారుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కెవిఎల్, నగర అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్, కళాకారులు మోహన్ రావు, రామకృష్ణ, రాము మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేయడంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



హిమాయత్‌నగర్ : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ జె.హేమలత యాదవ్ కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవానికి వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. డివిజన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు జె.బాబుయాదవ్, కృష్ణ యాదవ్, కొల్కుల శ్రీకాంత్, రఘు, బాబు, సత్యనారాయణ, రామకృష్ణ, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్ కార్యవర్గం ఎన్నిక

మణికొండ: కాలనీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఐ.లక్ష్మణ్ రావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి సారథ్యంలో ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా రతన్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. గంగాధర్‌రావు, సహాయ కార్యదర్శులుగా డి.సాగర్, కె.మమత, కోశాధికారిగా ఎం. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కె. మల్లారెడ్డి, కె. నర్సింగ్‌రావు, వి. శ్రీకారిని, ఎస్. నాగభూషణం, కేఆర్ స్వామి, ఎస్. నరేష్, ఇబ్రాయిల్, కె. లక్ష్మన్‌రావు, రామకృష్ణారెడ్డి, పలనిస్వామి, బి.రాంబాబు, బి. సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే రెండేళ్ల కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే పార్కును మున్సిపాలిటీ అధికారులు వెంటనే అభివృద్ధి చేయాలన్నారు.

సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో పాల్గొన్న స్థానికులు

ఖైరతాబాద్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం వ్యక్తం చేస్తూ ఆదివారం ఖైరతాబాద్ లేక్‌వ్యూ పార్క్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. లేక్ వ్యూ పార్క్‌లో వాకింగ్ చేసేందుకు వచ్చిన వారందరితో కలిసి కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం వ్యక్తం చేస్తూ అందరూ ముక్తకంఠంతో ఉగ్రవాదాన్ని వ్యతిరేకించాలని, బాధితుల పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు.

శాంతి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బ్రిగేడ్ కమ్యూనిటీవాసులు

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్ బ్రిగేడ్ సెటాడెల్ గేటెడ్ కమ్యూనిటీలో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఉగ్రవాదులను, వారికి సహకరిస్తున్న శక్తులను పునాదులతో సహా మట్టుపెట్టాలని, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతిని చేకూరాలన్నారు. ర్యాలీలో కమ్యూనిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసాద్, విష్ణు, జడేజా, సురేష్ నార్నె తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కార్లు పార్క్ చేయొద్దు


కేపీఆర్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

మణికొండ: కాలనీ రోడ్లపై కార్లు నిలపడంతో వాటర్ ట్యాంకర్లు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని అర్థం చేసుకుని కార్ల యజమానులు వాటిని గృహాల్లోపల, ఖాళీ స్థలాల్లో నిలుపుకోవాలని కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల్లో రహదారులు ఇరుగ్గా ఉన్నాయని, వాటిని మరింత ఇరుకు చేసేలా వాటిపై ఎక్కడ పడితే అక్కడ కార్లను నిలుపుతున్నారని మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. వాటర్ ట్యాంకర్లు కార్లు అడ్డుగా ఉంటాయని రావటం లేదన్నారు. దీంతో కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతునానరన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వచ్చేందుకు వీలు కావటం లేదన్నారు. ఇకనైనా కేపీఆర్ కాలనీతో పాటు ఇతర కాలనీల్లోనూ రోడ్లపై కార్లను నిలపవద్దని కోరారు. రాబోయే రోజుల్లో ఆయా కార్లను ట్రాఫిక్ పోలీసులను పిలిచి అప్పగించాలని కాలనీ సంక్షేమ సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి జి. సింహారాజరెడ్డి, నాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్ రెడ్డి, గణేష్‌రెడ్డి, సురేష్, దినేష్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హీమోఫీలియాపై అవగాహన అవసరం


హీమోఫీలియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పంజగుట్ట: ప్రపంచంలో అన్ని దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే హీమోఫీలియా బాధితులు ఎక్కువగా ఉన్నారని ప్రముఖ హెమటాలజీ వైద్య నిపుణులు విక్రమ్ కుమార్ అన్నారు. బాధితుల సంఖ్య నానాటికీ పెరగడం బాధాకరమన్నారు. ఆదివారం రాజ్‌భవన్ రోడ్డులోని అశ్విన్ ఆసుపత్రిలో హీమోఫిలియా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యాధి బాధితులకు ఉచిత సేవలందించేందుకు ఏర్పాటు చేసిన హీమోఫిలియా ట్రీట్‌మెంట్ సెంటర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా వ్యాధిగ్రస్తులకు తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు ఉచిత నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ కుమార్, చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ అత్యధునిక వైద్యం అందుబాటులోకి వస్తున్నప్పటికీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడం బాధాకరమన్నారు. పూర్తిగా వ్యాధి నయం కాకున్నా ఉపశమనం కలిగేందుకు ఆధునిక వైద్య చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగినప్పుడు ఫ్యాక్టర్ ఇంజెక్షన్‌తో పాటు రక్తస్రావం అవుతున్న చోట ఐస్ పెడుతుండాలని సూచించారు. ఫిజియో థెరపీ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సీతాదేవి, రమణి, రాధేశ్యామ్, హేమంత్ కుమార్, వంశీ, రామారావు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ నుంచి తరలిన గులాబీ దండు



బంజారాహిల్స్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బస్తీలు, కాలనీలు అని తేడా లేకుండా గులాబీ దండు ఉత్సాహంగా ఈ సభకు తరలారు. నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో కార్యకర్తల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుల్లోనే కాకుండా వందలాది మంది కార్యకర్తలు, నేతలు సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే గులాబీ శ్రేణులు వరంగల్ సభకు ఇక్కడి నుంచి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. నియోజకవర్గాన్ని గులాబీ మయంగా తీర్చిదిద్దారు. పలుచోట్ల బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు.

15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్: తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీఖాన్, కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, హేమంత్, అరుణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తెచ్చిన తంటా..

- అప్పు తీసుకుని ఒకరు..
- వసూలు చేసుకునేందుకు మరొకరు
- విధులకు ఎగనామం
- ఊడిన ఇద్దరు ఉద్యోగుల కొలువులు

ఫిలింనగర్: అప్పు తెచ్చిన తంటా ఒకే కార్యాలయంలో పనిచేసే ఇద్దరి కొలువులు ఊడేలా చేసింది. అప్పు తీసుకున్న వ్యక్తి ఉద్యోగానికి రాకుండా తప్పించుకు తిరుగుతుండగా, అప్పు ఇచ్చిన వ్యక్తి అతని కోసం వెతుకుతూ ఉద్యోగం కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే ఫిలింనగర్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్, రాంనగర్ లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన ప్రశాంత్ జలసౌధ భవనంలోని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులో అటెండర్లుగా పనిచేస్తున్నారు. వారు ఇద్దరూ స్నేహితులు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌కు ప్రవీణ్‌కుమార్ రూ.లక్ష అప్పుగా ఇప్పించాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు శ్రీనివాస్ తన కుటుంబం ఇబ్బందుల్లో ఉందని మరో రూ.4 లక్షలు కావాలని ప్రవీణ్‌ను కోరడంతో అతను ఆరు నెలల్లో తిరిగి చెల్లించేలా ప్రామిసరీ నోట్ రాయించుకుని రూ. 4 లక్షలు ఇచ్చాడు. గడువు తీరినా శ్రీనివాస్ బాకీ చెల్లించకపోవడంతో ప్రవీణ్ అతడిపై ఒత్తిడి పెంచాడు. దీంతో శ్రీనివాస్ ఆఫీసుకు రావడమే మానేశాడు. దీంతో ప్రవీణ్ అతడి ఇంటికి వెళ్లి అడగ్గా మరో ఆరు నెలలు సమయం కావాలని కోరాడు. ఆ గడువు పూర్తయినా అతని నుంచి ఎలాంటి స్పందన లేదు. అంతేగాక శ్రీనివాస్ తన మకాం మార్చడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. అతడి కోసం గాలించే క్రమంలో ప్రవీణ్ ఆఫీసుకు వెళ్లకపోవడంతో ఉన్నతాధికారులు అతడిని ఉద్యోగంలోంచి తొలగించారు. దీంతో చేసేదేమీ లేక శ్రీనివాస్‌పై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న అధ్యాపకుల సమ్మె



ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతోంది. ఆదివారానికి కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు 9 రోజులు కాగా, ఐదు రోజులుగా పార్ట్‌టైం అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. అయినా ప్రభుత్వంగాని , యూనివర్సిటీల అధికారులుగాని పట్టించుకోకవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆయా వర్సిటీల పాలన భవనాల ఎదుట సుమారు 2000 మంది అధ్యాపకులు సమ్మెలో పాల్గొనడంతో డిగ్రీ పరీక్షలపై తీవ్ర ప్రభావం పడింది.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మైన్ ఎస్ యువర్స్ వెడ్డింగ్ జ్యువెలరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్–2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బేగంపేట్‌లోని పర్యాటక భవన్‌లో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల సమస్యలపై ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఇక ముఖ గుర్తింపుతో పింఛన్లు

- ప్రత్యేక యాప్ రూపొందిస్తున్న సర్కారు
- యాప్‌తో అక్రమాలను వెలికితీసే అవకాశం
- మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో 1.46 లక్షల పింఛన్లు



సాక్షి, సిటీబ్యూరో: సాంకేతికతను జోడించి పింఛన్లు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు చేయూత పథకంలో ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) విధానాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. చేయూత పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1.46 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, వితంతువులకు బయోమెట్రిక్ విధానంలో అందజేస్తోంది. అయితే వచ్చే నెల లేదా జూన్ నుంచి ముఖ గుర్తింపుతో పింఛన్లు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. ఈ మేరకు సెర్ప్ అధికారులు పింఛన్ల కోసం కొత్త యాప్‌ను రూపొందిస్తున్నారు.

యాప్‌లో ఫొటోలు

- బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రలు రానివారికి ఆయా పంచాయతీల్లో కార్యదర్శులు, పురపాలక సంఘాల్లో వార్డు ఆఫీసర్లు వారి వేలిముద్రలను వేసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి డబ్బులు అందజేస్తున్నారు. ఈ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడంతో సర్కారు కొత్త విధానాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. పింఛన్ల పంపిణీకి ప్రత్యేకంగా రూపొందిస్తున్న యాప్‌లో లబ్ధిదారుల ఫొటోలను ప్రతి నెలా తీసుకుంటారు.
- ముఖ్యంగా పురపాలికల్లోని లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా పింఛన్ డబ్బులు జమ చేస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారు మరణిస్తే వారికి సంబంధించిన పింఛన్ వెంటనే రద్దు కావడం లేదు. కొందరికి మూడు నెలలు, మరికొందరి ఖాతాల్లో ఆరునెలల వరకు పింఛన్ డబ్బులు జమా అవుతున్న ఘటనలు జిల్లాలో ఉన్నాయి. అందుకే సర్కారు కొత్తగా ముఖ గుర్తింపు విధానం తీసుకువస్తోంది. పల్లెలు, పట్టణాలకు చెందిన లబ్ధిదారులు ఎవరైనా సరే యాప్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తేనే పింఛన్ మంజూరవుతుంది.

అక్రమాలు వెలుగుచూసే అవకాశం

ఆసరా పింఛన్ పొందుతున్న వారిలో కొందరు ఆధార్ కార్డుల్లో వయసును దిద్దించారు. తమకు ఎక్కువ వయసు ఉందని అధికారులను నమ్మించి పింఛన్లు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు నేతలు సిఫార్సు చేసిన వారికి అధికారులు ఎలాంటి విచారణ చేయకుండానే పింఛన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాప్‌ను పకడ్బందీగా రూపొందిస్తే నకిలీ పీఎఫ్ కార్డులు, ఇతరత్రా పింఛన్ పొందుతున్న వారి అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. లబ్ధిదారుల పూర్తి వివరాలను యాప్‌లో ముందుగా అప్‌లోడ్ చేస్తే అన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది.

పింఛన్లు ఇలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం పింఛన్లు 1,46,844 కాగా, ఇందులో వృద్ధాప్య పింఛన్లు 59,815, వితంతు పింఛన్లు 58,632, వికలాంగులు –21,788, చేనేత కార్మికులు –133, గీతకార్మికులు 428, బీడి కార్మికులు –170, ఒంటరి మహిళల పింఛన్లు–5,860 ఉన్నాయి.

ముగిసిన సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామిసేవలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సప్తదశ(17వ) వార్షిక బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరిరోజు దేవస్థానంలో అర్చకులు మహాపూర్ణాహుతి, శతఘటాభిషేకం, అలంకకరణ, పంచహారతులు, చక్రస్నానం, స్వామివారి పల్లకీసేవ, సుదర్శనారసింహ్మా హోమం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నేత నక్కా ప్రభాకర్‌గౌడ్ తదితరులు చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని చివరిరోజు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌లకు దేవాలయ అర్చకులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు మహాప్రసాదాన్ని అందజేయగా, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇందిర, కాంగ్రెస్ నేతలు కోల కృష్ణాయాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, బెలిదే రమేష్ గుప్తా, కందాడి శివరాంరెడ్డి, జంగయ్యయాదవ్, ధర్మేందర్, హరిబాబు, లక్ష్మీనారాయణ, హనుమంత్‌రెడ్డి, జయరాం, అఖిలాష్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో ఆరోగ్య రంగంలో భారీ మార్పులు



ది రోబోటిక్ ఎడ్జ్–2025 కాన్ఫరెన్స్‌లో వైద్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేర్ హాస్పటల్ ఆధ్వర్యంలో 'ది రోబోటిక్ ఎడ్జ్–2025'పేరిట నగరంలోని మారియట్ హోటల్‌లో ఆదివారం క్లినికల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వైద్య నిపుణులు, ఆరోగ్య రంగ ప్రముఖులు, టెక్నాలజీ నిపుణులు హాజరయ్యారు. ఈ సదస్సులో రోబోటిక్ శస్త్ర చికిత్స పద్ధతులను ప్రత్యక్షంగా చూపించారు. నిపుణులు వివిధ విభాగాల్లో రోబోటిక్స్ ఉపయోగాన్ని వివరించారు. కృత్రిమ మేధస్సు వల్ల ఆరోగ్య రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌ఖన్నా, గౌరవ అతిథులుగా ప్రముఖ నటి ప్రియాంక జువాల్కర్, ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరితోపాటు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ రమేష్‌బాబు, గ్రూప్ సీఎఫ్ఓ విశాల్ మహేశ్వరి, సీఐఓ వినోద్ రామన్, కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథూర్, జోనల్ సీఓఓ బిజునాయర్, జోనల్ ఏవీపీ అండ్ మెడికల్ హెడ్ అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ వేదికగా జరిగిన పలు సెషన్లలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, కేర్ వత్సల్య ఉమెన్ అండ్ చైల్డ్ ఇనిస్టిట్యూట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మంజుల అనగాని, యూరాలజీ హెచ్ఓడీ వంశీకృష్ణ, డాక్టర్ సతీష్ పవర్, డాక్టర్ వేణుగోపాల్ పరిక్, ఏఐ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ పద్మనాభుని పలు అంశాలపై ప్రసంగించారు.

వనజీవి రామయ్య అమరజీవి: విమలక్క



వనజీవి రామయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పంజగుట్ట: వనజీవి రామయ్య అమరజీవి అని, ఆయన చనిపోలేదని ప్రకృతి, పర్యావరణం ఉన్నంత వరకు బతికే ఉంటారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. తెలంగాణ కుమ్మర శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వనజీవి రామయ్య సంస్మరణ సభ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ వి.రవిశంకర్, గౌరవాధ్యక్షుడు కె.దశరథ్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావులతో కలిసి విమలక్క వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ కర్రిగుట్టలో పోలీసులు విపరీతంగా కూంబింగ్ చేస్తూ ప్రతిరోజు 40 నుంచి 50 మంది అమాయకులను చంపేస్తున్నారని, శాంతి చర్చలు జరపాలన్నా విజ్ఞప్తిని పట్టించుకోవడంలేదన్నారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ వి.రవిశంకర్, గౌరవాధ్యక్షులు కె.దశరథ్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, కె.శ్యామ్ కుమార్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ కోటి మొక్కలకుపైగా నాటిన వనజీవి రామయ్యకు భారతరత్న ప్రకటించాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, ఖమ్మం జిల్లాలో ఒక విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలని, ఆయన కుటుంబంలో ఒకరికి నామినేటెడ్ పదవి ఇవ్వాలని, ఆయన జీవితచరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.చంద్రశేఖర్, భద్ర, బాలామణి, శివాని తదితరులు పాల్గొన్నారు.

మేధోసంపత్తిని భావితరాలకు అందించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మేడ్చల్: పురాణాలు, ఇతిహాసాలలో ఉన్న మేధో సంపత్తిని భవిష్యత్ తరాలకు అందించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతా పఠనం వేసవి శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ మానవతా విలువలు, నైతిక విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. మనిషిని మనిషిగా జీవింపచేసే విలువలు, సనాతన ధర్మాలు పురాణాలు, ఇతిహాసాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. గీతా పఠనం కోసం ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ కమ్యూనికేషన్స్ చైర్మన్ యుధిష్టర్ గోవింద ప్రభు, డీఆర్ఎస్ స్కూల్ గ్రూపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంజనీకుమార్ అగర్వాల్, ఇస్కాన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు మహశృంగ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాకపోతే మన సంస్కృతిని తెలుసుకోలేం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట: తెలుగు భాష రాకపోతే మన చరిత్ర, సంస్కృతిని తెలుసుకోలేమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. అధికార భాషా సంఘానికి ఒక యోగ్యుడైన వ్యక్తిని నియమించాలని, తెలుగు అకాడమీలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు భాష పరిరక్షణ ఐక్య కార్యాచరణ సమితి(టీబీపీజేఏసీ) ఆధ్వర్యంలో ఇంటర్ విద్యలో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశపెట్టాలనే కేంద్రం ప్రతిపాదనను నిరసిస్తూ 'మన భాష–మన హక్కు'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జేఏసీ బాధ్యులు ప్రొఫెసర్ సి.కాశీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు ఇంటర్ బోర్డునే శాసించే స్థాయికి ఎదిగాయని అన్నారు. కవి, రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ హిందీ, సంస్కృతం నుంచి తెలుగు భాషకు ముప్పు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగులో సిలబస్ ఎంత ఉంటుందో సంస్కృతంలో కూడా అంతే ఉండేలా చూడాలని, తెలుగును తెలుగు లిపిలోనే, ఇంగ్లిష్‌ను ఇంగ్లిష్ లిపిలోనే రాస్తున్నట్లు సంస్కృతాన్ని కూడా అదే లిపిలో రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మన రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు సిలబస్ ఉండాలని జీవో ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాల్లో అన్ని అర్హత పరీక్షలతోపాటు తెలుగు పరీక్ష రాసి పాసైతేనే ఉద్యోగం ఇవ్వాలన్న నిబంధన కూడా ఉందని, దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు పులికొండ సుబ్బాచారి, ఆచార్య ఉమామహేశ్వరరావు, ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి, రచయితలు సంగిశెట్టి శ్రీనివాస్, కందుకూరి శ్రీరాములు, పసునూరి రవీందర్, అడ్లూరి మాలతి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు ఆదివారం నిర్వహించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం 1, 2లలోని ద్వారాలతోపాటు ప్లాట్‌ఫారాలపై ఉన్న ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. భద్రతా చర్యల్లో భాగంగానే స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎస్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు, ఎస్ఐలు ఎం.ధారాసింగ్, ఎస్‌వీ భాష,సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బంజారాహిల్స్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరింది. ఈ మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులు మద్దతు పలికారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు అవినాష్, ప్రధాన కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టే లోపు యూజీసీ పే స్కేల్(బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ, 3 శాతం ఇంక్రిమెంట్) ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం సలహాదారులు యాదగిరి, కోశాధికారి వై.కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకులు కోటేశ్వరరావు, పడాల లక్ష్మణ్, సునీల్‌కుమార్, నర్సయ్యభట్టు పాల్గొన్నారు.

రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు

చందానగర్ : తెలంగాణ రాష్ట్ర రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆల్విన్ క్రాస్ రోడ్డులోని హోటల్ అశోక గ్రాండ్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శేరిలింగంపల్లి మండలం నుంచి గాయం భీష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంషాబాద్ మండలం నుంచి వెంకటరమణ, కోశాధికారిగా గండిపేట్ మండలం నుంచి ఎంపీ రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్మా అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రామేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు యాదగిరి, శేరిలింగంపల్లి మండల అధ్యక్షుడు మారోజు ఆచార్య, ప్రధాన కార్యదర్శగా శ్రీనివాస్ శంకర్, కోశాధికారి రెహమాన్, ఇతర మండల డిస్ట్రిక్ట్ కౌన్సిల్ సభ్యులు, శేరిలింగంపల్లి స్కూల్స్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

'మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



'మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ విద్యావేత్త నర్ల సుధాకర్ శర్మ రచించిన 'మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు'అనే పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ మితవాద ఛాందస బ్రాహ్మణ కుటుంబం నుంచి సుధాకర్ శర్మ వచ్చి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఇంటికి పెద్దగా స్వార్థాన్ని పక్కన పెట్టి ఆదర్శంగా జీవిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ఎ.రాజేంద్ర బాబు, రాఘవాచారి, ప్రొఫెసర్ శ్రీనాథ్, కుటుంబ సభ్యులు సులోచన, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించాలి

క్రైస్తవ సంఘాల ప్రతినిధుల డిమాండ్



ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

కవాడిగూడ: క్రైస్తవ మత ప్రచారకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతదేహానికి సమగ్రమైన రీ పోస్టుమార్టం నిర్వహించాలని ద నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్, గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్ అధ్యక్షుడు సీపీ డేనియల్ ఆడమ్స్, డేవిడ్ శాంతరాజ్ ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. సీపీ డేనియల్ ఆడమ్స్, డేవిడ్ శాంతరాజ్ మాట్లాడుతూ తాగుబోతు అనేవిధంగా ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలోని టీడీపీ కూటమి ప్రభుత్వం సమగ్రమైన రీపోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీవీ చానళ్లలో మతపరమైన చర్చలను నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నేతలు జెరూసలేం మత్తయ్య స్వామి దాస్, పోచన్న సాల్మన్ రాజ్ డేనియల్, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'గాజులు కొనని రోజులు' పుస్తకావిష్కరణ



'గాజులు కొనని రోజులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాశీం తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత కేపీ లక్ష్మీనరసింహ రచించిన 'గాజులు కొనని రోజులు'కథా సంపుటిని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హృదయాన్ని తట్టేవిధంగా, రుచికరంగా కవిత్వం ఉండాలన్నారు. సారవంతంగా, నిర్మాణాత్మకంగా రచన ఉండాలని సూచించారు. అలాంటి సాహిత్యం 'గాజులు కొనని రోజులు'పుస్తకంలో ఉందన్నారు. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి కొల్లాపురం విమల, రచయితలు అనంతోజు మోహన కృష్ణ, బెక్కం జనార్దన్, వెల్దండి శ్రీధర్, పొన్నగంటి ప్రభాకర్, డాక్టర్ సిద్ధంకి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



మాట్లాడుతున్న రఘునందన్ రావు

నాంపల్లి: భాగ్యనగరానికి విచ్చేసిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఆధ్వర్యంలో కార్యక్రమ కన్వీనర్ జి.అంబేడ్కర్ అధ్యక్షతన 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంవిధాన్ గౌరవ అభియాన్'అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రఘునందన్ రావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ స్పీకర్ అనుమతి ఇచ్చినంత సేపు మాట్లాడి, ఆ తర్వాత విదేశాలకు వెళ్లి పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతు నొక్కేసినట్లు తప్పుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, బీజేపీ నేతలు ప్రదీప్, రాములు, కొప్పు భాష పాల్గొన్నారు.

30 లోగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ

లక్డీకాపూల్: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇంకా దరఖాస్తులను సమర్పించని వారు అవసరమైన పత్రాలతో ఈ నెల 30వ తేదీలోగా హైదరాబాద్ జిల్లాలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు డాక్టర్ రమేష్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ ద్వారా నిరుద్యోగ యువతకు కోసం తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం కింద ఆర్థిక సహాయం కోసం హైదరాబాద్ జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 1,28,763 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. వీరిలో 50 వేల మంది మాత్రమే జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులను అందించారని పేర్కొన్నారు.

వలసదారులపై చర్యలు తీసుకోవాలి

చర్చనీయాంశమైన 'సాక్షి' కథనం

పహాడీషరీఫ్: విదేశీ వలసదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. మయన్మార్ నుంచి శరణార్థుల ముసుగులో వలస వచ్చి బాలాపూర్ పరిసరాల్లో రోహింగ్యా ముస్లింలు తిష్టవేసి, అక్రమంగా భారత గుర్తింపు కార్డులు పొందుతున్న వైనంపై 'సాక్షి'లో 'అక్రమంగా ఆరువేల మంది!'శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. సాక్షి కథనాన్ని ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూప్‌లతోపాటు నెటిజన్లు తమ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు. పాకిస్థానీయులను పంపిస్తున్న మాదిరిగానే వీరిని కూడా పంపించాలని సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల్లో వీసా లేకుంటే రానివ్వరని, అలాంటిది మనదేశంలోకి అడ్డదారిలో వచ్చి అక్రమంగా గుర్తింపు కార్డులు పొందడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

మేడ్చల్: మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడింది. జాతీయ రహదారిపై ఔటర్ రింగు రోడ్డు సమీపంలోని ఆక్సిజన్ పార్క్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. పనస పండ్ల లోడుతో వెళుతున్న మిని ట్రక్కును నిలిపి తనిఖీ చేయగా పండ్ల మధ్యలో 400 కిలోలకుపైగా గంజాయి లభించింది. పోలీసులు గంజాయిని సీజ్ చేసి ట్రక్కుతోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం నుంచి గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిసింది. పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ పోలీసులను సంప్రదించగా వివరాలు తెలపడానికి సుముఖత చూపలేదు. పట్టుబడ్డ గంజాయి విలువ కోటి రూపాయల మేర ఉంటుందని అంచనా.

స్నేహితుడిని తలచుకొని మంత్రి రాజనర్సింహ భావోద్వేగం

అమెరికాలో మృతి చెందిన ఓయూ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థికి నివాళి



మనోహర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వవిద్యార్థి మనోహర్‌రావు అనారోగ్యంతో గత నెల 26న అమెరికాలో మృతి చెందారు. ఆదివారం కాలేజీ అసెంబ్లీ హాలులో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ విచ్చేసి మనోహర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తనకు మనోహర్‌తో గల స్నేహబంధాన్ని గుర్తు చేసుకొని మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 1978–83 (విద్యా సంవత్సరానికిగాను) బ్యాచ్‌లో తనకు అత్యంత ఆత్మీయులైన మనోహర్‌రావు, కల్నల్ బాల, కుటుంబరావు, అర్జున్‌ల స్నేహం కాలేజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తమ స్నేహం ప్రతి బ్యాచ్‌కి ఆదర్శంగా నిలిచిందన్నారు. గత నెలలో కేన్సర్ వ్యాధితో మృతి చెందిన మనోహర్‌రావు చివరిరోజుల్లో తనను కలుసుకునేందుకు వెతుకుంటూ అమెరికా నుంచి హైదరాబాద్‌కు విచ్చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. మనోహర్‌రావుతో 50 ఏళ్ల సుదీర్ఘ స్నేహాన్ని, అనుబంధాన్ని గుర్తు చేసుకొని మంత్రి రాజనర్సింహ కంటతడి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, ప్రొ.మల్లేశం, ప్రొ.గోపాల్‌నాయక్, డాక్టర్ రమణనాయక్, పూర్వవిద్యార్థి అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 28, ఏప్రిల్, 2025



సాహసం చేద్దాం బ్రదర్

వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్న యువత

అడ్వెంచర్స్‌కి ప్రాధాన్యతనిస్తున్న నగర వాసులు

నగర పరిసరాల్లోని ప్రాంతాలపై అన్వేషణ

వినోదం, విహారంతో సాహసానికే మొదటి ఓటు	అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో శిక్షణకు పలువురి ఆసక్తి	సిటీకి 30కి.మీ నుంచి 200కి.మీ పరిధిలో స్పాట్స్

వేసవి సెలవులను ఎంజాయ్ చేయడంలో ఇప్పుడు అడ్వెంచర్స్ కూడా భాగమవుతున్నాయి. గతంలో ఈ తరహా సాహస వినోదాల కోసం విహార యాత్రలకు వెళ్లినప్పుడు మాత్రమే అవకాశం ఉండేది. ఇప్పుడు నగరం నుంచి కేవలం 30కి.మీ నుంచి 200 కి.మీ పరిధిలోనే పలు రకాల అడ్వెంచర్ స్పాట్స్ సాహసికులను, ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నాయి. వీకెండ్‌లో కాసింత ఉత్కంఠ, మరి కాసింత ఉద్వేగవంతమైన అనుభూతిని పొందేందుకు వినోదాన్ని మేళవించిన అనుభవాలను పొందాలనుకుంటే.. కచ్చితంగా ఇలాంటి వారి కోసమే అన్నట్లు పలు స్పాట్స్ ఆహ్వానిస్తున్నాయి. అయితే ఈ సాహసాలు ఏవైనా అవగాహన పెంచుకుని, ముందస్తు శిక్షణ తీసుకున్న అనంతరమే ప్రయత్నించాలంటున్నారు నిపుణులు.

- సాక్షి, సిటీబ్యూరో

మన దేశంలో తొలిదశలో ఉన్న సాహసికులను ఆకర్షించేది అడ్వెంచర్ పారా గ్లైడింగ్ దాదాపు 4 దశాబ్దాల క్రితమే మొదలైనప్పటికీ.. గత ఐదారేళ్లుగా ఈ క్రీడా వినోదానికి బాగా ఆదరణ పెరిగింది. వందల/వేల అడుగుల ఎత్తు నుంచి కిందకు చూస్తూ ఓ గ్లైడర్/ కనోపి సాయంతో గాల్లో ఎగరడం ఒక అద్భుతమైన అనుభూతి. దీనిని ఎంజాయ్ చేయాలంటే.. నగరం నుంచి ఓ 50 కి.మీ ప్రయాణించాలి. షామీర్‌పేట్, తుర్కపల్లి దగ్గర ఉన్న కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ పరిసరాల్లో ఈ అడ్వెంచర్ యాక్టివిటీ నిర్వహిస్తున్నారు.



కయాకింగ్..

హైలెస్సో.. హైలెస్సా అంటూ నదిలో బోట్లు నడిపే కయాకింగ్ సాహసాలందు ఓ గొప్ప అనుభూతిని పంచుతుందంటున్నారు సాహసికులు. నీళ్లలో పడవను స్వయంగా నడుపుకుంటూ వైవిధ్యభరిత అనుభూతిని అందుకోవాలనుకునే వారిని.. సుమారు 100 కి.మీ.దూరంలోని వికారాబాద్ జిల్లాలో ఉన్న కోటిపల్లి రిజర్వాయర్ ఆహ్వానిస్తోంది. నీళ్లలో పడవల యానం.. మొదటిసారిగా ప్రయత్నిస్తున్నవారికి కూడా అనుకూలంగా ఉంటుంది. అనుభవజ్ఞులైన వారికి మరింత ఆస్వాదించదగిన అనుభవం.

గుహల అన్వేషణ..

హిమాలయాల కంటే పాతవైన ఈ పర్వత సమూహాల్లో గుహల అన్వేషణకు పాండవుల గుట్ట ప్రత్యేక చిరునామా. అక్కడ జంతువులు, పురాతన చిహ్నాలతో కూడిన ప్యాలియోలిథిక్ రాక్ పెయింటింగ్స్ కనిపిస్తాయి. నగరం నుంచి సుమారు 195 కిమీ దూరంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న ఈ గుట్టలో గుహలను శోధించడం.. ఓ సాహసం మాత్రమే కాదు చరిత్రను గుర్తుచేసుకోవడం కూడా. దీనిని సాహసాలను ఇష్టపడేవారి వారాంతపు వినోదానికి సరైన ఎంపిక అనవచ్చు.





బంగీ జంపింగ్..

ఇప్పటికే చాలా సినిమాల్లోనూ, బయటా స్టార్స్ చేయగా చూసి ఉంటారు. అలాంటి బంగీ జంపింగ్ నగరవాసులకు కూడా చేరువలోకి తెచ్చింది లియోనియా రిసార్ట్. నగరం నుంచి 30 కి.మీ దూరంలో ఉన్న ఈ రిసార్ట్‌కు వెళితే ఈసాహసాన్ని ఆస్వాదించవచ్చు.




డర్ట్ బైక్.. ఏటీవీ రైడ్స్..

ఆఫ్–రోడ్ థ్రిల్ కోరుకునే వారికి నగరం నుంచి 85 కి.మీ దూరంలో ఉన్న అనంతగిరి హిల్స్ సరైన అడ్రెస్ అని చెప్పాలి. అక్కడ అడ్వెంచర్ చేయడానికి డర్ట్ బైకులు మాత్రమే కాదు ఏటీవీ రైడ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. కొండలు, చెట్లు రాళ్ల రప్పల నడుమ ప్రత్యేకంగా రూపుదిద్దిన రేసింగ్ ట్రాక్‌పై చేసే డర్ట్ బైక్స్, ఏటీవీ రైడ్స్ సాహసికులకు థ్రిల్‌ని అందిస్తాయి.



ర్యాపెలింగ్..

ఓ కొండపై నుంచి మరో కొండకు తాళ్ల సాయంతో చేసే రాప్పెలింగ్.. కాసింత శిక్షణ తీసుకున్నవారికి సూచించదగ్గ సాహసం. రాక్ క్లైంబింగ్ అలవాటున్న వారికి ఇది కొంచెం సులభంగా అనిపిస్తుంది. నగరం నుంచి 105 కి.మీ దూరంలో ఉన్న భువనగిరి కోట దీనికి అనువుగా ఉంటుంది. సాహసికుల బృందాలతో కలిసి నిపుణుల ఆధ్వర్యంలో చేయడం మంచిది.



రాక్ క్లైంబింగ్..

తెలంగాణలో అనేక కొండలు, గుట్టలు రాక్ క్లైంబింగ్‌కు ప్రసిద్ధి చెందాయి. అయితే భువనగిరి కోట ప్రత్యేక శైలి నిర్మాణం రాక్ క్లైంబింగ్ సాహసానికి చారిత్రాత్మక ఆకర్షణను అందిస్తుంది. ఇది నగరం నుంచి దాదాపు 105 కిమీ దూరంలో ఉంది.

జిప్ లైనింగ్..

నగరం నుంచి 35 కి.మీ దూరంలో ఉన్న ఘట్కేసర్ దగ్గరలోని పెబుల్ బీచ్ అడ్వెంచర్ క్లబ్‌లో జిప్ లైనింగ్ ట్రిప్‌లు ఉన్నాయి. వీటిని పిల్లలకూ, పెద్దలకూ సరిపోయేలా రూపుదిద్దారు. ఇంకా నగరం చుట్టు పక్కల బ్యాలెన్స్‌వాక్, ఫారెస్ట్ క్యాంపింగ్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్.. లతో పాటు మరిన్న వైవిధ్యభరిత సాహస వినోదాలు అందుబాటులో ఉన్నాయి. తగినన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వీటిని ఎంజాయ్ చేస్తే చక్కని సమ్మర్ అనుభూతిని అందుకోవచ్చు.



స్కై సైక్లింగ్..

ఓ వీకెండ్‌ను వైవిధ్యభరితంగా, ఉద్విగ్నంగా గడపాలంటే స్కై సైక్లింగ్ మరో మంచి ఎంపిక. ఇది నగరం నుంచి 105కి.మీ దూరంలో ఉన్న సిద్ధిపేట జిల్లాలోని కోమటి చెరువు దగ్గర అందుబాటులో ఉంది. ఈ స్కై సైక్లింగ్ చేస్తూ ఆ చెరువు అందాలను, పరిసర ప్రదేశాల్లో అందమైన దృశ్యాలను ఆస్వాదించవచ్చు.

‘సృష్టి’లో మెటీరియల్ స్టోరీస్





బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని సృష్టి ఆర్ట్ గ్యాలరీలో ‘మెటీరియల్ స్టోరీస్’ పేరిట సృజనాత్మకతకు అద్దంపట్టేలా 16 మంది ఆధునిక కళాకారులు రూపొందించిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. టెర్రాకోట, కలప, దారం, లోహం వంటి మెటీరియల్స్‌తో వినియోగించి వివిధ ఆకృతులతో రూపొందించిన వస్తువులు, పెయింటింగ్స్, కళాఖండాలు సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. ఈ ప్రదర్శన నెల రోజుల పాటు కొనసాగనుంది.

సాహిత్య వెల్లువతో వరల్డ్ తెలుగు కన్సార్టియమ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ తెలుగు సమితి ఆధ్వర్యంలో 4వ అంతర్జాతీయ అంతర్జాల వరల్డ్ తెలుగు కన్సార్టియమ్ సమావేశం శని, ఆదివారాల్లో నిర్విరామంగా కొనసాగింది. ఇందులో భాగంగా సాహిత్యంలో మన సంస్కృతి, సప్త వర్ణ విలువలు, సాహిత్యంలో భక్తి–జీవాధార కౌశల్యం అనే అంశాలపై భారత్‌తో పాటు అమెరికా, ఖతార్, బోత్సువానా, ఆస్ట్రేలియా, జపాన్ వంటి దేశాల నుంచి పలువురు ప్రముఖులు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా.. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు, సమితి ముఖ్య సలహాదారులు వంగూరి చిట్టెన్ రాజు.. కవి, కవిత్వం, కథ, కథత్వం, వ్యక్తిత్వం, తత్వం ప్రాముఖ్యతలను తెలియజేశారు. ముఖ్య అతిథి శారదాపూర్ణ శొంఠి.. వాల్మీకి, కంబ రామాయణాల గురించి, సనాతన, సనూతన ధర్మాలు, లౌకిక మనోధర్మం, సారస్వత మనోధర్మం వంటి అంశాలను వివరించారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ అధినేత, ప్రపంచ తెలుగు సమితి ఫౌండర్, వంశీ రామరాజు సాహిత్యం వల్ల వృత్తిలో కలిగే అభివృద్ధి, విద్యార్థులు సాహిత్య సభలలో పాల్గొనుట వంటి వినూత్న విశేషాల గురించి పేర్కొన్నారు. దేవులపల్లి ఫౌండేషన్ అధినేత, ప్రపంచ తెలుగు సమితి ఫౌండర్ లలిత రామ్ తెలుగు సాహిత్య చరిత్రలోని మహామహులకు నమస్సుమాంజలి అర్పించారు. మన సంస్కృతికి, భక్తి తత్వానికీ అంతర్జాతీయంగా లభించిన గౌరవాభిమానాల గురించి వివరించారు. నేటి యువత తెలుగు, ప్రపంచ సాహిత్యం చదవటం అలవర్చుకొని అందరికీ స్ఫూర్తినివ్వాలని కోరారు. ఈ అంతర్జాతీయ వర్చువల్ కార్యక్రమాల్లో విశ్లేషకులు రాధిక మంగిపూడి, శ్రీహవిష కాపర్తి, షామీర్ జానకీ దేవి పాల్గొన్నారు.

ఎడ్యు ఫెయిర్–2025కు విశేష స్పందన

హాజరైన యూనివర్సిటీ ఆఫ్ యూరప్, ఫోమ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, కన్‌స్ట్రక్టర్ యూనివర్సిటీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన జర్మనీ అండ్ యుకె ఎడ్యు ఫెయిర్ 2025లో ఔత్సాహిక విద్యార్థులు, విద్యా ప్రముఖులు పాల్గొన్నారు. యాథపు కన్సల్టింగ్ ఆధ్వర్యంలోని ఐ20–ఫీవర్ ఈ ఎడ్యు ఫెయిర్‌లో విద్యావకాశాలను అన్వేషిస్తూ 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 20కి పైగా ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు అక్కడి కోర్సులు, కెరీర్ అవకాశాలు, స్కాలర్‌షిప్స్, విశ్వవిద్యాలయ ప్రవేశాలపై సమాచారాన్ని అందించారు. ఈ సందర్భంగా కన్‌స్ట్రక్టర్ విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ స్పెషలిస్ట్ ఓట్మనే టాజీ నిర్వహించిన ‘లైఫ్ ఇన్ జర్మనీ’ అనే సెషన్ విశేషంగా ఆకట్టుకుంది. వసతి, పార్ట్–టైమ్ వర్క్, సాంస్కృతిక అనుసరణ, ఆరోగ్య సంరక్షణ, పోస్ట్–స్టడీ వంటి ఎంపికలపై ఆచరణాత్మక సూచనలను అందించారు. ఈ ఎడ్యు ఫెయిర్ సందర్భంగా ఐ20–ఫీవర్ వ్యవస్థాపకులు నవీన్ యాథపు మాట్లాడుతూ.. విద్యార్థులను అంతర్జాతీయంగా గొప్ప విశ్వవిద్యాలయాలకు అనుసంధానించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఫెయిర్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూరప్, ఫోమ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, హెరియోట్–వాట్ యూనివర్సిటీ, బర్మింగ్‌హామ్ సిటీ యూనివర్సిటీ, ఎడిన్‌బర్గ్ నేపియర్ యూనివర్సిటీ వంటి సంస్థలు ఉన్నాయి. ఇందులో ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ వంటి ఇంగ్లిష్ ప్రావీణ్య పరీక్షలకు ఉచిత శిక్షణను అందించింది.

పేరెంట్ పెట్ ఫుడ్ విడుదల

యాప్ ద్వారా పెంపుడు జంతువులుకు వసతులు

మాదాపూర్ : పెంపుడు జంతువుల జీవితంలో వివిధ దశల్లో తగిన పోషకాహారాన్ని అందించే ఉత్పత్తులను కనుగొనడంలో జంతు ప్రేమికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు న్యూట్రిషన్ ఎస్ఎక్స్‌టీ వ్యవస్థాపకుడు ప్రహర్ష చెరుకూరి తెలిపారు. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో పేరెంట్ పెట్ ఫుడ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం పేరెంట్ పెట్ ఫుడ్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ ఎస్ఎక్స్‌టీ వ్యవస్థాపకుడు ప్రహర్ష, సహ వ్యవస్థాపకుడు వెంకట ధర్మేంద్ర బొప్పన మాట్లాడారు. పేరెంట్ 360, ప్రోవెట్ డిజిటల్ అప్లికేషన్‌లతో పెంపుడు జంతువుల సంరక్షణ తెలుస్తుందన్నారు. దీనిద్వారా పెంపుడు జంతువులకు నిర్దిష్ట పోషకాహారం, శరీరస్థితి, విశ్లేషణ సాధనాలు, ఆరోగ్యం, టీకా రికార్డులు, షెడ్యూలర్లు, టాక్టివిటీ ట్రాకర్లు, వీడియోకాల్ ద్వారా వెటర్నరీ డాక్టర్లను కలవడం, హోమ్, క్లినిక్ సందర్శనలు వంటి సౌకర్యాలను పొందవచ్చన్నారు. ఇది పశువైద్య నైపుణ్యంలో బలమైన పునాది వేసి, పెంపుడు జంతువుల జీతాలను మెరుగుపరుస్తుందన్నారు. 2026 నాటికి 10 మిలియన్ యూఎస్‌డీ (సుమారు రూ.84 కోట్లు) పెట్టుబడులతో సంవత్సరానికి 40,000 టన్నుల పెంపుడు జంతువుల ఆహారాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు.





వావ్.. వాంగార్డ్..



సాక్షి, సిటీబ్యూరో: సర్వకాల సర్వావస్థల్లోనూ ధరించేందుకు, ఫ్యాషన్‌కు చిరునామాగా కనిపించేందుకు వీలైన వైవిధ్యభరిత డిజైన్లను రూపుదిద్దిన యువ డిజైనర్ల సృజనాత్మక ప్రతిభ వేదికపై మెరుపులు మెరిపించింది. నగరానికి చెందిన వాక్సెన్ యూనివర్శిటీ మాదాపూర్‌లోని టీ వర్క్స్‌లో ఆదివారం నిర్వహించిన ‘డిజైన్ వాంగార్డ్–2025’ కార్యక్రమం, ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు తమ క్రియేటివ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు సమర్పించిన వైవిధ్యభరిత ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సస్టెయినబులిటీ, వేరబుల్ ఇన్నోవేషన్ తదితర కాన్సెప్ట్స్‌తో రూపొందించిన డిజైన్లు అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలోని 3 డీ ప్రింటెడ్ దుస్తులు, స్మార్ట్ వర్క్ వేర్, సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్, మొబిలిటీ సొల్యూషన్స్, ఇంటరాక్టివ్ వీ ఆర్ గేమ్స్.. విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు. తమ విద్యార్థుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసేందుకే ఈ వేదిక ఏర్పాటు చేశామని ‘వర్సిటీ’ డీన్ డా.అదితి సక్సేనా తెలిపారు.

క్రియేటర్ల వేదిక డిజైన్ థాన్..

నగరంలో మొదటి సారి నిర్వహణ

పాల్గొన్న యుఐ/యూఎక్స్ డిజైన్ ఔత్సాహికులు, గ్రాఫిక్ డిజైనర్లు, క్రియేటర్లు



సాక్షి, సిటీబ్యూరో : డిజైనింగ్ రంగానికి చెందిన ఔత్సాహికులు, డిజైనర్లు, క్రియేటర్లు నగర వేదికగా నిర్వహించిన డిజైన్ థాన్‌లో పాల్గొని సందడి చేశారు. నగరంలో ఐటీ రంగమే కాదు డిజైనింగ్ వంటి అధునాతన క్రియేటివ్ రంగాల్లో కూడా అద్భుత భవిష్యత్ ఉందని నిరూపించారు. వరల్డ్ డిజైన్ డే నేపథ్యంలో కోర్స్ వీట ఆధ్వర్యంలో నగరంలోని డిజైనర్స్, క్రియేటర్స్ కోసం ప్రత్యేకంగా ‘డిజైన్ థాన్’ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడలోని కోకర్మ వేదికగా నగరంలో మొదటిసారి జరిగిన ఈ 12–గంటల ఈవెంట్‌లో యుఐ/యూఎక్స్ డిజైన్ ఔత్సాహికులు, గ్రాఫిక్ డిజైనర్లు, క్రియేటర్లు, ఎడిటర్లు విభిన్న క్రియేటివ్ ఛాలెంజ్‌లలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కోర్స్ వీట పోర్ట్ ఫోలియో బిల్డర్, జాబ్ సిమ్యులేషన్, క్విజ్‌వీటా లాంటి సరికొత్త టెక్నాలజీలను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా నూతన టెక్నాలజీ ఆవిష్కరణల ద్వారా విద్యార్థి నుంచి ఉద్యోగిగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలు పొందేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోర్స్ వీట వ్యవస్థాపకుడు అర్జున్ వినయ్ మాట్లాడారు. హైదరాబాద్‌లో అతిపెద్ద డిజైన్ పోటీకి తాము ఆతిథ్యమివ్వడం గర్వంగా ఉందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రధానంగా ఐటీ రంగం వైపే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది డిజైనర్లను, క్రియేటర్లను ఒకే వేదిక పైకి తీసుకొచ్చామని తెలిపారు. ఏఐ అభివృద్ధితో కొత్త కొత్త సాంకేతిక ఒరవడులతో ఉద్యోగావకాశాలు మారుతూ ఉన్నాయని, నగరంలో డిజైన్, సృజనాత్మక రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ఆసక్తి ఉన్నవాళ్లకు ఇది ఒక గొప్ప వేదికగా నిలవబోతుందని పేర్కొన్నారు.




వైబ్ కోడింగ్ టూర్ ప్రారంభం..

డిజైన్, క్రియేటివ్ రంగ ఔత్సాహులకు కొత్త అవకాశాలను అందించడమే లక్ష్యంగా శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంలో కోర్స్ వీట ఆధ్వర్యంలో ‘వైబ్ కోడింగ్ టూర్’ ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ నైపుణ్యాలను ప్రోత్సహించడానికి ఆవిష్కరించిన వినూత్న కార్యక్రమం ఇది. ఈ డిజైన్ థాన్‌లో 400 మంది విద్యార్థులు, డిజైనర్లు, కంటెంట్ క్రియేటర్లు పాల్గొన్నారు. ఛాలెంజ్ విజేతలకు 50 వేల నగదు బహుమతులు అందించారు.

60+ సాహస యాత్ర!

అరవైల్లో పడ్డాక ఇక జీవితం అయిపోయిందనే రోజులు పోయాయ్! అమ్మమ్మలు.. తాతయ్యలు కూడా ఇప్పుడు అంటార్కిటికా నుంచి అగ్నిపర్వతాల దాకా... యూరప్ నుంచి జపాన్ దాకా.. ప్రపంచాన్ని చుట్టేసేందుకు సై అంటున్నారు. అంతేకాదు స్కైడైవింగ్ మొదలు స్కీయింగ్.. శాండ్ సర్ఫింగ్.. ఎలాంటి సాహసాలకైనా తగ్గేదేలే అంటున్నారు. అడ్వెంచర్ టూర్ల విషయంలో యువతతో పోటీ పడుతుండటంతో బేబీ బూమర్స్ (1946 నుంచి 1964 మధ్య పుట్టిన వారు) పర్యాటకం ఇప్పుడు ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



జీవితాన్ని ఎంజాయ్ చేయడానికి వయసుతో పనేముందని నిరూపిస్తున్నారు బేబీ బూమర్స్. కుటుంబ బాధ్యతలతో తాము కోరుకున్న ఆనందాలను దూరం చేసుకున్న వారెందరో ఉంటారు. అయితే, అరవైల్లో మళ్లీ నలభై వచ్చింది.. అంటూ ప్రపంచ పర్యటనలకు సైతం సిద్ధమైపోతున్న వారు ఇటీవల బాగా పెరుగుతున్నారు. దీంతో ట్రావెల్ పరిశ్రమ కూడా ప్రత్యేక ప్యాకేజీలతో మరింత ప్రోత్సహిస్తోంది. సెగ్జాజెనేరియన్స్ (60–69 ఏళ్ల వయసు), సెప్టువాజెనేరియన్స్ (70–79 ఏళ్ల వయసు) ఆక్టాజెనేరియన్స్ (80–89 ఏళ్ల వయసు) ఇలా అన్ని వయసుల వారికీ ట్రావెల్ కంపెనీలు అనువైన ప్యాకేజీలను అందిస్తున్నాయి.

అంటార్కిటికా నుంచి అగ్నిపర్వతాల దాకా... ▸ ప్రపంచాన్ని చుట్టేస్తున్న సీనియర్ సిటిజన్స్ | అడ్వెంచర్ యాక్టివిటీలకూ సై... ▸ ప్రత్యేక సదుపాయాలు, డిస్కౌంట్లతో ప్రోత్సహిస్తున్న ట్రావెల్ సంస్థలు

ఏ సాహసానికైనా రెడీ

కేవలం ప్రపంచ యాత్రలే కాదు అడ్వెంచర్ ట్రావెల్‌కు కూడా బేబీ బూమర్స్ ఎగిరి గంతేస్తున్నారు. బుకింగ్స్ డాట్ కామ్ 'ట్రావెల్ ప్రిడిక్షన్స్–2025' సర్వే ప్రకారం అత్యంత సాహసంతో కూడిన యాక్టివిటీలకు మొగ్గు చూపుతున్న బేబీ బూమర్స్ 30 శాతానికి ఎగబాకారు. 2024లో ఈ సంఖ్య 11 శాతం మాత్రమే. వయసు గురించి ఆలోచించకుండా ప్రతి నలుగురు బేబీ బూమర్స్‌లో ఒకరు ఇలాంటి అడ్వెంచర్లంటే మక్కువ చూపుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.

ప్రత్యేక డిస్కౌంట్లు

సీనియర్ సిటిజన్స్ విదేశీ పర్యటన బుకింగ్స్‌లో ఏటా 20 శాతం వృద్ధి నమోదవుతున్నట్లు ట్రావెల్ పోర్టల్ ఈజ్‌మైట్రిప్ సీఈఓ రికాంత్ పిట్టీ పేర్కొన్నారు. 2021తో పోలిస్తే బుకింగ్స్ ఏకంగా మూడు రెట్లు పెరిగాయన్నారు. కాగా, 60 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేక డిస్కౌంట్లనూ ఈ సంస్థ అందిస్తోంది. రిలాక్స్ అయ్యేందుకు కేరళ బ్యాక్ వాటర్స్, గోవా బీచ్‌లను ఎంచుకుంటున్నారు. ఇక ప్రకృతిలో సేద తీరేందుకు ఈశాన్య భారతాన్ని ఎక్కువగా చుట్టేస్తున్నారు.

చలో అంటార్కిటికా...

ఉత్తర ధ్రువం వద్ద నార్తర్న్ లైట్స్, అంటార్కిటికా క్రూజ్ యాత్రలకూ ఇటీవల ఆసక్తి పెరిగిందని సీనియర్ సిటిజన్స్ ట్రావెల్ స్పెషలిస్ట్ సంస్థ 'కరేవాయేజ్' పేర్కొంది. సంప్రదాయేతర, సాహసోపేతమైన గమ్యస్థానాలకు మొగ్గు చూపేవారు 2021తో పోలిస్తే 2024లో మూడింతలు పెరిగారని చెప్పింది. ఏటా 10వేల మందికి పైగా డిమాండ్ ఉన్నప్పటికీ, మంచి పర్యాటక అనుభూతిని అందించే లక్ష్యంతో తాము అంతకు మించి బుకింగ్స్ అనుమతించడం లేదని కంపెనీ ఫౌండర్ షెఫాలీ జైన్ మిశ్రా తెలిపారు. గతేడాది ఈ సంస్థ 10 మంది సీనియర్ సిటిజన్స్ బృందంతో 10 రోజుల అంటార్కిటికా ట్రిప్ నిర్వహించింది. జపాన్ చెర్రీ బ్లోసమ్స్, ఫిన్లాండ్ వింటర్ ల్యాండ్‌స్కేప్స్, నార్వే నార్తర్న్ లైట్స్, ఐస్‌లాండ్స్ క్రూజ్ యాత్రలు, యూరప్ రివర్ సెయిలింగ్స్ వంటి ప్రత్యేక టూర్లనూ ఈ సంస్థ అందిస్తోంది.

ఆర్థికంగా స్థిరపడటం ప్లస్

ఖర్చులన్నీ పోను అదనంగా వెచ్చించగలిగే ఆదాయం దండిగా ఉండటం, కుటుంబ బాధ్యతలన్నీ తీరిపోవడంతో ప్రపంచాన్ని చుట్టిరావాలన్న తమ కోరికలను తీర్చుకోవడానికి సీనియర్ సిటిజన్స్ ప్రాధాన్యమిస్తున్నారని పిట్టీ చెప్పారు. 'రిటైర్మెంట్ తర్వాత తగినంత సమయం దొరకడంతో కొత్త ప్రదేశాలను చుట్టొచ్చేందుకు వీలవుతోంది. 51 శాతం మంది బేబీ బూమర్స్, 39 శాతం మంది సైలెంట్ జెనరేషన్ (80 ఏళ్ల పైబడిన వారు) జీవితకాలంలో ఒక్కసారైనా చూడాల్సిన టూర్లకు మొగ్గు చూపుతున్నారు' అని వివరించారు. కాగా, విమానాలు, రైలు చార్జీల్లో డిస్కౌంట్లు.. ఎయిర్‌పోర్టుల్లో ర్యాంపులు, ఎలివేటర్ సదుపాయాలు ఉండటం వల్ల వారు పర్యటనలకు ముందుకొస్తున్నారని భారతీయ టూరిజం, హాస్పిటాలిటీ అసోసియేషన్ల ఫెడరేషన్ (ఎఫ్ఏఐటీహెచ్) బోర్డు సభ్యుడు, టూర్‌వాలా ఎండీ వేద్ ఖన్నా అభిప్రాయపడ్డారు. నిపుణులైన టూర్ గైడ్‌లు, జర్నీలో వైద్యుల తోడ్పాటు వంటి సదుపాయాలతో ప్రత్యేకంగా ప్యాకేజీలను తీర్చిదిద్దుతుండటం వల్ల కూడా డిమాండ్ పెరిగిందన్నారు.

అవీ ఇవీ


సీనియర్స్ మక్కువ చూపుతున్న ప్రఖ్యాత ప్రపంచ నగరాలు: టోక్యో, సియోల్, సింగపూర్, లండన్

ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలు: వారణాసి, అయోధ్య, హరిద్వార్, రిషికేష్, రామేశ్వరం, పూరి, తిరుపతి

సీనియర్ సిటిజన్స్ ట్రావెల్ బుకింగ్స్‌లో వృద్ధి: 20%

2023లో ప్రపంచవ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్ ట్రావెల్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ: 3.2 బిలియన్ డాలర్లు (రూ.27వేల కోట్లు)

(2032 నాటికి ఇది 16.7 బిలియన్ డాలర్లకు చేరుతుందనేది అలైట్ మార్కెట్ రీసెర్చ్ అంచనా)



'ఆపరేషన్' ఆఖరి దశకు చేరిందా?

ముందే పసిగట్టి కర్రి గుట్టల నుంచి మావోలు మకాం మార్చినట్టు అనుమానాలు


- ఎండలో కూంబింగ్‌తో అలిసిపోతున్న భద్రతా బలగాలు
- అతికష్టంపై గుట్టలపైకి చేరినా దొరకని మావోల ఆచూకీ

చర్ల: ఆపరేషన్ కర్రి గుట్టల పేరిట భద్రతా బలగాలు భారీ సంఖ్యలో మావోయిస్టుల కోసం జల్లెడ పట్టినా ఫలితం దక్కలేదని తెలుస్తోంది. గడిచిన ఐదారు నెలల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో కూంబింగ్ ద్వారా వందలాది మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో తమ స్థావరాల నుంచి తప్పించుకున్న మావోయిస్టులు ఆత్మరక్షణ కోసం తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రి గుట్టలకు చేరారు. సమాచారం అందుతుకున్న భద్రతా బలగాలు గత సోమవారం సాయంత్రానికి కర్రిగుట్టలకు చేరుకొని 'ఆపరేషన్ కర్రిగుట్ట'పేరుతో అధునాతన పరికరాలు, డ్రోన్లు, హెలికాప్టర్లతో మొదటి మూడురోజుల పాటు తీవ్రంగా గాలించాయి. గగనతలం నుంచి గాలిస్తూనే శక్తివంతమైన రాకెట్ లాంచర్లను గుట్టలపై జార విడిచారు. మొదటి రెండు రోజులు భారీగా బాంబులు జారవిడిచినట్టు సమీప ఆదివాసీ గ్రామాల ప్రజలు కూడా ధ్రువీకరించారు. అయితే.. 40కి పైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జవాన్లు నీరసించిపోగా మూడోరోజు 15 మంది, నాలుగోరోజు 25 మంది వడదెబ్బకు గురయ్యారు. కాగా, మూడోరోజు మావోయిస్టులు భద్రతా బలగాలకు తారసపడగా జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోలు మృతి చెందినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ ప్రకటించారు. కానీ వీరి మృతదేహాలను స్వాధీనం చేసుకోలేకపోగా, మృతుల వివరాలనూ వెల్లడించలేదు. నాలుగో రోజు నుంచి రాకెట్ లాంచర్లను ప్రయోగించడం ఆపేసిన జవాన్లు.. గాలింపు కొనసాగిస్తూనే శనివారం రాత్రి అతి కష్టంపై కర్రిగుట్టల పైభాగానికి చేరారు. అక్కడ మావోయిస్టులకు సంబంధించిన భారీ గుహ(సొరంగం), అందులో మావోలు తలదాచుకున్న ఆనవాళ్లను గుర్తించారు.

ఎవరెవరు.. ఎందరు?

ఇటు భద్రాద్రి కొత్తగూడెం, అటు ములుగు జిల్లాలను ఆనుకుని పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్, గలగం, నంబి, భూపాలపట్నం వరకు వ్యాపించి ఉన్న కర్రి గుట్టలను బలగాలు మూడువైపులా చుట్టుముట్టాయి. అయితే, ఆపరేషన్‌ను ముందుగానే గుర్తించిన మోస్ట్ వాంటెడ్ హిడ్మాతోపాటు తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన ముఖ్య నేతలు, కేంద్ర కమిటీ సభ్యులు సైతం కర్రిగుట్టకు నాలుగో వైపు నుంచి దిగి సురక్షిత ప్రాంతానికి చేరినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కర్రి గుట్టల్లో వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నారని తొలుత, 400 మంది ఉన్నారని ఆ తర్వాత ప్రచారం జరిగినా అందులో వాస్తవం లేనట్టు తెలుస్తోంది. అయితే మావోయిస్టులు మకాం మార్చారా.. లేక అక్కడే సురక్షిత స్థావరంలో ఉన్నారా అన్నది తేలడం లేదు. ఇక శుక్రవారం కర్రిగుట్టల్లో మావోయిస్టులు తారసపడ్డారని, ఆ సమయాన ఎదురుకాల్పుల్లో 38 మందికి పైగా మావోలు మృతి చెందారని ప్రచారం జరిగినా ఎవరూ నిర్ధారించలేదు. గలగం సమీప అటవీ ప్రాంతంలో ఒక జవాన్ ప్రెజర్ బాంబు తొక్కడంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. సుమారు 5 వేల మంది డీఆర్‌జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ విభాగాలకు చెందిన జవాన్లతో మంగళవారం తెల్లవారుజామున ఆరంభమైన ఆపరేషన్ ఆదివారానికి ఆరో రోజుకు చేరినా ఆశించిన ఫలితం లేకపోవడం.. జవాన్లు అలసిపోతుండడంతో ఆపరేషన్‌ను తాత్కాలికంగా నిలిపేస్తారనే ప్రచారం మొదలైంది. అయితే, మరోపక్క కర్రి గుట్టల్లోనే రెండు క్యాంపులను ఏర్పాటు చేస్తారన్న ప్రచారం తాజాగా మొదలుకావడంతో ఏది సరైనదో తేలాల్సి ఉంది.

భారీ గుహ గుర్తింపు



కర్రిగుట్టల ప్రాంతంలో భద్రతా దళాలు గుర్తించిన గుహ..

మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కూంబింగ్‌కు దిగిన భద్రతా బలగాలు కర్రి గుట్టలపై మావోయిస్టులకు చెందిన ఒక భారీ గుహను గుర్తించారు. ఐదు రోజులపాటు శ్రమించిన భద్రతా బలగాలు శనివారం రాత్రి అతికష్టం మీద కర్రి గుట్టలపైకి చేరుకొని భారీ గుహ (సొరంగం)ను గుర్తించి అందులో టార్చ్ లైట్లు వేస్తూ పరిశీలించాయి. అయితే అందులో భారీ సంఖ్యలో మావోయిస్టులు దాక్కున్నట్లుగా అనుమానిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసినట్టు తెలుస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు బలగాలు ముందుకు సాగనున్నట్టు సమాచారం. గుహలో మావోయిస్టులు ఉన్నారని, వారి మాటలు వినిపించాయని బలగాలు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన వీడియోను వారికి పోస్ట్ చేసినట్టు సమాచారం. శనివారం అర్ధరాత్రి నుంచి ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో కూడా చక్కర్లు కొడుతోంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్ఏఎల్‌లో అప్రెంటిస్‌లు

కోర్వా(అమేథీ)లోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్ కోసం వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

» **ట్రేడులు:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్–ఎయిర్ కండిషనింగ్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్(మెకానికల్), కంప్యూటర్ ఆపరేటర్–ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ), మెషినిస్ట్(గ్రైండర్), మెకానిక్(మోటార్ వెహికల్), ఎలక్ట్రోప్లేటర్, వెల్డర్(గ్యాస్–ఎలక్ట్రిక్), పెయింటర్(జనరల్), ప్లంబర్, మేసన్.
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో10+2,ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 04.05.2025 నాటికి 27 ఏళ్లు ఉండాలి
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గూగుల్ ఫామ్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.05.2025.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఎంఎస్ఈలో ఎంఏ కోర్సుల్లో ప్రవేశాలు

తమిళనాడులోని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్(ఎంఎస్ఈ)లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో ఎంఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 47(ఆల్ ఇండియా–31, తమిళనాడు–16).
» **కోర్సుల వివరాలు:** యాక్చురియల్ ఎకనామిక్స్, అప్లైడ్ క్వాంటిటేటివ్ ఫైనాన్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్, జనరల్ ఎకనామిక్స్. **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** సోషల్ సైన్సెస్(కామర్స్–మేనేజ్‌మెంట్), సైన్సెస్ లేదా ఇంజనీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే వారు కూడా అర్హులు) ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.05.2025
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేది:** 19.05.2025.
» **ప్రవేశ పరీక్షతేది:** 31.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.mse.ac.in

యూసీఎస్ఎల్, మాల్పేలో 18 సూపర్‌వైజర్ పోస్టులు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్)..ఒప్పంద ప్రాతిపదికన సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **పోస్టుల వివరాలు:** సూపర్‌వైజర్(మెకానికల్)–10, సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్)–05, సూపర్‌వైజర్(పెయింటింగ్)–02, సూపర్‌వైజర్(హెచ్ఎస్ఈ)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 12.05.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.40,650, రెండో ఏడాది రూ.41,490, మూడో ఏడాది రూ.42,355, నాలుగో ఏడాది రూ.43,246, ఐదో ఏడాది రూ.44,164.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.05.2025
» **వెబ్‌సైట్:** https://udupicsl.com

బెల్ బెంగళూరులో ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్, ట్రెనీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్–05, ట్రెనీ ఇంజనీర్–02.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఏరోనాటికల్/ఏరోస్పేస్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ /బీటెక్ /బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.04.2025 నాటికి ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు,ట్రెనీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.04.2025
» **వెబ్‌సైట్:** https://bel-india.in

టీచర్ కెరీర్‌కు మార్గం.. టెట్

» టీజీ టెట్–2025 జూన్ నోటిఫికేషన్ విడుదల
» డీఈడీ, బీఈడీ అర్హతతో పోటీ పడే అవకాశం
» పేపర్–1, 2లుగా పరీక్ష నిర్వహణ
» డీఎస్సీకి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి



టీచర్ ఎలిజిబిటీ టెస్ట్.. సంక్షిప్తంగా టెట్! ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశానికి ప్రామాణిక పరీక్ష! డీఎస్సీ ద్వారా చేపట్టే టీచర్ నియామకాలకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి! దీంతో బీఈడీ, డీఈడీ కోర్సుల అభ్యర్థులకు టెట్ ఎంతో కీలకంగా మారింది. తెలంగాణలో తాజాగా టీజీ టెట్–2025 జూన్ నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో.. టీజీ టెట్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకుంటే టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. అంతేకాకుండా టెట్ నోటిఫికేషన్ వెలువడిందంటే రానున్న రోజుల్లో డీఎస్సీ నియామకాలు ఉంటాయనే అంచనాలు కూడా నెలకొంటాయి. బీఈడీ, డీఈడీ అభ్యర్థులు టెట్‌లో రాణించేందుకు కృషి చేస్తే.. అదే ప్రిపరేషన్‌తో భవిష్యత్తులో నిర్వహించే టీచర్ నియామక పరీక్షల్లోనూ విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

రెండు పేపర్లుగా టెట్

తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం–పేపర్–1, పేపర్–2 రెండు పేపర్లుగా టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు టెట్ పేపర్–1కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించడానికి టెట్ పేపర్–2లో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది. అదే విధంగా పేపర్–1, పేపర్–2లకు హాజరుకు నిర్దేశిత విద్యార్హతలు ఉండాలి.

టెట్ పేపర్–1 అర్హతలు

ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి. డిసెంబర్ 12, 2015 ముందు విద్యార్హతలు పొంది ఉంటే.. 45 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు బీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు అయిదు శాతం మార్కుల మినహాయింపు లభిస్తుంది.

టెట్ పేపర్–2 అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు బీఈడీ/ బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.

లాంగ్వేజ్ పండిట్ కోర్సులకు సంబంధించి నిర్దేశిత లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా సంబంధిత లాంగ్వేజ్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉత్తీర్ణత ఉండాలి లేదా సంబంధిత సబ్జెక్ట్ సాహిత్యంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ పాసవ్వాలి. వీటితోపాటు నిర్దేశిత లాంగ్వేజ్‌లో లాంగ్వేజ్ పండిట్ ట్రెనింగ్ సర్టిఫికెట్/సంబంధిత లాంగ్వేజ్ మెథడాలజీలో బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.

150 మార్కులకు పేపర్–1

ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా పేర్కొన్న టెట్ పేపర్–1ను 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు–30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులు, గణితం 30 ప్రశ్నలు–30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు పరీక్ష ఉంటుంది.

పరీక్షలో రెండో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్–1 సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్‌ను పదో తరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి. మూడో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్–2 (ఇంగ్లిష్)కు సంబంధించి అందరు అభ్యర్థులకు ఈ విభాగం ఉంటుంది.

పేపర్–2 సైతం 150 మార్కులు

- సంబంధిత సబ్జెక్ట్‌లలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు అర్హతగా నిర్దేశించిన టెట్ పేపర్–2ను కూడా 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు–30 మార్కులు, లాంగ్వేజ్ 2(ఇంగ్లిష్) 30ప్రశ్నలు–30 మార్కులు,సంబంధిత సబ్జెక్ట్ 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి.
- రెండో విభాగం లాంగ్వేజ్–1లో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం సబ్జెక్ట్‌లను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- నాలుగో విభాగంగా ఉన్న సంబంధిత సబ్జెక్ట్ విషయంలో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి.
- అదే విధంగా సబ్జెక్ట్ పేపర్‌కు సంబంధించి కంటెంట్ నుంచి 24 ప్రశ్నలు, పెడగాజీ నుంచి ఆరు ప్రశ్నలు చొప్పున ప్రతి సబ్జెక్ట్ విభాగం నుంచి అడుగుతారు.
- సైన్స్ సబ్జెక్ట్‌కు సంబంధించి ఫిజికల్ సైన్స్ నుంచి 12, బయలాజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా ఆరు ప్రశ్నలు సైన్స్ పెడగాజీ నుంచి అడుగుతారు. సోషల్ విభాగంలో హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్‌ల నుంచి 48 కంటెంట్ ప్రశ్నలు, 12 పెడగాజీ ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు లభించే సమయం రెండున్నర గంటలు.

బెస్ట్ స్కోర్ సాధించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

రెండు పేపర్లలోనూ మొదటి విభాగంగా చైల్డ్ డెవలప్‌మెంట్ పెడగాజి ఉటుంది. ఇందులో అడిగే ప్రశ్నలు.. బోధన, అభ్యసనానికి సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ఉంటాయి. శిశువు సైకాలజీ, వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి.

లాంగ్వేజ్–1, 2లకు ఇలా

లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకున్న భాషలో నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డెరైక్ట్ అండ్ ఇన్‌డెరైక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీపై అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్–1లో ఉండే ఈ రెండు సబ్జెక్ట్‌లలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. సబ్జెక్టులో 30 ప్రశ్నల్లో 24 ప్రశ్నలు కంటెంట్‌పై ఉంటే.. 6 ప్రశ్నలు పెడగాజిపై అడుగుతారు. పేపర్–2లో మ్యాథమెటిక్స్, సైన్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు. కాని ప్రశ్నల క్లిష్టత స్థాయి ఇంటర్ స్థాయిలో ఉండే అవకాశముంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణపై ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. ప్రస్తుతం టెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ ప్రాధాన్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం లాభిస్తుంది.

సైన్స్

టెట్ పేపర్–2లో సైన్స్ సబ్జెక్ట్ అభ్యర్థులు మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు సైన్స్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదివాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

మెథడాలజీ

ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్–1, పేపర్–2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 30.
- **దరఖాస్తు సవరణ:** 2025, ఏప్రిల్ 28 – మే 3.
- **టెట్ తేదీ:** జూన్ 15 నుంచి 30 వరకు(పేపర్–1 : ఉదయం 9:30 నుంచి 12:00 వరకు; పేపర్–2: మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 వరకు).
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tgtet.aptonline.in/tgtet

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్



మంచిమాట

అనుభవాలే పాఠాలుగా...

జీవితంలో పైకి రావాలనుకున్న వారెవరికైనా ముందుగా తాము చేస్తున్న పని పట్ల, తమ లక్ష్యం పట్ల చిత్తశుద్ధి ఉండాలి. ఎవరు నమ్మినా నమ్మకపోయినా తమ పట్ల తమకు నమ్మకం ఉండాలి. నేను చేయగలను అన్న నమ్మకం మీలో కొత్త ఉత్సాహాన్నిస్తుంది. కొత్త ఆశలను చిగురింప చేస్తుంది. కావల్సినంత బలాన్నిస్తుంది. అందువల్ల జీవితంలో ఎవ్వరిని నమ్మినా నమ్మకపోయినా మనలో ఉన్న మన ఆత్మవిశ్వాసమే మనల్ని విజయ తీరాల వైపు తీసుకువెళుతుందన్న విషయాన్ని గుర్తించాలి.

తమ లక్ష్యాలను సాధించి జీవితంలో విజయ బావుటా ఎగురవేసిన వారిని మనం నిత్యజీవితంలో అనేక మందిని చూస్తుంటాం. వింటూ ఉంటాం. అయితే వారివారి విజయ గాధలలో ఆయా వ్యక్తుల సాఫల్యాన్ని మాత్రమే మనం పరిగణనలోకి తీసుకుంటాం కానీ ఆ విజయం వెనుక సదరు వ్యక్తులు పడిన తపన, బాధలు, కష్టాలు, కన్నీళ్ళు, అవరోధాల గురించి మనం పట్టించుకోం. నిజానికి ప్రతి విజయ గాధ వెనుక ఎన్నో అపజయాలు, మరెన్నో అవరోధాలు ఉంటాయని తెలుసుకోలేం.

నేడు సమాజంలో ఉన్నత స్థితికి వచ్చిన ఏ వ్యక్తినైనా తీసుకోండి. వారి విజయం వెనుక వారెన్ని కష్టాలు, ఇబ్బందులు పడ్డారో తేటతెల్లమవుతుంది. ఎన్నో అపజయాలు, ఓటములు అనుభవించిన తరువాత గానీ, ఆయా వ్యక్తులకు విజయం సిద్ధించలేదన్న విషయం బోధపడుతుంది.

జీవితంలో ఎవ్వరైనా తాము అనుభవిస్తున్న, అనుభవించిన అవమానాలు, అపజయాలు, ఓటముల ద్వారానే పాఠాలు నేర్చుకోవాలి. ఆయా పాఠాలు నేర్పిన గుణపాఠాలను ఆత్మవిశ్వాసం ద్వారా అధిగమించాలి. తమమీద తాము విశ్వాసాన్ని పెంచుకుని అపజయాన్ని విజయానికి సోపానంగా మార్చుకున్న వారే జీవితంలో ఎలాంటి విజయాన్నైనా సాధించగలరు. అందువల్ల ఆత్మవిశ్వాసమే ఆశావహుల ఆభరణమని తెలుసుకోవాలి.

మనం చిన్నపుడు తాబేలు, కుందేలు కథ విని ఉంటాం. నిదానంగా, నెమ్మదిగా పరుగెత్తే తాబేలు, అత్యంత వేగంగా పరుగెత్తే కుందేలుతో పరుగెత్తి విజయం సాధించిందని ఆ కథ సారాంశం. మరి ఈ కథలో తాబేలుకు విజయం వరించడానికి ప్రధానమైన కారణమే ఆత్మవిశ్వాసం.

ఎంత ఆత్మవిశ్వాసం ఉంటే వేగంగా కదలలేని తాబేలు, వేగంగా పరుగెత్తే కుందేలు తో పందెం కడుతుంది. ఎంత ఆత్మవిశ్వాసముంటే తాబేలు కుందేలుతో పోటీపడి గెలుస్తుంది. ఎంత అతి విశ్వాసముంటే, పోటీలో గెలిచే సామర్థ్యమున్నా, కుందేలు విజయానికి దూరంగా ఉందన్న విషయం అవగతమవుతోంది. ఈ కథ ద్వారా జీవితంలో పైకి రావాలనుకున్న ప్రతి ఒక్కరికీ ఆత్మవిశ్వాసం ఎంత అవసరమో తెలుస్తుంది. అలాగే, మన లక్ష్యాలను గమ్యాలను దూరం చేసే అతి విశ్వాసం పనికి రాదని తేటతెల్లమవుతుంది.

ఆత్మవిశ్వాసంతో ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చని అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ జీవిత గాథ మనకు అవగతం చేస్తుంది. విజయం సాధించడానికి వయసుతో సంబంధం లేదని నిరూపించి విజేతగా నిలిచిన గొప్ప వ్యాపారవేత్త కల్నల్ సాండర్స్. కనుక జీవితంలో విజేతగా నిలవాలనుకున్న ప్రతిఒక్కరూ కష్టాలకు నెరవకుండా, అనుభవాలను పాఠాలుగా నేర్చుకుంటూ ముందుకి వెళితే విజయం తప్పక వరిస్తుందన్న వాస్తవాన్ని తెలుసుకుని మసలుకోవాలి.

– దాసరి దుర్గా ప్రసాద్

ఆత్మదర్శిని

దైవం నీ నిజతత్వం



నేను శరీరం, నేను మనస్సు అనే నమ్మికనే దుఃఖానికి మూలకారణం. ఏ రకమైన ఆకర్షణలు, సంతోషాలు, దుఃఖాలు వచ్చినా 'అవి సత్యాలు కావు. నేను సాక్షిగా వీటిని చూస్తున్న చైతన్యాన్ని' అన్న ప్రజ్ఞలో నిరంతరం ఉన్నప్పుడు నీకు జీవిత పరమార్థం అర్థమైనట్టే. సంస్కారాలు ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా ఉంటాయి. ఎవరికి ఎలాంటి వాటి పట్ల రాగద్వేషాలు ఉంటాయో అలాంటి విషయాలనే ఎదుర్కొంటారు. వాటిల్లో చిక్కుకుని పోతారు. అవే సత్యమనుకుంటారు. కొందరు అత్యంత ధనవంతులుగా, అత్యంత పలుకుబడి ఉన్న వ్యక్తులుగాఉంటూ వాటిల్లోనే కూరుకుపోతారు. కొందరు గొప్ప మేధావులుగా, విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, సినిమా నటులుగా గొప్పస్థానాల్లో ఉంటూ ఆ ఉచ్చులోనే చిక్కుకుని పోతారు.

చివరికి గొప్ప ఆధ్యాత్మికవేత్తలు కూడా మనస్సు ఉచ్చులో చిక్కుకొని పోతున్నారు.

నేను శరీరం–మనస్సు అనే భ్రమల్లో చిక్కుకుపోవడానికి రకరకాల ఉచ్చులు సిద్ధంగా ఉంటాయి నీ చుట్టూ. జీవితంలో ఎంత సాధించినా, సంఘంలో ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా అంతిమంగా నీవు తెలుసుకో వలసింది నీ నిజతత్వాన్ని. అప్పటివరకు కూడా ఎన్ని సాధించినా శాశ్వతమైన ఆనందాన్ని, శాంతి, సంతృప్తులను పొందలేవు. మనం ఇంతవరకు దైవం 'గురించి' మాత్రమే తెలుసుకున్నాం కానీ దైవాన్ని అనుభవపూర్వకంగా ఎన్నడూ తెలుసుకోలేదు. దైవాన్ని ఒకరూపంగా మాత్రమే చూస్తూ వచ్చావు గానీ దైవం నీ నిజతత్వం అని తెలుసుకోలేదు. నీ పంచేంద్రియాలతో, మనస్సుతో తెలుసుకునేది ఏదీ దైవం కాదు. దైవాన్ని నీ జీవితం ద్వారా అనుభవ పూర్వకంగానే తెలుసుకోగలవు. ఏ పనిలో ఉన్నా ప్రతి క్షణం సాక్షిగా ఉంటే అక్కడ దైవం ఉన్నట్టే. అ సాక్షే దైవం. జీవితంలో ప్రతిక్షణం సాక్షిగా ఏ విషయాలకూ అంటకుండా జీవించు.



– స్వామి మైత్రేయ
ఆధ్యాత్మిక బోధకులు

అప్పుడు అనుక్షణం దైవాన్ని చూస్తావు. నీవు బయట ఎక్కడో వెదుకుతున్న దైవాన్ని నీలోనే చూస్తావు. నీ ఆత్మే దైవమని తెలుసుకుంటావు. సంస్కారాలన్నీ అంతమైన క్షణం నీవే ఆత్మవు. స్వచ్ఛమైన అద్దంలా ఉంటావు. ప్రతిబింబించడానికి వస్తువే లేనపుడు అద్దం స్వచ్ఛంగా ఉంటుంది. సంస్కారాలన్నీ అంతమైనపుడు నీవే ఆ స్వచ్ఛమైన చైతన్యంగా మిగిలిపోతావు.

ఆధ్యాత్మికథ

పిలిచిన పలికేవు స్వామి!

స్వామివారి దర్శనం చేసుకుందామని బెంగుళూరుకు చెందిన ఒక యువ సాఫ్ట్ వేర్ ఉద్యోగి తిరుపతి బయలుదేరాడు. నేరుగా అలిపిరి చేరుకున్నాడు. తల పైకెత్తి శేషాచలం కొండలవైపు చూశాడు. గుండెల్లో దడ మొదలయ్యింది.

'నేను 3550 మెట్లు ఎక్కగలనా?' అన్న అనుమానం పట్టుకుంది. 'ముచ్చట గా మూడు మైళ్లు కూడా నడవలేనే, ఈ పన్నెండు కిలోమీటర్ల దూరం నడవటం నా వల్ల అయ్యే పనేనా' అని దిక్కులు చూడసాగాడు. అక్కడే ఇద్దరు యువతులు ప్రతి మెట్టుకూ పసుపు కుంకుమలు పెట్టి కర్పూరం వెలిగిస్తూ ఉన్నారు.

''మీరు చాలాసార్లు కాలినడకన కొండ ఎక్కినట్లు ఉన్నారు. నేను నడవగలనా?''అని వారిని అడిగాడు. ''కొంచెం కష్టపడాలి. అక్కడక్కడ కూర్చుని వెళ్ళండి'' అని సలహా ఇచ్చి వెళ్ళి పోయారు. అయినా అతడికి ధైర్యం రాలేదు.



ఎప్పుడో వచ్చిన మోకాళ్ళ నొప్పులు గుర్తుకు తెచ్చుకుని కాలినడక విరమించుకున్నాడు. బస్సుకెళ్దామని నిర్ణయించుకుని పక్కకి తిరిగాడు.

అప్పుడే ఓ పండు వృద్ధురాలు కట్టె చేతపెట్టుకుని, నెత్తిన సంచి ఉంచుకొని కొండ ఎక్కడానికి వచ్చింది.

ఆ యువ ఇంజినీరు ఆశ్చర్యంగా ''ఇన్ని మెట్లు నువ్వు ఎక్కగలవా అవ్వా?'' అని అడిగాడు. ఆమె బోసినోటితో ''ఎక్కించే వాడు పైన ఉన్నాడు నాయనా, నన్ను ఎలాగోలా ఎక్కిస్తాడులే'' అని సమాధానమిచ్చింది. ''ఆయన ఎలా ఎక్కిస్తాడు? నువ్వుకదా కొండ ఎక్కాల్సింది!'' అన్నాడు.

''నడవాలని అనుకోవడమే నా వంతు నాయనా. మిగతాది అంతా ఆయన చూసుకుంటాడు. ఏదో ఒకవిధంగా తోడుగా వచ్చి నన్ను కొండ చేరుస్తాడు'' అని మెట్లు ఎక్కసాగింది. 'ఈ పెద్దామే ఎక్కుతోందే... మనం ఎందుకు ఎక్కలేము?' అని మనసులో అనుకున్నాడు. చిన్నగా ఆ అవ్వతో కలిసి నడవటం ప్రారంభించాడు. అక్కడక్కడా నిలుస్తూ అవీ ఇవీ మాట్లాడుకుంటూ ఇద్దరూ కొండపైకి చేరారు.

చివరి మెట్టు మీద నిలబడుకొని ఆ యువకుడు ''అవ్వా... మీ దేవుడు వచ్చి నిన్ను కొండ ఎక్కిస్తాడని చెప్పావే... ఎక్కడా కనిపించడేమి?'' అని కొంచెం వెటకారంగా అడిగాడు.

ఆ ముసలామె నవ్వుతూ ''నువ్వు ఎవరనుకున్నావు నాయనా... దేవుడు తోడు చేసి పంపితే వచ్చినవాడివి కదా'' అని చెప్పి హుషారుగా వైకుంఠం వైపు నడవసాగింది. 'ఆ' అని నోరు తెరవడం ఆ యువకుడి వంతు అయ్యింది.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

నానుడి

పరశురామప్రీతి అంటే ఏమిటి?

ఎక్కడైనా ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు పరశురామ ప్రీతి అయిందని అనడం మనం వింటూ ఉంటాం. సిసలైన జాతీయం ఇది. పరశురాముడికి అగ్నికి సంబంధం ఏమిటి? శివుడిని మెప్పించి పరశువు (గండ్రగొడ్డలి)ని ఆయుధంగా పొందుతాడు పరశురాముడు.ఇక పరశురామప్రీతి విషయానికి వస్తే... కార్తవీర్యుని కొడుకులు పరశురాముని తండ్రి జమదగ్ని తలను నరికి మహిష్మతికి పట్టుకుపోతారు. పరశురాముని తల్లి రేణుక జమదగ్ని దేహంపై పడి ఏడుస్తూ ఇరవై ఒక్కసార్లు గుండెలు బాదుకుంటుంది. ఎన్నిసార్లు తల్లి గుండెలు బాదుకుందో అన్నిసార్లు క్షత్రియులందరినీ చంపుతానని ప్రతిజ్ఞ చేస్తాడు పరశురాముడు. కార్తవీర్యుని రాజధాని నగరాన్ని ఆగ్నేయాస్త్రంతో భస్మం చేస్తాడు. ఊరంతా తగలబడిపోతుంది. ఇలా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టడాన్ని 'పరశురామ ప్రీతి'గా పేర్కొనడం వాడుకలోకి వచ్చింది.



సాక్షి సినిమా

నాని నా అంచనాలను మించిపోయాడు

– దర్శకుడు రాజమౌళి



● దీప్తి గంటా, శైలేష్ కొలను, విశ్వక్ సేన్, రాజమౌళి, నాని, శ్రీనిధీ శెట్టి, అడివి శేష్, ప్రశాంతి తిపిర్నేని

''నాని ఏ సినిమా చేసినా హిట్ అని తెలిసిపోతుంటుంది. కానీ తన దగ్గర్నుంచి ఇంకా కావాలని ఓ ఫంక్షన్‌లో అన్నాను. అయితే నా అంచనాలను మించి నాని చాలా ముందుకెళ్లిపోయాడు. కానీ నానీ... మేం ఇంకా కోరుకుంటూనే ఉంటాం. నువ్వు ఇంకా ముందుకు వెళ్లు'' అని ప్రముఖ దర్శకుడు రాజమౌళి అన్నారు. నాని హీరోగా నటించిన చిత్రం 'హిట్ 3: థర్డ్ కేస్'. ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి హీరోయిన్. శైలేష్ కొలను దర్శకత్వంలో నాని, ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా దర్శకుడు రాజమౌళి, అతిథులుగా 'హిట్ 1'లో హీరోగా నటించిన అడివి శేష్, 'హిట్ 2'లో హీరోగా నటించిన విశ్వక్ సేన్ హాజరయ్యారు. ఈ వేదికపై దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ – ''అ!, హిట్ 1, హిట్ 2, కోర్ట్... ఆల్ సక్సెస్. వంద శాతం సక్సెస్ అయిన నిర్మాత ప్రశాంతి. ఇండస్ట్రీలో హిట్ మిషన్ అని పిలుచుకుంటుంటాం. ఇప్పుడు 'హిట్ 3' సక్సెస్ అవుతుందని నా గట్టి నమ్మకం. ఓ ఫ్రాంచైజీని స్టార్ట్ చేసినప్పుడు అది ఎంతకాలం ఉంటుందో చెప్పలేం. కానీ 'హిట్ ఫస్ట్ కేస్, సెకండ్ కేస్... చాలా కేస్‌లు ఉండొచ్చు. శైలేష్ ఏడు సినిమాలే అనుకుని ఉండొచ్చు. కానీ ఈ ఫ్రాంచైజీ ఎప్పటికీ ఉంటుందని అనుకుంటున్నాను.

'హిట్ 3' ప్రమోషనల్ కంటెంట్ చూశాను. సినిమా సూపర్ డూపర్ హిట్ అనే వైబ్‌ని క్రియేట్ చేసింది. మే1 థియేటర్స్‌లో... అబ్ కీ బార్ అర్జున్ సర్కార్. హిట్ ది థర్డ్ కేస్'' అని రాజమౌళి అన్నారు. కాగా.. ఈ వేదికపై **''మీరు తీయబోతున్నటు వంటి 'మహాభారతం' సినిమాలో నానీగారి క్యారెక్టర్ ఫిక్స్ అయిందని విన్నాం... నిజమేనా'' అని యాంకర్ సుమ అడిగితే ''నాని ఉంటాడన్నది మాత్రం ఫిక్స్'' అని రాజమౌళి చెప్పారు.**

నాని మాట్లాడుతూ– ''నా ప్రతి కొత్త సినిమాకు మార్నింగ్ షోకి ప్రసాద్ ఐమ్యాక్స్‌కి వెళతాను. వెళ్లే ముందే రాజమౌళిగారి ఫ్యామిలీ మెంబర్స్ కూడా వస్తున్నారా? అని చెక్ చేసుకుని, థియేటర్లో వాళ్ల రియాక్షన్ చూస్తుండేవాడిని. సినిమా అయిపోయాక వల్లీగారు, రమగారిని టాక్ అడిగేవాడిని. ప్రేమగా హగ్ ఇచ్చి వెళ్లిపోయారంటే నచ్చలేదని అర్థం. 'చాలా బాగుంది. కారు ఎక్కిన వెంటనే నీకు మెసేజ్ చేస్తాం' అంటే సినిమా బాగుందని అర్థం. అయితే ఈ మధ్య థియేటర్‌కి వెళ్లకపోవడంతో కాస్త బ్రేక్ వచ్చింది. ఈసారి 'హిట్ 3' సినిమా చూసి, ఆయన (రాజమౌళి) నాకు ఆ మార్నింగ్ షో ఎనర్జీ ఇవ్వాలని కోరుకుంటున్నాను. రాజమౌళిగారు ఈ మూవీని ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. ఒక థ్రిల్లర్, ఒక మాస్ కమర్షియల్ ఫిల్మ్ కలిస్తే అది 'హిట్ 3'. మే 1న ఆడియన్స్‌కు ఒక అమేజింగ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను నాని ప్రామిస్ చేస్తున్నాడు'' అన్నారు. 'హిట్ 3' సక్సెస్ అవ్వాలనే ఆకాంక్షను అడివి శేష్, విశ్వక్ సేన్ వ్యక్తం చేశారు. శైలేష్ కొలను, శ్రీనిధీ శెట్టి, కోమలీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

త్రీడీలో జగదేక వీరుడు అతిలోక సుందరి



● చిరంజీవి, శ్రీదేవి

చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం మళ్లీ విడుదల కానుంది. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాను 35 ఏళ్ల తర్వాత రీ–రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. మే 9న ఈ చిత్రం రీ రిలీజ్‌కు సిద్ధమైంది. అది కూడా 2డీతో పాటు 3డీ వెర్షన్‌లోనూ విడుదల కానుంది. ''జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం అప్పట్లోనే విజువల్ వండర్‌గా ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు త్రీడీ వెర్షన్‌తో ఆడియన్స్‌కు సరికొత్త అనుభూతినివ్వబోతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఇళయరాజా.

కోర్ట్ తర్వాత సారంగపాణి జాతకం నాకో వరం

– ప్రియదర్శి

''కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' చిత్రం నాకు ఓ వరంలా దొరికింది. ఇలాంటి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది. శనివారం 'సారంగపాణి జాతకం' సినిమా సెలబ్రిటీ షో వేశాం. సెలబ్రిటీలు, ఆడియన్స్ సినిమాను ఎంజాయ్ చేశారు'' అని ప్రియదర్శి అన్నారు. ప్రియదర్శి, రూపా కొడవయూర్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ అయింది. ఆదివారం జరిగిన ఈ సినిమా 'ఫన్'టాస్టిక్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ– ''నేను అనుకున్నదాని కంటే



● శివలెంక కృష్ణప్రసాద్, రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ

వెయ్యి రెట్లు ఎక్కువగా ప్రియదర్శి నటించాడు. శివలెంక కృష్ణ ప్రసాద్‌గారితో నేను 'సమ్మోహనం, జెంటిల్‌మ్యాన్' సినిమాలు చేశాను. ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమా చేశాం. ఈ మూడూ ప్రేక్షకులు పది కాలాల పాటు గుర్తుపెట్టుకునే చిత్రాలు'' అని తెలిపారు. ''మేం ఎంతో కష్టపడి, ఇష్టపడి చేసిన ఈ సినిమాను అందరూ చూసి, ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''దర్శికి మంచి జడ్జిమెంట్ ఉంది. అప్పట్లో ఆమిర్ ఖాన్ గారికి ఇలాంటి జడ్జిమెంట్ ఉండేది. ఇంద్రగంటిగారితో పనిచేస్తే చాలు... రిజల్ట్‌తో అవసరం లేదు'' అని చెప్పారు 'వెన్నెల' కిశోర్. ''దర్శి ఆల్‌రౌండర్ నటుడు'' అన్నారు అవసరాల శ్రీనివాస్. ఇంకా నటుడు వైవా హర్ష, కెమెరామేన్ పీజీ విందా మాట్లాడారు.

ఊరంతా తెలిసిన సీక్రెట్...

హర్షిత్ రెడ్డి, సి. మల్లిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'శుభం'. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మించిన తొలి చిత్రం ఇది. అలాగే ఈ సినిమాలో ఓ కీలక పాత్రలోనూ నటించారు సమంత. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఆ సీరియల్ టీవీలో వస్తున్నంత సేపు నా పెళ్ళాం చాలా తేడాగా ప్రవర్తించింది రా..., ఇంత జరుగుతుంటే ఊళ్లో ఒక్కడన్నా బయటకు వచ్చి చెప్పాడ్రా... అసలు ఒరేయ్... ఊరంతా తెలిసిన సీక్రెట్ రా ఇది... మొత్తం మగవాళ్ళ పరువంతా డేంజర్‌లో పడింది' అనే సంభాషణలు 'శుభం' ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ ఊర్లో మహిళలందరూ టీవీలో ఓ సీరియల్ చూసి, వింత వింతగా ప్రవర్తిస్తుంటారు. దెయ్యం పట్టినట్టుగా మహిళలు ప్రవర్తిస్తుంటే.. వారి నుంచి తప్పించుకునేందుకు ఊర్లో పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అప్పుడు ఓ మాతాజీలా సమంత వస్తారు. ఆ నెక్ట్స్ ఏం జరిగింది? అనే కథాంశంతో 'శుభం' సినిమా రూపొందిందని విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది.



● సమంత

ప్యాషన్‌తో నిర్మించిన పేషన్ హిట్టవ్వాలి

– దర్శకుడు శేఖర్ కమ్ముల



● అరుణ్‌కుమార్, సుధీష్, శేఖర్ కమ్ముల, అంకిత, అరవింద్

''కొత్త ఫ్లేవర్‌తో వచ్చిన సినిమాలను ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ 'పేషన్' సినిమాను కూడా అంతే అద్భుతంగా ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. సుధీష్, అంకిత హీరో, హీరోయిన్లుగా అరవింద్ జాషువా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పేషన్'. నరసింహా యేలే, ఉమేష్ చిక్కు, రాజీవ్ సింగ్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ – ''ఆనంద్' సినిమా నుంచే నాకు అరవింద్ జాషువా పరిచయం. తనలో మంచి స్టోరీ టెల్లింగ్ క్రియేటర్ ఉన్నాడని అప్పుడే అనిపించింది. తను రాసిన పేషన్ నవలను చదివా. చాలా బాగుంది. ఇక అరవింద్ రూపొందించిన ఈ 'పేషన్' ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కైండ్ ఫిల్మ్. కొత్త నిర్మాతలు ప్యాషన్‌తో ఈ మూవీ తీశారు'' అన్నారు. ''శేఖర్ కమ్ములగారి బ్లెస్సింగ్స్ లేకపోతే ఈ మూవీ అయ్యేది కాదు. 'పేషన్' విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్. ''శేఖర్ కమ్ములగారికి నేను ఏకలవ్య శిష్యుడ్ని. ఈ జనరేషన్‌కి కనెక్ట్ అయ్యే కథతో 'పేషన్' తీశాం. త్వరలోనే ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని అన్నారు అరవింద్ జాషువా.

ఓటీటీ ఇది చూడొచ్చు

వామ్మో... ఆపిల్ స్టోరా...

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ఐ హోస్టేజ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఉన్నవి రెండు పాత్రలు... వాటికి అనుసంధానంగా అడపాదడపా వచ్చే మరో డజను పాత్రలు. కథ మొత్తం ఆ రెండు పాత్రల మధ్యే. అయినా ప్రేక్షకుడిని క్షణం కూడా కన్నార్పనీయకుండా కట్టిపడేసే విధంగా థ్రిల్లర్ జోనర్‌తో సినిమా నడపడం డచ్ దర్శకుడైన బాబీ బోర్‌మెన్స్‌కి మాత్రమే చెల్లింది. అదే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఐ హోస్టేజ్ సినిమా. ఆపిల్ స్టోర్... ఐ ఫోన్ నుండి ఐ ప్యాడ్ల వరకు ప్రతి దానికి ఆపిల్ స్టోరే కదా... ఈ సినిమాకి మూలం అదే. అమెరికా, ఆస్ట్రేలియా, చైనా తదితర దేశాలలో ఆపిల్ స్టోర్‌లు ఘనంగా దాదాపు 5 ఫ్లోర్లు పైనే విశాలంగా పెద్ద భవంతిలో ఉంటాయి. అది కూడా నగరానికి మధ్యలోనే ఉంటాయి. కథా పరంగా ఆమ్‌స్టర్ డామ్ నగరం మధ్య లోని ఓ ఆపిల్ స్టోర్ బోలెడంత మంది కస్టమర్లతో కళకళలాడుతుంటుంది. అప్పుడు ఆ స్టోర్లోకి కూరగాయల సంచితో ఓ వ్యక్తి వచ్చి తన దగ్గర ఉన్న తుపాకీ తీసి అందరినీ హడలుగొట్టి, ఓ వ్యక్తిని బందీగా తీసుకుంటాడు. అంతేకాదు తన దగ్గర పేలుడు పదార్థాలు ఉన్నాయని బెదిరించి, తనకు మిలియన్ల డబ్బుతో పాటు అక్కడ నుండి తప్పించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేయమని అధికారులకు ఫోన్‌లో చెప్తాడు. ఇక సినిమా మొత్తం దాదాపుగా ఆ ఇద్దరి మధ్యే నడుస్తుంది. సినిమా ఆ ఇద్దరి మీదే నడిచినా మంచి స్క్రీన్‌ప్లేతో ఆకట్టుకున్నారు దర్శకుడు. సినిమా చివర్లో బందీగా తీసుకున్న వ్యక్తితో తను బయటపడగలిగాడా? లేదా? తాను డిమాండ్ చేసిన డబ్బులు అందుకున్నాడా? లేదా అనేది తెలుసుకోవాలంటే మాత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఐ హోస్టేజ్ సినిమాని చూసేయండి. ఈ సినిమా ద్వారా మానసికంగా ప్రేక్షకుడికి భయాన్ని పూర్తిగా పరిచయం చేశారు దర్శకుడు. అది కూడా చిన్నపాటి ఘర్షణ లేకుండా, ఒక్క బుల్లెట్ పేలకుండా... మరీ ముఖ్యంగా ఎటువంటి పేలుళ్ల జరగకుండా సైకలాజికల్‌గా సినిమాని తీసుకువెళ్లారు. సినిమా చూసిన తరువాత మాత్రం వామ్మో... ఆపిల్ స్టోరా ఇంక వెళ్లొద్దు బాబు అని కనీసం పది మందిలో సగమైనా అనుకుంటారు. మరి... మీరు కూడా ఆలస్యం కాకుండా ఈ సినిమా చూసేయండి. అయితే ఆపిల్ స్టోర్‌కి మాత్రం వెళ్లడం మానకండి.



– హరికృష్ణ ఇంటూరు



భారత మహిళల హాకీ జట్టుకు వరుసగా రెండో పరాజయం

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు 2-3 గోల్స్ తేడాతో పరాజయం చవిచూసింది. భారత్ తరఫున జ్యోతి సింగ్ (13వ నిమిషంలో), సునెలితా టొప్పో (59వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుకు ఐవీ స్టాన్స్‌బై (17వ నిమిషంలో), డేలీ డాల్‌కెన్స్ (48వ నిమిషంలో), జేమీ లీ సుర్గా (52వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. తొలి క్వార్టర్ చివర్లో లభించిన పెనాల్టీ కార్నర్‌ను జ్యోతి సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ ఖాతా తెరిచింది. నాలుగు నిమిషాల తర్వాత ఆసీస్ స్కోరును సమం చేసింది. ఒకదశలో మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగుస్తుందనిపించింది. అయితే నాలుగు నిమిషాల వ్యవధిలో ఆసీస్ రెండు గోల్స్ చేసింది. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా భారత్ రెండో గోల్ చేసినా పరాజయాన్ని తప్పించుకోలేకపోయింది.

భారత స్పిన్‌కు శ్రీలంక చిత్తు

తొలి పోరులో 9 వికెట్లతో టీమిండియా ఘన విజయం

మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ • రేపు దక్షిణాఫ్రికాతో భారత్ పోరు


స్నేహ్ రాణా

కొలంబో: స్పిన్నర్లు సత్తా చాటడంతో ముక్కోణపు వన్డే మహిళల క్రికెట్ టోర్నీని భారత జట్టు ఘన విజయంతో మొదలు పెట్టింది. ఆదివారం జరిగిన తొలి పోరులో భారత్ 9 వికెట్ల తేడాతో శ్రీలంక జట్టును చిత్తు చేసింది. వర్షం కారణంగా ఆట రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దాంతో మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌట్ కాగా... అనంతరం భారత్ 29.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 149 పరుగులు సాధించింది. ఇటీవల కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన తీవ్రవాద దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళిగా భారత క్రికెటర్లు నల్లరంగు బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. రేపు జరిగే టోర్నీ రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడుతుంది. శ్రీలంక ఇన్నింగ్స్‌లో ఓపెనర్ హాసిని పెరీరా (46 బంతుల్లో 30; 4 ఫోర్లు) మినహా మిగతా వారెవరూ ప్రభావం చూపలేకపోయారు. ప్రధాన బ్యాటర్, కెప్టెన్ చమరి అటపట్టు (7)ను అరుంధతి రెడ్డి అవుట్ చేయడంతో లంక తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత 15 పరుగుల వ్యవధిలో జట్టు తర్వాతి 3 వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో కవీషా దిల్హారి (26 బంతుల్లో 25; 3 ఫోర్లు), అనుష్క సంజీవని (39 బంతుల్లో 22; 3 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ తర్వాతి బ్యాటర్లంతా విఫలం కావడంతో జట్టు తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ముగ్గురు భారత స్పిన్నర్లు స్నేహ్ రాణా, దీప్తి శర్మ, శ్రీచరణి కలిసి 7 వికెట్లు పడగొట్టడం విశేషం. ఛేదనలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రతీక రావల్ (62 బంతుల్లో 50 నాటౌట్; 7 ఫోర్లు) తన అద్భుత ఫామ్‌ను కొనసాగించగా, ఆరంభంలో క్రీజ్‌లో ఉన్నంతసేపు స్మృతి మంధాన (46 బంతుల్లో 43; 6 ఫోర్లు) తన ధాటిని ప్రదర్శించింది. 54 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంలో 43 పరుగులు ఆమెనే చేసింది. స్మృతి వెనుదిరిగిన తర్వాత ప్రతీక, హర్లీన్ డియోల్ (71 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు) రెండో వికెట్‌కు అభేద్యంగా 95 పరుగులు జత చేసి జట్టును గెలిపించారు. 62 బంతుల్లో ప్రతీక అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, తర్వాతి బంతికి హర్లీన్ ఫోర్ కొట్టడంతో మరో 9.2 ఓవర్లు మిగిలి ఉండగానే భారత్ విజయాన్ని అందుకుంది. కెరీర్‌లో ఏడో ఇన్నింగ్స్ ఆడిన ప్రతీకకు ఇది నాలుగో అర్ధసెంచరీ కాగా, మరో సెంచరీ ఆమె ఖాతాలో ఉంది.


ప్రతీక

శ్రీచరణి, కాశ్వీ అరంగేట్రం


శ్రీచరణి కాశ్వీ

లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టింది. 20 ఏళ్ల శ్రీచరణి స్వస్థలం వైఎస్‌ఆర్ కడప జిల్లా వీరపనాయునిపల్లి మండలం ఎర్రమల్లె గ్రామం. ఈ సీజన్ ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 2 మ్యాచ్‌లు ఆడటంతో ఆమెకు గుర్తింపు దక్కింది. తన తొలి వన్డేలో వరుసగా రెండు ఓవర్లలో 2 వికెట్లతో చరణి ఆకట్టుకుంది. భారత్ తరఫున శ్రీచరణితో పాటు పేసర్ కాశ్వీ గౌతమ్ కూడా ఇదే మ్యాచ్‌తో అరంగేట్రం చేసింది.

స్కోరు వివరాలు


శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని (ఎల్బీ) (బి) స్నేహ్ రాణా 30; చమరి అటపట్టు (సి) రిచా ఘోష్ (బి) అరుంధతి రెడ్డి 7; హర్షిత (రనౌట్) 14; హన్సిమ (సి అండ్ బి) స్నేహ్ రాణా 4; కవీష (సి) అరుంధతి రెడ్డి (బి) శ్రీచరణి 25; నీలాక్షిక (సి అండ్ బి) స్నేహ్ రాణా 10; అనుష్క (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) దీప్తి శర్మ 22; పియూమి (సి) ప్రతీక (బి) శ్రీచరణి 2; అచిని (సి) జెమీమా (బి) దీప్తి శర్మ 17; మల్కీ (రనౌట్) 2; ఇనోకా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (38.1 ఓవర్లలో ఆలౌట్) 147. వికెట్ల పతనం:** 1-23, 2-54, 3-67, 4-69, 5-93, 6-106, 7-112, 8-144, 9-147, 10-147. **బౌలింగ్:** కాశ్వీ గౌతమ్ 8-0-28-0, అరుంధతి రెడ్డి 8-0-26-1, దీప్తి శర్మ 5.1-0-22-2, స్నేహ్ రాణా 8-0-31-3, శ్రీచరణి 8-0-26-2, ప్రతీక రావల్ 1-0-2-0. **భారత్ ఇన్నింగ్స్:** ప్రతీక రావల్ (నాటౌట్) 50; స్మృతి మంధాన (సి అండ్ బి) ఇనోకా 43; హర్లీన్ డియోల్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (29.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 149. వికెట్ల పతనం:** 1-54. **బౌలింగ్:** మల్కీ మదారా 6-0-31-0, అచిని కులసూర్య 3-0-12-0, కవీష దిల్హారి 6-0-41-0, ఇనోకా రణవీర 7.4-2-32-1, చమరి అటపట్టు 4-0-22-0, పియూమి బదాల్గే 3-0-11-0.

బెంగళూరు ప్రతీకారం

దాదాపు రెండు వారాల క్రితం బెంగళూరు వేదికగా ఢిల్లీ, బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్... 163 పరుగులు చేసిన ఆర్‌సీబీ ఓటమి పాలైంది. అద్భుత ప్రదర్శనతో గెలిపించిన 'లోకల్ ప్లేయర్' కేఎల్ రాహుల్ మ్యాచ్ ముగిశాక 'ఇది నా అడ్డా' అన్నట్లుగా కాంతారా స్టయిల్‌లో సంబరం చేసుకున్నాడు. ఇప్పుడు అవే రెండు జట్ల మధ్య వేదిక ఢిల్లీకి మారింది. మ్యాచ్‌పై చర్చ కూడా కోహ్లి వర్సెస్ రాహుల్‌గానే సాగింది. ఈసారి ఆర్‌సీబీ విజయలక్ష్యం అదే 163 పరుగులు... 26/3తో బెంగళూరు కష్టాల్లో పడినట్లు కనిపించినా... కోహ్లి, కృనాల్ పాండ్యా శతక భాగస్వామ్యంతో ఆర్‌సీబీ ఘన విజయాన్ని అందుకొని బదులు తీర్చుకుంది. ఈసారి బ్యాటింగ్‌లో పరుగులు చేసేందుకు రాహుల్ తీవ్రంగా ఇబ్బంది పడగా... 'దిల్లీవాలా' కోహ్లి చక్కటి ఆటతో బెంగళూరు విజయానికి బాటలు వేశాడు. మ్యాచ్ ముగిశాక ప్రతీకార శైలిలో కోహ్లి విజయనాదం చేశాడు.

ఢిల్లీపై ఆర్‌సీబీ ఘన విజయం
- పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి
- కృనాల్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- కోహ్లి అర్ధ సెంచరీ


కృనాల్ పాండ్యా


కోహ్లి గెలుపు జోష్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య సమరం 1-1తో సమంగా ముగిసింది. సొంతగడ్డపై గత మ్యాచ్‌లో ఓడిన బెంగళూరు ఈసారి ప్రత్యర్థి మైదానంలో విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (39 బంతుల్లో 41; 3 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (18 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే ఫర్వాలేదనిపించగా, భువనేశ్వర్ 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అనంతరం బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 165 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కృనాల్ పాండ్యా (47 బంతుల్లో 73 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (47 బంతుల్లో 51; 4 ఫోర్లు) నాలుగో వికెట్‌కు 84 బంతుల్లో 119 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

బ్యాటింగ్ తడబాటు...

అభిషేక్ పొరేల్ (11 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టబ్స్ కలిసి 29 బంతుల్లో 62 పరుగులు చేయగా... మిగతా బ్యాటర్లంతా కలిసి 92 బంతుల్లో 96 పరుగులు మాత్రమే సాధించడం ఢిల్లీ బ్యాటింగ్ పరిస్థితిని చూపిస్తోంది. భువనేశ్వర్ ఓవర్లో 2 సిక్స్‌లతో ధాటిని ప్రదర్శించిన పొరేల్ ఎక్కువ సేపు నిలవలేకపోగా, కరుణ్ నాయర్ (4) విఫలమయ్యాడు. పవర్‌ప్లేలో జట్టు 52 పరుగులు చేసింది. అయితే ఆపై ఆర్‌సీబీ స్పిన్నర్లు సుయాశ్, కృనాల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల రాక కష్టంగా మారిపోయింది. ఈ ఇద్దరు బౌలర్లు కలిసి 8 ఓవర్లలో 2 ఫోర్లు, 1 సిక్స్ సహా 50 పరుగులు మాత్రమే ఇచ్చారు. ఒత్తిడిలో డుప్లెసిస్ (22), అక్షర్ పటేల్ (15) వెనుదిరగ్గా... రాహుల్ కూడా షాట్లు ఆడేందుకు బాగా ఇబ్బంది పడ్డాడు. భువీ ఒకే ఓవర్లో రాహుల్, అశుతోష్ (2)లను అవుట్ చేయడంతో ఢిల్లీ 17 ఓవర్లలో 120/6 వద్ద నిలిచింది. అయితే స్టబ్స్ దూకుడుగా ఆడటంతో తర్వాతి రెండు ఓవర్లలో 36 పరుగులు వచ్చి స్కోరు 150 దాటింది.

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో బెంగళూరుకు సరైన ఆరంభం లభించలేదు. ఆరు పరుగుల వ్యవధిలో బెథెల్ (12), పడిక్కల్ (0), పాటీదార్ (6) వెనుదిరగడంతో స్కోరు 26/3 వద్ద నిలిచింది. ఈ దశలో కోహ్లి, కృనాల్ కలిసి చక్కటి సమన్వయంతో జట్టును ఆదుకున్నారు. ఆరంభంలో జాగ్రత్తగా ఆడినా... నిలదొక్కుకున్న తర్వాత కృనాల్ ధాటిని పెంచాడు. 8 ఓవర్లలో 85 పరుగులు చేయాల్సిన సమయంలో తర్వాతి 3 ఓవర్లలో బెంగళూరు 36 పరుగులు రాబట్టడంతో పని సులువైంది. ఈ క్రమంలో సిక్సర్లతో చెలరేగిన కృనాల్ 38 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. 2016 సీజన్‌లో తన ఏకైక హాఫ్ సెంచరీని సాధించిన కృనాల్ ఇన్నేళ్లకు మళ్లీ ఆ మార్క్‌ను దాటడం విశేషం. ఆ తర్వాత కోహ్లి కూడా 45 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. విజయానికి 18 పరుగుల దూరంలో కోహ్లి అవుటైనా... కృనాల్, టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కలిసి 9 బంతుల ముందే మ్యాచ్‌ను ముగించారు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పొరేల్ (సి) జితేశ్ శర్మ (బి) హాజల్‌వుడ్ 28; డుప్లెసిస్ (సి) కోహ్లి (బి) కృనాల్ 22; కరుణ్ నాయర్ (సి) భువనేశ్వర్ (బి) దయాళ్ 4; రాహుల్ (సి) బెథెల్ (బి) భువనేశ్వర్ 41; అక్షర్ (బి) హాజల్‌వుడ్ 15; స్టబ్స్ (సి) హాజల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 34; అశుతోష్ (బి) భువనేశ్వర్ 2; విప్‌రాజ్ (రనౌట్) 12; స్టార్క్ (నాటౌట్) 0; చమీరా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-33, 2-44, 3-72, 4-102, 5-118, 6-120, 7-158, 8-162. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-33-3, యశ్ దయాళ్ 4-0-42-1, హాజల్‌వుడ్ 4-0-36-2, సుయాశ్ శర్మ 4-0-22-0, కృనాల్ పాండ్యా 4-0-28-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: బెథెల్ (సి) నాయర్ (బి) అక్షర్ 12; కోహ్లి (సి) స్టార్క్ (బి) చమీరా 51; పడిక్కల్ (బి) అక్షర్ 0; పాటీదార్ (రనౌట్) 6; కృనాల్ (నాటౌట్) 73; డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (18.3 ఓవర్లలో 4 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-20, 2-20, 3-26, 4-145. **బౌలింగ్:** అక్షర్ పటేల్ 4-0-19-2, స్టార్క్ 3-0-31-0, ముకేశ్ కుమార్ 3.3-0-51-0, విప్‌రాజ్ 1-0-12-0, కుల్దీప్ 4-0-28-0, చమీరా 3-0-24-1.

ముంబై 'పాంచ్' పంచ్

సీజన్‌లో వరుసగా ఐదో విజయం
- 54 పరుగులతో లక్నో ఓటమి
- రాణించిన రికెల్టన్, సూర్య, జాక్స్


పంత్

ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో మరింత వేగంగా దూసుకుపోతోంది. తొలి ఐదు మ్యాచ్‌లలో ఒకటే గెలిచి ఇబ్బందుల్లో కనిపించిన టీమ్ ఒక్కసారిగా జూలు విదిల్చింది. ఇప్పుడు వరుసగా ఐదో విజయంతో 'ప్లే ఆఫ్స్' రేసుకు మరింత చేరువైంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఓడిన ముంబై ఇప్పుడు సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో సత్తా చాటి ప్రతీకారం తీర్చుకుంది. మరోవైపు ముందుగా బౌలింగ్, ఆపై బ్యాటింగ్ వైఫల్యంతో సూపర్ జెయింట్స్ చేతులెత్తేసింది. గత నాలుగు మ్యాచ్‌లలో లక్నోకు ఇది మూడో ఓటమి.

ముంబై: హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ మరో భారీ విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన పోరులో ముంబై 54 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 58; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 54; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది. ఆయుశ్ బదోని (22 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (24 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. బుమ్రా 4, బౌల్ట్ 3 వికెట్లు పడగొట్టగా, ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన విల్ జాక్స్ (29, 2/18) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సమష్టి బ్యాటింగ్...

ప్రిన్స్ వేసిన రెండో ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో రికెల్టన్ జోరు ప్రదర్శించగా, మరోవైపు రోహిత్ శర్మ (12), ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న మయాంక్ యాదవ్ మధ్య ఆసక్తికర పోరు సాగింది. మయాంక్ ఓవర్లో 141 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన రెండు బంతులను వరుసగా పుల్ షాట్‌లతో రోహిత్ సిక్సర్లుగా మలిచాడు. అయితే అదే ఓవర్లో 120 కిలోమీటర్ల వేగంతో వచ్చిన స్లో బంతికి అతను వెనుదిరిగాడు. దిగ్వేశ్ రాఠీ ఓవర్లో రికెల్టన్ 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో పవర్‌ప్లేలో ముంబై 66 పరుగులు సాధించింది. 25 బంతుల్లో రికెల్టన్ హాఫ్ సెంచరీ పూర్తయింది. విల్ జాక్స్ (21 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లు ఆడగా... రవి బిష్ణోయ్ ఓవర్లో సూర్యకుమార్ వరుసగా 6, 4, 4 కొట్టాడు. ఈ క్రమంలో అతను 27 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. తిలక్ వర్మ (6), హార్దిక్ పాండ్యా (5) విఫలం కాగా... చివర్లో నమన్ ధీర్ (11 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కార్బిన్ బాష్ (10 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడి స్కోరును 200 దాటించారు.


విల్ జాక్స్‌కు సహచరుల అభినందన

పంత్ మళ్లీ విఫలం...

భారీ ఛేదనలో లక్నో ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. తన తొలి ఓవర్లోనే మార్క్‌రమ్ (9)ను అవుట్ చేసి బుమ్రా తొలి దెబ్బ కొట్టాడు. మార్ష్, నికోలస్ పూరన్ (15 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) క్రీజ్‌లో ఉన్న సమయంలో లక్నో తగిన రీతిలో జవాబిచ్చినట్లే కనిపించింది. చహర్ ఓవర్లో పూరన్ వరుసగా 3 సిక్స్‌లతో చెలరేగడంతో 6 ఓవర్లలో స్కోరు 60 పరుగులకు చేరింది. అయితే రెండు బంతుల వ్యవధిలో పూరన్, రిషభ్ పంత్ (4)లను జాక్స్ అవుట్ చేయడంతో పరిస్థితి మారింది. కరణ్ శర్మ ఓవర్లో బదోని 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టి ధాటిని ప్రదర్శించాడు. ఆ తర్వాత బౌల్ట్ తన వరుస ఓవర్లలో మార్ష్, బదోనిలను వెనక్కి పంపడంతో లక్నో ఆశలకు కళ్లెం పడింది. చివరి 5 ఓవర్లలో విజయానికి లక్నో 76 పరుగులు చేయాల్సి ఉండగా... 16వ ఓవర్ వేసిన బుమ్రా 3 వికెట్లు తీయడంతోనే జెయింట్స్ ఓటమి ఖాయమైంది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) బదోని (బి) రాఠీ 58; రోహిత్ (సి) ప్రిన్స్ (బి) మయాంక్ 12; జాక్స్ (బి) ప్రిన్స్ 29; సూర్యకుమార్ (సి) మార్ష్ (బి) అవేశ్ 54; తిలక్ (సి) ప్రిన్స్ (బి) బిష్ణోయ్ 6; పాండ్యా (బి) మయాంక్ 5; నమన్ (నాటౌట్) 25; బాష్ (సి) పూరన్ (బి) అవేశ్ 20; చహర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1-33, 2-88, 3-116, 4-137, 5-157, 6-180, 7-208. **బౌలింగ్:** మయాంక్ యాదవ్ 4-0-40-2, ప్రిన్స్ యాదవ్ 4-0-44-1, దిగ్వేశ్ రాఠీ 4-0-48-1, రవి బిష్ణోయ్ 4-0-41-1, అవేశ్ ఖాన్ 4-0-42-2.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 34; మార్క్‌రమ్ (సి) నమన్ (బి) బుమ్రా 9; పూరన్ (సి) సూర్యకుమార్ (బి) జాక్స్ 27; పంత్ (సి) కరణ్ (బి) జాక్స్ 4; బదోని (సి) జాక్స్ (బి) బౌల్ట్ 35; మిల్లర్ (సి) బాష్ (బి) బుమ్రా 24; సమద్ (బి) బుమ్రా 2; బిష్ణోయ్ (బి) బాష్ 13; అవేశ్ (బి) బుమ్రా 0; ప్రిన్స్ (నాటౌట్) 4; రాఠీ (బి) బౌల్ట్ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 161. వికెట్ల పతనం:** 1-18, 2-60, 3-64, 4-110, 5-135, 6-141, 7-142, 8-142, 9-157, 10-161. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-20-3, దీపక్ చహర్ 3-0-38-0, బుమ్రా 4-0-22-4, జాక్స్ 2-0-18-2, కరణ్ శర్మ 2-0-25-0, హార్దిక్ పాండ్యా 1-0-10-0, బాష్ 4-0-26-1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	10	7	3	0	14	0.521
గుజరాత్	8	6	2	0	12	1.104
ముంబై	10	6	4	0	12	0.889
ఢిల్లీ	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
లక్నో	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	9	3	5	1	7	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్తాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × గుజరాత్
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పరాజయంతో ప్రారంభం

సుదిర్మన్ కప్‌లో భారత్‌కు నిరాశ • తొలి లీగ్ మ్యాచ్‌లో డెన్మార్క్ చేతిలో ఓడిన టీమిండియా


పీవీ సింధు

జియామెన్ (చైనా): స్టార్ జోడీలు లేకుండానే ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత జట్టుకు నిరాశ ఎదురైంది. గ్రూప్ 'డి'లో భాగంగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 1-4 తేడాతో డెన్మార్క్ చేతిలో ఓడిపోయింది. ఈ పరాజయంతో భారత జట్టు నాకౌట్ దశకు చేరుకోవాలంటే తదుపరి రెండు మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గాయాల కారణంగా పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం ఈ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉన్నాయి. దాంతో భారత జట్టు విజయావకాశాలన్నీ రెండు సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడ్డాయి. అయితే ఈ రెండింటిలోనూ భారత స్టార్స్ ఆకట్టుకోలేకపోయారు. వెరసి ఈ టోర్నీని భారత జట్టు పరాజయంతో మొదలుపెట్టింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 13-21, 14-21తో జెస్పర్ టాఫ్ట్-అమెలీ మేగ్‌లండ్ జోడీ చేతిలో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో భారత రెండో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 15-21, 16-21తో ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రూబన్ కుమార్ ద్వయం 7-21, 4-21తో ప్రపంచ నంబర్‌వన్ ఆండెర్స్ స్కారప్-కిమ్ అస్ట్రుప్ జోడీ చేతిలో ఓడిపోవడంతో భారత పరాజయం ఖరారైంది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ పీవీ సింధు 20-22, 21-23తో లినె హోమార్క్ జార్స్‌ఫెల్డ్ చేతిలో ఓడిపోయింది. రెండు గేముల్లోనూ సింధు ఒకదశలో ఆధిక్యంలో ఉన్నా దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. చివరిదైన ఐదో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-శ్రుతి మిశ్రా ద్వయం 13-21, 18-21తో నటాషా-అలెగ్జాండ్రా బోయె జంటను ఓడించి భారత్ క్లీన్‌స్వీప్ కాకుండా కాపాడింది. మంగళవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఇండోనేసియాతో భారత్ ఆడుతుంది.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	589	79,213
నిఫ్టీ ▽	207	24,039

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,383	△	217
డోజోన్స్	40,113	△	20
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,415	△	8
డాక్స్	22,242	△	178
షాంఘై	3,295	▽	2
నికాయ్	35,706	△	667

అమెరికా, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.30	115.21
€	యూరో	ఎస్‌బీఐ	95.71	98.40
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.74	55.94
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.63	67.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.89	23.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.37	24.16
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.85	12.67



ఈపీఎఫ్ క్లెయిమ్‌కు వెళ్తున్నారా..?

వేతన జీవుల్లో అధిక శాతం మందికి నెలవారీ ఖర్చులు ఆదాయాన్ని మించుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రుణాలను ఆశ్రయిస్తున్నారు. దీని ఫలితమే పర్సనల్, క్రెడిట్ కార్డ్, బంగారం రుణాలు గడిచిన కొన్నేళ్లలో గణనీయంగా పెరిగిపోవడం చూస్తున్నాం. కానీ, ఒక్కసారి ఈ రుణ చక్రంలోకి దిగితే.. అది అంత తొందరగా విడిచిపెట్టదు. అందుకే దీనికి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. ఇటీవలి కాలంలో వేతన జీవుల నుంచి భవిష్యనిధి క్లెయిమ్‌లు పెరగడం చూస్తున్నాం. అత్యవసరాల్లో ఈపీఎఫ్ నుంచి పాక్షిక ఉపసంహరణ అవకాశాన్ని ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. నిర్దేశిత అర్హతలు, నిబంధనల మేరకే ఈపీఎఫ్ క్లెయిమ్ చేసుకోగలరు. ఈ విషయంలో ఎలా వ్యవహరించాలన్న దానిపై నిపుణులు అందిస్తున్న సమాచారం ఇది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

- నిబంధనలు, అర్హతలు తెలుసుకోవాలి
- విద్య, వైద్యం, ఇంటి కోసం తీసుకోవచ్చు
- ఇంటి కోసం 90% వరకు అనుమతి
- మిగిలిన వాటికి ఉపసంహరణ పరిమితంగానే
- కొన్ని క్లెయిమ్‌లకు కనీస సర్వీస్ ఉండాల్సిందే
- ఐదేళ్లలోపు రూ. 50 వేలు మించితే టీడీఎస్

‘ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వేతన జీవుల భవిష్యత్ లక్ష్యాల కోసం ఉద్దేశించిన సాధనం అని అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ముఖ్యంగా రిటైర్మెంట్ అవసరాల కోసం దీన్ని ఏర్పాటు చేశారు. అదే సమయంలో సొంతిల్లు, వైద్య అవసరాల్లోనూ దీన్ని వినియోగించుకోవచ్చు. భవిష్యత్ లక్ష్యాల కోసం ఉద్దేశించిన ఈ నిధిని తాత్కాలిక అవసరాల కోసం ఖాళీ చేయడం మంచి నిర్ణయం అనిపించుకోదు. కానీ, ఆర్థిక, అత్యవసర పరిస్థితుల్లో కొందరు ఉద్యోగులకు మరో ప్రత్యామ్నాయం లేకపోవచ్చు. ఖర్చులు ఆదాయాన్ని మించినప్పుడు.. రుణాలు తీసుకోవడం వల్ల చెల్లింపులు భారంగా మారతాయి. కనుక విశ్రాంత జీవనం కోసం ప్రత్యామ్నాయ ప్రణాళిక కలిగిన వారు.. విద్య, వైద్యం, వివాహం వంటి అత్యంత ముఖ్యమైన, క్లిష్టమైన అవసరాల్లో ఈపీఎఫ్ క్లెయిమ్‌ను పరిశీలించొచ్చు. అలాంటి సందర్భాల్లో ఎంత మేర వెనక్కి తీసుకోవచ్చు? అర్హతల గురించి ఉద్యోగులకు తప్పక అవగాహన ఉండాలి.

ఏ అవసరానికి ఎంత?

వివాహం లేదా ఉన్నత విద్య కోసం ఈపీఎఫ్ నిధిని వినియోగించుకోవాలంటే కఠిన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఉద్యోగి కనీసం ఏడేళ్ల పాటు ఈపీఎఫ్ సభ్యుడు/సభ్యురాలిగా ఉంటేనే ఈ అవసరాల కోసం క్లెయిమ్ చేసుకునేందుకు అర్హత లభిస్తుందని ప్రావిడెంట్ ఫండ్ మాజీ ప్రాంతీయ కమిషనర్ సంజయ్ కేసరి తెలిపారు. ఉద్యోగంలో చేరిన తేదీ క్లెయిమ్ తేదీకి ఏడేళ్ల ముందు అయి ఉండాలన్నారు. ఈ నిబంధనలో ఎలాంటి వెసులుబాటు ఉండదు. తన సర్వీస్ మొత్తంలో ఉన్నత విద్య (పదో తరగతి తర్వాత చదువులు), వివాహ అవసరాల కోసం కలిపి మూడు పర్యాయాలు ఉపసంహరణకు వెళ్లొచ్చు. ఒకవేళ వైద్యం కోసం అయితే సర్వీస్‌తో సంబంధం లేకుండా క్లెయిమ్‌కు వెళ్లొచ్చు. గరిష్ఠంగా క్లెయిమ్ ఇన్ని సార్లు అన్న పరిమితి అయితే లేదు.

వివాహం

ఉద్యోగి తన సొంత వివాహం కోసం, తన తోడ బుట్టిన వారి వివాహం కోసం, తన పిల్లల వివాహాల కోసం పీఎఫ్ నిధిని పొందొచ్చు. కనీసం ఏడేళ్ల సర్వీస్ ఉండాలి. ఉద్యోగి వాటాల రూపంలో జమలు, వడ్డీ నుంచి 50 శాతం ఉపసంహరించుకోవచ్చు.

వైద్యం

సభ్యుడు, అతను/ఆమె జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, తన పిల్లల వైద్యం కోసం తీసుకోవచ్చు. వైద్య అవసరాలకు కనీస సర్వీస్ నిబంధన వర్తించదు. ఎన్ని పర్యాయాలు ఉపసంహరించుకోవచ్చన్న పరిమితి లేదు. ఉద్యోగి స్వీయ జమల రూపంలో పోగైన మొత్తం, వడ్డీ లేదా.. నెలవారీ మూలవేతనం, డీఏకి ఆరు రెట్లు.. ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అంత మేరకు వెనక్కి తీసుకోవచ్చు.

ఇల్లు

ప్లాట్ కొనుగోలు లేదా ఇల్లు/ఫ్లాట్ నిర్మాణం, కొనుగోలు కోసం ఉద్యోగి తన జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే పీఎఫ్ క్లెయిమ్‌కు వెళ్లొచ్చు. కనీసం ఐదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసి ఉండాలి. ఉద్యోగి సొంతంగా లేదా జీవిత భాగస్వామితో కలసి జాయింట్‌గా ప్రాపర్టీ కొనుగోలు చేయడం లేదా కలిగి ఉండడం తప్పనిసరి. ప్లాట్ కొనుగోలుకు అయితే నెల జీతానికి 24 రెట్లు.. ఇల్లు కొనుగోలు లేదా ఇంటి నిర్మాణం కోసం అయితే నెలవారీ జీతానికి 36 రెట్లు.. లేదా ఉద్యోగి, యాజమాన్యం జమలు, వీటిపై వడ్డీ మొత్తం.. లేదా కొనుగోలు/నిర్మాణ వ్యయం.. ఇందులో ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు.

గృహ నవీకరణ

ఇల్లు నిర్మించుకున్న ఐదేళ్ల తర్వాత అనుమతిస్తారు. ఉద్యోగి నెలవారీ మూలవేతనం, డీఏకి 12 రెట్ల వరకు తీసుకోవచ్చు. లేదా ఉద్యోగి స్వీయ జమలు, వాటిపై వడ్డీ.. లేదా నవీకరణకు అయ్యే వ్యయం.. ఈ మూడింటిలో తక్కువ మొత్తాన్నే అనుమతిస్తారు.

గృహ రుణం తీర్చివేసేందుకు

కనీసం మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలి. బ్యాలన్స్ నుంచి 90% వెనక్కి తీసుకోవచ్చు.

విద్య

తన కుమారుడు లేదా కుమార్తెల ఉన్నత విద్య కోసమే భవిష్య నిధి నుంచి పాక్షిక ఉపసంహరణకు అనుమతిస్తారు. కనీసం ఏడేళ్ల సర్వీస్ ఉండాలి. ఉద్యోగి జమలు, వడ్డీ మొత్తం నుంచి 50 శాతాన్ని తీసుకోవచ్చు. ఇలా 3 పర్యాయాలు ఉపసంహరించుకోవచ్చు. ఈ 3 సార్లు అన్న పరిమితి వివాహం, విద్యకు కలిపి వర్తిస్తుంది.



ఉద్యోగం కోల్పోయిన పరిస్థితుల్లో..



ఒకచోట ఉద్యోగం కోల్పోవడం లేదంటే మానివేసి.. నెల రోజులకు పైగా మరో ఉపాధి లేని పరిస్థితుల్లో పీఎఫ్ బ్యాలన్స్ నుంచి 75 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఉపాధి లేకుండా రెండు నెలలు దాటిపోతే అప్పుడు మిగిలిన 25 శాతాన్ని కూడా వెనక్కి తీసేసుకోవడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఒక సంస్థలో ఉద్యోగం మానేశామన్న కారణంతో పీఎఫ్ ఖాతాను ఖాళీ చేయాలనేమీ లేదు. మరో సంస్థలో చేరిన తర్వాత పీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకోవచ్చు. తద్వారా అందులో ప్రయోజనాలను అలాగే కొనసాగించుకోవచ్చు.

54 ఏళ్లు నిండితే..



54 ఏళ్లు నిండిన తర్వాత, ముందస్తు పదవీ విరమణ/వయోభారం రీత్యా విరమణ చేసిన వారు 58 ఏళ్లు రాకముందే మొత్తం పీఎఫ్ బ్యాలన్స్‌లో 90 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు.

ఉపసంహరణ ఎలా..?



ఆన్‌లైన్ క్లెయిమ్ ప్రక్రియను ఈపీఎఫ్‌వో ఎంతో సులభతరం చేసింది. ఈపీఎఫ్ ఇండియా పోర్టల్‌కు వెళ్లి కుడి భాగంలో పైన కనిపించే ‘ఆన్‌లైన్ క్లెయిమ్స్’ దగ్గర క్లిక్ చేయాలి. ఆ తర్వాత ప్రత్యేక విండో తెరుచుకుంటుంది. అక్కడ ‘యూఏఎన్’ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి, మొబైల్‌కు వచ్చే ఓటీపీతో లాగిన్ అవ్వాలి. లాగిన్ పూర్తయిన తర్వాత పైన కనిపించే ఆప్షన్లలో ‘ఆన్‌లైన్ సర్వీసెస్’ సెక్షన్‌లో ‘క్లెయిమ్ ఫారమ్’ను ఎంపిక చేసుకోవాలి. అక్కడ యూఏఎన్‌కు లింక్ చేసిన బ్యాంక్ ఖాతా నంబర్‌ను నమోదు చేసి ధ్రువీకరించాలి. అక్కడ పీఎఫ్ అడ్వాన్స్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత సెలక్ట్ సర్వీస్ దగ్గర పనిచేస్తున్న సంస్థను ఎంపిక చేసుకోవాలి. దాని కింద క్లెయిమ్ దేనికోసమన్న కారణాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం అక్కడ కోరిన వివరాలు ఇచ్చి దరఖాస్తును సమర్పించాలి. చివరిగా మొబైల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేసిన అనంతరం అది విజయవంతంగా దాఖలవుతుంది. క్లెయిమ్ దరఖాస్తు పురోగతిని సైతం ఇదే మాదిరి లాగిన్ అయ్యి చెక్ చేసుకోవచ్చు. పరిశీలన కోసం చెక్ కాపీని స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి రావచ్చు. కనుక ముందే సిద్ధం చేసుకోవాలి. సంబంధిత చెక్ లీఫ్‌పై సభ్యుడి పేరు, బ్యాంక్ ఖాతా తదితర వివరాలు ఉండాలి. ఉమంగ్ యాప్ నుంచి కూడా క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు.

అదే ఆఫ్‌లైన్‌లో క్లెయిమ్ దరఖాస్తు సమర్పించేందుకు, కావాల్సిన అన్ని డాక్యుమెంట్లతో సమీపంలోని ఈపీఎఫ్‌వో కార్యాలయానికి వెళితే సరిపోతుంది. అక్కడ విత్‌డ్రాయల్ ఫారమ్ పూరించి, వారు కోరినట్టు డాక్యుమెంట్లను జత చేసి సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో క్లెయిమ్ దరఖాస్తు 3–4 రోజుల్లో పరిష్కారం అవుతుంది. క్లెయిమ్ రూ. లక్ష లోపు ఉంటే ఆటోమేటిక్‌గా అనుమతి లభిస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఇందుకు 10–20 రోజులు పట్టొచ్చు. ఈపీఎఫ్ ఖాతా నుంచి ఉపసంహరించుకున్న నిధులను, రుణం కాదు కనుక తిరిగి జమ చేయాల్సిన అవసరం లేదు. అలాగే, ఈపీఎఫ్ బ్యాలన్స్‌పై ఎలాంటి రుణ సదుపాయం లేదు.

- క్లెయిమ్ భారీగా ఉంటే అప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు లేదా వైద్య డాక్యుమెంట్ల కాపీలు అప్‌లోడ్ చేయాల్సి రావచ్చు.
- అర్హతలు, పరిమితులను ఒక్కసారి సమగ్రంగా తెలుసుకోవాలి. ముఖ్యమైన అవసరాల్లోనే ఈపీఎఫ్‌ను వివేకంగా ఉపయోగించుకోవాలన్నది నిపుణుల సూచన.
- ఈపీఎఫ్ క్లెయిమ్‌కు వెళ్లే ముందు తమ కేవైసీ వివరాలు సరిగ్గా ఉన్నాయేమో ఒక్కసారి సరి చూసుకోవాలి. అంటే బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, పాన్ వివరాలు నమోదు చేసి, ధ్రువీకరించి ఉండాలి. దీనివల్ల క్లెయిమ్ దరఖాస్తు తిరస్కరణకు గురికాకుండా ఉంటుంది.

పన్ను భారం?

ఈపీఎఫ్ ఖాతా ప్రారంభించిన ఐదేళ్ల తర్వాత ఉపసంహరణకు వెళితే ఆ మొత్తంపై ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఒకవేళ సర్వీస్ ఐదేళ్లలోపు ఉండి, ఉపసంహరించుకునే మొత్తం రూ.50,000 మించితే అప్పుడు దీనిపై 10 శాతం టీడీఎస్ మినహాయిస్తారు. పాన్ నంబర్ ఇవ్వకపోతే 20 శాతం టీడీఎస్ పడుతుంది. ఐదేళ్లలోపు రూ.50 వేలకు మించి ఉపసంహరించుకుంటే ఆ మొత్తాన్ని వార్షిక ఆదాయానికి కలిపి చూపించి నిబంధనల మేరకు పన్ను చెల్లించాల్సి వస్తుంది. పన్ను పరిధిలోకి రాకపోతే, పీఎఫ్‌పై మినహాయించిన టీడీఎస్‌ను రిఫండ్ కోరొచ్చు. ఒకవేళ ఉద్యోగం నుంచి తొలగింపునకు గురై లేదా కంపెనీ మూసివేసిన కేసుల్లో ఉద్యోగులు పీఎఫ్ నిధిని ఉపసంహరించుకుంటే, అప్పుడు సర్వీస్ ఐదేళ్లలోపు ఉన్నా సరే ఆ మొత్తం పన్ను పరిధిలోకి రాదు.



బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,023 **టార్గెట్: రూ. 1,415**

ఎందుకంటే: రియల్టీ కంపెనీ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ గత ఐదేళ్ల కాలం (2020–24)లో వార్షిక ప్రాతిపదికన ముందస్తు అమ్మకాలలో సగటున 36 శాతం వృద్ధిని సాధించింది. ఈ బాటలో మరో మూడేళ్ల (2025–27) 24 శాతం మించి పురోగతిని అందుకోగలదని భావిస్తున్నాం. ఇందుకు హైదరాబాద్, చెన్నైలలో కార్యకలాపాల విస్తరణ సహకరించనుండగా.. పటిష్ట పైప్‌లైన్ (విడుదలకానున్న ప్రాజెక్టు అంచనాలు) సైతం దోహదపడనున్నట్లు కంపెనీ పేర్కొంటోంది. జనవరి మొదలు కంపెనీ ప్రీమియం రెసిడెన్షియల్ సహా పలు ప్రస్తావించదగ్గ ప్రాజెక్టులను ప్రవేశపెట్టింది. ఈ జాబితాలో బెంగళూరులోని రూ. 2,700 కోట్ల స్థూల డెవలప్‌మెంట్ విలువ (జీడీవీ) కలిగిన ఎటెర్నియా, రూ. 380 కోట్ల జీడీవీ గల ఆర్కేడ్స్‌తోపాటు.. చెన్నైలోని అత్యంత విలాసవంత (అల్ట్రా లగ్జరీ) ప్రాజెక్ట్ ఆల్టియస్ తోడ్పాటునివ్వనున్నాయి. వెరసి అత్యధిక డిమాండు గల పట్టణ ప్రాంతాలు, సంపన్నవర్గ కొనుగోలుదారులను ఆకట్టుకునే టాప్‌టైర్ ప్రాపర్టీలతో కంపెనీ వ్యూహాత్మకంగా ముందుకుసాగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో కలెక్షన్లు రూ. 9,400 కోట్లను తాకగలవని అంచనా. అంటే 2024–27 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 34 శాతం వృద్ధికి వీలుంది. దీంతో ఇదే కాలంలో మొత్తం రూ. 10,000 కోట్ల నిర్వహణ సంబంధ నగదు ఆర్జనను సాధించే అవకాశముంది. మరోవైపు వివిధ ప్రాంతాలలో అద్దె ఆస్తులను సైతం ప్రారంభించడంతో 2024–27 మధ్య కాలంలో అద్దె ఆదాయం వార్షికంగా 15 శాతం చొప్పున లభించగలదని భావిస్తున్నాం. అంతేకాకుండా ఆతిథ్య రంగ పోర్ట్‌ఫోలియోను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయడం ద్వారా కంపెనీ అదనపు నగదును సమకూర్చుకునే వీలుంది.

స్టాక్స్ వ్యూ



ఇన్నోవా క్యాప్‌ట్యాబ్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 886 **టార్గెట్: రూ. 1,120**

ఎందుకంటే: ఫార్మా కంపెనీ ఇన్నోవా క్యాప్‌ట్యాబ్ జమ్మూలో కొత్తగా ప్రారంభించిన తయారీ కేంద్రాన్ని ఇటీవల సందర్శించాం. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యంతో జమ్మూ వృద్ధి అవకాశాలపై సమావేశమయ్యాం. తద్వారా కంపెనీ పురోగతి, భవిష్యత్‌పై యాజమాన్యం పలు అంశాలను వివరించింది. జమ్మూ ప్లాంటును 11 ఎకరాలలో నాలుగు బ్లాకులుగా ఏర్పాటు చేసింది. వీటిలో మూడు బ్లాకులను పూర్తిగా యాంటీబయోటిక్స్ కోసం కేటాయించగా, మరో బ్లాకును సాధారణ అవసరాల కోసం నెలకొల్పింది. జమ్మూ యూనిట్ వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి ప్రారంభించింది. దీంతో ప్రస్తుతం పెన్సిలిన్ ప్రాడక్టులు సహా పెన్యుమ్స్, భారీ పరిమాణంలో పేరంటల్స్, రెస్పిరేటరీ క్యాప్సూల్స్‌ను రూపొందించగలుగుతోంది. మరోపక్క సెఫలోస్పోరిన్ తయారీ సామర్థ్యాన్ని సైతం విస్తరించింది. తద్వారా ఓరల్ సెఫ్ విభాగంలో కంపెనీ మార్కెట్ వాటాను ప్రస్తుత 5–6 శాతం నుంచి పెంచుకునే వీలుంది. ఎగుమతులనూ విస్తరించనుంది. దేశీయంగా ఉత్పత్తిని ఈయూ జీఎంపీ సర్టిఫికేషన్ కలిగిన బడ్డీ (హిమాచల్‌ప్రదేశ్) ప్లాంటు నుంచి జమ్మూకి మార్చనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో జమ్మూ ప్లాంటు నుంచి రూ. 400–500 కోట్ల ఆదాయం సాధించగలమని యాజమాన్యం ధీమా వ్యక్తం చేస్తోంది. గరిష్టస్థాయిలో వినియోగాన్ని పెంచుకుంటే రూ. 1,500–1,600 కోట్ల టర్నోవర్‌కు చేరుకోగలమని భావిస్తోంది. జమ్మూ ప్లాంటు గరిష్ట వినియోగాన్ని సాధిస్తే 2025–27 మధ్య కాలంలో వార్షికంగా ఆదాయం 34 శాతం, నిర్వహణ లాభం 39 శాతం, నికర లాభం 41 శాతం చొప్పున పుంజుకోగలవని అంచనా. వెరసి 20 శాతానికి మించిన ఆర్‌వోఐసీ, తక్కువ వర్కింగ్ క్యాపిటల్, పటిష్ట నిర్వహణా నగదు ఆర్జన కంపెనీకి లబ్ధిని చేకూర్చనున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

50-30-20 అనుకూలమేనా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మూడు నుంచి ఐదేళ్ల కాలానికి.. కార్పొరేట్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్, పీఎస్‌యూ ఫండ్స్‌లో ఏది అనుకూలం? – మంజునాథ్


కార్పొరేట్ బాండ్ ఫండ్స్ 80 శాతం అధిక క్రెడిట్ రేటింగ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. బ్యాంకింగ్ అండ్ పీఎస్‌యూ ఫండ్స్ 80 శాతం బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. వీటితోపాటు షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్ని రకాల పరిస్థితుల్లోనూ అనుకూలమైనవి. దీర్ఘకాలంలో వీటిలోని రిస్క్–రాబడులు ఇంచుమించు ఒకే మాదిరి ఉంటాయి. ఇన్వెస్టర్లు రెండు కారణాల దృష్ట్యా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి వివిధ రకాల డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. వైవిధ్యం ఎక్కువ. మెచ్యూరిటీ కాలంపై స్పష్టత ఉంటుంది. ఏడాది కాలానికి మించిన లక్ష్యాల కోసం, డెట్ విభాగంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి.

ఇంటి బడ్జెట్ విషయంలో 50–30–20 ఆర్థిక సూత్రం గురించి విన్నాను. నా ఆర్థిక అంశాలకు ఇది మంచి సూత్రమేనా? – కరణ్ రాథోడ్

మీ నెలవారీ ఆదాయాలను ఏ రకంగా వర్గీకరించాలన్నది ఈ సూత్రం తెలియజేస్తుంది. ఆదాయంలో 20 శాతాన్ని అవసరాల కోసం కేటాయించాలి. అంటే ఇంటి అద్దె, గ్రోసరీ, విద్యుత్, ఈఎంఐలు, స్కూల్ ఫీజులు అన్నీ కలిపి 50 శాతానికే పరిమితం కావాలి. ఆదాయంలో 30 శాతాన్ని కోరికల కోసం కేటాయించుకోవచ్చు. అంటే రెస్టారెంట్లలో విందులు, ఓటీటీ చందాలు, విహార యాత్రలు, షాపింగ్, ఇతర హాబీల కోసం కేటాయింపులు 30 శాతం మించకూడదు. ఇక మిగిలిన 20 శాతాన్ని పొదుపు కోసం కేటాయించాలి. మీ ఆర్థిక అంశాలను సులభంగా నిర్వహించుకునేందుకు ఇది అనుకూలిస్తుంది. ముఖ్యంగా వేతన జీవులు, అప్పుడే కెరీర్ ఆరంభించిన వారికి ఇది ఎంతో సులభం. కాకపోతే ఇదొక సాధారణ సూత్రమే కానీ, అందరికీ అనుకూలమని చెప్పలేం. వ్యక్తిగత ఆదాయం, జీవన వ్యయాలు, బాధ్యతలు ఇవే ఒకరి బడ్జెట్‌ను నిర్ణయించేవి. ఉదాహరణకు ఒక నగరానికి చెందిన యువ ఉద్యోగి నెలకు రూ.40,000 సంపాదిస్తున్నాడని అనుకుందాం. పెద్ద నగరం కావడంతో అద్దెకు, రవాణా కోసమే నెల జీతంలో సగం ఖర్చు చేయాల్సి వస్తుంది. అప్పుడు కోరికలు, పొదుపు కోసం మిగిలేదేమీ ఉండదు. అదే రూ.2 లక్షలు సంపాదిస్తున్న వ్యక్తి అయితే ఆదాయంలో 30–35 శాతంతోనే అవసరాలను తీర్చుకోవడం సులభం. అప్పుడు పొదుపు చేయడానికి 30–40 శాతం మిగులు ఉంటుంది.

కనీసం 20 శాతం పొదుపు

ఎవరైనా సరే బడ్జెట్ ఆరంభించేందుకు 50–30–20 సూత్రం మంచి ఫలితమిస్తుంది. మీ జీవన అవసరాలు ఆదాయాన్ని మించకుండా చూసుకోవాలి. అలాగే, ఆదాయంలో కనీసం 20 శాతాన్ని పొదుపు చేయాలి. కోరికల విషయంలో కొంత రాజీ పడినా సరే పొదుపును కొనసాగించాలి. ఎలా ఆరంభించాలో తెలియకపోతే అప్పుడు ఆదాయంలో 20 శాతాన్ని పెట్టుబడులకు మళ్లించే విధంగా ఆటోమేట్ చేసుకోవాలి. అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి వెళ్లేలా సిప్ పెట్టుకోవాలి. మొదట పొదుపు, పెట్టుబడి తర్వాతే ఖర్చులకు వెళ్లాలి. స్థిరమైన పొదుపు, వివేకంతో చేసే ఖర్చుతో మీ ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతుంది.



నేటి నుంచి ఏథర్ ఐపీవో



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ నేడు(28న) ప్రారంభంకానుంది. 30న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి రూ. 304–321కాగా.. యాంకర్ ఇన్వెస్టర్లకు షేరుకి రూ. 321 ధరలో 4.17 కోట్ల షేర్లను కేటాయించింది. తద్వారా రూ. 1,340 కోట్లు అందుకుంది. మ్యూచువల్ ఫండ్స్‌సహా 36 సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి. కాగా.. ఇష్యూలో భాగంగా రూ. 2,626 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.1 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 2,981 కోట్లు సమకూర్చుకోనుంది. వెరసి కొత్త ఆర్థిక సంవత్సరం (2025–26)లో తొలి పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది. ఐపీవో ద్వారా మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులను సమీకరించాలని భావిస్తోంది. రుణ చెల్లింపులకూ నిధులను వెచ్చించనుంది. ఐపీవో ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో గతేడాది ఆగస్ట్‌లో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ద్విచక్ర ఈవీ కంపెనీగా ఏథర్ నిలవనుంది. ఓలా ఎలక్ట్రిక్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 6,145 కోట్లు అందుకున్న విషయం విదితమే. మొత్తం రూ. 11,956 కోట్ల విలువలో ఏథర్ ఎనర్జీ ఐపీవోకు వస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 46 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. గరిష్ఠంగా 13 లాట్లవరకూ దరఖాస్తుకు వీలుంటుంది. షేర్ల కేటాయింపు మే 2న ఉండవచ్చు. స్టాక్ ఎక్స్ఛేంజీలలో 6న లిస్టయ్యే వీలుంది.

ఎడెల్‌వీజ్ ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఫండ్

ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ దేశంలో మొదటి ‘ఇంటర్నెట్ ఎకానమీ ఇండెక్స్ ఫండ్’ను ఆవిష్కరించింది. ఈ నూతన ఫండ్ ఆఫర్ ఈ నెల 25న ప్రారంభమైంది. వచ్చే నెల 9వ తేదీ వరకు పెట్టుబడులను స్వీకరించనుంది. బీఎస్ఈ ఇంటర్నెట్ ఎకానమీ టోటల్ రిటర్న్ ఇండెక్స్‌లో మొత్తం 20 స్టాక్స్ ఉన్నాయి. సూచీలో వెయిటేజీ ఆధారంగా ఆయా స్టాక్స్‌లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమైన కంపెనీల్లో పెట్టుబడులకు ఈ పథకం వీలు కల్పిస్తుంది. కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..
ఫలితాలు, విదేశీ అంశాలపై కన్ను
వర్షాకాల సమావేశాల్లో బీమా సవరణ బిల్లు

ఉద్యోగుల మధ్య సత్సంబంధాలతో 49% ఎక్కువ జాబ్ శాటిస్‌ఫాక్షన్

సహచరులతో కలిసి లంచ్, టీలతో పెరుగుతున్న మిత్రుత్వం

అదే సమయంలో ఒంటరితనంతో బాధపడుతున్న మరో 49% ఉద్యోగులు

భారత్ సహా 21 దేశాల్లో ఉద్యోగుల స్నేహాలపై సర్వేలో వెల్లడి



ఆడుతు పాడుతు పనిచేస్తుంటే..

దేశంలోని పనిప్రదేశాల్లో స్నేహాలు ఉద్యోగులకు 49 శాతం ఎక్కువ జాబ్ శాటిస్‌ఫాక్షన్‌ను అందిస్తున్నాయని ది పవర్ ఆఫ్ సోషలైజేషన్ పేరిట జరిగిన తాజా సర్వే వెల్లడించింది. సంస్థల ఉత్పాదకత పెరుగుదల, దీర్ఘకాలిక విజయాల సాధనకు సైతం ఇవి దోహదపడుతున్నాయని తెలిపింది. అదే సమయంలో సహచరులతో స్నేహంచేయని మరో 49 శాతం మంది భారత ఉద్యోగులు తాము ఒంటరిగా ఉన్నామని కుమిలిపోతున్నట్లు పేర్కొంది. భారత్ సహా 21 దేశాల్లో పనిచేస్తున్న వివిధ రంగాల్లోని ఉద్యోగుల ఆఫీసు స్నేహాలపై ఫుడ్ అండ్ ఫెసిలిటీ సర్వీసెస్ సంస్థ కంపాస్ గ్రూప్ ఇండియా, మింటెల్ అనే సంస్థతో కలిసి చేపట్టిన అధ్యయనంలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆఫీసుల్లో లంచ్ లేదా టిఫిన్ చేసే వేళలు లేదా కలిసి టీ, ఇతర పానీయాలు సేవించే సమయాల్లో చోటుచేసుకొనే సంభాషణల వల్ల ఉద్యోగుల మధ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయని సర్వే గుర్తించింది. అదేవిధంగా సంబంధిత సంస్థల వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ఉద్యోగులను అనుసంధానం చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు తేల్చింది. మరోవైపు ఒంటరితనానికి లోనవుతున్న ఉద్యోగులు సామాజికంగా కనెక్ట్ అయిన వారితో పోలిస్తే రెట్టింపు సిక్ లీవ్‌లు తీసుకుంటున్నారని.. ఇది సంస్థల ఖర్చులు, ఉత్పాదకతపై నేరుగా ప్రభావం చూపుతోందని సర్వేలో వెల్లడైంది.

\- సాక్షి, హైదరాబాద్

సమస్యల పరిష్కారంలో యాజమాన్యాలకు ఇదో కొత్త దృక్పథం..



ఉద్యోగులు, ఉత్పాదకత వంటి అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో సర్వే ఫలితాలు సంస్థల యాజమాన్యాలకు కొత్త దృక్పథాన్ని అందిస్తాయి. సహోద్యోగులతో స్నేహంగా మెలిగే 42% మంది ఉద్యోగులు తమ సంస్థ వ్యూహం, లక్ష్యాలను స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. సామాజిక సంబంధాలు లేని కార్యాలయాల్లో కేవలం 19% మంది ఉద్యోగులే తమ సంస్థలతో కనెక్ట్ అయినట్లు భావిస్తున్నారు. ఇది సంస్థలకు తీవ్రమైన వ్యాపార ప్రమాదంగా మారుతోంది.

\- వికాస్ చావ్లా, కంపాస్ గ్రూప్ ఇండియా ఎండీ

వెల్లడైన అంశాలు ఇవీ..

- ఆఫీసుల్లో సామాజిక కార్యక్రమాలు ఉద్యోగుల సంతోషాన్ని 50% పెంచుతున్నాయి.
- భోజన వేళల్లో సహోద్యోగులతో సంభాషణలు సంబంధాలను బలోపేతం చేస్తున్నాయని సర్వేలో పాల్గొన్న వారిలో 75% మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.
- సహోద్యోగులతో క్రమం తప్పకుండా సంభాషించే 44% మంది ఉద్యోగులు తమకు ఆఫీసులో కనీసం ఒక మంచి స్నేహితుడు ఉన్నాడని నమ్ముతున్నారు.
- సామాజికంగా కనెక్ట్ అయిన 38% మంది ఉద్యోగుల మధ్య బంధం దృఢంగా ఉంది.
- ఆఫీసుల్లో సామాజిక సంబంధాలు లేని వారు 10 శాతమే.
- క్యాంటీన్లలో 58%, భోజన విరామ సమయాల్లో 67% సామాజికీకరణ జరుగుతోంది.
- సామాజిక కలయికల సందర్భంగా 71% మంది ఉద్యోగులు తమ సంస్థ గురించి సానుకూల ప్రచారం చేస్తున్నారు. ఇది బలమైన ఎంప్లాయర్ నెట్ ప్రమోటర్ స్కోర్ (eNP)ను సృష్టిస్తుంది.
- కార్యాలయంలో స్నేహితులుగా ఉన్న 41% మంది ఉద్యోగులు బలమైన భావనను ఆస్వాదిస్తున్నారు.
- సామాజిక సంబంధాలు లేని కార్యాలయాల్లో ఉద్యోగుల మధ్య సహకార రేటు 12 శాతమే.

దేశంలోనే తొలిసారిగా పేగుమార్పిడి శస్త్ర చికిత్స

ప్రకటించిన ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు

అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్ (హైదరాబాద్): దేశంలోనే తొలిసారిగా ఉస్మానియా ఆసుపత్రిలో ఇంటర్‌స్టైన్ కాలేయ మార్పిడి (కాలేయానికి ఆనుకుని ఉండే పేగు) శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశామని వైద్యులు ప్రకటించారు. 40 ఏళ్ల వయసున్న వ్యక్తి కాలేయ తదితర సమస్యలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఉస్మానియాలో చేరాడు. అతడు కాలేయ జబ్బులతో పాటు కుడివైపు కడుపులో గాంగ్రీన్ సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో ఇంటర్ స్టైన్ కాలేయ మార్పిడి చేయాలని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్ నిర్ధారించారు. ఈనెల 19న పేగు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం 7వ రోజు ప్రొటోకాల్ ఎండోస్కోపి నిర్వహించి రోగి సాధారణ స్థితికి చేరుకున్నట్లు నిర్ధారించారు. కాగా, దేశంలోనే తొలిసారిగా పేగుమార్పిడి శస్త్రచికిత్సపై ముఖ్యమంత్రి వైద్యులను అభినందించారు.

ప్రభుత్వాస్పత్రిలో పెద్దపల్లి కలెక్టర్ భార్య ప్రసవం



సిజేరియన్ చేసిన వైద్య బృందం, కొడుకును ఎత్తుకొని సంతోషం వ్యక్తం చేస్తున్న పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

గోదావరిఖని జీజీహెచ్‌లో సిజేరియన్ ద్వారా కాన్పు

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పెంచారంటూ కలెక్టర్ దంపతులపై ప్రశంసలు

కోల్ సిటీ (రామగుండం): ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన సతీమణి విజయకు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ప్రసవం చేయించారు. శనివారం రాత్రి ఆమెకు పురిటినొప్పులు రావడంతో వెంటనే జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు సిజేరియన్ చేయగా 3.6 కిలోల మగబిడ్డకు కలెక్టర్ భార్య జన్మనిచ్చారు. ఆమెకు ఇది రెండో కాన్పు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీహర్ష పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వాస్పత్రుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తన సతీమణి గర్భం దాల్చినప్పటి నుంచి గోదావరిఖని జీజీహెచ్‌లోనే పరీక్షలు చేయిస్తూ వచ్చారు. కలెక్టర్ తీరు ఇతర అధికారులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచిందని.. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా చేశారంటూ ఆస్పత్రి వైద్యాధికారులు కలెక్టర్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. తన సతీమణికి సిజేరియన్ చేసిన వైద్య బృందం గైనిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అరుణతోపాటు డాక్టర్ లక్ష్మి, అనెస్తీషియా డాక్టర్ భానులక్ష్మిని కలెక్టర్ అభినందించారు.

ఒకేసారి కాదు.. దశల వారీగా పరిష్కారం

సమ్మె ముంగిట ఆర్టీసీ విషయంలో ప్రభుత్వ విధానం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లు.. వారి సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట హామీ కాకుండా, దశల వారీ పరిష్కార హామీ ఇచ్చి సమ్మెకు చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే నెల ఏడో తేదీ నుంచి సమ్మె చేస్తామంటూ సంస్థ కార్మిక సంఘాలతో కూడిన ఓ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దానికి మరో జేఏసీ, ఇతర సంఘాలు అంతగా సానుకూలంగా లేకపోవటంతో సమ్మె విజయవంతం విషయంలో డోలాయమానం నెలకొంది. దీంతో ప్రభుత్వం కూడా సమ్మె విషయంలో అంత ఆందోళనగా లేదని సమాచారం. అసలు సమ్మెనే మొదలు కాకుండా చూసేందుకు చర్యలు ప్రారంభించింది. 21 అంశాలను పేర్కొంటూ ఓ జేఏసీలోని కార్మిక సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చాయి. అయితే డిమాండ్లకు సంబంధించి ఎప్పటిలోగా పరిష్కరించేది, ఎంత మొత్తం నిధులు విడుదల చేసేది.. స్పష్టంగా చెప్పకుండా, ఓ ఏడాది కాలంలో పరిష్కరిస్తాం అనే తరహా హామీ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

రిటైర్డ్ అధికారుల సమావేశంలో సంకేతాలు..: ఆర్టీసీ రిటైర్డ్ అధికారులకు ఆర్థిక పరమైన బకాయిల అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. పలు సందర్భాల్లో రిటైర్డ్ ఉద్యోగులు బస్‌భవన్ ఎదుట ధర్నాలు చేశారు. వాటిని చెల్లించాలని వినతిపత్రాలు సమర్పించారు. కానీ అవి పరిష్కారం కాలేదు. ఆర్టీసీ రిటైర్డ్ అధికారుల సంఘం ఐదో వార్షిక సమావేశం ఆదివారం ఓ హోటల్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లు హాజరయ్యారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలతోపాటు వారి డిమాండ్ల పరిష్కారానికి దృష్టి సారిస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం । 28-4-2025

బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఎప్పుడో?



త్వరలో వెలువడనున్న పదో తరగతి ఫలితాలు • బాసర క్యాంపస్‌లో 1,500 సీట్లు

ఎల్కతుర్తిలో మరో క్యాంపస్ • బాసరకు అనుబంధంగా! • మార్చిలోనే భూసర్వే చేసిన అధికారులు

బాసర ట్రిపుల్ ఐటీలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడుతుందోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. నిర్మల్ జిల్లా బాసరలో ఉన్న ట్రిపుల్ ఐటీకి ఏటా వేల సంఖ్యలోనే దరఖాస్తులొస్తాయి. ఈ ఏడాది ప్రభుత్వం 1,500 సీట్ల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నట్టు సమాచారం. ప్రవేశాల ప్రక్రియకు ఇన్‌చార్జ్ వీసీ గోవర్ధన్ ఆధ్వర్యంలో అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నెల చివరిలోగా పదో తరగతి ఫలితాలు వెలువడనున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో అత్యధిక మార్కులు ఉన్న వారికే ఈ క్యాంపస్‌లో సీట్లు దక్కుతాయి. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సు బోధిస్తున్నారు. ఇక్కడి విద్యార్థుల్లో అధిక శాతం ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోనూ కార్పొరేట్ కంపెనీల్లో కొలువులు వస్తున్నాయి.

– భైంసా


బాసర ట్రిపుల్ ఐటీ

ఎల్కతుర్తి క్యాంపస్...

కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాలకు కూడలిగా ఉన్న ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో నాలుగు కొత్త ట్రిపుల్ ఐటీలను నెలకొల్పుతామని పేర్కొంది. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో విద్యా సంస్కరణలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రెండు కొత్త ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, ఎల్కతుర్తిలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలనే చర్చ జరిగినట్టు తెలిసింది. కాగా మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త క్యాంపస్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. బాసర ట్రిపుల్ ఐటీకి అనుబంధంగా ఎల్కతుర్తిలో మరో క్యాంపస్ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మార్చి 24న బాసర ఇన్‌చార్జ్ వీసీ గోవర్ధన్ ఎల్కతుర్తి రెవెన్యూ అధికారులతో కలిసి అక్కడ భూమిని పరిశీలించారు. ట్రిపుల్ ఐటీ ఏర్పాటు కోసం 100 ఎకరాలు అవసరమని చర్చించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి కిలోమీటరు దూరంలో సర్వే నంబర్లు 381, 385, 389, 392లలో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. 381 సర్వేనంబరులో 88 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని సమాచారం. రెవెన్యూ అధికారుల బృందం గత మార్చి నెలలో మూడు రోజులు సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్టు తెలిసింది.

కలిపి ఇస్తారేమో...?

బాసర ట్రిపుల్ ఐటీకి ఈ బడ్జెట్‌లో రూ.35 కోట్లు కేటాయించారు. కొత్త క్యాంపస్ కోసం రూ.500 కోట్ల మేర నిధులు అవసరమవుతాయని సమాచారం. ఎల్కతుర్తిలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు తీసుకొని తరగతులు ప్రారంభించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. శాశ్వతంగా భవనాలు నిర్మించే వరకు కొత్త క్యాంపస్‌లో ఏటా 1,000 సీట్లు భర్తీ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ఏడాదికో క్యాంపస్ తెరిచి రానున్న నాలుగేళ్లలో నాలుగు కొత్త ట్రిపుల్ ఐటీలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అయితే ఈ ఏడాది ప్రవేశాలు ఎల్కతుర్తితో కలిసి 1,000 సీట్లు పెంచుతారో ఒక్క బాసరకే 1,500 సీట్లు కేటాయిస్తారో అనే విషయం తెలియడం లేదు. సీట్లు పెరిగితే మరో 1,000 మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం వస్తుంది.

అప్పటి వరకు బాసరలోనే...

ఎల్కతుర్తి క్యాంపస్‌లో కొత్త విద్యా సంవత్సరానికి 1,000 సీట్లు భర్తీ చేసి వచ్చే విద్యా సంవత్సరం వరకు బాసర క్యాంపస్‌లోనే పీయూసీ–1, పీయూసీ–2 చదివేలా ఏర్పాట్లు చేయించాలని వాదనలు వినిపిస్తున్నాయి. బాసర క్యాంపస్‌లో విశాలమైన భవనాలు ఉన్నాయి. రెండేళ్ల వరకు ఇక్కడే విద్యార్థులు చదివి.. ఎల్కతుర్తి క్యాంపస్ నిర్మాణం ప్రారంభమైతే విద్యార్థులను అక్కడకు పంపించొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

ప్రభుత్వానికి నివేదించాం

గత మార్చి నెలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రకటన విషయ మై ప్రభుత్వానికి నివేదికను పంపించాం. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పదో తరగతి ఉత్తీర్ణులైన ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ఆసక్తి కనబరుస్తారు. ప్రభుత్వ అనుమతి రాగానే నోటిఫికేషన్ వెలువరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం.

– గోవర్ధన్, ట్రిపుల్ ఐటీ, వీసీ

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయులు

కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్‌లకు కేటీఆర్ నివాళులు

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూ జీ, ప్రొఫెసర్ జయశంకర్‌లు అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించిన తొలినాళ్లలో ఎవరూ కూడా ఆశ్రయం కల్పించని రోజుల్లో నేనున్నా నంటూ ముందుకు వచ్చి తన ఇంటినే పార్టీ ఆఫీస్‌గా మార్చి బీఆర్ ఎస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆదివారం బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద గల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కేటీఆర్, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, అధికార పార్టీగా ఉజ్వల రాష్ట్రాన్ని నిర్మించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులందరికీ వినమ్రంగా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్, తలసాని తదితరులు

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ఎవరు అవునన్నా, కాదన్నా.. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డ్ కమాన్ వద్ద ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ సమైక్యపాలకుల అణచివేత నుంచి తెలంగాణకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పించిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. 24 ఏళ్ల క్రితం సిద్దిపేటలో పుట్టిన ఈ పార్టీ, తెలంగాణ కోసం పోరాటం చేసిందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా పార్టీని అభివర్ణించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తమది ఎప్పుడూ ప్రజల పక్షమేనన్నా రు. కేసీఆర్ హయాంలో అనేక సంక్షేమ పథ కాలను అమలు చేసినట్టు తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు కోసం బీఆర్‌ఎస్ ప్రతిపక్ష పార్టీగా నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని హరీశ్‌రావు విమర్శించారు.


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సభ విజయవంతమైంది

కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అనగానే కాంగ్రెస్ నాయ కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయని, కేసీఆర్ వచ్చి నిలదీస్తారనగానే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టి, సభను అడ్డుకునేందుకు కుట్ర లు చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. అందుకే అడుగడుగున పోలీసు ఆంక్షలు, నిర్బంధాలు ప్రయోగించి, సభా స్థలికి కార్యకర్తలు, ప్రజలు చేరకుండా 10–15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ చేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు. కరీంనగర్, సిద్దిపేట, హు స్నాబాద్, వరంగల్ సహా అన్ని దారుల్లో వచ్చే వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారని, ట్రాఫిక్ జాం పేరిట సాక్షాత్తూ పోలీసులే దగ్గరుండి వందలాది వాహనాలను తిప్పి పంపారన్నారు. ఆర్టీవో అధికారులను అడుగడుగునా పెట్టి వాహనాలు చెక్ చేయించారని, స్కూల్ బస్సులు అద్దెకు ఇచ్చిన వారికి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. బీఆర్‌ఎస్ సభను ఎలాగైనా అడ్డుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలయ త్నం చేసిందని, సహాయ నిరాకరణ చేసి సభను ఫెయిల్ చేసే కుట్ర చేసిందన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తెలంగాణ ప్రజలు, బీఆర్ ఎస్ కార్యకర్తలు పటాపంచలు చేశారని, తండోపతండాలుగా తరలివచ్చి గులాబీ జెండా సత్తాచాటారని పేర్కొన్నారు. సభను విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరి క్షేత్రానికి భక్తుల తాకిడి


ఆలయ క్యూకాంప్లెక్స్‌లో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి వేసవి సెలవులతో పాటు ఆదివారం కావడంతో.. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు యాద గిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.34,93,088 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


ఆలయ ముఖ మండపంలో భక్తుల బారులు

కళ తప్పిన బైండ్ల బతుకులు

సజీవ కళ.. ఆదరణ లేక!

- దుర్భరంగా బైండ్ల కళాకారుల జీవనం
- ఆలయాల్లో అర్చకులుగా అవకాశం ఇవ్వాలని వేడుకోలు

‘వాద్య వైఖరి కడు నెరవాది యనగా
ఏకవీర మహాదేవి ఎదుట నిల్చి
పరుశరాముని కథలెల్ల ప్రౌఢి పాడె
చారుతర కీర్తి భవనీల చక్రవర్తి’.. అని 13వ శతాబ్దం నాటి గ్రంథం ‘క్రీడాభిరామం’లో బైండ్ల కళ గొప్పతనం గురించి ఉంది.

“శివుని చిన్న బిడ్డవమ్మ ఎల్లమ్మా..
నీవు శివులెల్లి మాతవమ్మ ఎల్లమ్మా..
పుట్టలోన పుట్టినావు ఎల్లమ్మ..
నీవు పుడమిపై బడ్డవమ్మా ఎల్లమ్మా..
నాగవన్నె చీరలమ్మ ఎల్లమ్మ..
నీకు నెమలికండ్ల రవికలమ్మ ఎల్లమ్మా..
రావె రావె ఎల్లమ్మా...
నిన్ను రాజులు కొలిచేరెల్లమ్మా..”



బైండ్ల కళాకారుల ప్రదర్శనలు (ఇన్‌సెట్‌లో) బైండ్ల కళాకారుల వాయిద్యం జమిడిక

తొర్రూరు: ఒంటి నిండా రంగు.. గంభీరమైన ఆకారంతో.. ఇలాంటి పాటలు పాడుతూ గ్రామ దేవతలకు పూజలు చేసే కళాకారులే బైండ్ల కళాకారులు. జమిడిక తంత్రిని మునివేళ్లతో మీటుతూ రకరకాల శబ్దాలను పలికిస్తారు. ఒకప్పుడు రాజులకు వినోదాన్ని పంచిన ఈ కళ ప్రజలందరికీ చేరువలో ఉండేది. వంశపారంపర్యంగా వచ్చిన కళను కాపాడుతూ జీవం పోస్తున్నారు.

నేడు జమిడిక నాదం మూగబోయే స్థితికి..

అలాంటి జమిడిక నాదం ప్రస్తుతం మూగబోయే పరిస్థితి కనిపిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో డీజేల హోరు పెరగడంతో భవిష్యత్తులో బైండ్ల కళా ప్రదర్శన కనుమరుగయ్యే దుస్థితి నెలకొందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైండ్ల కళాకారులను భవానీలు అని కూడా పిలుస్తారు. వీళ్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోనూ ఉన్నారు. వీరి పూజా విధానం కాస్త కష్టంగానే ఉన్నా.. ప్రజలను ఉగ్రరూతలూగిస్తుంది.

గ్రామ దేవతలకు పూజలు చేస్తూ..

తెలుగు చరిత్రలో బైండ్ల కులస్తులకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ కళాకారులు మాదిగ కులస్తులకు పూజారులుగా, శక్తి ఆరాధకులుగా పేరొందారు. పూర్వం మాదిగ కులస్తులు జరుపుకొనే శుభకార్యాలకు ముహూర్తాలు పెట్టడమే కాకుండా పెళ్లితంతు జరిపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. పెళ్లిళ్లు, పండుగలు ఇతర కులాల వారితో చేయించడం వల్ల వారి ఉపాధి దెబ్బ తింది. ప్రస్తుతం వారు వంశానుక్రమంగా సంక్రమించిన గ్రామాలకు వెళ్లి ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ కథలు చెప్పి దేవతలను కొలిచే పూజారులుగా, కళాకారులుగానే మిగిలారు.

‘జమిడిక’ విన్యాసాలు

బైండ్ల కళాకారులు ఉపయోగించే వాయిద్యాన్ని ‘జమిడిక’ అంటారు. దీన్ని ఇత్తడితో తయారు చేస్తారు. జమిడికతో అనేక రకాల సంగీత ధ్వనులు పలికిస్తారు. పాట వరుసను అనుసరించి లయ మారుస్తుంటారు. కథకుడు కథాగానం చేస్తుంటే.. పక్కనున్న కళాకారులు వంత పాడుతూ జమిడిక వాయిస్తుంటారు. పల్లెల్లో ఎక్కువగా చేసుకునే రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ పండుగలప్పుడు పసుపు, కుంకుమలతో పట్నాలు వేసి దేవతలను కొలుస్తారు. దేవుళ్లకు బోనాలు సమర్పించిన రాత్రంతా గుడి దగ్గరే ఉంటారు. తెల్లవారుజాము వరకు ఆటపాటలతో దేవతల చరిత్ర చెబుతారు. పరశురాముడు, మాంధాత, పోతరాజు, ఎల్లమ్మతో పాటు పలు రకాల వేషధారణలతో ఆకట్టుకుంటారు.

నేడు ఉపాధి కరువై..

ప్రస్తుతం తెలంగాణలో కథాగానం చేసే బైండ్ల కళాకారులు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. ఆయా గ్రామాల్లో పండుగలు జరిగినప్పుడే వీరికి ఉపాధి దొరుకుతోంది. ఏటా కేవలం ఆషాఢం, శ్రావణ మాసాల్లోనే వీరికి ఉపాధి దొరుకుతోంది. మిగతా రోజులు కూలీ పనులు, వేరే వృత్తులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొత్త తరం ఈ కళారూపాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావడం లేదు. అక్కడక్కడా కళాకారులు తమ వారసత్వ కళా సంస్కృతిని కొనసాగించాలనే పట్టుదలతో తమ పిల్లలను చదివిస్తూనే సందర్భాన్ని బట్టి వారికి కథలను నేర్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రభుత్వ చేయూత కోసం..

శక్తి దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ వంటి దేవతల కథలు చెప్పే సంస్కృతి బైండ్ల కళాకారుల నుంచి అనాదిగా వస్తోంది. ఈ ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకం కింద బైండ్ల కళాకారులను చేర్చి అర్చకులుగా అవకాశమివ్వాలని వారు కోరుతున్నారు. దాంతో పాటు కళనే నమ్ముకుని వయోభారంతో ఇబ్బంది పడుతున్న వారికి.. ప్రభుత్వం ప్రత్యేక పథకాలు వర్తింపజేయాలని, కళాకారుల పింఛన్లు అందించాలని కోరుతున్నారు. భావితరాలకు ఈ కళను పరిచయం చేసేందుకు డాక్యుమెంటేషన్ చేయాలని కళాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగరవనంలో పసందైన భోజనం



ఎండలు మండుతుండటంతో స్నేహితులంతా కలిసి సేదదీరేందుకు తిరుపతిలోని నగరవనానికి చేరుకున్నారు. పచ్చని చెట్ల కింద, చల్లటి నీడలో పచ్చిక మీద కూర్చొని కబుర్లు చెప్పకొంటూ భోజనాలు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఉగ్రదాడికి నిరసనగా..



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదులు జరిపిన ఘాతుకానికి నిరసనగా కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. నిరసనలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

చల్లని సాయంత్రం



మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు విశాఖ నగరవాసులు ఆదివారం సాయంత్రం ఆర్కే బీచ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో సాగరతీరం యువత, పిల్లల కేరింతలతో సందడిగా మారింది. సముద్రం మీది నుంచి వచ్చే చల్లగాలిని ఆస్వాదిస్తూ బీచ్‌లో సంతోషంగా గడిపారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రధానితో రైతులకు సన్మానం అవాస్తవం : సీఆర్డీఏ

సాక్షి, అమరావతి: వచ్చేనెల 2న ఏపీకి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి రైతులను సత్కరిస్తారన్న వార్తల్లో నిజం లేదని ఏపీ సీఆర్డీఏ ఓ ప్రకటనలో వెల్లడించింది. రాజధాని రైతులను ప్రధాని సన్మానిస్తారంటూ 30 మంది రైతుల పేర్లతో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొంది.

నేడు గుంటూరులో కోకో రైతుల ధర్నా

కొరిటిపాడు(గుంటూరు): అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పందం నిర్ణయం ప్రకటించాలని కోరుతూ సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు నేడు సిండికేట్‌గా మారి కోకో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.750 పైగా ధర ఉందని, ప్రస్తుతం కంపెనీలు రూ.450 నుంచి రూ.500 వరకు మాత్రమే ధర ఇస్తున్నాయన్నారు. కోకో గింజలు కొనుగోలు, ధరల సమస్యలపై ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో రైతులు, కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారని వెల్లడించారు. ఈ సమావేశం నిర్ణయం ప్రకారం ఈ నెల 7వ తేదీన కోకో గింజల ఒప్పంద నిర్ణయం ప్రకటన చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఎండగండం నుంచి.. కొండంత ఉపశమనం





కొబ్బరి బొండం.. దివ్యౌషధం
- వేసవి ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న డిమాండ్
- ఉమ్మడి 'తూర్పు'న 1.50 లక్షల ఎకరాల్లో కొబ్బరి తోటలు
- భారీగా ఎగుమతులు
- చాగల్లు, ఏలేశ్వరం, కొత్తపేట బొండాలకు అధిక డిమాండ్

రోహిణీ కార్తె ఇంకా రానేలేదు.. అప్పుడే రోళ్లు పగిలేలా ఎండలు కాస్తున్నాయి. నడినెత్తిన చండమార్తాండుడు నిప్పులు కురిపిస్తూండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా మండుతున్న ఎండల నుంచి తక్షణ ఉపశమనాన్నిచ్చే దివ్యౌషధం కొబ్బరి బొండం. వేసవిలోనే కాదు ఏడాది పొడవునా తాగేందుకు అనువైన ఆరోగ్యకరమైన పానీయం. రైతులకు సైతం కొబ్బరి కాయ కన్నా బొండం అమ్మకాల వల్లే అధిక ఆదాయం లభిస్తోంది. బొండాలు, నీళ్లు, కొబ్బరి నీళ్లతో చేసే జ్యూస్‌ల విక్రయాలతో చిరు వ్యాపారుల నుంచి కార్పొరేట్ కంపెనీల వరకూ పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నాయి. -సాక్షి, అమలాపురం

పోషకాల గని

- కొబ్బరి నీళ్లలో పోషకాలు, ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. కొబ్బరి బొండం సెలైన్‌తో సమానం. ఒక బొండంలో దాదాపు 300 మిల్లీ గ్రాముల సోడియం ఉంటుంది. పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి.
- మూత్ర సంబంధిత జబ్బులు, కిడ్నీలో రాళ్ల సమస్యకు ఇది చక్కగా పని చేస్తుంది.
- కొబ్బరి నీళ్ల ఒంట్లో వేడిని తగ్గిస్తాయి. దీనిని బెస్ట్ ఎనర్జీ డ్రింక్‌గా ఆరోగ్య నిపుణులు పేర్కొంటారు.
- బొండంలో ఉండే కొబ్బరి గుజ్జు గుండెజబ్బులు రానివ్వకుండా చేస్తుంది. వేసవిలో చెమట కాయలు, వేడి కురుపులు, చికెన్‌పాక్స్ వంటివి తగ్గడానికి దోహదపడుతుంది.
- లేత కొబ్బరిలో విటమిన్-ఎ, బి, సి సమృద్ధిగా లభిస్తాయి. ఐరన్, క్యాల్షియం, కార్బోహైడ్రేట్లు, రెబోఫ్లెవిన్, నియాసిన్, థయామిన్ అధికంగా ఉంటాయి.

అక్కడి బొండాలకు డిమాండ్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఏడాదికి 105 కోట్ల కొబ్బరి కాయలు వస్తాయని అంచనా. కొబ్బరి కాయల్లో 15 శాతం మాత్రమే బొండాలుగా రైతులు విక్రయిస్తున్నారు.

ఎండలు పెరగడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి బొండాల ఎగుమతులు జోరందుకున్నాయి. మన రాష్ట్రంతో పాటు తెలంగాణలోని ముఖ్య నగరాలు, పట్టణాలకు బొండాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి రోజుకు 60 లారీలకు పైగా ఎగుమతి అవుతున్నాయి. ఎండల తీవ్రత మరింత పెరిగితే రోజుకు 100 లారీల వరకూ బొండాల ఎగుమతి జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు, చాగల్లు, పెరవలి, గోపాలపురం, కాకినాడ జిల్లాలో తుని, ఏలేశ్వరం, కోనసీమ జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం వంటి మండలాల్లో మాత్రమే కొబ్బరి బొండం సేకరణ అధికంగా ఉంటుంది.

మార్చి మొదటి వారంలో బొండం రైతువారీ ధర రూ.12 ఉండగా ఇప్పుడది రూ.18కి పెరిగింది. ఎండలు పెరిగితే ఈ ధర రూ.20 వరకూ చేరుతుందని రైతులు ఆశపడుతున్నారు.

కొబ్బరి కాయలైతే రైతులే సేకరించాలి. దింపు, పోగువేత, రాశులు పోయడం ఇలా కాయకు రూ.2 వరకూ అవుతోంది. అదే బొండాలను వ్యాపారులు సొంత ఖర్చులు పెట్టుకుని తీసుకుంటారు. దీనివలన రైతులకు ఆ పెట్టుబడి బాధ తప్పుతోంది. మార్కెట్‌తో సంబంధం లేకుండా ధర నిలకడగా ఉండటం, కాయ సేకరణ భారం లేకపోవడంతో బొండాల అమ్మకమే ప్రయోజనకరమని కొబ్బరి రైతులు భావిస్తున్నారు.

కొబ్బరి కాయతో పోల్చుకుంటే బొండం అమ్మకాలే లాభసాటిగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. బొండం ఆరు నుంచి ఎనిమిది నెలలకు తయారవుతుంది. అదే పక్వానికి వచ్చే కొబ్బరి కాయకు పట్టే సమయం 12 నెలలు. అందువలన బొండాల ఉత్పత్తిని రైతులు త్వరగా అందుకుంటూ, నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు.



షర్బత్‌ల నుంచి జ్యూస్‌ల వరకూ..

కొబ్బరి బొండాలపై ఆధారపడి జీవిస్తున్నవారి సంఖ్య కూడా అధికంగానే ఉంది. బొండాలతో పాటు కొబ్బరి నీళ్లతో షర్బత్, నాటాడీకో వంటి కోకోనట్ జెల్లీలతో పాటు కొబ్బరి నీళ్ల, గుజ్జుతో జ్యూస్‌లు కూడా తయారు చేస్తున్నారు. వాస్తవానికి కొబ్బరి జ్యూస్ తయారీ మొదలైంది రాజమహేంద్రవరంలోనే కావడం విశేషం. ఇప్పుడు ఈ వ్యాపారం అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. కోకోనట్ జ్యూస్‌లలో సైతం స్ట్రాబెర్రీ, మ్యాంగో, డ్రాగన్, బనానా, కివీ, వాటర్ మిలన్, ఆపిల్ వంటి ఫ్లేవర్లతో ఆకట్టుకుంటున్నారు. వీటితో నిరుద్యోగ యువత ఉపాధి పొందడంతో పాటు జనానికి ఆరోగ్యాన్ని చేరువ చేస్తున్నారు.

ఆరోగ్యానికి ఔషధం



కేవలం దప్పిక తీరడమే కాదు.. కొబ్బరి బొండం ఆరోగ్యానికి ఔషధం. వేసవిలో ఉపశమనం కోసమే కాదు.. ఏడాది పొడవునా ఆరోగ్యం కోసం కొబ్బరి బొండం తాగడం మంచిదే. దీనిలోని ఎలక్ట్రోలైట్లు, సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు తక్షణ శక్తినిస్తాయి. ఆరోగ్యానికి పలు రకాలుగా మేలు చేస్తాయి. - డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అంబాజీపేట

ఆశల పల్లకిలో కొల్లేరు

- హద్దులను పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రభుత్వమే అఫిడవిట్ వేయాలని కొల్లేరు ప్రజల డిమాండ్
- కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేనా?
- సుప్రీం సూచనలను అనుకూలంగా మార్చుకుంటున్న నేతలు
- రెగ్యులేటర్ల నిర్మాణం మాటెత్తని ప్రభుత్వం



కైకలూరు: కొల్లేరు అనే ఈ మూడక్షరాల పదం రాష్ట్రంలో మరోమారు చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు చెబుతున్న సూచనలను రాజకీయ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నారు. తాజాగా మరోసారి కొల్లేరు సరిహద్దుల పరిశీలన చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర సాధికారిత కమిటీని ఆదేశించింది. కొల్లేరు ఆపరేషన్ ద్వారా అక్రమ చెరువులను ధ్వంసం చేసి 19 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అభయారణ్యం ఆక్రమణల చెరలోనే చిక్కుకుంది. కొల్లేరు కాంటూరు కుదింపు సాధ్యం కాదని అధ్యయన కమిటీలు గతంలోనే నివేదిక ఇచ్చాయి. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న నేతల వాగ్దానాలు నెరవేరేనా అనే అనుమానాలు కొల్లేరు ప్రజల్లో సర్వత్రా వినిపిస్తున్నాయి.

మరోమారు తెరపైకి..

కొల్లేరు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అంతర్జాతీయ రామ్‌సర్ ఒడంబడిక ప్రకారం 1999 అక్టోబరు 4న అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జీఓ 120ను తీసుకొచ్చింది. పూర్వపు కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 9 మండలాల్లో + 5 కాంటూరు పరిధి వరకు 77,138 ఎకరాలను అభయారణ్యంగా నిర్ణయించారు. అక్రమ చేపల చెరువులు అభయారణ్యంలో పెరగడంతో 2006లో కొల్లేరు ఆపరేషన్ ద్వారా వేలాది ఎకరాల్లో అక్రమ చెరువులను ధ్వంసం చేశారు. కొల్లేరు సంరక్షణకు 2006 ఏప్రిల్ 10న సుప్రీం కోర్టు జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వ అధికారులు అమలు చేయలేదని ఇది కోర్టు ధిక్కరణకు వస్తుందని కాకినాడకు చెందిన కె.మృత్యుంజయరావు 2004 సెప్టెంబరులో సుప్రీం కోర్టులో కేసు వేశారు.

కాంటూరు కుదింపు సాధ్యమయ్యేనా..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రపంచం గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. 10వ కాంటూరు పై వరకు కొల్లేరు విస్తరించి ఉన్నప్పటికీ 5వ కాంటూరు వరకు మాత్రమే 77,138 ఎకరాల్లో అభయారణ్యంగా గుర్తించారు. కొల్లేరు అభయారణ్యాన్ని 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదిస్తే 48,777 ఎకరాలు మిగులుతోంది. అభయారణ్యంలో పట్టా భూములు 14,932 ఎకరాలు, సొసైటీ భూములు 5,510 ఎకరాలు ఉన్నాయి. నష్టపరిహారం చెల్లించకుండా ధ్వంసం చేశారని కొల్లేరు ప్రజలు వాదన వినిపిస్తోన్నారు. కొల్లేరుపై అధ్యయనం చేసిన పలు కమిటీలు కాంటూరు కుదింపు సాధ్యం కాదని నివేదికలు అందించాయి. కూటమి నేతలు మాత్రం కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేసినట్లుగానే ప్రచార చేస్తున్నారు.

ప్రధాని హామీ అమలు చేయాలి

ఎన్నికల ప్రచారంలో భాగంగా 2014లో భీమవరం వచ్చిన ప్రధాని మోదీ కొల్లేరు కాంటూరును కుదిస్తానని హామీ ఇచ్చారు. ఆ సభలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఉన్నారు. 2015 జూలైలో అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకాష్ జవదేవకర్, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కొల్లేరులో సమావేశం నిర్వహించారు. అనంతరం కాంటూరు కుదింపుపై త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్, రివ్యూ పిటీషన్లు దాఖలు చేసి వాదనలు వినిపించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు. కాంటూరు కుదింపు జరగాలంటే జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు (ఎన్‌టీడబ్ల్యూఎల్) ఆమోదం జరగాలంటే రాష్ట్ర బోర్డు తీర్మాణం చేయాల్సి ఉంది. అలాగే కొల్లేరులో నిత్యం నీరు నిల్వ ఉండాలంటే రెగ్యులేటర్ల నిర్మాణం జరగాలి. ప్రభుత్వం దీనిపై ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు.

రాజకీయం చేయద్దు



కాంటూరు కుదింపు చేస్తామని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ముందుగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించాలి. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పి ఏళ్లు గడిచిపోయాయి. అమాయకులైన కొల్లేరు ప్రజలకు వాస్తవ పరిస్థితులు చెప్పండి. ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అమలు చేయడానికి కూటమి నేతలు కృషి చేయాలి. -బలే గణేష్, శృంగవరప్పాడు, కైకలూరు మండలం

వక్ఫ్ ఆస్తులు యూపీలోనే ఎక్కువ


ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్, తమిళనాడు
- దేశంలో వక్ఫ్‌కు 8,72,352 స్థిరాస్తులు, 16,713 చరాస్తులు
- ఇప్పటివరకు 994 ఆస్తులు ఇతర అవసరాలకు కేటాయింపు
- కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో వక్ఫ్ ఆస్తులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలున్నాయని తెలిపింది. దేశంలో వక్ఫ్‌కు సంబంధించి 8,72,352 స్థిరాస్తులు, 16,713 చరాస్తులు ఉన్నాయని ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు 994 వక్ఫ్ ఆస్తులను ఇతర అవసరాలకు కేటాయించినట్లు వివరించింది. ఉత్తరప్రదేశ్‌లో సున్నీల స్థిరాస్తులు 2,17,161, షియాల స్థిరాస్తులు 15,386 ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 14,685 స్థిరాస్తులు, 85 చరాస్తులున్నట్లు తెలిపింది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ స్థిరాస్తులు, చరాస్తుల సంఖ్య

రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతం	స్థిరాస్తుల సంఖ్య	చరాస్తుల సంఖ్య
అండమాన్-నికోబార్ దీవులు	151	----
ఆంధ్రప్రదేశ్	14,685	85
అస్సాం	2,654	---
బిహార్ (షియా)	1,750	16
బిహార్ (సున్నీ)	6,867	18
చండీగఢ్	34	--
ఛత్తీస్‌గఢ్	4,230	---
దాద్రా-నగర్ హవేలీ	30	1
ఢిల్లీ	1,047	---
గుజరాత్	39,940	5,418
హరియాణ	23,267	----
హిమాచల్‌ప్రదేశ్	5,343	---
జమ్మూ-కశ్మీర్	32,533	---
జార్ఖండ్	698	4
కర్ణాటక	62,830	1,801
కేరళ	53,297	---
లక్షద్వీప్	896	----
మధ్యప్రదేశ్	33,472	237
మహారాష్ట్ర	36,701	131
మణిపూర్	999	---
మేఘాలయ	58	51
ఒడిశా	10,314	26
పుదుచ్చేరి	693	254
పంజాబ్	75,965	---
రాజస్థాన్	30,895	---
తమిళనాడు	66,092	8,605
తెలంగాణ	45,682	---
త్రిపుర	2,814	62
ఉత్తరప్రదేశ్(షియా)	15,386	--
ఉత్తరప్రదేశ్(సున్నీ)	2,17,161	3
ఉత్తరాఖండ్	5,388	--
పశ్చిమ బెంగాల్	80,480	1
మొత్తం ఆస్తులు	8,72,352	16,713



ఉడుపి శ్రీకృష్ణుడిని చూడాలి.
శృంగేరి శారదామాతను దర్శించాలి.
కుక్కె సుబ్రహ్మణ్యం... మంగళాదేవి...
కుద్రోలి గోకర్ణనాథేశ్వర స్వామి ఆలయం.
కద్రి... ధర్మస్థల మంజునాథులనూ చూడాలి.
అన్నింటినీ ఒకే ట్రిప్‌లో చుట్టేయవచ్చు.
ఐఆర్‌సీటీసీ డివైన్ కర్నాటక ప్యాకేజ్ ఉంది.
పై వాటితోపాటు మాల్పె... తన్నేర్‌బావి బీచ్‌లు.
మినీ గోమతేశ్వరుడు ఈ టూర్‌లో బోనస్.

అరేబియా సౌందర్యం
కన్నడ దైవత్వం

డివైన్ కర్నాటక (ఎస్‌హెచ్‌ఆర్086).
ఇది ఆరు రోజులు ఐదు రాత్రుల టూర్ ప్యాకేజ్.
ఇందులో ప్రధానంగా ధర్మస్థల, మంగళూరు, శృంగేరి, ఉడిపి కవర్ అవుతాయి.

విండో టూర్

మొదటిరోజు

ట్రైన్ 12789 కాచిగూడ-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.05 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.

1. ఈ రైలు హైదరాబాద్‌లో బయలుదేరి తెలంగాణలో జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో కర్నూల్, డోన్, గుత్తి, యరగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తమిళనాడులోకి ప్రవేశించి కాట్పాడి, జోలార్‌పేట, సేలం జంక్షన్, ఈ రోడ్ జంక్షన్, తిరుప్పూర్, కోయంబత్తూర్ జంక్షన్ తర్వాత కేరళలో అడుగుపెట్టి పాలక్కాడ్, షోర్‌నూర్, తిరూర్, కోళికోడ్, వాడకర, తలస్సెరి, కన్నూరు, పయ్యనూర్, కన్హాగాడ్, కాసర్‌గోడ్ దాటిన తర్వాత కర్నాటకలో ప్రవేశించి మొత్తం 33 గంటలకు పైగా ప్రయాణించి 1532 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేసుకుని మంగళూరు సెంట్రల్ స్టేషన్‌కు చేరుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక ఐదు దక్షిణాది రాష్ట్రాలను చుట్టేస్తుందన్నమాట. ఇది కేవలం మన గమ్యాన్ని చేరే ప్రయాణంగా భావిస్తే మంగళూరు చేరేలోపే బోర్ కొడుతుంది. ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ, కంటికి కనిపించిన అన్నింటినీ గమనిస్తూ, మనోనేత్రంతో విశ్లేషించుకుంటూ సాగితే ఐదు రాష్ట్రాల వైవిధ్యాన్ని, ప్రజల జీవనశైలిని ఒకే ప్రయాణంలో ఆస్వాదించవచ్చు.


2. ఉడుపిలోని శ్రీకృష్ణుడిని ద్వైత తత్వాన్ని బోధించిన మధ్వాచార్యుడు స్థాపించాడు. ఈ ఆలయానికి వెళ్లినప్పుడు కళ్లు మూసుకుని స్మరించుకుని వెనక్కి వచ్చేశారంటే అంతకంటే పెద్ద పొరపాటు మరొకటి ఉండదు. ఆలయ నిర్మాణం ఒక అద్భుతం. ఆ అద్భుతాన్ని కనులారా వీక్షించాలి. దర్శనం కోసం క్యూలో ఉన్నంత సేపు ఆలయ ప్రాంగణాన్ని, అక్కడి ఆచార సంప్రదాయాలను గమనించాలి. బయటకు వచ్చిన తర్వాత గోపురాన్ని, శిల్పాలను నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే వెనుదిరగాలి. ఎందుకంటే ఈ నిర్మాణం ఓ వైవిధ్యం. ఇలాంటి ఆలయం దేశంలో మరొకటి లేదు. శ్రీకృష్ణుడి దర్శనం తర్వాత మాల్పె బీచ్ విహారానికి వెళ్లవచ్చు. దీనిని ఒక అడ్వెంచర్ పార్క్ అని చెప్పాలి. స్టాల్స్‌లో దొరికే కన్నడ చిరుతిళ్లను రుచి చూస్తూ అరేబియా తీరాన సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తూ సమయం గడపవచ్చు. టైమ్ ఉంటే సెయింట్ మేరీ ఐలాండ్‌కు వెళ్లిరావచ్చు. ఉడుపిలో ఉన్న రోజు మధ్యాహ్నభోజనం, రాత్రి భోజనంలో రకరకాల ఉడుపి రుచులను ఆస్వాదించడం మర్చిపోవద్దు. ఉడుపి హోటళ్లలో శాకాహారంతోపాటు మాంసాహారంలో స్థానిక స్పెషల్ వంటకాలను రుచి చూడాలి. ఎప్పుడూ సందడిగా ఉంటాయి. దేశమంతటా విస్తరించిన ఉడుపి హోటళ్లు ఎప్పుడూ సందడిగా ఉంటాయి. అలాంటిది ఉడుపిలో అసలు సిసలైన ఉడుపి రుచులను అసలే మిస్ కాకూడదు. ఇక్కడ తుళు భాష ఎక్కువగా మాట్లాడతారు. తుళు అంటే... దేశ భాషలందు తెలుగు లెస్స అని మన తెలుగును ప్రశంసించిన కృష్ణదేవరాయల మాతృభాష.



ఉడుపి కృష్ణుడు

రెండవ రోజు

ఉదయం తొమ్మిదన్నరకు మంగళూరుకు చేరుతుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఉడుపికి ప్రయాణం. హోటల్‌లో చెక్ ఇన్. శ్రీకృష్ణ ఆలయ దర్శనం, మాల్పే బీచ్ విహారం తర్వాత రాత్రి బస ఉడుపిలోనే.



శృంగగిరి చల్లదనం శారదామాత వీక్షణం

మూడవ రోజు

హోటల్ గది చెక్ అవుట్ చేసి శృంగేరి వైపు సాగిపోవాలి. శారదాంబ ఆలయ దర్శనం తర్వాత మంగళూరుకు ప్రయాణం. రాత్రి బస మంగళూరులో.

3. శృంగేరిలోని శారదా పీఠం ఆదిశంకరాచార్యులు స్థాపించిన పీఠాల్లో ఒకటి. రామాయణంలోని బాలకాండలో రుష్యశృంగుడి గురించిన ప్రస్తావన ఉంది. ఆ రుష్యశృంగుడు తపస్సు చేసుకున్న కొండ కావడంతో దీనికి శృంగగిరి శృంగేరి అనే పేరు వచ్చింది. ఎండ కాలం చల్లగా ఉంటుంది. విద్యాశంకర ఆలయ నిర్మాణ కౌశలాన్ని ఆస్వాదించి, శారదా మాత దర్శనంతో ఆశీస్సులు పొందిన తర్వాత ఆది శంకరాచార్యుని ఆలయం, శృంగేరి మఠం చూడాలి.

4. **ధర్మస్థల...** నేత్రావతి నది తీరం. ఇక్కడ మంజునాథ ఆలయంతోపాటు మంజూష మ్యూజియాన్ని కూడా చూడాలి. ఇది పరిశోధన గ్రంథాల నిలయం. మాన్యుస్క్రిప్ట్‌లు, పెయింటింగ్‌లున్నాయి. పక్కనే ఒక కొండ మీద 39 అడుగుల గోమతేశ్వరుడిని చూడాలి. ఇది యాభై ఏళ్ల కిందట చెక్కిన శిల్పం. బాహుబలిగా చెప్పుకునే అసలు గోమతేశ్వరుడి విగ్రహం కాదిది. అసలు గోమతేశ్వరుని ప్రతిరూపాలు మరో నాలుగున్నాయి కర్నాటకలో . ఇవన్నీ చూసిన తర్వాత ఇక్కడ ఉన్న వింటేజ్ కార్ మ్యూజియాన్ని కూడా విజిట్ చేయవచ్చు.

ప్యాకేజ్ ఇలా...

- ప్యాకేజ్‌లో బస త్రీ స్టార్ హోటల్‌లో ఉంటుంది. ఏసీ వాహనాల్లో ప్రయాణం. మూడు రోజులు బ్రేక్‌ఫాస్ట్ ఉంటుంది.
- భోజనాలు, ట్రైన్‌లో కొనుక్కునే తినుబండారాలు, సైట్ సీయింగ్ ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు, బోటింగ్ - హార్స్ రైడింగ్ వంటి వినోదాల ఖర్చులు ప్యాకేజ్‌లో వర్తించవు.
- ఈ రైలు వారానికొకసారి మాత్రమే ఉంటుంది. ప్రతి మంగళవారం కాచిగూడలో బయలుదేరుతుంది.
- సింగిల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి దాదాపు 39 వేలవుతుంది. ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 23 వేలవుతుంది. ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి పద్దెనిమిది వేలవుతుంది.



నేత్రానందం మంజునాథాలయం

నాలుగవ రోజు

ధర్మస్థలకు ప్రయాణం, మంజునాథ ఆలయ దర్శనం, ఆ తర్వాత కుక్కె సుబ్రహ్మణ్య ఆలయ దర్శనం చేసుకుని సాయంత్రానికి మంగుళూరు చేరాలి. ఆ రాత్రి బస కూడా మంగళూరులోనే.







పరశురాముడి క్షేత్రం

కుక్కె సుబ్రహ్మణ్య స్వామి ఆలయం... ఇది కుమారధార నది తీరాన ఉంది. ఐదు వేల ఏళ్ల నాటి ఆలయం. ఇది కార్తికేయుడి ఆలయం. సుబ్రహ్మణ్య స్వామి పేరుతో పూజలందుకుంటున్నాడు. గరుడుని బారి నుంచి తప్పించుకోవడానికి వాసుకి ఇక్కడకు వచ్చాడని చెబుతారు. పురాణేతిహాసాల ప్రకారం ఈ ప్రదేశం పరశురాముడు స్థాపించిన ఏడు క్షేత్రాల్లో ఇదొకటి.

5. మంగళాదేవి ఆలయం విశాలంగా ఉంటుంది. చక్కటి గోపురం, లోపల నిర్మాణాలకు ఎర్ర పెంకు పై కప్పు, వర్షపునీరు జారిపోవడానికి వీలుగా ఏటవాలుగా ఉంటుంది. ఆలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటుంది. కద్రి మంజునాథ ఆలయ గోపురం ప్రత్యేకమైన వాస్తు శైలిలో ఉంటుంది. ఇక టూర్‌లో సేదదీరే ప్రదేశం తన్నేర్‌బావి బీచ్. ఇది పర్యటనకు అనువైన ప్రదేశంగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన బీచ్. వీలైతే సూర్యాస్తమయాన్ని వీక్షించవచ్చు. ఇక చివరగా కుద్రోలి గోకర్ణనాథేశ్వర ఆలయం కొత్తది. రాజులు నిర్మించినది కాదు. కేవలం వందేళ్ల దాటింది. కన్నడ సంప్రదాయ యక్షగాన కళాకారుడు, యుద్ధవిద్య గారడి విన్యాసాలు చేసేవాళ్లు సమూహంగా మారి నిర్మించుకున్నారు.

మంగళూరు మాత

ఐదవ రోజు

ఉదయం గది చెక్ అవుట్ చేసి మంగళూరు సైట్ సీయింగ్‌కి బయలుదేరాలి. మంగళూరుకు ఆ పేరు తెచ్చిన మంగళాదేవి ఆలయం దర్శనం, కద్రి మంజునాథ ఆలయ దర్శనం తర్వాత తన్నేర్‌బావి వీచ్ విహారం, కుద్రోలి గోకర్ణనాథేశ్వర ఆలయ దర్శనం చేసుకుని మంగళూరు సెంట్రల్ రైల్వేస్టేషన్‌కి చేరాలి. తిరుగు ప్రయాణానికి 12790 ట్రైన్ రాత్రి ఏడు గంటలకు బయలుదేరుతుంది.

విండో టూర్ మరోసారి


ఆరవ రోజు

రాత్రి పదకొండు గంటల నలభై నిమిషాలకు కాచిగూడకు చేరుతుంది. పర్యటన అలసట తీరే వరకు విశ్రాంతి తీసుకున్న తర్వాత టూర్ మొదటి రోజు చూసిన ప్రదేశాల విండో టూర్‌ను మరోసారి ఆస్వాదించవచ్చు.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి







నీవు సంపాదించే దాని కన్నా తక్కువ ఖర్చు చేయగలిగితే..
నిన్ను మించిన ఆర్థిక నిపుణుడు ఉండడు
- అరిస్టాటిల్

వర్షాకాల సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లు

100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి...



న్యూఢిల్లీ: బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) వీలు కల్పించే సవరణ బిల్లును వచ్చే వర్షకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుంచనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముసాయిదా బిల్లు సిద్ధమైందని, త్వరలోనే కేబినెట్ ఆమోదం తీసుకోనున్నట్టు తెలిపాయి. కేబినెట్ ఆమోదం అనంతరం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే ప్రక్రియను ఆర్థిక వ్యవహారాల విభాగం మొదలు పెడుతుందని పేర్కొన్నాయి. పార్లమెంటు వర్షకాల సమావేశాలు సాధారణంగా జూలైలో ఆరంభం అవుతుంటాయి. ప్రస్తుతం బీమా రంగంలో 74 శాతం మేర ఎఫ్‌డీఐలకు అనుమతి ఉండగా, 100 శాతానికి పెంచే ప్రతిపాదనను 2025–26 బడ్జెట్‌లో ప్రతిపాదించడం గమనార్హం. బీమా సవరణ చట్టంలో ఎఫ్‌డీఐ పెంపుతోపాటు మూలధన నిధుల అవసరాలను తగ్గించడం, కాంపోజిట్ లైసెన్స్ తదితర ప్రతిపాదనలు చోటుచేసుకోనున్నాయి. బ్రోకర్లు సైతం ఒకటికి మించిన బీమా కంపెనీల ఉత్పత్తుల విక్రయానికి అవకాశం లభించనుంది.

ఫలితాలు, విదేశీ అంశాలపై కన్ను

- గురువారం మహారాష్ట్ర డే సెలవు
- ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం
- కార్పొరేట్ల క్యూ4 ఫలితాలు కీలకం

భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల ఎఫెక్ట్



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారం పలు అంశాల ఆధారంగా కదలనున్నాయి. ప్రధానంగా గత వారం జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రదాడి కారణంగా భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ప్రభావం చూపనున్నాయి. దీంతో రెండు దేశాల మధ్య రాజకీయ, భౌగోళిక ఆందోళనలు సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషకులు ప్రస్తావించారు. ఇవికాకుండా అమెరికా, చైనా మధ్య టారిఫ్‌ల సంక్షోభానికి సైతం ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో గత వారం చివర్లో మార్కెట్లు ఉన్నట్టుండి బలహీనపడ్డాయి. ఫలితంగా ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 23,800కు ఎగువన నిలవగలిగితేనే సాంకేతికంగా బుల్లిష్ ధోరణి కొనసాగే వీలున్నట్లు నిపుణులు అభిప్రాయపడ్డారు. కాగా.. ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. మహారాష్ట్ర డే సందర్భంగా గురువారం(మే 1న) మార్కెట్లు పనిచేయవు.

ఇంధన, సిమెంట్ కంపెనీలు

ఇప్పటికే గత ఆర్థిక సంవత్సర(2024–25) ఫలితాల సీజన్ ప్రారంభమై జోరందుకుంది. ఈ బాటలో ఈ వారం మరికొన్ని దిగ్గజాలు క్యూ4(జనవరి–మార్చి) పనితీరుతోపాటు పూర్తి ఏడాది ఫలితాలు ప్రకటించనున్నాయి. జాబితాలో ఇంధన రంగ పీఎస్‌యూలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్)సహా.. సిమెంట్ దిగ్గజాలు అంబుజా, అల్ట్రాటెక్, టాటా గ్రూప్ దిగ్గజం ట్రెంట్, ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్, బజాజ్ ఫైనాన్స్ తదితరాలున్నాయి. గత వారం చివర్లో డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యూ4, పూర్తి ఏడాది ఫలితాలు వెలువరించింది. ఈ ప్రభావం నేటి(సోమవారం) ట్రేడింగ్‌లో రిలయన్స్ కౌంటర్‌పై కనిపించనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

సానుకూలం

2024 అక్టోబర్ మొదలు దేశీ స్టాక్స్‌లో పెట్టుబడుల ఉపసంహరణకే పెద్దపీట వేస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడం గమనార్హం! దీంతో గత 7 ట్రేడింగ్ రోజుల్లో ఎఫ్‌పీఐలు నగదు విభాగంలో నికరంగా రూ. 27649 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత వారం రూ. 17,425 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. ఫలితంగా భారత్, పాక్ ఉద్రిక్తతల నడుమ చివరి రెండు రోజుల్లో మార్కెట్లు నీరసించినప్పటికీ నికరంగా గత వారం లాభపడ్డాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 659 పాయింట్లు(0.84 శాతం) పుంజుకుని 79,213 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 188 పాయింట్లు(0.8 శాతం) ఎగసి 24,039 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్‌క్యాప్ మరింత అధికంగా 1.3 శాతం బలపడగా, స్మాల్‌క్యాప్ 0.12 శాతమే లాభపడింది.

ఇతర అంశాలు

గత వారం ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ వెనకడుగు వేసింది. మరోవైపు దేశీ స్టాక్స్‌లో ఎఫ్‌పీఐలు భారీగా ఇన్వెస్ట్ చేశారు. వెరసి డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ రూపాయి బలపడింది. అమెరికా, చైనా మధ్య టారిఫ్‌ల సంక్షోభం కారణంగా పసిడి ధరలు మండుతున్నప్పటికీ ముడిచమురు ధరలు దిగివస్తున్నాయి. బ్రెంట్ చమురు 65 డాలర్ల సమీపంలో కదులుతోంది. రూపాయి పుంజుకోవడం, చమురు చల్లబడటం దేశీ ఆర్థిక వ్యవస్థకు సానుకూల అంశాలుగా మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ వారం భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ టారిఫ్‌ల సంక్షోభం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ సీనియర్ వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. ఇవికాకుండా దేశీయంగా పలు కార్పొరేట్ దిగ్గజాలు క్యూ4 ఫలితాలు ప్రకటించనుండటంతో ఇన్వెస్టర్లు వీటిపై దృష్టి పెట్టనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. మరోవైపు ఎఫ్‌పీఐలు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతుండటం సానుకూల అంశమని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ పేర్కొన్నారు.

ఐఐపీవైపు చూపు

మార్చి నెలకు పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు నేడు విడుదలకానున్నాయి. ఫిబ్రవరిలో ఐఐపీ వృద్ధి గత 6 నెలల్లోనే కనిష్టంగా 2.9 శాతానికి పరిమితమైంది. జనవరిలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే భారీగా క్షీణించింది. ఇక ఏప్రిల్ నెలకు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐ వారాంతాన(మే 2న) విడుదలకానుంది. అంతర్జాతీయ అంశాల విషయానికివస్తే మార్చి నెలకు 29న యూఎస్ ఉపాధి గణాంకాలు వెల్లడికానున్నాయి. ఏప్రిల్‌కు చైనా తయారీ పీఎంఐ గణాంకాలు, ఏప్రిల్‌కు యూఎస్ పీసీఈ ధరల ఇండెక్స్ 30న వెలువడనున్నాయి. మే 1న బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, రిటైల్ ధరలు ప్రకటితంకానున్నాయి. ఈ బాటలో యూఎస్ తయారీ పీఎంఐ, వ్యవసాయేతర ఉపాధి, నిరుద్యోగిత గణాంకాలు 2న వెల్లడికానున్నాయి.

రిస్క్ సామర్థ్యం.. నిజంగా ఎంతుంది



రోహిత్ మట్టూ
నేషనల్ హెడ్ - రిటైల్ సేల్స్, యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

మీరో రోడ్ ట్రిప్‌కు బైల్దేరారు. కారు విండోలు కిందికి దించి, స్వేచ్ఛగా, ఝూమ్మంటూ, జోరుగా దూసుకెళ్తున్నారు. దారిలో ఏ అడ్డంకి వచ్చినా దాటేయగలను అనే ఆత్మవిశ్వాసంతో వెళ్తున్నారు. కానీ, ఇంతలోనే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కుండపోతగా వాన మొదలైంది. ముందేమీ సరిగ్గా కనిపించడం లేదు. కారు పట్టు తప్పిపోతోంది. అప్పటిదాకా థ్రిల్లింగ్ అనిపించిన జర్నీ కాస్తా, ఒక్కసారిగా గందరగోళంగా మారిపోయింది. అప్పుడు అనిపిస్తుంది. మీరు అనుకున్నంత స్థాయిలో రిస్కులను ఎదుర్కొనేంత సన్నద్ధత మీకు లేదేమోనని.

ఇదిగో, పెట్టుబడులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. చాలా మంది ఇన్వెస్టర్లకు తాము చాలా రిస్కు తీసుకోగలమనో లేదా ఒక మోస్తరుగా తీసుకోగలమనో తమ తమ రిస్కు సామర్థ్యాల విషయంలో ఒక భావన ఉంటుంది. కానీ వాస్తవ ప్రపంచంలో పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఈ ధీమాను విపరీతంగా పరీక్షిస్తాయి. మార్కెట్లో ఒడిదుడుకులను ఆచరణలో ఎదుర్కొనడమనేది థియరీలో చెప్పినంత సులువైన వ్యవహారం కాదు. ఇలా, మనకు ఉన్నాయనుకునే రిస్కు సామర్థ్యాలకు, వాస్తవంగా ఉన్న సామర్థ్యాలకు మధ్య వైరుధ్యం నెలకొన్నప్పుడు, భావోద్వేగాలకు లోనై, నిర్ణయాలు తీసుకుంటాం. కంగారుపడిపోయి, ముందుగానే తప్పుకుంటాం లేదా సామర్థ్యానికి మించి మరింత రిస్కు తీసుకుంటాం. ఊహించుకుంటున్న సామర్థ్యాలకు, వాస్తవ సామర్థ్యాలకు మధ్య వ్యత్యాసాన్ని ముందుగానే గుర్తించి, క్రియాశీలకంగా చక్కదిద్దుకుంటే సంపద సృష్టికి దోహదపడుతుంది. లేకపోతే సంపద నాశనానికి దారితీస్తుంది. మరికొందరు ఇన్వెస్టర్లు, మరింత ఎక్కువగా రిస్కులు తీసుకోగలిగినప్పటికీ, తమకు అంత సామర్థ్యం లేదని భావిస్తుంటారు. ఇలా మరీ మెతక వైఖరి వల్ల వృద్ధి అవకాశాలను కోల్పోతుంటారు.

అవగాహన ఉండాలి..

రిస్కు సామర్థ్యం అనేది ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడుల వ్యవధి, వ్యక్తిత్వాన్ని బట్టి ఇన్వెస్టరు ఏ స్థాయిలో రిస్కును తీసుకోగలుగుతారనేది చూచాయగా తెలియజేస్తుంది. ఇక రిస్క్ సహనశీలత అనేది, మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నప్పుడు ఇన్వెస్టరు వాస్తవంగా – ఇటు భావోద్వేగాలపరంగా అటు ఆర్థికంగా – ఎంత వరకు రిస్కు తీసుకుంటారనేది తెలియజేస్తుంది. ఉదాహరణకు ఈక్విటీల విషయంలో తాను ఎంతైనా రిస్కు తీసుకోగలనని ఓ ఇన్వెస్టరు అనుకోవచ్చు. కానీ మార్కెట్లు పతనమవుతున్నప్పుడు కంగారు పడిపోయి, అమ్మేయొచ్చు. అంటే, తాము రిస్కుల విషయంలో ముందుగా ఊహించుకున్న దానికన్నా సహనశీలత చాలా తక్కువగా ఉందని అర్థం. ఇలా ఊహించుకునే దానికి, వాస్తవానికి మధ్య ఉండే వ్యత్యాసం వల్ల భావోద్వేగాలకు లోనై నిర్ణయాలు తీసుకోవడంతో ఆర్థిక ప్రణాళికలు తల్లకిందులవుతాయి.



రిస్కులపై భ్రమలు..

మనం ఊహించుకునే రిస్కు సామర్థ్యాలకు, వాస్తవ పరిస్థితికి మధ్య వ్యత్యాసాలకు చాలా కారణాలే ఉంటాయి:

మార్కెట్ పరిస్థితులు: బుల్ మార్కెట్లు మనకు ఆత్మవిశ్వాసం ఉన్నట్లు భ్రమింపచేస్తాయి. మరోవైపు, మార్కెట్లు పతనమైనప్పుడు తీవ్రమైన భయం వేస్తుంది. దీంతో ఇన్వెస్టర్లు, ముందూ వెనుకా ఆలోచించకుండా తమ రిస్కు సామర్థ్యాలను పక్కనపెట్టి అప్పటికప్పుడు నిర్ణయాలు తీసేసుకుంటూ ఉంటారు.

అనుభవం: మొదటిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్నవారు, మార్కెట్ల పతనాన్ని తొలిసారి చవిచూసే వరకు తాము ఎలాంటి రిస్కులనైనా ఎదుర్కొనగలమనే భావనలో ఉండొచ్చు. కానీ అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లకు మాత్రమే వాస్తవిక దృక్కోణం ఉంటుంది.

భావోద్వేగాలపరమైన పక్షపాత ధోరణులు: నష్టాన్ని అస్సలు ఇష్టపడకపోయే ధోరణి ఉంటే, లాభాలు ఎంత వచ్చినా గానీ కాస్తంత నష్టం వస్తే చాలా కష్టంగా అనిపించేలా చేస్తుంది. అలాగే, ఇటీవలి కాలంలో కనిపించిన ధోరణుల వైపు మొగ్గు చూపే ఆలోచన విధానం ఉంటే, మార్కెట్లు స్వల్పకాలిక ఒడిదుడుకులకు లోనైనా ఇన్వెస్టర్లు భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకునే పరిస్థితి తలెత్తుతుంది. గుంపును అనుసరించి ముందుకెళ్లే ధోరణి, ఇన్వెస్టర్లు తమకు అనువుకాని రిస్కులను తీసుకునేలా ప్రేరేపిస్తుంది.

జీవితంలో మార్పులు: యువ ప్రొఫెషనల్స్‌కు కాస్తంత రిస్కులు తీసుకునే సామర్థ్యాలు ఎక్కువే ఉండొచ్చు. కానీ పెళ్లి, పిల్లలు, రిటైర్మెంట్‌కు దగ్గరవుతుండటంలాంటి పరిస్థితుల కారణంగా ప్రాధాన్యతలు మారొచ్చు. దానికి అనుగుణంగానే రిస్క్ సామర్థ్యాలూ మారొచ్చు.

కాలవ్యవధిపై భ్రమలు: పెట్టుబడులు మొదలెట్టినప్పుడు తమకు బోలెడంత సమయం ఉందని ఇన్వెస్టర్లు భావిస్తుంటారు. కానీ స్వల్పకాలికంగా నష్టాలు ఎదురైనప్పుడు, అసలు సమయమే లేదనే రీతిలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు.

సామర్థ్యాలకు తగ్గట్లుగా పెట్టుబడులు..

ఇన్వెస్టర్లు తమ వాస్తవిక రిస్కు సామర్థ్యాల గురించి అర్థం చేసుకున్న తర్వాత, తదనుగుణంగా పోర్ట్‌ఫోలియోను సరి చేసుకోవడం చాలా కీలకం. ఈక్విటీలు, ఫిక్సిడ్ ఇన్‌కం, ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలతో పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యాన్ని పాటిస్తే, రిస్కులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలవుతుంది. పెట్టుబడులను దీర్ఘకాలికంగా కొనసాగించడం ద్వారా ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) ఉపయోగపడతాయి. జీవితంలోని దశలు, మార్కెట్ పరిస్థితులను బట్టి రిస్క్ సామర్థ్యాలు మారిపోతుంటాయి కాబట్టి, మధ్యమధ్యలో పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకుంటూ ఉండాలి. క్రమం తప్పకుండా రీబ్యాలెన్స్ చేసుకుంటూ ఉంటే రిస్కులకు తగ్గట్లుగా మెరుగైన రాబడులను పొందేందుకు సాధ్యపడుతుంది. ప్రొఫెషనల్ సలహాలను తీసుకుంటే మనకు అనువైన వ్యూహాలను అమలు చేసేందుకు వీలవుతుంది. పెట్టుబడులు విజయవంతం కావాలంటే మనపై మనకు అవగాహన ఉండటం ముఖ్యం. తప్పుగా అంచనా వేసుకుంటే, భావోద్వేగాలపరమైన నిర్ణయాలతో అంతిమంగా ఆర్థిక ప్రణాళికలు పట్టాలు తప్పుతాయి. క్రమం తప్పకుండా సమీక్షించుకుంటూ ఉండటం, క్రమశిక్షణతో పెట్టుబడులు, సమతుల్యమైన వ్యూహాలు వంటి అంశాలు లక్ష్యాల సాధన దిశగా ముందుకెళ్లేందుకు ఉపయోగపడతాయి.

ఎలా గుర్తించాలి..

వాస్తవిక రిస్క్ సామర్థ్యాలను అర్థం చేసుకోవాలంటే గతంలో చేసిన పెట్టుబడుల ధోరణులను ఒకసారి విశ్లేషించుకోవాలి. మార్కెట్లు పతనమైనప్పుడు కూడా పెట్టుబడులను కొనసాగించారా లేదా కంగారు పడిపోయి, నిష్క్రమించారా? అనే అంశాన్ని పరిశీలించుకోవాలి. ఆదాయ స్థిరత్వం, పెట్టుబడుల కాలవ్యవధి, ఒడిదుడుకుల విషయంలో భావోద్వేగాలపరమైన స్పందన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకునే రిస్క్ ప్రొఫైలింగ్ సాధనాలు ఇందులో కాస్త సహాయపడగలవు. ఇక అసెట్లకు జరిపే కేటాయింపులు కూడా మనం ఎంతవరకు రిస్కులను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉంటామనే విషయాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు పెట్టుబడుల విషయంలో చాలా దూకుడుగా, చురుగ్గా ఉంటాననుకునే వ్యక్తి ఎక్కువగా ఫిక్సిడ్ ఇన్‌కం అసెట్స్‌వైపే మొగ్గు చూపుతున్నారంటే, తాము ఊహించుకుంటున్న దానికన్నా వారి రిస్క్ సామర్థ్యాలు తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు.

పెట్టుబడుల కాలవ్యవధి, ఆర్థిక లక్ష్యాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. స్వల్పకాలిక లిక్విడిటీ అవసరాలు ఉన్న వారితో పోలిస్తే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు సాధారణంగా కాస్తంత ఎక్కువ రిస్కులు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒక చిన్న స్ట్రెస్ టెస్టుతో వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకోవచ్చు. పోర్ట్‌ఫోలియో 20 శాతం పడిపోయినా ఎలాంటి మార్పులు, చేర్పులూ చేయకుండా ఓర్చుకోగలమా అనే చిన్న ప్రశ్న వేసుకుంటే మన రిస్క్ సామర్థ్యాలు మనకు అర్థమవుతాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-4-2025

విశాఖ	430-00
చిత్తూరు	480-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

హైబ్రిడ్ ఫండ్స్‌కి ఆదరణ



న్యూఢిల్లీ: హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి 2024–25లో రూ.1.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2023–24లో వచ్చిన పెట్టుబడులు రూ.1.45 లక్షల కోట్లతో పోల్చి చూస్తే 18 శాతం తగ్గాయి. అయినప్పటికీ గణనీయంగా పెట్టుబడులు రావడం గమనించొచ్చు. అంతే కాదు, ఇన్వెస్టర్ల పెట్టుబడి ఖాతాలతో (ఫోలియోలు)పాటు, హైబ్రిడ్ ఫండ్స్ నిర్వహణలోని పెట్టుబడులు (ఏయూఎం) అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే వృద్ధి చెందడం గమనార్హం. ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 1.35 కోట్ల నుంచి గత ఆర్థిక సంవత్సరం చివరికి 1.56 కోట్లకు పెరిగాయి. ఇక వీటి నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.7.23 లక్షల కోట్ల నుంచి రూ.8.83 లక్షల కోట్లకు పెరిగింది. అంటే ఏయూఎంలో 22 శాతం వృద్ధి నమోదైంది. ఈక్విటీ మార్కెట్లో అనిశ్చితులు పెరిగిపోవడం, కంపెనీల ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడం వంటి పరిణామాలు పెట్టుబడులపై ప్రభావం చూపించినట్టు నిపుణులు చెబుతున్నారు. హైబ్రిడ్ ఫండ్స్ ఈక్విటీ, డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయని తెలిసిందే. హైబ్రిడ్ పథకాల్లో డెట్ పెట్టుబడులకు ఉండే రక్షణ దృష్ట్యా అవి గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించినట్టు ట్రేడ్‌జినీ సీవోవో త్రివేష్ తెలిపారు. అచ్చమైన ఈక్విటీలతో పోల్చితే ఈ పథకాల్లో పెట్టుబడుల విషయంలో ఇన్వెస్టర్లు అంత ఆందోళన చెందక్కర్లేదన్నారు. 2022–23లో ఇదే విభాగం నికరంగా రూ.18,813 కోట్లను కోల్పోవడం గమనార్హం.

నగదు డిపాజిట్ చేస్తున్నారా..?



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

నగదు .. అంటే కరెన్సీ నోట్లను బ్యాంకు అకౌంటులో జమచేయడం మీద ఎన్నో ఆంక్షలు ఉన్నాయి.

→ పాన్ నెంబర్ వేయకుండా, అంటే అవసరం లేకుండా ఒక వ్యవహారంలో రూ.50,000 దాటకుండా డిపాజిట్ చేయవచ్చు.

→ అలా అని ఒకరోజు మొత్తంలో రూ. 2 లక్షలు దాటి తీసుకోరు.

→ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు డిపాజిట్లు చేసారంటే మీరు జాగ్రత్త పడాలి. ఈ పరిమితిని ఒక ఆంక్షలాగే భావించాలి. మొదటగా పాన్ నెంబర్ ఇవ్వాలి. అంతేకాకుండా సదరు బ్యాంకు బ్రాంచి ఏ పొదుపు ఖాతాలో నగదుగా రూ.10 లక్షలు, అంతకన్నా ఎక్కువగా డిపాజిట్ అయ్యిందో, వారి అకౌంటు వివరాలు... సంవత్సర కాలంలో నగదు మొత్తం ఎంత జమ అయ్యిందో, సమాచారం తెలియజేస్తారు. ప్రతి బ్యాంకుకి వారి వారి పాలసీలు కూడా అమలులో ఉన్నాయి.

ఈ క్రింది కేసులు/వ్యవహారాలు గమనించండి.

→ ఈశ్వరరావు పాలబూత్‌లో కార్డులు, అరువులు కాకుండా రోజూ నగదు రూపేణా రూ.20 వేల అమ్మకాలు ఉండేవి. రోజూ ఉదయం బ్యాంకు తెరవగానే ఆ మొత్తాన్ని డిపాజిట్ చేసేవాడు. ఏడాదికిగాను రూ.72 లక్షలు డిపాజిట్ అయ్యాయి. నోటీసులు వచ్చాయి. నగదుగా చేసిన డిపాజిట్ నుంచి సరఫరా చేసే డైయిరీఫాం వారికి పెద్ద పెద్ద మొత్తాలు చెక్కు/డీడీ రూపంలో చెల్లించేవాడు. డిపాజిట్ చేసిన మొత్తం పాల విక్రయం ద్వారా ఏర్పడింది. కానీ అది నూటికి నూరు పాళ్ళు ఆదాయం కాదు. లాభమూ కాదు. నోటీసులకు జవాబులిచ్చి బయటపడేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. ఇలా కొన్ని వ్యాపారాలు/వృత్తుల్లో ప్రైవేటు హాస్పిటల్స్, సినిమా పరిశ్రమ, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, హోటల్స్, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్‌లో నగదు వస్తుంటుంది. తగిన జాగ్రత్త వహించాలి. అలాగే గుడి, గోపురాల్లో కూడా.

→ దామోదర్ రెడ్డికి నగరశివార్లలో ఒక పెద్ద కాంప్లెక్స్, 12 ఫ్లాట్లు ఉన్నాయి. అద్దెలు వస్తున్నాయి. వయస్సు పెద్దది. సమయం, ఓపిక లేదు. అందరూ నగదే చెల్లిస్తున్నారు. అందరిని తన పొదుపు ఖాతాలోకి నగదు రూపంలో డిపాజిట్ చేయమనేవాడు. వారందరూ మాట ప్రకారం అకౌంట్లోనే జమచేసేవారు. లక్షల్లో తేలేది అద్దె ఆదాయం. నోటీసులు తథ్యం. అకౌంటు చేయక తప్పలేదు.

→ వీరభద్రానికి పెద్ద ఇల్లు. నలుగురు పిల్లలు. భారీ సంపాదన. అంతా చెక్కు రూపంలోనే స్వీకరించేవారు. నగదు విత్‌డ్రా చేయడం ఖర్చులన్నీ పోగా మిగిలిన మొత్తాన్ని నగదు ద్వారా బ్యాంకులో డిపాజిట్ చేసేవారు. ఇలా చేసిన డిపాజిట్లు రూ.10 లక్షల దాటాయి. నోటీసులు... కథ కమామీషు.


→ హస్తవాసి ఉన్న డాక్టర్ ఆనంద్‌రావు ఖాతాలు, ఎన్నో గుళ్లు గోపురాలు ప్రతిష్ఠ చేసిన బ్రహ్మ గారి ఖాతాలు, లంచాలు లాగి.. లాగి అమాయకంగా బ్యాంకులో నగదు డిపాజిట్ చేసిన లంచావతారం ఖాతాలు, అదర్శ రైతు అవార్డు పొందిన రైతుగా తన వ్యవసాయ ఆదాయాన్ని బ్యాంకు అకౌంటులో డిపాజిట్ చేసిన నాగయ్య, ఎన్నో ఇళ్లు కట్టిన మేస్త్రిగా మంచి పేరు పొందిన కొండయ్య, బొటిక్ పెట్టి మంచి పేరుతో డబ్బులు సంపాదించి బ్యాంకులో డిపాజిట్ చేసిన రాణి, కేటరింగ్‌తో లక్షలు సంపాదించి నగదు డిపాజిట్ చేసిన శ్రీను.. ఇలా ఎందరో నగదు డిపాజిట్‌దారులు.. ఎన్నెన్నో కథలు.

→ ప్రయివేటు చిట్టీల్లో వచ్చిన మొత్తాలు... భూములు, పొలాలు, ఇండ్లు అమ్మగా వచ్చిన మొత్తాలు... స్నేహితులు, చుట్టాలు ఇచ్చిన రుణాలు... అప్పులు... ఇలా ఎంతమందినైనా చెప్పవచ్చు. ఎన్నో వ్యవహారాలు ప్రస్తావించవచ్చు. అన్నీ డిపాజిట్ల ఆదాయం కాకపోవచ్చు. సరైన, సమగ్రమైన, సంతృప్తికరమైన వివరణ ఇస్తే బయపడవచ్చు. లేదంటే ఈ డిపాజిట్లలో నగదును ఆదాయంగా భావించే ప్రమాదం ఉంది. 1.4.2024 నుంచి 31.3.2025 మధ్య ఇటువంటి డిపాజిట్లు ఉంటే విశ్లేషించుకోండి. విషయాన్ని బయటపెట్టండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో మంచి రాబడి

టాటా ఈక్విటీ పీఈ ఫండ్



ఈక్విటీ మార్కెట్లు ఎప్పుడూ లాభాల బాటలోనే ప్రయాణించవు. ఎగుడుదిగుళ్లు సర్వసాధారణం. ర్యాలీ తర్వాత స్టాక్స్‌లో దిద్దుబాటు సహజం. కనుక ఇన్వెస్టర్లు అన్ని కాలాలకూ అనుకూలమైన పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలంటే అందుకు వ్యాల్యూ ఫండ్స్ మంచి ఎంపిక అవుతుంది. గత మూడు నెలల్లో లార్జ్‌క్యాప్‌తో పోల్చితే మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో భారీ దిద్దుబాటు చూశాం. వ్యాల్యూ ఫండ్స్ ఆకర్షణీయమైన విలువల వద్ద ఉన్న కంపెనీలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటాయి. తద్వారా దీర్ఘకాలంలో మంచి రాబడిని తెచ్చిపెట్టే పనితీరు చూపిస్తాయి. గ్రోత్ స్టాక్స్ మాదిరి వ్యాల్యూ స్టాక్స్ ధరలు పరుగులు పెట్టవు. కానీ స్థిరమైన పనితీరు చూపిస్తుంటాయి. అస్థిరతలు తక్కువ. దీర్ఘకాలంలో వ్యాల్యూ స్టాక్స్ సైతం మంచి రాబడులను ఇస్తాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కనీసం ఏడేళ్లు అంతకు మించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు వ్యాల్యూ ఫండ్స్ విభాగాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఈ విభాగంలో టాటా ఈక్విటీ పీఈ ఫండ్ పనితీరు నిలకడగా ఉండడాన్ని గమనించొచ్చు.



రాబడులు

ఈ పథకం రాబడులను గమనించినట్టయితే.. గడిచిన ఏడాది కాలంలో 4.54 శాతంగా ఉన్నాయి. కరెక్షన్ కారణంగా రాబడి తక్కువగా కనిపిస్తోంది. మూడేళ్లలో చూస్తే వార్షికంగా 20.55 శాతం చొప్పున రాబడిని ఇచ్చింది. ఐదేళ్లలో 26.38 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 15 శాతానికిపైనే వార్షిక రాబడులు ఈ పథకంలో కనిపిస్తాయి.

పెట్టుబడుల విధానం

అంతర్గత విలువతో (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) పోలిస్తే ఆకర్షణీయమైన ధరల వద్ద లభించే వాటిని వ్యాల్యూ స్టాక్స్‌గా చెబుతారు. బీఎస్ఈ సెన్సెక్స్ పీఈ కంటే తక్కువ పీఈ రేషియోలో ట్రేడ్ అవుతున్న (గత 12 నెలల ట్రెయిలింగ్ పీఈ రేషియో) స్టాక్స్‌ను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. తన నిర్వహణలోని మొత్తం పెట్టుబడుల్లో 70 శాతాన్ని ఈ స్టాక్స్‌కే కేటాయిస్తుంటుంది. ఇలా ఎంపిక చేసిన కంపెనీల్లోనూ భవిష్యత్తులో మంచి వృద్ధికి అవకాశం ఉన్న వాటిని తుది జాబితాగా తీసుకుంటుంది. ఆయా రంగాల్లో కంపెనీల స్థానం ఏంటి, వాటికి ఉన్న వృద్ధి అవకాశాలు, రాబడుల రేషియోలు ఎలా ఉన్నాయి, స్టాక్ లిక్విడిటీ ఈ అంశాలన్నింటికీ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. అన్ని రంగాల మధ్య, అన్ని స్థాయిల కంపెనీల్లోనూ (లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.8,004 కోట్ల ఆస్తులున్నాయి. ఇందులో 94 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా.. మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలోనే కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 37 స్టాక్స్ ఉన్నాయి. టాప్ 10 స్టాక్స్‌లోనే 46 శాతం పెట్టుబడులు ఉండడం గమనార్హం. పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్ సగటు పీఈ రేషియో 12.68 శాతంగా ఉంది. ఈక్విటీ పెట్టుబడులను గమనించినట్టయితే 68 శాతం లార్జ్ క్యాప్ కంపెనీలకు కేటాయించగా.. మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో 24.57 శాతం, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో 7.68 శాతం వరకు పెట్టుబడులు పెట్టి ఉంది. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు అత్యధికంగా 39.48 శాతం పెట్టుబడులు కేటాయించింది. ఆ తర్వాత ఇంధన రంగ కంపెనీల్లో 12.65 శాతం ఇన్వెస్ట్ చేసింది. టెక్నాలజీ కంపెనీలకు 11 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 9.57 శాతం చొప్పున కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	10.22
బీపీసీఎల్	4.87
కోల్ ఇండియా	4.79
కోటక్ బ్యాంక్	4.18
ముత్తూట్ ఫైనాన్స్	3.94
రాడికో ఖైతాన్	3.82
ఐసీఐసీఐ బ్యాంక్	3.79
విప్రో	3.60
శ్రీరామ్ ఫైనాన్స్	3.47
ఎన్‌టీపీసీ	3.36

వివాదం ఇంకా ఉంది!

- ఐ-లీగ్ వివాదంలో మరో మలుపు
- చర్చిల్ బ్రదర్స్‌ను విజేతగా ప్రకటించవద్దని సీఏఎస్ స్టే
- ఆదివారమే పతకాలు, ట్రోఫీలు కూడా అందజేసిన ఏఐఎఫ్ఎఫ్

న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐ-లీగ్ చాంపియన్‌షిప్‌లో చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్‌ను విజేతగా అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ప్రకటించడంపై అంతర్జాతీయ స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టు (సీఏఎస్) స్టే విధించింది. కేసులో విచారణ ముగిసేవరకు టైటిల్ చాంప్‌పై ఓ నిర్ణయానికి రావొద్దని సీఏఎస్ డివిజన్ డిప్యూటీ ప్రెసిడెంట్ మధ్యంతర తీర్పు ఇచ్చారు. ఈ సీజన్ ఐ-లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన ఇంటర్ కాశీ జట్టు తమకు సంబంధించిన ఒక మ్యాచ్ ఫలితంపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించకుండానే ఏఐఎఫ్ఎఫ్ ఏకపక్షంగా చర్చిల్ బ్రదర్స్ జట్టును విజేతగా ప్రకటించడం అసంబద్ధమని కోర్టుకెక్కింది. దీనిపై ఆదివారం విచారించిన సీఏఎస్ డివిజన్ ఏఐఎఫ్ఎఫ్‌కు వ్యతిరేకంగా తీర్పుఇచ్చింది. జట్టు సభ్యులకు పతకాలు గానీ, ట్రోఫీని గానీ బహూకరించరాదని స్పష్టం చేసింది. ప్రతివాదులైన విజేత జట్టు చర్చిల్ బ్రదర్స్ యాజమాన్యం, ఏఐఎఫ్ఎఫ్‌లకు కౌంటర్ దాఖలు చేసేందుకు ఈ నెల 29 వరకు గడువిచ్చింది. కానీ జరగాల్సిన తంతు ఆదివారమే జరిగిపోవడంతో ఇప్పుడు ఏఐఎఫ్ఎఫ్ నవ్వులపాలైంది. వివాదం ఉన్న సంగతిని ఏమాత్రం పట్టించుకోని ఏఐఎఫ్ఎఫ్ అత్యుత్సాహానికి పోయి ఆదివారం విజేత జట్టుకు ట్రోఫీని, పతకాలను బహూకరించింది. అయితే తుదితీర్పుకు లోబడే తమ నిర్ణయముంటుందని, అప్పుడు ట్రోఫీని, పతకాలను వెనక్కి తీసుకుంటామని ముక్తాయించిన తీరు సర్వత్రా విమర్శల పాలైంది.



ఏమిటీ వివాదం!

ఐ-లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో నాకౌట్ పోటీలు, ఫైనల్ మ్యాచ్ అనేవి ఉండవు. మొత్తం పాల్గొన్న జట్లలో సాధించిన విజయాలు, కొట్టిన గోల్స్, ఇచ్చిన గోల్స్ ఆధారంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటించారు. దీంతో 40 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న చర్చిల్ బ్రదర్స్‌ను ఏఐఎఫ్ఎఫ్ విజేతగా ప్రకటించింది. కానీ 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న ఇంటర్ కాశీ జట్టుకు అంతకుముందు నాంధారి జట్టుతో జరిగిన మ్యాచ్ ఫలితం వివాదం రేపింది. ఈ మ్యాచ్‌లో ఇంటర్ కాశీ జట్టు 2-0తో నాంధారి జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో అనర్హతకు గురైన ఆటగాడితో మ్యాచ్ ఆడించినందు వల్ల నాంధారి జట్టుపై పెనాల్టీ విధించి ఫలితాన్ని తమకు అనుకూలంగా ఇవ్వాలని ఇంటర్ కాశీ కోరింది. ఒకవేళ తీర్పు ఇంటర్ కాశీ జట్టుకు అనుకూలంగా వస్తే ఆ జట్టు 42 పాయింట్లతో ఐ-లీగ్ చాంపియన్‌గా అవతరిస్తుంది.


విన్నర్స్ ట్రోఫీలతో మనుశ్-దియా

మనుశ్-దియా జోడీ సంచలనం

డబ్ల్యూటీటీ ట్యూనిస్ కంటెండర్ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సొంతం

ఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంక్ జోడీపై విజయం

ట్యూనిస్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ... వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ట్యూనిస్ కంటెండర్ టోర్నీలో భారత్‌కు చెందిన మనుశ్ షా-దియా చిటాలె జోడీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించింది. ట్యూనిషియా రాజధాని ట్యూనిస్‌లో ఆదివారం ముగిసిన ఈ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో మనుశ్-దియా ద్వయం 11-9, 5-11, 14-12, 3-11, 11-6తో ప్రపంచ ఎనిమిదో ర్యాంక్ సారా మత్సుషిమా-మివా హరిమోటో (జపాన్) జోడీని బోల్తా కొట్టించింది. 37 నిమిషాలపాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో కీలకదశలో భారత జోడీ పైచేయి సాధించింది. సొంత సర్వీస్‌లో 22 పాయింట్లు నెగ్గిన దియా-మనుశ్... ప్రత్యర్థి సర్వీస్‌లోనూ 22 పాయింట్లు సాధించారు. విజేతగా నిలిచిన మనుశ్-దియాలకు 2,500 డాలర్ల (రూ. 2 లక్షల 13 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రపంచ ర్యాంకింగ్‌లో 11వ స్థానంలో ఉన్న మనుశ్-దియా ఈ టోర్నీలో మూడో సీడ్‌గా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో దియా-మనుశ్ 11-6, 11-5, 11-5తో సన్ యాంగ్-హు యి (చైనా)లపై, క్వార్టర్ ఫైనల్లో 11-6, 2-11, 16-18, 11-2, 11-4తో సత్యన్ జ్ఞానశేఖరన్-ఆకుల శ్రీజ (భారత్)లపై, సెమీఫైనల్లో 11-4, 11-5, 11-6తో వసీమ్ ఇసిద్ (ట్యూనిషియా)-హనా గొడా (ఈజిప్ట్)లపై విజయం సాధించారు.

14 స్వర్ణాల వేటలో...

ఫైనల్లో భారత బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. ఆదివారం బౌట్‌లలో సత్తా చాటిన 14 మంది భారత బాక్సర్లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. అండర్-15 బాలికల విభాగంలో 12 మందిలో 9 మంది భారత బాక్సర్లు తుదిపోరుకు అర్హత సాధించారు. పోటీల ఎనిమిదో రోజు బాలికల విభాగంలో కోమల్ (33 కేజీలు), నవ్య (58 కేజీలు), సునైనా (61 కేజీలు) ప్రత్యర్థులపై సంపూర్ణ ఆధిపత్యంతో రిఫరీ స్టాప్‌డ్ ద కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా విజయం సాధించగా... ఖుషీ అహ్లావత్ (35 కేజీలు), తమన్నా (37 కేజీలు), ప్రిన్సీ (52 కేజీలు), తృష్ణ (67 కేజీలు) కూడా చక్కటి ప్రదర్శనతో గెలుపొందారు. మిల్కీ మైనమ్ (43 కేజీలు) హోరాహోరీ సెమీస్‌లో 3-2తో నెగ్గి తుదిపోరుకు అర్హత సాధించింది. మరో ఇద్దరు బాక్సర్లు 'బై' ద్వారా ముందంజ వేశారు. బాలుర అండర్-15 విభాగంలో సంస్కార్ వినోద్ (35 కేజీలు) రిఫరీ స్టాప్‌డ్ ద కాంటెస్ట్ ద్వారా కిర్గిస్తాన్ బాక్సర్ అర్సెన్ జొరోబెవ్‌పై విజయం సాధించాడు. ఇతర బౌట్‌లలో రుద్రాక్ష్ (46 కేజీలు), అభిజీత్ (61 కేజీలు), లక్ష్య (64 కేజీలు) కూడా గెలిచి ఫైనల్‌కు చేరారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తంగా భారత బాక్సర్లు 43 పతకాలు ఖాయం చేసుకున్నారు.


రుద్రాక్ష్

పాక్ నుంచి స్వదేశానికి భారత బ్రాడ్‌కాస్టింగ్ సిబ్బంది

కరాచీ: భారత్‌కు చెందిన టీవీ ప్రొడక్షన్, బ్రాడ్‌కాస్టింగ్ సిబ్బంది పాకిస్తాన్ నుంచి స్వదేశానికి చేరుకుంది. మొత్తం 23 మంది భారత టెక్నీషియన్లు అక్కడ జరుగుతున్న పాక్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో సేవలందిస్తోంది. ఈ బృందంలో కెమెరామెన్‌లు, ప్రొడక్షన్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) నిపుణులు, సాంకేతిక సిబ్బంది ఉంది. పహల్గాంలో ఇటీవల భారత పర్యాటకులపై ఉగ్రమూక నరమేధానికి పాల్పడింది. ఇది ఇరుదేశాల మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలను పెంచింది. భారత ప్రభుత్వం పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. రోజుల వ్యవధిలోనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ప్రతిగా పాక్ కూడా ఈ నెలాఖర్లోగా భారతీయులు దేశం వీడాలని హుకుం జారీచేసింది. దీంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఉన్నతాధికారులు భారత్‌కు చెందిన 23 మంది బ్రాడ్‌కాస్టింగ్ సిబ్బందిని గౌరవప్రదంగా భారత్‌కు పంపింది. లాహోర్ నుంచి తిరుగుముఖం పట్టిన భారతీయులంతా వాఘ సరిహద్దు గుండా వారి స్వదేశానికి చేరుకున్నారని పీసీబీ వర్గాలు తెలిపాయి. పీఎస్ఎల్ బ్రాడ్‌కాస్టింగ్‌కు ఆటంకం కలుగకుండా విదేశీ నిపుణుల్ని నియమించుకున్నట్లు పీసీబీ అధికారి ఒకరు చెప్పారు.



స్వర్ణ పతకంతో అసీఫా

మరో విజయంపై గురి

- నేడు రాజస్తాన్ రాయల్స్‌తో గుజరాత్ టైటాన్స్ పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

జైపూర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో వరస విజయాలతో జోరు మీదున్న మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్... వరస పరాజయాలతో డీలా పడ్డ రాజస్తాన్ రాయల్స్‌తో పోరుకు సిద్ధమైంది. ఆడిన 8 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 2 ఓటములతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకున్న గుజరాత్ ప్లే ఆఫ్స్ వైపు అడుగులు వేస్తుండగా... రాజస్తాన్ 9 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 7 ఓటములతో పట్టికలో కింది స్థానం కోసం పోటీ పడుతోంది. రాయల్స్ జట్టు ఆడిన చివరి 5 మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైంది. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్‌పై గుజరాత్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ విజయానికి అతి చేరువగా వచ్చిన రాయల్స్... ఆఖర్లో ఒత్తిడికి చిత్తై ప్రత్యర్థికి మ్యాచ్‌లు అప్పగించింది. ఇందులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన 'సూపర్ ఓవర్' కూడా ఉంది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ సామ్సన్ గాయం కారణంగా జట్టుకు దూరం కాగా అతడి స్థానంలో రియాన్ పరాగ్ సారథ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన రాయల్స్... తెగించి పోరాడాలని చూస్తోంది. మరో రెండు విజాయలు సాధిస్తే టైటాన్స్‌కు ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు కానున్న నేపథ్యంలో ఈ మ్యాచ్ గుజరాత్‌కు మంచి అవకాశం కానుంది.

తెగించి కొట్లాడితేనే!

ఐపీఎల్ ఆరంభ సీజన్ (2008)లో చాంపియన్‌గా నిలిచిన రాజస్తాన్ రాయల్స్... ఆ తర్వాత ఎన్నిసార్లు ప్రయత్నించినా రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయింది. సారథులు, ఆటగాళ్లు, కోచ్‌లు ఎంతమంది మారినా జట్టు రాత మాత్రం మారలేదు. ఈసారి యువ ఆటగాళ్ల బృందంతో బరిలోకి దిగిన రాయల్స్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమవుతోంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన వంతు ప్రయత్నం చేస్తున్నా... మిగతా వాళ్ల నుంచి సహకారం లభించడం లేదు. తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన జైస్వాల్ 39.56 సగటుతో 356 పరుగులు చేశాడు. ఇందులో 4 అర్ధశతకాలు ఉన్నాయి. సంజూ దూరమవడంతో... 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీకి ఓపెనర్‌గా అవకాశం దక్కుతోంది. అందుకు తగ్గట్లే ఆరంభ మెరుపులు మెరిపిస్తున్న సూర్యవంశీ... ప్రతి బంతికి షాట్ కొట్టాలనే తొందరలో పెవిలియన్ చేరుతున్నాడు. రియాన్ పరాగ్, నితీశ్ రాణా, ధ్రువ్ జురెల్, శుభమ్ దూబేతో మిడిలార్డర్ పేపర్ మీద బలంగానే కనిపిస్తున్నా... మైదానంలో ప్రదర్శన అంతంత మాత్రమే. వెస్టిండీస్ వీరుడు హెట్‌మైర్ ధాటిగా ఆడటంలో విఫలమవుతున్నాడు. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్, హసరంగ, ఫరూఖీ, సందీప్ శర్మ ప్రభావం చూపలేకపోతున్నారు. ఇక చేసేదేమీ లేని తరుణంలో ఈ మ్యాచ్‌లో జట్టు సమష్టిగా తెగించి పోరాడాలని చూస్తోంది.


గుజరాత్ ఆటగాళ్లు


యశస్వి, వైభవ్

ఫుల్ ఫామ్‌లో టాప్-3...

శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్... చక్కటి ఫామ్‌లో ఉంది. బ్యాటింగ్‌లో టాప్-3 ప్లేయర్లు విజృంభిస్తుంటే... బౌలర్లు అంచనాలకు మించి రాణిస్తున్నారు. 8 మ్యాచ్‌ల్లో 52.13 సగటుతో 417 పరుగులు చేసిన సాయి సుదర్శన్ 'ఆరెంజ్ క్యాప్' రేసులో ముందు వరుసలో నిలవగా... గతంలో రాజస్తాన్‌కు ప్రాతినిధ్యం వహించిన బట్లర్ 71.20 సగటుతో 356 పరుగులు చేశాడు. సారథి గిల్ 43.57 సగటుతో 305 పరుగులతో కొనసాగుతున్నాడు. ఈ ముగ్గురూ 150కి పైగా స్ట్రయిక్ రేట్‌తో ఈ పరుగులు సాధించడం మరో విశేషం. మిడిలార్డర్‌లో షారుక్ ఖాన్, రూథర్‌ఫర్డ్, రాహుల్ తెవాటియా కీలకం కానున్నారు. ఇక దక్షిణాఫ్రికా పేసర్ రబడ లీగ్ మధ్యలో వ్యక్తిగత కారణాలతో స్వదేశానికి తిరుగు పయనమవడంతో... గుజరాత్ బౌలింగ్ బలహీన పడుతుందని భావిస్తే... విభిన్న కూర్పుతో మరింత రాటుదేలింది. గాయాల కారణంగా చాన్నాళ్లుగా లైమ్‌లైట్‌లో లేని ప్రసిధ్ కృష్ణ... 8 మ్యాచ్‌ల్లో 16 వికెట్లతో 'పర్పుల్ క్యాప్' రేసులో దూసుకెళ్తున్నాడు. హైదరాబాదీ పేసర్ సిరాజ్, సాయి కిషోర్ చెరో 12 వికెట్లు పడగొట్టి మంచి టచ్‌లో ఉన్నారు. వీరంతా మరోసారి విజృంభిస్తే... గుజరాత్ టైటాన్స్ జట్టు 'ప్లే ఆఫ్స్'కు మరింత చేరువ కావడం ఖాయమే!

తుది జట్లు (అంచనా)

రాజస్తాన్ రాయల్స్: రియాన్ పరాగ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, నితీశ్ రాణా, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, శుభమ్ దూబే, ఆర్చర్, హసరంగ, తుషార్ దేశ్‌పాండే, ఫజల్‌హక్ ఫరూఖీ, సందీప్ శర్మ.

గుజరాత్ టైటాన్స్: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్, రాహుల్ తెవాటియా, షారుక్ ఖాన్, రూథర్‌ఫోర్డ్, రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, సాయి కిషోర్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ.

అసీఫా ప్రపంచ రికార్డు

లండన్ మారథాన్ మహిళల విభాగంలో ఇథియోపియా రన్నర్ ఘనత

లండన్: ప్రతిష్టాత్మక లండన్ మారథాన్ రేసులో మహిళల విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఆదివారం జరిగిన ఈ రేసులో ఇథియోపియాకు చెందిన టిగ్స్‌ట్ అసీఫా విజేతగా అవతరించింది. 42.195 కిలోమీటర్ల దూరాన్ని 28 ఏళ్ల అసీఫా 2 గంటల 15 నిమిషాల 50 సెకన్లలో పూర్తి చేసి అద్భుత ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకోవడంపాటు ప్రపంచ రికార్డును లిఖించింది. జాయ్స్‌లిన్ జెప్‌కోస్గి (కెన్యా; 2గం:18ని:44 సెకన్లు) రజతం, సిఫాన్ హసన్ (నెదర్లాండ్స్; 2గం:19నిమిషాలు) కాంస్యం సాధించారు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన అసీఫా 2022, 2023 బెర్లిన్ మారథాన్ రేసుల్లోనూ విజేతగా నిలిచింది. లండన్ మారథాన్ పురుషుల విభాగంలో సెబాస్టియన్ సావీ (కెన్యా) విజేతగా నిలిచాడు. సెబాస్టియన్ 42.195 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 2 నిమిషాల 27 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. జేకబ్ కిప్లిమో (ఉగాండా; 2గం:3ని:37 సెకన్లు) రజతం, అలెగ్జాండర్ ముతిసో (కెన్యా; 2గం:4ని:20 సెకన్లు) కాంస్యం సాధించారు. గత ఏడాది లండన్ మారథాన్‌లోనే పెరెస్ జెప్‌చిర్‌చిర్ ఈ ప్రపంచ రికార్డును సృష్టించి స్వర్ణ పతకాన్ని సాధించగా... అసీఫా రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. ఈ సంవత్సరం పెరెస్ జెప్‌చిర్‌చిర్ లండన్ మారథాన్‌కు దూరం కాగా... అసీఫా అగ్రస్థానాన్ని అందుకుంది. ఈ క్రమంలో 2 గంటల 16 నిమిషాల 16 సెకన్లతో పెరెస్ జెప్‌చిర్‌చిర్ (కెన్యా) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును అసీఫా బద్దలు కొట్టింది.

శ్రీనిధి డెక్కన్ బ్లూ కబ్స్ ఫుట్‌బాల్ టోర్నీ విజయవంతం

సాక్షి, హైదరాబాద్: యువ ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎస్‌డీఎఫ్‌సీ) నిర్వహించిన బ్లూ కబ్స్ చాంపియన్‌షిప్ 2024-25 విజయవంతమైంది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) సూచనలకు అనుగుణంగా... ఎస్‌డీఎఫ్‌సీ చిన్నారుల కోసం ఈ చాంపియన్‌షిప్ నిర్వహించింది. ఈ లీగ్‌లో భాగంగా... అండర్-7, అండర్-9, అండర్-11 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గతేడాది నవంబర్ 9న ప్రారంభమైన ఈ లీగ్‌లో వేర్వేరు వయో విభాగాల్లో మొత్తం 32 జట్ల మధ్య 195 మ్యాచ్‌లు నిర్వహించారు. ఆరు నెలల పాటు సాగిన లీగ్‌లో సుమారు 400 మంది ప్లేయర్లు పాల్గొన్నారు. శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా సాగిన ఈ లీగ్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జీపీ పాల్గుణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ సుదీర్ఘంగా చేపట్టిన ఈ లీగ్ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఉపయోగపడుతుంది. చిన్నారుల్లో ప్రతిభను గుర్తించి సానబెడితే మరిన్ని మెరుగైన ఫలితాలు వస్తాయి. ఆర్నెళ్ల పాటు వారాంతాల్లో మ్యాచ్‌లు నిర్వహించడం మామూలు విషయం కాదు. ఈ కృషికి శ్రీనిధి క్లబ్‌ను అభినందించాలి. దీంతో ఆట మూలాల నుంచి బలపడుతూ... భవిష్యత్తుపై భరోసా పెంచుతుంది' అని అన్నారు.




ఆదివారం అటారీ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద భారత పాస్‌పోర్టున్న తన తల్లిని అడ్డుకోవడంతో సరిత అనే పాక్ జాతీయురాలి ఆవేదన


తన సోదరుడు, తండ్రి, కూతురిని పాక్‌కు అనుమతించి భారత పాస్‌పోర్టున్న తనను అడ్డుకోవడంతో ఓ మహిళ ఆవేదన


ఇరాన్‌కు చెందిన ఈమె పేరు ఇల్హాం. పాక్ గుండా భారత్ వచ్చారు. పాక్ తిరిగి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో తన ట్రక్‌లోనే కూర్చున్నారు.


పహల్గాం దాడి మృతులకు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో ఆదివారం సామూహిక పిండప్రదానం నిర్వహిస్తున్న పురోహితులు

3 నిమిషాలకో మరణం

రోజూ ఉదయం పేపర్ తీయగానే రోడ్డు ప్రమాద వార్తలు. బస్సులు లోయల్లోకి పడిపోవడం, ఆగి ఉన్న ట్రక్కులను ఢీకొన్న కార్లు. ద్విచక్ర వాహనాలను ఢీకొన్న పెద్ద వాహనాలు. ఈ రోజువారీ విషాదాలు నిశ్శబ్ద సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. భారత్‌లో ప్రతి మూడు నిమిషాలకొకరు రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారు. సగటున రోజూ 474 మరణాలు సంభవిస్తున్నాయి. 2023లోనే 1,72,000 మందికి పైగా భారతీయులు రోడ్లపై ప్రాణాలు కోల్పోయినట్టు కేంద్రం విడుదల చేసిన అధికారిక నివేదికే పేర్కొంది. వారిలో 10,000 మంది పిల్లలే. పాఠశాలలు, కళాశాలల సమీపంలో జరిగిన ప్రమాదాల్లో మరో 10వేల మంది మరణించారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వాహనాలు ఢీకొట్టి 35 వేల మంది పాదచారులు ప్రాణాలు కోల్పోయారు. మృత్యువాత పడ్డ ద్విచక్ర వాహనదారుల సంఖ్య కూడా అధికమే. ఈ ప్రమాదాలకు అతివేగమే అతి పెద్ద కారణం. కనీస భద్రతా జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ప్రాణాంతకంగా మారింది. హెల్మెట్ ధరించకపోవడం వల్ల 54 వేల మంది ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. కారులో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల 16 వేల మంది మరణించారు. ఓవర్ లోడ్ 12,000 మరణాలకు దారితీసింది. సరైన లైసెన్స్ లేకుండా వాహనాలు

మన రోడ్లు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరం

నడపడం వల్ల జరిగిన ప్రమాదాలకు బలైనవారు 34 వేలమంది.

రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రహదారి నెట్‌వర్క్ భారత్‌లో ఉంది. మొత్తం 66 లక్షల కిలోమీటర్ల పొడవైన రహదారులున్నాయి. ఇందులో జాతీయ, రాష్ట్ర రహదారుల వాటా 5 శాతం. 35 కోట్ల రిజిస్టర్డ్ వాహనాలున్నాయి. కానీ భారత రహదారులు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. అస్తవ్యస్తమైన రహదారుల వ్యవస్థే దీనికి



కారణం. రోడ్లపై ట్రాఫిక్ నియమాలు సరిగ్గా లేకపోవడం, ఉన్నా పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాలు, భారీ వాహనాలు, ఆటోలు, సైకిళ్లు, పాదచారులు, అక్కడక్కడా జంతువులు.. మొత్తంగా రోడ్డును అడ్డదిడ్డంగా ఉపయోగించడం వల్ల పరమాదాలు జరుగుతున్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణ కూడా ప్రమాదాలకు కారణంగా ఉంది. ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా నియంత్రణకోసం ఎన్ని నిధులు వెచ్చించినా మారని మనుషుల తీరు, అమలులో లోపాలు, వ్యవస్థాగత నిర్లక్ష్యం సంక్షోభానికి కారణమవుతోంది. రోడ్డు ప్రమాదాలతో దేశ వార్షిక జీడీపీకి 3 శాతం నష్టం కలుగుతోందంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలకు చట్టం పట్ల గౌరవం, భయం లేకపోవడం వల్లే అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వాలు చెబుతున్నా అది ఒక పార్శ్వం మాత్రమే.

నిర్మాణ, నిర్వహణ లోపాలు

లోపభూయిష్టమైన రోడ్ల డిజైన్, నాసిరకం నిర్మాణం, అసమర్థ నిర్వహణ ప్రమాదాలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. రోడ్డు సూచికలు, మార్కింగ్ విధానం వంటి చిన్న విషయాలు కూడా అధ్వానంగా ఉన్నాయి. 59 ప్రధాన లోపాలను కేంద్ర ఉపరితల రవాణా శాఖే గుర్తించింది. రహదారుల్లో ప్రమాదానికి కారణమయ్యే 13,795 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. వీటిలో 5,036లకు మాత్రమే దీర్ఘకాలిక మరమ్మతులు చేశారు. ఢిల్లీ ఐఐటీ ట్రాన్స్‌పోర్టేషన్ రీసర్చ్ అండ్ ఇంజ్యూరీ ప్రివెన్షన్ సెంటర్ నిర్వహించిన రోడ్ సేఫ్టీ ఆడిట్లు దేశ రహదారుల్లో మౌలిక సదుపాయాల లోపాలేంటో గుర్తించాయి. క్రాష్ బారికేడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం కూడా ప్రధాన కారణంగా ఉంది. బారికేడ్లున్నా లెక్క చేయక పోవడం కొంత కారణమైతే అస్తవ్యస్తమైన నిర్వహణే ఎక్కువ హాని చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. డివైడర్ల నిర్మాణంలోనూ లోపాలున్నాయి. ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఎత్తులో ఉండటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. గుంతలు తవ్వి వదిలేయడం, సైన్ బోర్డులు పెట్టకపోవడం వల్లా ప్రమాదాలు జరుగుతున్నాయి. పటిష్టమైన రహదారుల వ్యవస్థ కాగితాలపైనే ఉందని, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని నిపుణులు చెబుతున్నారు.

అనుకరణ వద్దు

భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. ఇక్కడ ప్రత్యేక ట్రాఫిక్ వ్యవస్థ ఉంటుంది. తదనుగుణంగా ఏర్పాట్లుండాలి. అందుకు భిన్నంగా పాశ్చాత్య రహదారుల నమూనాలను అనుకరించడం ప్రమాదాలకు కారణమవుతోందన్నది అంతర్జాతీయ నిపుణుల వాదన. రోడ్డు వెడల్పు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నది నిజం కాదని చెబుతున్నారు. రోడ్డు వెడల్పు అతి వేగానికి దారి తీస్తుందని, చిన్న వాహనదారులకు ప్రాణాంతకంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. దేశాభివృద్ధికి మరిన్ని రహదారులను నిర్మించడం కీలకమేనని, అయితే అది పాదచారులు, సైక్లిస్టుల, ద్విచక్ర వాహనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆ అభివృద్ధికి నిరుపేద వర్గాలు మూల్యం చెల్లించుకోవాల్సి రాకూడదని హెచ్చరిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పాపం పసివాళ్లు!

తల్లులను వీడి కన్నీటి నడుమ పాక్ బాట

కుటుంబాలను విడదీస్తున్న ఉగ్ర దాడి

ఒక్క ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయడమే గాక తల్లీబిడ్డలను విడదీస్తోంది. భార్యాభర్తలను వేరు చేస్తోంది. విభజన కాలం నాటి ఉద్విగ్న పరిస్థితులను తలపిస్తోంది. పహల్గాంలో ఉగ్రదాడి తరువాత పాక్ వీసాలను రద్దు చేయడం తెలిసిందే. దాంతో ఇక్కడి పాకిస్తానీలంతా వెనుదిరుగుతున్నారు. భారత వీసాలున్న పలువురు మహిళలు మాత్రం తమ కుటుంబంతో పాటు పాక్ వెళ్లలేకపోతున్నారు. పాక్ వీసాలున్న వారి పిల్లలేమో వెళ్లక తప్పని పరిస్థితి! తల్లులను విడిచి వెళ్లలేక వారు పడుతున్న బాధ వర్ణనాతీతం! '''తల్లి లేకుండా పిల్లలెలా ఉంటారు ప్రధాని మోదీ జోక్యం చేసుకుని తల్లులను పిల్లల దగ్గరకు చేర్చాలి'' అని ఆ కుటుంబాలు వేడుకుంటున్నాయి.


కంటతడి పెడుతున్న జైనబ్

పిల్లలు విలవిల్లాడుతున్నారు

గత నెలలో కరాచీ నుంచి భారత్‌కు వచ్చిన మరో కుటుంబానిదీ ఇదే పరిస్థితి. తల్లికి భారత పౌరసత్వం ఉండగా పిల్లలు పాకిస్తాన్ జాతీయులు. ''అమ్మను వదిలి వెళ్లడం బాధగా ఉంది. అమ్మ మాతోపాటు పాక్ రావడానికి అనుమతించాలని మోదీని వేడుకుంటున్నా'' అంటూ అల్యాన్ అనే బాలుడు అభ్యర్థించాడు. ''మేం గత నెల కరాచీ నుంచి భారత్ వచ్చాం. నా భార్య నబీలాను ఇక్కడే వదిలి తిరిగి వెళ్లాలివస్తోంది. పిల్లలు విలవిల్లాడుతున్నారు. ఈ టెర్రరిస్టులు మా కుటుంబాన్ని వేరు చేశారు. అందుకు మూల్యం చెల్లించుకుంటారు'' అని అల్యాన్ తండ్రి మహ్మద్ ఇర్ఫాన్ వాపోయారు. భార్య షర్మీన్, కూతుళ్లతో కలిసి వచ్చిన మహ్మద్ ఇమ్రాన్‌దీ ఇదే పరిస్థితి. ''షర్మీన్‌కు భారత పాస్‌పోర్టుంది. దాంతో మాతో పాక్ వచ్చేందుకు అనుమతించడం లేదు. మోదీ మాకు సాయం చేయాలి'' అని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మమ్మను చూడ్డానికి వచ్చి.. అమ్మను వదిలేసి..


ఆదివారం పంజాబ్‌లోని అటారీ సరిహద్దులో విషాద పరిస్థితులు నెలకొన్నాయి. తల్లిని వీడి వెళ్తున్న 11 ఏళ్ల జైనబ్, 8 ఏళ్ల జెనీష్ కన్నీటి పర్యంతమయ్యారు. ''నానీని కలవడానికి వచ్చాం. కానీ ఇప్పుడు అమ్మ మాతో రాలేకపోతోంది. నేను, చెల్లి మాత్రమే వెళ్లిపోతున్నాం. అమ్మను వదిలి వెళ్లాలన్న ఆలోచనకే నా గుండె బద్దలవుతోంది'' అంటూ జైనాబ్ విలపిస్తోంది. వారి తండ్రి పాకిస్తానీ. తల్లిది ఢిల్లీ. పిల్లలిద్దరికీ పాకిస్తాన్ పాస్‌పోర్టుండగా తల్లికి భారత్ పాస్‌పోర్టుంది. ఢిల్లీలో అమ్మమ్మను చూడ్డానికి గత నెలలో వచ్చారు. తమలాంటి అమాయకులను ఇబ్బంది పెట్టిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని జైనాబ్ కోరుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కశ్మీర్‌కు పర్యాటక కళ

శని, ఆదివారాల్లో పెరిగిన రద్దీ • సురక్షితమేనంటున్న పర్యాటకులు

కశ్మీర్ నెత్తుటి మరకలను తుడుచుకుంది. పాశవిక దాడి తాలూకు చేదు అనుభవం నుంచి చూస్తుండగానే తేరుకుంది. పర్యాటకులను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటోంది. దాడి నేపథ్యంలో భయాందోళనలతో లోయను వీడిన టూరిస్టులు ఇప్పుడు అక్కడికి తిరిగి వెళ్తున్నారు. ఉగ్ర దాడుల ఆందోళనలు పూర్తిగా తొలగకపోయినా దేశమంతా ఏకమై ఉందని చెప్పడానికి కశ్మీర్‌ను సందర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో కోల్‌కతా, బెంగళూరు సహా దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు కశ్మీర్ చేరుకున్నారు. ''కశ్మీర్ ఇప్పుడు సురక్షితంగా ఉంది, షాపులు, సందర్శన స్థలాలు అన్నీ తెరిచే ఉన్నాయి'' అని వారు స్వయంగా చెబుతున్నారు. ''లోయ మళ్లీ పర్యటాకులతో కళకళలాడుతోంది. కశ్మీర్ పర్యటనకు రండి' అని స్థానిక టూర్ ఆపరేటర్లతో పాటు ప్రభుత్వం కూడా పిలుపునిస్తోంది. ప్రఖ్యాత దాల్ సరస్సు ఆదివారం ఉదయం మళ్లీ సందడిగా మారింది. పర్యాటకులు షికారాల్లో విహారాన్ని, స్థానిక ఆతిథ్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు. కశ్మీరీల ఆతిథ్యం గొప్పగా ఉందంటూ కొనియాడుతున్నారు. ఉగ్ర దాడితో పర్యాటకం దెబ్బతినకుండా చూసుకుందామంటూ పిలుపునిస్తున్నారు.


ఆదివారం పహల్గాంలో విదేశీ పర్యాటకుల సందడి

కశ్మీర్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు బాలీవుడ్ నటుడు అతుల్ కులకర్ణి ముందుకొచ్చారు. 'చలో కశ్మీర్' అంటూ ఆయన ఆదివారం ఉదయం పహల్గాం చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. ''కశ్మీర్ పర్యటన ప్రణాళికలను రద్దు చేసుకుంటే ఉగ్రవాదులు అనుకున్నది నెరవేరుతుంది. అది జరగకూడదు. పర్యాటకులు కశ్మీర్‌కు రావాలి'' అని ఎక్స్‌లో పిలుపునిచ్చారు. 'చలో కశ్మీర్', 'టెర్రరిజాన్ని ఓడించండి', 'ఫేట్స్ ఇన్ కశ్మీర్' అంటూ హ్యాష్‌టాగ్‌లు జోడించారు. ఉగ్రవాదాన్ని ఓడించాలనే సందేశంతో కశ్మీర్లో రెండు రోజుల పాటు పర్యటిస్తానని కులకర్ణి చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజలు పరస్పరం అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కశ్మీరీ జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్న తమిళనాడుకు చెందిన పర్యాటకుల బృందాన్ని పహల్గాంలో చూశానని, ఇలాంటి సంభాషణలు ప్రజల సన్నిహిత బంధాలను పెంపొందించడానికి, ఐక్యత, కరుణ సందేశాన్ని పంపడానికి కూడా సహాయపడతాయని ఆయన అన్నారు. పహల్గాంలోని బైసారన్ లోయలో మంగళవారం ఉగ్ర దాడి జరిగిన వెంటనే కశ్మీర్‌లోని హోటళ్లు, హౌస్ బోట్ల టూరిస్ట్ బుకింగ్స్‌లో 80 శాతం వరకు రద్దవడం తెలిసిందే. వేలాది మంది పర్యాటకులు కశ్మీర్‌లో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని ప్రత్యేక విమానాలు, రైళ్లలో స్వస్థలాలకు చేరుకున్నారు.

'ఛలో కశ్మీర్'
నటుడు అతుల్ కులకర్ణి

ఉగ్ర లక్ష్యం నెరవేర నీయొద్దు


''దుర్గా పూజ తర్వాత కశ్మీర్ పర్యటనకు బుకింగ్స్ చేసుకున్నాం. దాడితో షాకయ్యాం. కానీ స్థానికులతో మాట్లాడాక వెళ్లొచ్చని నిర్ధారించుకున్నాం. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కశ్మీర్‌ను కచ్చితంగా పర్యటించాలనే వచ్చాం. భయపడి ఆగిపోతే ఉగ్రవాదుల లక్ష్యాన్ని నెరవేర్చిన వాళ్లమవుతాం అనిపించింది. అందుకే వచ్చాం' అని కోల్‌కతా నుంచి వచ్చిన ఓ యువతి తెలిపారు. ''ఇప్పుడు కశ్మీర్ సురక్షితంగా ఉంది. గుల్మార్గ్, సోన్‌మార్గ్, తరువాత పహల్గాం కూడా వెళ్లాలనుకుంటున్నాం. కశ్మీర్ భారత్‌లో భాగం. మనం కశ్మీర్ సందర్శించడం స్థానికులకు సాయం చేసినట్టవుతుంది. ఈ విషాద సమయాల్లో మనమంతా ఒక్కటని చాటాల్సిన అవసరముంది'' అని మరో యువకుడు నొక్కి చెప్పారు. ''మేం దాడి తర్వాతే వచ్చాం. ఇప్పుడిక్కడ అంతా సాధారణంగానే ఉంది. చల్లటి వాతావరణాన్ని ఎంజాయ్ చేశాం' అని బెంగళూరుకు చెందిన దంపతులు చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

టైటానిక్ లేఖకు రూ.3.4 కోట్లు

టైటానిక్ నౌక మునిగిపోవడానికి కొన్ని రోజుల ముందు అందులోంచి ఓ ప్రయాణికుడు రాసిన లేఖకు వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. బ్రిటన్‌లో జరిగిన వేలంలో ఆ లేఖను ఒకరు 3 లక్షల పౌండ్లకు (రూ.3.4 కోట్లకు) కొనుగోలు చేశారు. కల్నల్ ఆర్చిబాల్డ్ గ్రేసీ అనే సదరు ప్రయాణికుడు 1912 ఏప్రిల్ 10న ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్‌లో టైటానిక్‌లోకి ఎక్కిన రోజు ఆ లేఖ రాశారు. అంటే ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో ఐస్‌బర్గ్‌ను ఢీకొట్టి మునిగిపోవడానికి ఐదు రోజుల ముందు. ఈ ప్రమాదం నుంచి అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ లేఖను విల్ట్‌షైర్‌లోని హెన్నీ ఆల్‌డ్రిడ్జ్ అండ్ సన్ వేలం హౌస్ ఆదివారం వేలం నిర్వహించింది. ఆశించిన దానికంటే 60 వేల రెట్లు ఎక్కువకు అమ్ముడుపోయిందని తెలిపింది. టైటానిక్ నుంచి జరిగిన అన్ని ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ దీనికే అత్యధిక ధర పలికిందని తెలిపారు. న్యూయార్క్ వెళ్తున్న టైటానిక్‌లోని 2,200 మంది ప్రయాణికులు, సిబ్బందిలో కల్నల్ గ్రేసీ ఒకరు. ఫస్ట్ క్లాస్‌లో క్యాబిన్‌సీ 51 నుంచి ఆ లేఖ రాశారు. ఏప్రిల్ 11న ఐర్లాండ్‌లోని క్వీన్స్‌టౌన్‌లో నౌక ఆగినప్పుడు పోస్ట్ చేశారు. ప్రమాదం నుంచి బయటపడ్డా తక్కువ ఉష్ణోగ్రతలు, శారీరక గాయాల కారణంగా గ్రేసీ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తింది. 1912 డిసెంబరు 2 న కోమాలోకి వెళ్లి మరణించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్


April 10th 1912.
On board R.M.S. "TITANIC"
Dear Mr Brooks, I am delighted to receive your greetings aboard ship sent me at Southampton

ఎన్ఎస్ఎఫ్ డైరెక్టర్ పంచనాథన్ రాజీనామా

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికా శాస్త్రవేత్త సేతురామన్ పంచనాథన్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. ఎన్ఎస్ఎఫ్ 9 బిలియన్ డాలర్ల వార్షిక బడ్జెట్‌ను తగ్గించాలని, సిబ్బందిని తగ్గించాలని, డీఈఐ కార్యక్రమాలకు నిధులను తగ్గించాలని ట్రంప్ ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

నమాజ్ చేయాలని విద్యార్థులపై ఒత్తిడి

ఏడుగురు అధ్యాపకులపై కేసు • ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

బిలాస్‌పూర్: నమాజు చదవాలంటూ విద్యార్థులను బలవంతం చేశారన్న ఆరోపణలతో ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఏడుగురు అధ్యాపకులపై కేసు నమోదైంది. గురు ఘసిదాస్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు ఎన్‌సీసీ క్యాంపునకు వెళ్లారు. వారిలో నలుగురే ముస్లింలు. అధ్యాపకులు మాత్రం అందరినీ నమాజు చదవాలంటూ బలవంతం చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

ఇద్దరు తమిళ మంత్రుల రాజీనామా

చెన్నై: తమిళనాడు మంత్రులు వి.సెంథిల్ బాలాజీ, కె.పొన్ముడి ఆదివారం రాజీనామా చేశారు. ఈడీ విచారణను ఎదుర్కొంటున్న సెంథిల్ బెయిల్‌ను రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు హెచ్చరికల నేపథ్యంలో తప్పుకున్నారు. శైవులు, వైష్ణవులపై పొన్ముడి వ్యాఖ్యలు దుమారం రేపడం తెలిసిందే.

హత్యాచార దోషికి రెండు మరణ శిక్షలు

అహ్మదాబాద్: ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్యకు పాల్పడిన వ్యక్తికి గుజరాత్‌లోని ఖంబట్ సెషన్స్ కోర్టు ఆదివారం రెండు మరణ శిక్షలు విధించింది. ఆనంద్ జిల్లాకు చెందిన దాదో గోహెల్ (24) 2019 అక్టోబర్ 18వ తేదీన ఏడేళ్ల బాలికకు చాక్లెట్ల ఆశ చూపి తీసుకెళ్లాడు. అత్యాచారానికి పాల్పడి గొంతు నులిమి చంపాడు. అతని పాశవికత్వ మానవీయతకే మచ్చ అని జడ్జి పేర్కొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ కొత్త పుస్తకాల్లో... మొఘలులు, ఢిల్లీ సుల్తాన్ల చరిత్ర తొలగింపు

న్యూఢిల్లీ: ఎన్‌సీఈఆర్‌టీ 7వ తరగతి కొత్త పాఠ్యపుస్తకాల్లోని భారతీయ రాజవంశాల అధ్యాయంలో కీలక మార్పులు జరిగాయి. మొఘలులు, ఢిల్లీ సుల్తానుల చరిత్రను తొలగించారు. బదులుగా మహాకుంభమేళా, మేకిన్ ఇండియా, బేటీ బచావో, బేటీ పఢావో వంటివాటిని చేర్చారు. పుస్తకం తొలి భాగమే విడుదలైందని రెండో భాగం త్వరలోరానుందని అధికారులు తెలిపారు. ఈ మార్పులను కాషాయీకరణగా ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

సామాజిక కార్యకర్తను కాల్చి చంపిన ముష్కరులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులు సామాజిక కార్యకర్త ఒకరిని కాల్చి చంపారు. ఖండి ఖాస్‌లోని తన నివాసంలో ఉన్న గులామ్ రసూల్ మగ్రాయ్(45ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

వారణాసి: ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు కెనడాకు చెందిన ప్రయాణికుడు చేసిన హెచ్చరికతో వారణాసి విమానాశ్రయంలో కలకలం చెలరేగింది. శనివారం రాత్రి వారణాసి-బెంగళూరు విమానం ఎక్కిన ప్రయాణికుడొకరు తన వద్ద బాంబుందంటూ బెదిరించడంలో అధికారులు ఉలిక్కిపడ్డారు. విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి ప్రయాణికులందరినీ దించి వేశారు. బాంబేమీ లేదని తేలాక ఆదివారం ఉదయం విమానం బయల్దేరింది. కెనడా వాసిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

ఇరాన్‌లో 40కి పెరిగిన పేలుడు మృతులు

మస్కట్: ఇరాన్‌లోని షాహిద్ రాజీ నౌకాశ్రయంలో శనివారం సంభవించిన అత్యంత తీవ్ర పేలుడుకు క్షిపణుల్లో ఇంధనంగా వాడే రసాయనమే కారణం కావొచ్చని చెబుతున్నారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య 40కు చేరగా 1,000 మంది వరకు గాయపడ్డారు.

కెనడాలో జనంపైకి దూసుకెళ్లిన కారు

11 మంది మృతి దుర్మరణం

వాంకోవర్: కెనడాలోని వాంకోవర్‌లో శనివారం దారుణం జరిగింది. ఫిలిప్పీన్స్ ఉత్సవంలో పాల్గొంటున్న వారిపైకి కారు దూసుకెళ్లడంతో 11 మంది మృత్యువాత పడ్డారు. భయభ్రాంతులకు గురైన జనం తలోదిక్కు పరుగెత్తారు. దీనికి ఉగ్రవాదంతో సంబంధం లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై ప్రధాని మార్క్ కార్నీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పైకి రష్యా 150 డ్రోన్లు

కీవ్: ఉక్రెయిన్‌లోని పలు లక్ష్యాలపైకి రష్యా ఆదివారం సుమారు 150 డ్రోన్లు ప్రయోగించింది. యుద్ధాన్ని ఆపడం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇష్టం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. రష్యా దాడులు ఇది వరుసగా మూడో రోజని అధికారులు తెలిపారు. ''57 డ్రోన్లను కూల్చేశాం. 67 డ్రోన్లను జామ్ చేశాం'' అని ఉక్రెయిన్ ప్రకటించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన 8 డ్రోన్లను గాల్లోనే పేల్చేశామని రష్యా తెలిపింది.

సెమీ క్రయోజనిక్ హాట్ టెస్ట్ సక్సెస్

సూళ్లూరుపేట: తమిళనాడులో మహేంద్రగిరిలోని స్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్ ఇంజన్ హాట్ టెస్ట్ రెండో పరీక్ష విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. పూర్తి సెమీ క్రయోజనిక్ ఇంజన్ కార్యాచరణ ఖరారుకు ఇది కీలక డేటాను అందించింది. మే చివర్లో లేదా జూన్ తొలి వారంలో ప్రయోగించే జీఎస్ఎల్‌వీ ఎఫ్-16 రాకెట్ రెండో దశను (జీఎస్-2) కూడా సిద్ధం చేశారు. క్రయోజనిక్ దశనూ పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం కానున్నారు.

పాక్ మహిళకు వీసా నిరాకరణ

న్యూఢిల్లీ: దీర్ఘకాలం వీసా దరఖాస్తును పరిశీలించాలన్న షీనా నాజ్ అనే పాకిస్తాన్ మహిళ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. భారత పౌరుడిని పెళ్లాడినందున తనను ఇక్కడే ఉండేందుకు అనుమతించాలని కోరగా నిరాకరించింది. తన నివాస అనుమతిని అధికారులు రద్దు చేయకుండా చూడాలన్న అభ్యర్థనను కూడా కోర్టు తిరస్కరించింది.

సాక్షి ప్లస్
సోమవారం । 28-4-2025

ఏకీకృత ప్రభుత్వ వ్యవస్థ ముఖ్య లక్షణం?

స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

పరిచయం: రాజ్యం మనుగడకు ప్రధాన ఆధారం 'రాజ్యాంగం'. ప్రతి ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అత్యవసరం. దేశ ప్రభుత్వ యంత్రాంగ రథ చక్రాలు సాఫీగా సాగడానికి రాజ్యాంగ సూత్రాలు మార్గాన్ని సుగమం చేస్తాయి. రాజ్యాంగమంటే దేశపాలనా స్వభావాన్ని, దాని లక్ష్యాలను అమలు చేసే ప్రభుత్వ నిర్మాణాన్ని, ప్రభుత్వ విధులను, ప్రభుత్వ హక్కులను, బాధ్యతలను తెలిపే నియమ నిబంధనల రాజపత్రం. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆసక్తులు, ఆదర్శాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తోంది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, రాజ్యాంగ సభ ఉద్దేశాలను భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలను ఈ పాఠం స్థూలంగా వివరిస్తుంది. విద్యార్థులు ఈ పాఠ్యాంశ అధ్యయనం ద్వారా భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలన నుంచి విముక్తి పొందిన భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అంతకుముందే స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనావిధానాల రూపకల్పనకు మన నాయకులు రాజ్యాంగం అవసరాన్ని గుర్తించారు. రాజ్యాంగ రచన చేయడానికి 389 మంది మేధావులతో కూడిన రాజ్యాంగ సభ (పరిషత్తు) 1946, ఆగస్టులో ఏర్పడింది. వీరిలో 292 మంది వివిధ రాష్ట్రాలు, 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి నియమితులయ్యారు. వీరు కాకుండా మరో నలుగురు చీఫ్ కమిషనర్‌లు ఎంపికయ్యారు. ఇందులో వివిధ వర్గాలకు, ప్రాంతాలకు, పార్టీలకు చెందినవారున్నారు. 26 మంది షెడ్యూల్డ్‌కులాలకు చెందినవారు, 9 మంది మహిళలు ఉన్నారు. ఎక్కువమంది సభ్యులు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాగా, ఆ తర్వాత ముస్లింలీగ్ పార్టీవారున్నారు. అయితే 1947, ఆగస్టు 14న దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఏర్పడటంతో ఆ దేశానికి చెందిన 90 మంది సభ్యుల సంఖ్య తగ్గింది. తర్వాత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కు చేరుకుంది. వీరందరూ ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నిక కాలేదు. అయితే భారత ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ముఖ్యాంశాలు

- రాజ్యాంగంలో పొందుపర్చాల్సిన వివిధ అంశాల అధ్యయనానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో అతి ముఖ్యమైంది రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ. దీన్ని 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. డా౹౹బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలోని ఆరుగురు సభ్యులు గల ఈ కమిటీ రాజ్యాంగ సభ సమావేశాల్లోని చర్చల ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించింది. 1949, నవంబర్ 26న రాజ్యాంగసభ ఆమోదించిన మన రాజ్యాంగం జనవరి 26, 1950లో పూర్తిగా అమల్లోకి వచ్చింది. అందుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవం జరుపుకుంటున్నాం.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

- ముసాయిదా రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. రాజ్యాంగాన్ని ఆమోదించినప్పుడు 395 అధికరణలు, 8 షెడ్యూళ్లకు పెరిగాయి. వివిధ సవరణలు చేయడం వల్ల ప్రస్తుతం రాజ్యాంగంలో 448 అధికరణలు, 12 షెడ్యూళు ఉన్నాయి. రాజ్యాంగ రచనకు 2 ఏళ్ల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది.
- ప్రపంచంలో రెండు రకాల ప్రభుత్వ రూపాలున్నాయి. అవి.. పార్లమెంటు తరహా ప్రభుత్వ వ్యవస్థ, అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థ. ఇండియాలో మొదటి పద్ధతి అమలులో ఉంది. రెండో తరహా వ్యవస్థకు మంచి ఉదాహరణ అమెరికా.
- ఏకీకృత (ఏకకేంద్ర)విధానం, సమాఖ్య విధానమనే రెండు రకాల రాజ్యాంగ రూపాలున్నాయి. భారత రాజ్యాంగం సమాఖ్య లక్షణాలు కలిగింది. అయితే ఏకీకృత లక్షణాలు కూడా చాలానే ఉన్నాయి. భారతదేశంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో ఉన్న మంచి సమాఖ్య లక్షణాలు లేవు. అదేవిధంగా బ్రిటన్‌లో ఉన్న పూర్తి ఏకీకృత లక్షణాలు లేవు.
- భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం.
- భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. కానీ అంటరానితనం అంటే నిర్వచనాన్ని ఇవ్వలేకపోయింది. సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించారు.



- పరిస్థితులకనుగుణంగా నిబంధనల ప్రకారం రాజ్యాంగాన్ని సవరించవచ్చు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా మన రాజ్యాంగ ప్రవేశికలో సామ్యవాదం, లౌకికత్వం, సమగ్రత అనే పదాలను చేర్చారు. ఇది రాజ్యాంగ ప్రవేశికకు చేసిన మొట్టమొదటి, చివరి సవరణ.
- కేశవానంద భారతి వర్సెస్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల గురించి ప్రస్తావించింది. ఈ మౌలిక సూత్రాలను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

కీలక పదాలు - నిర్వచనాలు

1. **ముసాయిదా సంఘం:** రాజ్యాంగ సభ నియమించిన వివిధ కమిటీల నివేదికలపై రాజ్యాంగ సభ తీసుకున్న నిర్ణయాల సారాంశాన్ని ఆధారం చేసుకొని రాజ్యాంగాన్ని రూపొందించే మేధావుల బృందం(కమిటీ).**ఉదా:** అంబేద్కర్ అధ్యక్షుడిగా ఉన్న భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ.
2. **రాజ్యాంగ సభ:** దేశానికి అవసరమైన రాజ్యాంగాన్ని రచించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికైన ప్రతినిధుల సమూహం.
3. **ప్రవేశిక:** రాజ్యాంగ స్థూల స్వరూపాన్ని క్లుప్తంగా పరిచయ వాక్యాలతో చెప్పే పత్రం. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను తెలుపుతోంది. దీన్ని రాజ్యాంగానికి దర్పణంగా, ముందు మాటగా పేర్కొంటారు.
4. **ఏకీకృత సిద్ధాంతం:** దేశ పాలనాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికే మాత్రమే ఉండడం. ఇది ఏకీకృత ప్రభుత్వ వ్యవస్థ ముఖ్యలక్షణం. **ఉదా:** బ్రిటన్.
5. **సమాఖ్యసిద్ధాంతం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు స్పష్టంగా విభజితమై ఉంటాయి. **ఉదా:** అమెరికా, ఇండియా.
6. **ఉభయ పద్దు (ఉమ్మడి జాబితా):** సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చట్టాలు చేసే అధికారాలు విభజితమై ఉంటాయి. ఇవి కేంద్రానికి, రాష్ట్రాలకు ఉమ్మడిగా గల అధికారాలను తెలిపే అంశాల జాబితా.
   ఉదా: భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 47 అంశాలను తెలిపారు.
7. **పౌరసత్వం:** దేశంలో నివసించే పౌరులకు చట్టబద్ధంగా ఇచ్చే గుర్తింపు. ఇండియాలో ఏక పౌరసత్వం, అమెరికాలో ద్వంద్వ పౌరసత్వం అమల్లో ఉన్నాయి.
8. **అధ్యక్ష తరహా వ్యవస్థ:** దేశ పరిపాలనాధికారాలన్నీ అధ్యక్షుడి చేతిలోనే ఉండే ప్రభుత్వ వ్యవస్థ. అధ్యక్షుడిని ప్రభుత్వాధినేత, దేశాధినేత అని కూడా పిలుస్తారు. ఆయనేప్రభుత్వ వాస్తవ కార్యనిర్వాహణాధికారిగా ఉంటారు. **ఉదా:** అమెరికా.
9. **పార్లమెంటరీ తరహా వ్యవస్థ:** పార్లమెంట్ లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీ సీట్లు పొందిన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలను ప్రధానమంత్రి నేతృత్వంలో మంత్రిమండలి నిర్వర్తిస్తుంది. ఈ విధంగా శాసననిర్మాణ, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంతో కూడిన వ్యవస్థను పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ అంటారు. మంత్రిమండలి నాయకుడిని ప్రధానమంత్రి అంటారు. ఆయనే ప్రభుత్వాధినేత. వీరి సలహా, సూచనల మేరకే దేశాధినేత అయిన అధ్యక్షుడు (రాష్ట్రపతి) వ్యవహరిస్తారు. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారి ప్రధానమంత్రి. **ఉదా:** బ్రిటన్, ఇండియా.
10. **సవరణ:** రాజ్యాంగబద్ధంగా దేశ మౌలిక రాజ్యాంగంలో చేసే అవసరమైన మార్పు. దేశాభివృద్ధికి ఆవశ్యకమైన రాజ్యాంగ సవరణలను చట్టసభలు ఆమోదిస్తాయి. సవరణ అంటే రాజ్యాంగంలో అప్పటికే ఉన్న అధికరణలను తొలగించవచ్చు.. మార్చవచ్చు లేదా కొత్తవాటిని చేర్చవచ్చు.

4 మార్కుల ప్రశ్న

1. **రాజ్యాంగంలో మౌలిక సూత్రాలు ఉంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి? (సమకాలీన అంశాలపై ప్రతిస్పందన - ప్రశ్నించడం)**

జ. ఈ వ్యాఖ్యతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను.

- ఏ దేశ రాజ్యాంగంలోనైనా కొన్ని మౌలిక సూత్రాలుంటాయి. అవి రాజ్యాంగ స్వరూ పాన్ని, ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. రా జ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన మౌలిక సూత్రాల లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలో మార్పులు సంభవించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ఈ సామాజిక మార్పు ప్రజలు రాజ్యాంగ పద్ధతిలో వ్యవస్థతో తలపడినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది.

నేను ఈ వాస్తవాలతో ఏకీభవించడానికి కారణాలు:

- దేశ సార్వభౌమాధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. ప్రజలే పాలకులు, ప్రజల కోసం చేసే చట్టాలను ప్రజలే చేసుకుంటారు. ప్రజలతో కూడినదే వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలో అభివృద్ధిపూర్వకమైన మార్పులకు ప్రజలు సిద్ధపడాలి.
- లౌకిక, సామ్యవాద సూత్రాలు జాతీయ సమైక్యతను, ప్రజల సంక్షేమాన్ని పెంపొందిస్తాయి. పాలనా వ్యవస్థ వీటిని అమలు చేయాలి. ప్రజలు జాగరూకులై ఈ అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. పాలనా వ్యవస్థ ప్రజల కోరికలను పట్టించుకోనప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.
- రాజ్యాంగ సూత్రాల ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అందించాలి. అదే విధంగా పౌరులందరిలో సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడు ప్రజల జీవితాల్లో అవసరమైన మార్పులు వస్తాయి. తద్వారా సామాజిక మార్పును ఆశించవచ్చు.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాలనా వ్యవస్థ విస్మరించినప్పుడు ప్రజలు సమూహంగా మారి తమ సామాజిక వ్యవస్థ మార్పు కోసం ప్రజా ప్రతినిధులతో కూడిన పాలనా వ్యవస్థతో తలపడాల్సి వస్తుంది. రాజ్యాంగం కోరుకునేది కూడా అదే. పాలనా వ్యవస్థలకు సామాజిక వ్యవస్థే ఆధారం.

2 మార్కుల ప్రశ్నలు

1. **రాజ్యాంగానికి 73వ సవరణ చేసిన తర్వాత గ్రామాలకు ఎటువంటి స్వయంప్రతిపత్తి కల్పించారో తెలుసుకోండి?**
   (సమాచార సేకరణ నైపుణ్యం)

జ. భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ ప్రకరణ పంచాయతీరాజ్ వ్య వస్థ ఏర్పాటు, గ్రామాలకు స్వయం పాలనాధికారాలను కల్పించడం గురించి ప్రస్తావించింది.

- అందుకోసం పార్లమెంట్ 1992లో రాజ్యాంగంలో 73వ సవరణ చేసింది. 1993, ఏప్రిల్ 24న ఈ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తినిచ్చింది. అదేవిధంగా గ్రామస్వయంపాలనకు అవసరమైన అధికారాలను, విధులను, బాధ్యతలను పంచాయతీ వ్యవస్థలకు కల్పించింది. వాటిలో ముఖ్యమైనవి గ్రామసభ ఏర్పాటు, ప్రత్యక్ష ఎన్నికలు, సీట్లలో రిజర్వేషన్లు, మూడంచెల వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, నిర్దేశించిన పదవీ కాలం మొదలైనవి.

2. **భారతీయ సమాఖ్య వ్యవస్థ, అమెరికా సమాఖ్య వ్యవస్థకు మధ్య ముఖ్య తేడాలను పేర్కొనండి?**

జ. అమెరికా, ఇండియాలో సమాఖ్య వ్యవస్థ అములులో ఉంది. ఈ దేశాల్లో ఆచరిస్తున్న సమాఖ్య విధానాల్లో స్పష్టమైన తేడాలున్నాయి. అవి..

భారతీయ సమాఖ్య వ్యవస్థ
1. ఏక పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ఏక న్యాయవ్యవస్థ
2. సివిల్, క్రిమినల్ చట్టాల్లో సారూప్యత, ఏక విధానం
3. అఖిల భారత సర్వీసులు

అమెరికా సమాఖ్య వ్యవస్థ
1. ద్వంద్వ పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ప్రత్యేక న్యాయవ్యవస్థలు.
2. చట్టాల్లో సారూప్యత, ఏక విధానం లేదు
3. ప్రత్యేకంగా వేర్వేరు సర్వీసులు

స్టెయిన్‌లెస్ స్టీల్ వేటి మిశ్రమ లోహం?

లోహశాస్త్రం

ప్రకృతిలో లోహం లభించే వివిధ సమ్మేళనాలనే 'ఖనిజాలు' అంటారు. ఖనిజాలన్నింటిలో దేని నుంచి వ్యాపారాత్మకంగా లాభదాయకమైన పద్ధతిలో లోహాన్ని వెలికి తీయగలమో దాన్ని 'ధాతువు' అంటారు. అంటే ఖనిజాలన్నీ ధాతువులు కావు. ఉదాహరణకు అల్యూమినియం ఖనిజాలు - కోరండం, బాక్సైట్, క్రయొలైట్. వీటిలో బాక్సైట్ నుంచి మాత్రమే వ్యాపార సరళిలో అల్యూమినియం లోహాన్ని ఉత్పత్తి చేస్తారు. కాబట్టి అల్యూమినియం ధాతువు బాక్సైట్. ధాతువులో ఉండే మలినాలను 'గాంగ్' లేదా 'మాట్రిక్స్' అంటారు.

కొన్ని లోహాల ముఖ్య ఖనిజాలు

లోహం	ఖనిజం
అల్యూమినియం	బాక్సైట్, కోరండం క్రయొలైట్
ఇనుము	హెమటైట్, మాగ్నటైట్, సిడిరైట్, లియొనైట్, ఐరన్ పైరెటీస్
రాగి (తామ్రం)	కాపర్ గ్లాన్స్, కాపర్ పైరెటీస్ మాలకైట్
సీసం (లెడ్)	గెలీనా, సెరలైట్
పాదరసం	సిన్నబార్
యురేనియం	పిచ్‌బ్లెండ్
జింక్	జింక్ బ్లెండ్ (స్ఫాలరైట్) కాలమైన్, జింకైట్ (ఫిలాసఫర్ ఊల్)

- ధాతువును గాలి లేకుండా బాగా వేడిచేసి బాష్పశీల మలినాలను తొలగించడాన్ని భస్మీకరణం (Calcination) అంటారు. ఉదాహరణకు లైమ్‌స్టోన్ ($CaCO_3$)ను వేడిచేస్తే విఘటనం చెంది CO_2 విడుదల చేస్తూ కాల్షియం ఆక్సైడ్‌ను ఏర్పరుస్తుంది.
- ధాతువును గాలి సమక్షంలో అధిక ఉష్ణోగ్రతలకు వేడి చేయడాన్ని భర్జనం (Roasti-ng) అంటారు.
- సాధారణంగా ధాతువు అనేది లోహం మాత్రమే కాకుండా రాళ్లు, ఇసుక, బంకమన్ను, మైకా, క్వార్ట్జ్ మొదలైన మలినాలతో కలిసి ఉంటుంది.
- ఒక ధాతువును ద్రవకారి (ద్రవీభవన ఉష్ణోగ్రత తగ్గించేది)ని కలిపి లేదా కలపకుండా అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం ద్వారా లేదా సల్ఫైడ్ ఖనిజాన్ని ద్రవస్థితిలో పొందడాన్ని 'ప్రగలనం' అంటారు.
- శుద్ధలోహం కంటే మిశ్రమలోహం ఉపయోగకర గుణాలు అధికం. ఉదాహరణకు స్వచ్ఛమైన బంగారానికి కొద్దిగా రాగిని కలిపితే దాని గట్టితనం పెరుగుతుంది.

ప్రకృతిలో బంగారం, ప్లాటినం లాంటి లోహాలు మాత్రమే స్వేచ్ఛాస్థితిలో లభిస్తాయి. మిగిలినవి ఆక్సైడ్‌లు, సల్ఫైడ్‌లు, కార్బొనేట్లు, బై కార్బొనేట్లు లాంటి సమ్మేళనాల రూపంలో లభిస్తాయి. వీటి నుంచి స్వచ్ఛమైన లోహాన్ని నిష్కర్షణ (వెలికితీసే పద్ధతి) చేసే ప్రక్రియల గురించి చర్చించేదే లోహశాస్త్రం.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. అత్యంత సాగే గుణం ఉన్న లోహం ఏది?
   1) వెండి 2) బంగారం
   3) రాగి 4) ఇనుము
2. కిందివాటిలో అల్యూమినియం ధాతువు ఏది?
   1) హెమటైట్ 2) సిన్నబార్
   3) గెలీనా 4) బాక్సైట్
3. జతపరచండి.

లోహం	ఖనిజం
ఎ) ఇనుము	1. గెలీనా
బి) రాగి	2. సిన్నబార్
సి) సీసం	3. మాగ్నటైట్
డి) మెర్క్యురీ	4. మాలకైట్

	ఎ	బి	సి	డి
1)	1	3	2	4
2)	3	1	4	2
3)	3	4	1	2
4)	2	4	3	1

4. ఇనుమును శుద్ధి చేసే బ్లాస్ట్ కొలిమిలో కార్బన్ మోనాక్సైడ్ సమక్షంలో ఐరన్ ఆక్సైడ్‌పై జరిగే ప్రక్రియ?
   1) ఆక్సీకరణం 2) క్షయకరణం
   3) జలవిశ్లేషణ 4) విద్యుద్విశ్లేషణ
5. బ్లాస్ట్ కొలిమిలో ఉపయోగించే గరిష్ఠ ఉష్ణోగ్రత?
   1) 500 °C 2) 1500 K
   3) 1500 °C 4) 750 °C
6. గుల్లబారి ఉండే ఇనుమును ఏమంటారు?
   1) పిగ్ ఐరన్ 2) స్పాంజ్ ఐరన్
   3) కాస్ట్ ఐరన్ 4) పోరస్ ఐరన్
7. లైమ్‌స్టోన్‌లో లభించే ప్రధాన ఖనిజం?
   1) మెగ్నీషియం
   2) సోడియం 3) కాల్షియం
   4) బేరియం
8. పొటాషియంతో పాటు మెగ్నీషియం లభించే ఖనిజం?
   1) కార్నలైట్ 2) హెమటైట్
   3) మాగ్నసైట్ 4) మాగ్నటైట్
9. జతపరచండి.

ఎ) కార్బొనేట్ ఖనిజం	1. కార్నలైట్
బి) సల్ఫైడ్ ఖనిజం	2. పిచ్ బ్లెండ్
సి) ఆక్సైడ్ ఖనిజం	3. కాపర్ పైరెటీస్
డి) క్లోరైడ్ ఖనిజం	4. లైమ్ స్టోన్

	ఎ	బి	సి	డి
1)	2	1	3	4
2)	1	3	2	4
3)	4	3	2	1
4)	3	2	4	1

10. మోనోజైట్ ఇసుకలో ప్రధానంగా లభించేది?
    1) థోరియం 2) రేడియం
    3) ప్రొన్షియం 4) పొలోనియం
11. ఇనుము రకాలలో అత్యంత శుద్ధమైంది?
    1) పోత ఇనుము 2) చేత ఇనుము
    3) స్పాంజ్ ఇనుము
    4) దుక్క ఇనుము
12. గాలి లేకుండా ధాతువును వేడిచేసే ప్రక్రియను ఏమంటారు?
    1) భర్జనం 2) భస్మీకరణం
    3) నిక్షాళనం 4) ప్రగలనం
13. భూ పటలంలో పుష్కలంగా లభించే లోహ ఏది?
    1) జింక్ 2) ఇనుము
    3) అల్యూమినియం 4) రాగి
14. తన ద్వారా విద్యుత్తును ప్రవహింపజేయ నివ్వనప్పటికీ (అథమ విద్యుత్ వాహకం) ఉష్ణాన్ని ప్రవహింపజేయనిచ్చేది (ఉష్ణవాహకం) ఏది?
    1) ఆస్బెస్టాస్ 2) మైకా (అభ్రకం)
    3) సెల్యులాయిడ్ 4) స్టీల్
15. స్టెయిన్‌లెస్ స్టీల్ వేటి మిశ్రమ లోహం?
    1) ఐరన్ 2) కార్బన్
    3) క్రోమియం 4) పైవన్నీ
16. ఇత్తడి (బ్రాస్) ఏయే లోహాల మిశ్రమ లోహం?
    1) జింక్, రాగి 2) నికెల్, ఐరన్
    3) నికెల్, జింక్ 4) నికెల్, రాగి
17. కంచు (బ్రాంజ్) వేటి మిశ్రమ లోహం?
    1) కాపర్, టిన్ 2) జింక్, రాగి
    3) నికెల్, జింక్ 4) ఐరన్, కార్బన్
18. సౌరశక్తి పానెల్‌లో ఉపయోగించే మూలకం ఏది?
    1) టైటానియం 2) ఐరన్
    3) సిలికాన్ 4) టిన్
19. గన్ మెటల్‌లో ఉండే లోహాలేవి?
    1) ఇనుము, నికెల్ 2) ఇనుము, తగరం
    3) రాగి, తగరం 4) రాగి, జింక్
20. పాదరసం ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహం?
    1) అమాల్గం 2) స్టీల్
    3) ఎమల్షన్ 4) పాలీమర్
21. మిశ్రమ లోహం అనేది?
    1) ద్రావణం 2) ఎమల్షన్
    3) కొల్లాయిడ్ 4) పాలీమర్
22. లోహంలో ధాతువుతో పాటు ఉండే మలినాలను ఏమంటారు?
    1) ఖనిజం 2) గాంగ్
    3) ద్రవకారి 4) ఫ్లక్స్
23. ఇనుము సల్ఫైడ్ ధాతువు ఏది?
    1) మాగ్నటైట్ 2) హెమటైట్
    3) ఐరన్ పైరెటీస్ 4) మాలకైట్
24. లోహ నిష్కర్షణలో ఉపయోగించే చార్జ్ అనేది?
    1) విద్యుదావేశ ఎలక్ట్రోడ్
    2) ధాతువు + కోక్
    3) ధాతువు + సున్నపురాయి + కోక్
    4) ధాతువు + సున్నపురాయి
25. చేత ఇనుములో ఉండే కార్బన్ శాతం?
    1) 0.1% 2) 0.2%
    3) 1% 4) 2%
26. కిందివాటిలో సిల్వర్ అనుఘటకంగా లేని మిశ్రమ లోహం ఏది?
    1) హార్న్ సిల్వర్ 2) జర్మన్ సిల్వర్
    3) రూబీ సిల్వర్ 4) స్టెర్లింగ్ సిల్వర్
27. హెల్మెట్ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
    1) మాగ్నాలియం 2) క్రోమ్ స్టీల్
    3) మాంగనీస్ స్టీల్ 4) నికెల్ స్టీల్
28. ముడి ఖనిజంలో లోహంతో పాటు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాలతో ఉండే మిశ్రమాన్ని ఏమంటారు?
    1) ఫ్లక్స్ 2) గాంగ్
    3) పోలింగ్ 4) లోహ మలం
29. జర్మన్ సిల్వర్‌లో ఉండే లోహాలేవి?
    1) కాపర్ 2) నికెల్
    3) జింక్ 4) పైవన్నీ
30. కిందివాటిలో కాయినేజ్ లోహాలు ఏవి?
    1) కాపర్ 2) బంగారం
    3) వెండి 4) పైవన్నీ
31. బ్లేడ్ల తయారీలో వాడే స్టీల్ ఏది?
    1) క్రోమ్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
    3) ఇన్వార్ స్టీల్ 4) టంగ్‌స్టన్ స్టీల్
32. శస్త్ర చికిత్స సాధనాల తయారీలో ఉపయోగించే మిశ్రమ లోహం?
    1) స్టెయిన్‌లెస్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
    3) నిక్రోమ్ 4) మాగ్నాలియం
33. ఉక్కు (స్టీల్) తుప్పు పట్టకుండా నిరోధించేది?
    1) నికెల్ 2) ఇనుము
    3) క్రోమియం 4) కార్బన్
34. స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఎంతశాతం క్రోమియం ఉంటుంది?
    1) 5-8 2) 12-20
    3) 10-15 4) 1-5
35. అయస్కాంతాల తయారీకి వాడే మిశ్రమ లోహం?
    1) స్టీల్ 2) నిక్రోమ్
    3) ఆల్నికో 4)స్టెయిన్‌లెస్ స్టీల్
36. ఎమాల్గం ఏర్పరచని లోహం ఏది?
    1) ఐరన్ 2) ప్లాటినం
    3) సోడియం 4) 1, 2
37. వంటపాత్రల తయారీకి వాడే స్టీలు ఏది?
    1) ఎక్కువ కార్బన్ ఉన్న స్టీల్
    2) ఎక్కువ క్రోమియం ఉన్న స్టీల్
    3) ఇన్వార్ స్టీల్
    4) ఎక్కువ నికెల్ ఉన్న స్టీల్
38. స్టెయిన్‌లెస్ స్టీల్ ఏ లోహాల మిశ్రమం?
    (పోలీస్ కానిస్టేబుల్-2011)
    1) ఇనుము + కార్బన్ + నికెల్
    2) ఇనుము + క్రోమియం + నికెల్
    3) ఇనుము + క్రోమియం + జింక్
    4) ఇనుము + లెడ్
39. ఫ్యూజులు, నిరోధక తీగల తయారీలో వాడే మిశ్రమం?
    1) నిక్రోమ్ 2) ఇన్వార్ స్టీల్
    3) బెల్ మెటల్ 4) కంచు
40. గేర్లు, బేరింగ్‌ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
    1) గన్ మెటల్ 2) ఎలక్ట్రాన్
    3) మాగ్నాలియం 4) బెల్ మెటల్

సమాధానాలు

1) 2;	2) 4;	3) 3;	4) 2;
5) 3;	6) 2;	7) 3;	8) 1;
9) 3;	10) 1;	11) 2;	12) 2;
13) 3;	14) 2;	15) 4;	16) 1;
17) 1;	18) 3;	19) 3;	20) 1;
21) 1;	22) 2;	23) 3;	24) 3;
25) 2;	26) 2;	27) 3;	28) 2;
29) 4;	30) 4;	31) 1;	32) 1;
33) 3;	34) 2;	35) 3;	36) 4;
37) 2;	38) 2;	39) 1;	40) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

యూఐఐసీఎల్, చెన్నైలో 52 అప్రెంటిస్‌లు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్(యూఐఐసీఎల్) మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవాలో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ■ **మొత్తం ఖాళీల సంఖ్య:** 52.

- **స్టైపెండ్:** నెలకు రూ.9000.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** మహారాష్ట్ర-30, గోవా-02, మధ్యప్రదేశ్-10, గుజరాత్-10.
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 21 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.04.2025
- **వెబ్‌సైట్:** https://uiic.co.in

ఆర్ఆర్‌బీలో 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలట్(ఏఎల్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 9,970.
- **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్మూ-శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.
- **రీజియన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్-497,అజ్‌మేర్-820,ప్రయాగ్‌రాజ్-588, భోపాల్-664, భువనేశ్వర్-928, బిలాస్‌పూర్-568, చండీఘడ్-433, చెన్నై-362, గువాహటి-30, జమ్మూ-శ్రీనగర్-08, కోల్‌కతా-720, మాల్డా-432, ముంబై-740, ముజఫర్‌పూర్-89, పాట్నా-33, ప్రయాగ్‌రాజ్-286, రాంచీ-1,213, సికింద్రాబాద్-1500, సిలిగురి-95, తిరువనంతపురం-148, గోరఖ్‌పూర్-100.
- **అర్హత:** మెట్రిక్యులేషన్‌తో పాటు ఐటీఐ పూర్తి చేసి ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరంగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.07.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** మొదటి దశ సీబీటీ-1, రెండో దశ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 14.05.2025 నుంచి 23.05.2025
- **దరఖాస్తులకు చివరితేది:** 11.05.2025.
- **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటోన్న ప్రాంతాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

ఒక ప్రాంతంలోని సగటు వాతావరణ పరిస్థితులనే శీతోష్ణస్థితిగా వ్యవహరిస్తారు. భారతదేశం శీతోష్ణస్థితి ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత్‌లో ఆరు రుతువులను గుర్తించవచ్చు. అంటే.. ప్రతి రెండు నెలలకు వాతావరణ మార్పులు సంభవిస్తాయి. భారతదేశ శీతోష్ణస్థితిని 'రుతుపవన శీతోష్ణస్థితి' అంటారు. శాస్త్రీయంగా పరిశీలిస్తే భారతదేశం 'ఉష్ణో-ఆర్ద్ర శీతోష్ణస్థితి మండలం' కిందకు వస్తుంది. కానీ సువిశాల భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ఒక్కో ప్రాంతంలో, ఒక్కో సమయంలో ఒక్కోలా ఉంటాయి. సువిశాల విస్తీర్ణం, నైసర్గిక స్వరూపం, రుతుపవనాలు, భౌగోళిక ఉనికి లాంటి అంశాలు వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అత్యధిక(ఉదా.చిరపుంజి,మాసిన్‌రామ్), మరికొన్ని ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం నమోదవుతుంది (ఉదా: థార్ ఎడారి). వేసవిలో దక్కన్ పీఠభూమి, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాలు 45 సెంటీగ్రేడ్‌కు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి భిన్నంగా అదే సమయంలో ఉత్తరాన హిమాలయ పర్వత సానువుల్లో వాతావరణం చల్లగా ఉంటుంది.

వాతావరణ శాస్త్రజ్ఞులు భారత శీతోష్ణస్థితిని 4 భాగాలుగా విభజించారు. 1. రుతు పవన పూర్వకాలం(మార్చి15-జూన్ 15) 2. నైరుతి రుతుపవన కాలం (జూన్ 15 -సెప్టెంబర్ 15) 3. ఈశాన్య రుతు పవన కాలం (సెప్టెంబర్ 15 -డిసెంబర్ 15) 4. రుతు పవన అనంతర కాలం (డిసెంబర్ 15-మార్చి 15).

రుతుపవన పూర్వ కాలం

రుతుపవన పూర్వ కాలం (మార్చి 15 -జూన్15)లో దేశమంతటా ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ఇది మండు వేసవి. ఈ సమయంలో సంవహన గాలులు వీస్తాయి. ఈ పవనాలను ఆంధీ, లూ, కాల్‌బైశాఖీ, మామిడి జల్లులు లాంటి స్థానిక పేర్లతో పిలుస్తారు. ఈ వేడిగాలులకు అప్పుడప్పుడూ చిరుజల్లులు, గాలి దుమ్ము కూడా తోడవుతాయి. ఈ కాలంలో ద్వీపకల్ప పీఠభూములు, వాయవ్య భారతదేశం బాగా వేడెక్కడంతో అల్పపీడనం ఏర్పడుతుంది. ఈ అల్పపీడనం నైరుతి రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించటానికి ఉపకరిస్తుంది.



నైరుతి రుతుపవన కాలం

నైరుతి రుతుపవన కాలం(జూన్15- సెప్టెంబర్ 15)లో అరేబియా సముద్రం, హిందూమహా సముద్రాల నుంచి నైరుతి రుతు పవనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి, దేశమంతా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక వర్షపాతంలో సుమారు 2/3 వంతు ఈ మూడు నెలల కాలంలోనే సంభవిస్తుంది. భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతు పవనాలు మొదటగా జూన్ మొదటి వారంలో మలబార్ తీరాన్ని తాకుతాయి. క్రమంగా ఇవి జూలై 15 కల్లా దేశమంతా వ్యాపిస్తాయి. నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా(అరేబియా సముద్రం, బంగాళాఖాతం) దేశంలోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతు పవనాలు ఎత్తయిన పర్వతాలు, పీఠభూములను దాటే సమయంలో పవనాభిముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అధిక వర్షపాతం ఉంటుంది. కానీ అదే సమయంలో పవనపరాన్ముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం ఉండటంతో అవి పాక్షిక శుష్క మండలాలుగా రూపొందాయి. ఉదాహరణకు అరేబియా సముద్రం నుంచి ప్రవేశించే నైరుతి రుతుపవనాలను పశ్చిమ కనుమలు అడ్డుకుంటాయి. దీనివల్ల మలబార్, కొంకణ్ తీరాల్లో విస్తారంగా వర్షం కురుస్తుంది. ఇవి అతి ఆర్ద్ర మండలాలు. కానీ సహ్యాద్రి కొండలకు వెనుక ఉన్న దక్కన్ పీఠభూమికి చెందిన ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువ. అందువల్ల ఇవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఈ ప్రాంతాలు ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలు ఈ మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో వర్షపాత పరిమాణంలో అనిశ్చితి కూడా అధికంగా ఉంది. ఈ మండలం తరచూ తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది.

విస్తారంగా వర్షాలు

బంగాళాఖాతం నుంచి ప్రవేశించే నైరుతి రుతు పవనాలు తూర్పు, ఈశాన్య భారతదేశం, గంగా మైదానాల్లో వర్షాన్నిస్తాయి. ఈ పవనాలను పూర్వాంచల్ కొండలు, శివాలిక్ పర్వతాలు అడ్డుకుంటున్నాయి. దాంతో పవనాభిముఖదిశలోని తెరాయి మండలం, మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి, నాగాలాండ్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గారో, ఖాసీ కొండల పవనాభిముఖదిశలో ఉన్న మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాల్లో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాలు నైరుతి రుతు పవనాలకు సమాంతరంగా ఉండటంతో ఇవి నైరుతి రుతు పవనాలను అడ్డగించలేవు. అదే సమయంలో పశ్చిమ రాజస్థాన్ ప్రాంత ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలో ఉన్న చల్లని స్థిర వాయురాశి నైరుతి రుతు పవనాలను పైకి లేవనీయకుండా అదిమిపెడతాయి. ఈ కారణాల వల్ల పశ్చిమ రాజస్థాన్‌లో వర్షపాతం అత్యల్పంగా ఉండి, శుష్క మండలం ఏర్పడింది. థార్ ఎడారి ఏర్పడటానికి ప్రధాన కారణం.

దక్షిణార్ధగోళంలోకి సూర్యుడు

సెప్టెంబర్ మధ్య నుంచి సూర్యుడు దక్షిణార్ధగోళంలోకి ప్రవేశిస్తాడు. దీంతో భారత్‌లో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. భారత భూభాగంపై విస్తరించి ఉన్న అల్ప పీడనం క్రమంగా క్షీణించి, ఆ స్థానంలో అధిక పీడనం బలపడుతుంది. ఈ రకంగా నైరుతి రుతు పవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమించే రుతుపవనాలు శుష్కంగా ఉంటాయి. అయితే ఇవి బంగాళాఖాతంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి తేమను పీల్చుకొని, ఆర్ద్రగా మారుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో వీస్తున్న ఈశాన్య వ్యాపారపవనాలు.. తిరోగమన రుతు పవనాలను ఈశాన్య రుతు పవనాలుగా రూపాంతరం చెందిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌ల్లో వర్షం కురుస్తుంది. ఈ సందర్భంగా గమనించాల్సిందేమిటంటే.. తమిళనాడు ప్రాంతంలోకి నైరుతి రుతుపవనాలు రాకుండా.. నీలగిరి, అన్నామలై, ఏలకుల కొండలు అడ్డగిస్తాయి. అందువల్ల నైరుతి రుతుపవన కాలంలో తమిళనాడులో వర్షం అంతగా కురవదు.

ఈశాన్య రుతుపవనాలతో ఈ ప్రాంతం విస్తారంగా వర్షాన్ని పొందుతుంది. డిసెంబర్ 15కల్లా దేశమంతటా శీతాకాలం ప్రారంభమవుతుంది. సైబీరియా నుంచి వచ్చే అతిశీతల పవనాలు.. గంగా-సింధూ మైదానంలోకి రాకుండా హిమాలయ పర్వతాలు అడ్డుకుంటాయి. లేకపోతే వీటి ప్రభావం వల్ల గంగా-సింధూ మైదానంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు చేరుకొని, నదులు గడ్డకట్టి రబీ సాగు సాధ్యమయ్యేది కాదు. డిసెంబర్, జనవరిల్లో హిమాలయాల నుంచి వీచే శీతల పవనాల వల్ల గంగా-సింధూ మైదానంలో ఎముకలు కొరికే చలి ఉంటుంది. డిసెంబర్-ఫిబ్రవరి కాలం సాధారణంగా దేశమంతా శుష్కంగా ఉంటుంది. కానీ ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం నుంచి వాయవ్య భారతదేశంలోకి కవోష్ణ చక్రవాతాలు ప్రవేశిస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. వీటి ప్రభావం వల్ల దేశ వాయవ్య ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాలు రబీలో సాగయ్యే గోధుమ దిగుబడి పెరగటానికి దోహదపడతాయి.

బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన ద్రోణులు కొన్ని బలపడి అయనరేఖా చక్రవాతాలుగా మారి తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి.

గోదావరి నది జన్మస్థానం?

భారత్ వ్యవసాయ ప్రధాన దేశం. వ్యవసాయానికి మూలాధారం సాగునీరు. ఈ నీటిని అందించడంలో నదులది కీలక పాత్ర. ప్రధాన నదులైన గంగ, సింధూ, గోదావరి, కృష్ణా లాంటి నదుల జన్మస్థానాలు, ప్రవాహ గతికి సంబంధించిన సమాచారం గ్రూప్స్ పరీక్షల్లో అత్యంత కీలకం!!

సింధూ లేదా ఇండస్

దీని జన్మస్థానం టిబెట్‌లోని కైలాస పర్వతాల్లో ఉన్న 'చాండుయాంగ్' హిమానీనదం. ఈ నది డామ్‌ఛోక్ వద్ద దేశంలోకి ప్రవేశించి షిగార్, గిల్గిత్, ద్రాస్ తదితర ఉపనదులను కలుపుకొని పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తుంది. సట్లెజ్, రావి, బియాస్, జీలం, చీనాబ్ నదులు సింధూ ముఖ్య ఉపనదులు. సట్లెజ్ నది కూడా కైలాస పర్వతాల్లోని 'రాకాస్ తావ్'గా పిలిచే హిమానీనద సరస్సు నుంచి ఉద్భవిస్తుంది. ఈ నదిని ప్రాచీన కాలంలో 'సుతుద్రి' అని పిలిచేవారు. సట్లెజ్ నది హిమాచల్ ప్రదేశ్‌లోని 'షిప్కిలా' కనుమ ద్వారా భారత్‌లోకి ప్రవేశిస్తుంది.

సట్లెజ్‌పై భాక్రా నంగల్

సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లోని భాక్రా, పంజాబ్‌లోని నంగల్ వద్ద భారీ ఆనకట్టలు నిర్మించారు. భాక్రా నంగల్ భారత్‌లో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టుల్లో ఒకటి. భాక్రా నంగల్ రిజర్వాయర్‌ను 'గోవింద సాగర్'గా పిలుస్తారు. జీలం నది కశ్మీర్‌లోని వెరినాగ్ కొండల్లో ఆవిర్భవిస్తుంది. చంద్ర-భాగా నదుల కలయికతో చీనాబ్ నది ఏర్పడింది. ఇవి హిమాచల్ ప్రదేశ్‌లోని రోహతాంగ్ కనుమ వద్ద ఆవిర్భవిస్తాయి.

కాలాబాగ్

రావి నది కులూ కొండల్లో, బియాస్ నది బియాస్‌కుండ్ వద్ద ఆవిర్భవించాయి. సింధూ నదీ వ్యవస్థలో రావి-బియాస్‌ల సంగమం మాత్రమే భారతదేశంలో ఉంది. మిగిలిన నదులన్నీ పాకిస్తాన్ భూభాగంలో ఒక దానితో మరోటి కలుస్తాయి. ఈ నదులన్నీ పాకిస్తాన్‌లోని 'కాలాబాగ్' వద్ద కలిసి, ఒకే ప్రవాహంగా సింధ్ రాష్ట్రం ద్వారా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. రావి-బియాస్ నదులు పంజాబ్ (భారత్)లోని హరికే వద్ద కలుస్తాయి. ఇందిరాగాంధీ కాలువ హరికే వద్ద నిర్మించిన ఆనకట్ట నుంచి ప్రారంభమవుతుంది.

గోదావరి -త్ర్యయంబకం

ద్వీపకల్ప నదీ వ్యవస్థలన్నింటి కంటే గోదావరి పెద్దది. ఇది సహ్యాద్రి పర్వతాల్లో నాసిక్ సమీపంలోని 'త్ర్యయంబకం' వద్ద ఆవిర్భవించింది. ఈ నది మహారాష్ట్రకు చెందిన వార్ధా, పేన్‌గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, కోయనా, మధ్యప్రదేశ్‌కు చెందిన వైన్‌గంగను కలుపుకొని తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. మానేరు, శబరి, మంజీరా నదులు గోదావరి ముఖ్య ఉపనదులు.


మంజీరాపై నిజాంసాగర్

మంజీరా నది మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ పర్వత్రేణుల్లో ఆవిర్భవించింది. ఈ నది తెలంగాణలోని నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. మంజీరాపై నిజాంసాగర్, సింగూరు ఆనకట్టలు నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉద్భవించిన శబరి నది, ఖమ్మం జిల్లాలోని కూనవరం వద్ద గోదావరిలో కలుస్తుంది. గోదావరిపై నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద శ్రీరాంసాగర్ ఆనకట్ట నిర్మించారు. గోదావరి రాజమండ్రికి దిగువన గౌతమీ గోదావరి, వశిష్ట గోదావరి, వైనతేయి గోదావరి అనే మూడు పాయలుగా చీలిపోతుంది. అనంతరం అంతర్వేది, యానాం, కొమరగిరి పట్నాల వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

కృష్ణానది

సహ్యాద్రి కొండల్లోని మహాబలేశ్వర్ వద్ద కృష్ణానది ఆవిర్భవించింది. ఇది కర్ణాటక ద్వారా ప్రవహిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్ వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఘటప్రభ, మల్లప్రభ, భీమా, తుంగభద్ర, దిండి, మూసీ నదులు కృష్ణా నదికి ముఖ్య ఉపనదులు. తుంగభద్ర కర్ణాటకలోని వరాహ పర్వతాల్లో ఆవిర్భవించి.. కర్నూలులోని సంగమేశ్వర్ వద్ద కృష్ణలో కలుస్తోంది. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు దిగువన కృష్ణానది పాయలుగా చీలి హంసలదీవి వద్ద బంగాళాఖాతాన్ని చేరుతుంది.

That exactly represents the relationship..



SYLLOGISMS

The questions on syllogisms are generally solved by using two methods:

1) Rules based method

2) Venn Diagram method

It is easy and preferable solving any kind of question by using Venn Diagram method.

Firstly, let us discuss how many types of statements are there.

1) All A's are B's
2) Some A' are B's
3) No A is B
4) Some A's are not B's

As you might have noticed above, there are four master statements of which two are affirmative statements and two are negative statements. Sometimes, the given statements may look different. We have to observe the given statements for each question and find out under which of the above master statements they have to be treated.

Examples:

- 'Apple is Ball' is treated as 'All Apples are Balls'
- 'Many bats are cats' is considered as 'Some bats are cats'
- 'Cat is not Dog' is equivalent to 'No Cat is Dog'
- 'All Ears are not Fans' is understood as 'Some Ears are not Fans'

Venn Diagrams:

There are two kinds of diagrams..

1) Basic Diagram
2) Alternate Diagram

Basic Diagram: This diagram represents minimum relationship between the terms of the statement. Hence, the least possible relationship should be shown by minimum overlapping.

Alternate Diagrams: The Alternate Diagram/ Diagrams represent other possible ways of the extent of overlapping.

The master statements are represented in the form of venn diagrams as follows:

Checking the validity of conclusions:











There are two types of conclusions. Definite conclusions and Possible conclusions.

Let us discuss how to draw definite conclusions.

Based on the above diagrams we can draw the following definite conclusions for each statement.

As there are positive statements and negative statements even we have positive conclusions and negative conclusions.

Let us discuss how to draw the conclusions based on the given statements for each question.

Statements	Basic Diagram	Alternate Diagram1	Alternate Diagram2	Alternate Diagram3
All A's are B's				
Some B's are C's				
No C is D				
Some E's are not F's				

The following points can be followed for easy understanding.

- Read the statements and try to find out whether any connecting terms are there between the statements.
- Draw the 'basic diagram' in a combined format that exactly represents the relationship of all the terms in the statements given.

NOW VERIFY THE VALIDITY OF THE GIVEN CONCLUSIONS

1. If Positive definite conclusion follows in the basic diagram, then, it is a VALID conclusion.

Statement	Valid Definite conclusions	Conclusions which are definitely false
All A's are B's	Some B's are A's Some A's are B's ('some' is a part of 'all')	No A is B No B is A Some A's are Not B's
Some B's are C's	Some C's are B's	No C is B No B is C
No C is D	No D is C Some C's are Not D's Some D's are Not C's	All C's are D's All D's are C's Some C's are D's Some D's are C's
Some E's are Not F's	No definite conclusion	All E's are F's

2. If Positive definite conclusion does not follow in the basic diagram, Then, it is NOT A VALID conclusion
3. If Negative definite conclusion does not follow in the basic diagram

Then, it is NOT A VALID conclusion. But, verify whether COMPLEMENTARY PAIR is there.

4. We know that there are two Negative conclusions.

i) If negative definite conclusion **'No C is D'** follows in the basic diagram, then see whether **'Some C's are D's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion.


ii) If negative definite conclusion **'Some E's are Not F's'** follows in the basic diagram, then see whether **'All E's are F's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion

Note: We need not draw alternate diagrams to check the validity of Positive definite conclusions because when they follow in the minimum overlapping then they definitely follows in the maximum overlapping diagram (alternate diagrams).

Model Questions

1. Statements:

1) All Pens are cars
2) All cars are dogs




Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) All Pens are dogs
2) Some dogs are Pens
3) Some cars are Pens
4) Some dogs are cars

2. Statements:

All chairs are Red
No Red is Spoon



Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) Some Red are chairs
2) Some chairs are Red
3) No Spoon is Red
4) No chair is Red

Note: 'No Spoon is Red' is valid as we cannot draw alternate diag ram' some spoons are Red'. Same is the case with 'No chair is Red'

COMPLEMENTARY PAIR

Sometimes certain pair of conclusions is given which are contradictory to each other.

For Instance, 'Some A's are B's 'contradicts 'No A is B'.

If 'Some A's are B's is true then 'No A is B' cannot be true at the same time and vice versa.

Similarly, 'All A's are B's' contradicts 'Some A's are NOT B's'

If 'All A's are B's' is true then 'Some A's are NOT B's' cannot be true at the same time and vice versa.

3. Statements:

1) Some cans are bottles
2) Some bottles are lids

Diagram-1





Diagram-2



Conclusions:

1) No can is lid
2) Some cans are lids

Explanation: In Diagram-1, 'No can is lid' is TRUE whereas 'Some cans are lids' is NOT TRUE. In Diagram-2, 'NO can is lid' is NOT TRUE whereas 'Some cans are lids' is TRUE.

Hence, we can conclude that 'Either 1 OR 2 follows'.